# బైబిల్ భాష్యానికి సూత్రాలు

shepherds
GLOBAL CLASSROOM

Shepherds Global Classroom క్రీస్తు శరీరాన్ని శక్తివంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న క్రైస్తవ నాయకుల కోసం పాఠ్యాంశాలను అందిస్తు వారిని సిద్ధ పరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక శిక్షకులకు 20-కోర్సుల పాఠ్యాంశాల సాధనాన్ని అందించడం ద్వారా, స్వదేశీ శిక్షణా కార్యక్రమాల సంఖ్యను విస్తరించాలని మేము ఆశిస్తున్నాము.

ఈ కోర్సు ఉచితంగా అందుబాటులో ఉంది డౌన్‌లోడ్ చేసుకోవడానికి https://www.shepherdsglobal.org/courses

ప్రధాన రచయిత: Dr. Randall D. McElwain

కాపీరైట్ © 2024 Shepherds Global Classroom
మూడవ ఇంగ్లీష్ ఎడిషన్ నుండి తెలుగులోకి అనువదించబడింది.

సర్వ హక్కులు ప్రత్యేకించబడినవి.

థర్డ్-పార్టీ వనరులు వాటి సంబంధిత యజమానుల కాపీరైట్ గా ఉన్నాయి మరియు మరియు వివిధ లైసెన్సుల ద్వార పంచుకొనబడ్డాయి.

ఈ పుస్తకంలో వాడబడిన వాక్య భాగాలు బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా వారి తెలుగు పరిశుద్ధ గ్రంథం నుండి తీసుకోవడం జరిగింది. Telugu Old Version Bible - పరిశుద్ధ గ్రంథము O.V. Bible

**అనుమతుల గమనిక:**

ఈ కోర్సు క్రింది మార్గదర్శకాల ప్రకారం ప్రింట్ మరియు డిజిటల్ ఫార్మాట్‌లలో ఉచితంగా ముద్రించబడుతుంది మరియు పంపిణీ చేయబడుతుంది: (1) కోర్సు కంటెంట్ ఏ విధంగానూ మార్చబడకపోవచ్చు. (2) కాపీలను లాభం కోసం అమ్మకూడదు. (3) విద్యా సంస్థలు ఈ కోర్సును ఉచితంగా లేదా ట్యూషన్ ఫీజు తీస్కొని కాపీ గా ఉపయోగించు కోవచ్చు (4) Shepherds Global Classroom అనుమతి మరియు పర్యవేక్షణ లేకుండా కోర్సు అనువదించబడదు.

# విషయాసూచిక


కోర్సు యొక్క అవలోకనం....5

(1) బైబిల్ భాష్యానికి పరిచయం....7

(2) పరిశీలన: వచనాన్ని పరిశీలించడం.... 19

(3) పరిశీలన: పెద్ద వాక్యభాగాలను చూడడం....39

(4) భాష్యం: పరిచయం....63

(5) భాష్యం: సందర్భం....73

(6) భాష్యం: సాహిత్య రూపాలు....87

(7) భాష్యం: పద అధ్యయనం....119

(8) భాష్యానికి సాధారణ సూత్రాలు....131

(9) అన్వయం....145

(10) వాక్యభాగ అధ్యయనాన్ని అభ్యసించడం....157

బైబిల్ అధ్యయన పరికరాలు....171

సిఫార్సు చేసిన వనరులు....175

అభ్యాసాల రికార్డు....177

# కోర్సు యొక్క అవలోకనం

ఈ కోర్సు బైబిలు భాష్యానికి ప్రాథమిక సూత్రాలను పరిచయం చేస్తుంది. దీనిలో చెప్పే చాలా విషయాలు హోవార్డ్ మరియు విలియం హెండ్రిక్స్ రాసిన లివింగ్ బై ద బుక్ *గ్రంథాన్ని బట్టి జీవించడం* (*Living by the Book*, by Howard and William Hendricks) నుండి తీసుకోవడం జరిగింది. మీరు ఆ పుస్తకాన్ని కలిగి ఉన్నట్లయితే, ఈ కోర్సులో చెప్పిన సూత్రాలను అభ్యాసం చేయడానికి కొన్ని ప్రశ్నలను చూడవచ్చు మరియు ప్రతి సూత్రంపై మరింతగా చర్చించవచ్చు. అయితే, ఈ కోర్సు చేయడానికి మాత్రం ఆ పుస్తకం అవసరం లేదు. అవసరమైన మెటీరియల్ అంతా ఈ పాఠాలలో ఇవ్వడం జరిగింది.

ప్రతి విద్యార్థి తరగతికి రాకముందే ప్రతి పాఠం చదవాలి. ఇంటి వద్ద అభ్యాసాలకు వెచ్చించే సమయానికి అదనంగా ప్రతి తరగతి సెషన్ కు 90-120 నిమిషాల సమయాన్ని వెచ్చించాలి. ఈ కోర్సు ప్రాథమికంగా ఆచరణాత్మ కార్యాచరణలపై ఆధారపడి ఉంది గనుక పాఠాన్ని ఒకటి కంటే ఎక్కువ సమావేశాలుగా విభజించవచ్చు. ఇది విద్యార్థులు కార్యచరణలను చేయడానికి ఎక్కువ సమయం వెచ్చించడానికి సహాయం చేస్తుంది.

చాలా పాఠాలలో, ప్రతి పాఠంలో చెప్పిన సూత్రాలను/ నియమాలను అభ్యాసం చేయడానికి అనేక **కార్యాచరణలు** ఉన్నాయి. ఈ కార్యాచరణకు చేయడానికి విద్యార్థులు తగినంత సమయం తీసుకోవడం ప్రాముఖ్యం. ఈ కార్యాచరణల్లో అనేక లేఖన భాగాలు ఉంటాయి. పాఠాన్ని ముగించడానికి తొందరపడవద్దు. ఈ కార్యాచరణల్లో చాలా మట్టుకు విద్యార్థులకు క్రొత్త గనుక ఈ కార్యాచరణలు ఎలా పూర్తి చేయాలో ప్రతి విద్యార్థి అర్థం చేసుకునేలా జాగ్రత్త పడాలి. ప్రాథమిక లక్ష్యం, ఒక నిర్దిష్టమైన సమాధానాన్ని కనుగొనడం కాదు; బైబిల్ ని అధ్యయనం చేయడం, భాష్యం చెప్పడంలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ప్రధాన లక్ష్యం.

కోర్సు ముగిసే సమయానికి, విద్యార్థి లేఖనంలోని అనేక భాగాలను జాగ్రత్తగా అధ్యయనం చేసి, అవగాహన పొందుతాడు. ప్రతి విద్యార్థి, వాళ్ళు అధ్యయనం చేసిన నోట్స్‌ను భవిష్యత్‌లో ఉపయోగించడానికి నోట్‌బుక్‌లో ఉంచాలి. ఈ కోర్సు కోసం చేసిన పని ప్రసంగాలు మరియు బైబిల్ పాఠాలను తయారుచేయడంలో ఉపయోగపడుతుంది.

**చర్చించే ప్రశ్నలు మరియు తరగతి గది కార్యచరణలు ►** ఈ బాణం గుర్తుతో సూచించబడినవి. చర్చించే ప్రశ్నల విషయంలో, సమాధానాన్ని గురించి విద్యార్థులే చర్చించాలి. తరగతిలో ఉన్న విద్యార్థులందరూ పాల్గొనేలా చూడాలి. అవసరమైతే, విద్యార్థులను పేరు పెట్టి పిలవాలి.

ప్రతి విద్యార్థి, కోర్సు అంతటిలో **కోర్సు ప్రాజెక్టుపై** పని చేస్తాడు. 10వ పాఠం తరువాత, వాళ్ళు తరగతికి ఒక ప్రెజెంటేషన్ చేస్తారు లేదా తరగతి నాయకునికి ఒక పేపర్ సమర్పిస్తారు. 10వ పాఠంలోని అభ్యాసాల విభాగంలో ప్రెజెంటేషన్ లేదా పేపర్ కొరకు సూచనలు ఇవ్వబడినాయి.

పాఠం 2 & 7 చివర్లో కొన్ని **ఇతర అభ్యాసాలు** కూడా ఉన్నాయి. విద్యార్థులు, వాళ్ళు పూర్తి చేసిన పనిని తరగతి నాయకునికి చూపించాలి, కానీ వాళ్ళ పుస్తకంలో ఒక కాపీని ఉంచుకోవాలి.

# పాఠం 1

# బైబిల్ భాష్యానికి పరిచయం

## పాఠం లక్ష్యాలు

(1) ఒక క్రైస్తవునికి లోతైన బైబిల్ అధ్యయనం ఎందుకు అవసరమో తెలుసుకోవడం.

(2) బైబిల్ ను అధ్యయనం చేయడానికి అవసరమైన మూడు దశలను జాబితా చేయగలగడం.

(3) లేఖనంలో ఒక భాగాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసే ప్రక్రియను ప్రారంభించడం.

(4) బైబిల్ భాష్యం కొరకు పరిశుద్ధాత్ముని వెలిగింపు యొక్క ప్రాముఖ్యతను అభినందించడం.

## పరిచయం

మీ వ్యక్తిగత అధ్యయనంలో మరియు లేఖనాన్ని అన్వయించుకోవడంలో మీ ఎదుగుదలకు సహాయపడడమే ఈ కోర్సు యొక్క ఉద్దేశ్యం. ప్రస్తుతం మీ బైబిల్ అధ్యయన పద్ధతులను యదార్థంగా మూల్యాంకనం చేయడమే మొదటి అడుగు.

► మీ ప్రస్తుత బైబిల్ పఠన అభ్యాసాలను గురించి చర్చించడానికి కొన్ని నిమిషాలు సమయం తీసుకోవాలి. ఇది ఒకరి నొకరు విమర్శించుకొనే సమయం కాదు; “నేను దేవుని వాక్యాన్ని ఎలా చదువుతున్నాను?” అనే ప్రశ్న గురించి ఆలోచించే సమయమిది. మీరు ఆలోచించాల్సిన కొన్ని ప్రశ్నలు ఇక్కడ ఉన్నాయి:

- నేను ఎంత తరచుగా బైబిల్ చదువుతున్నాను?
- నేను బైబిల్ చదివినప్పుడు ఎంత సమయం చదువుతున్నాను?
- నేను చదివే లేఖనభాగాలను ఎలా ఎంపిక చేసుకుంటాను?
- నేను చదువుతున్న దానిని అర్థం చేసుకోగలుగుతున్నానా?
- నేను చదివే దానిని గుర్తుంచుకోగలుగుతున్నానా?
- నేను నా జీవితానికి అన్వయించుకోగలుగుతున్నానా?
- నేను బైబిల్ ను ఇంకా ఎక్కువగా చదవకపోవడానికి 2-3 కారణాలు ఏమిటి?

తైవాన్ దేశానికి చెందిన జియన్‌హోంగ్, 15 సంవత్సరాలుగా క్రైస్తవునిగా ఉన్నాడు, కానీ ఆత్మీయ పరిపక్వతకు సంబంధించిన కొన్ని సూచనలు మాత్రమే చూపించాడు. అతనిలో ఆత్మీయ వృద్ధి లేకపోవడం వలన ఎంతో ఆందోళనకు,

చిరాకుకు గురయ్యాడు. ఒక ఆదివారం ఉదయకాల ఆరాధన ముగిసిన తరువాత, అతని చిరాకు, ఆందోళన బయటికి వచ్చాయి. పాస్టర్, బైబిల్ చదవమని మీరు నాకు చెప్పారు. దేవుడు తన వాక్యం ద్వారా మాట్లాడతాడని చెప్పారు. నేను ప్రయత్నించాను! నేను ప్రతి ఉదయం బైబిల్ చదువుతున్నాను, అది నాకేమి చెప్పడం లేదు. తప్పు ఎక్కడ జరుగుతుంది?" అని అడిగాడు.

"జియన్‌హోంగ్, నువ్వు బైబిల్ **ఎలా** చదువుతున్నావో చెప్పు" అని పాస్టర్ ఆడిగాడు. జియన్‌హోంగ్ స్పందన, అతను ఇబ్బంది పడే విషయాల్లో ప్రాముఖ్యమైన అంశాన్ని సూచించింది. "ప్రతి ఉదయం పనిని ప్రారంభించడానికి ముందు నా బైబిల్ తెరిచి ఒక వచనం చదువుతాను" అని సమాధానమిచ్చాడు. "నువ్వు బైబిల్ లో ఒక పుస్తకాన్ని లేదా ఒక అధ్యాయమంతటిని చదివావా?" అని పాస్టర్ అడిగాడు. "లేదు, నేను బైబిల్ తెరిచినప్పుడు నాకు కనబడే ఒక వచనాన్ని చదువుతాను, అది చాలా అరుదుగా సహాయం చేస్తుంది" అని జవాబిచ్చాడు.

బైబిల్ ను ఇలా చదవడంలో ఉన్న సమస్యను జియన్‌హోంగ్ అర్థం చేసుకోవడంలో సహాయం చేయడానికి, బైబిల్ ను తెరిచి, తనకు కనబడిన మొదటి వచనాన్ని చదవమని చెప్పాడు. జియన్‌హోంగ్, "దక్షిణ దిక్కున నివసించువారు ఏశావుయొక్క పర్వతమును స్వతంత్రించుకొందురు; మైదానమందుండువారు ఫిలిష్తీయులదేశమును స్వతంత్రించుకొందురు; మరియు ఎఫ్రాయిమీయుల భూములను షోమ్రోనునకు చేరిన పొలమును వారు స్వతంత్రించుకొందురు. బెన్యామీనీయులు గిలాదుదేశమును స్వతంత్రించుకొందురు" (ఓబద్యా 1:19) అనే వచనాన్ని చదివాడు.

ఆ తరువాత పాస్టర్ జియన్‌హోంగ్ ని కొన్ని ప్రశ్నలు అడిగాడు. "నెగెబు ఎక్కడ ఉంది? షేఫెలా ఎక్కడ ఉంది? ఎఫ్రాయీము దేశం ఎక్కడ ఉంది? సమరయ? బెన్యామీను? గిలాదు?" ప్రతి ప్రశ్నకు "నాకు తెలీదు" అని సమాధానం చెప్పాడు. తదుపరి వారం, "బైబిల్ ని ఎలా చదవాలి" అనే దానిని అధ్యయనం చేయడానికి బైబిల్ స్టడీని ప్రారంభించారు. ఆ తరువాతి కొన్ని వారాల పాటు, బైబిల్ భాష్యానికి మరికొన్ని సూత్రాలు నేర్చుకొన్నాడు. ఈరోజు లేఖనం మనతో ఎలా మాట్లాడుతుందో అర్థం చేసుకోవడం నేర్చుకున్నాడు.

బైబిల్ అధ్యయన పద్ధతుల యొక్క ప్రాథమిక సూత్రాలను నేర్చుకొని, అన్వయించుకోవడంలో సహాయం చేయడమే ఈ కోర్సు లక్ష్యం. ఈ పాఠాల ద్వారా, అభ్యాసాల ద్వారా, దేవుని వాక్యాన్ని అర్థం చేసుకొని, దానిని మీ జీవితానికి అన్వయించుకొని, ఇతరులకు బోధించడంలో సహాయం చేసే పనిముట్లను, సాధనాలను పొందుతారు.

## నేను బైబిల్ ఎందుకు చదవాలి?

కొంతమంది బైబిల్ ని అర్థం చేసుకోవడం కష్టం అని నమ్మడం వలన వాళ్ళు బైబిల్ ని చదవరు. బైబిల్ దేవుని వాక్యమని నమ్మే అనేకమందికి దానిని ఎలా అధ్యయనం చేయాలో, అన్వయించుకోవాలో తెలీదు. బైబిల్ ని అధ్యయనం చేయడం కష్టమైన పని. అధ్యయనం చేయడం విలువైనదేనా? మనం బైబిల్ ను ఎందుకు చదవాలి?

**దేవుడు లేఖనం ద్వారా తనని తాను వెల్లడిపరచుకున్నారు.**

దేవుడు ఎవరో లేఖనం మనకు చూపుతుంది. దేవుని వాక్యం, దేవుని స్వభావానికి ఒక వ్యక్తీకరణ (కీర్తన 119:15, 27). దేవుడు ఎలా ఆలోచిస్తాడు, ఆయనకు ఏది ప్రాముఖ్యమైనది, ఆయన ప్రజలతో ఎలాంటి సంబంధం కలిగి ఉంటాడు మరియు మానవ చరిత్రలో ఆయన ఎలా పనిచేస్తాడు అనే విషయాలను లేఖనం చూపిస్తుంది. దేవుని ధర్మశాస్త్రం (ఆయన కోరుకునేది) ఆయన స్వభావాన్ని, ఆయన న్యాయాన్ని, ఆయన జ్ఞానాన్ని ప్రతిబింబిస్తుంది (కీర్తన 119:137). మనం బైబిల్ చదివినప్పుడల్లా, అది దేవుని గురించి ఏం వెల్లడి చేస్తుందనే దానిపై దృష్టిపెట్టాలి.

లేఖనాలు, ఆరాధించే వ్యక్తికి దేవునిని వెల్లడి చేస్తాయి. ఇది దేవుని పట్ల ఆరాధకుని స్పందనకు నడిపించి, మనం ఎలా జీవించాలో అది చూపిస్తుంది.

**బైబిల్ ఒక దీపమయి**

కీర్తనాకారుడు, దేవుని వాక్యాన్ని మన జీవితాన్ని నడిపించు మార్గాన్ని చూపించే దీపంతో పోల్చాడు (కీర్తన 119:105). బైబిల్ దేవుని సత్యమై, మనం ఎలా ఆలోచించాలో మరియు జీవించాలో మాకు బోధిస్తుంది.

► కీర్తన 19:7-11, కీర్తన 119:160, మరియు 2 తిమోతికి 3:16-17 చదవండి.

దేవుని వాక్యం సరైన సిద్ధాంతానికి మూలం. రక్షణ, పరిశుద్ధతకు అవసరమైన జ్ఞానమంతా బైబిల్లో ఉంది. ఈ సూత్రం ఉద్దేశ్యం, ఇతర సహాయం ఏమి లేకుండా లేఖనమంతటినీ మనం అర్థం చేసుకోగలమని కాదు. దీని ఉద్దేశ్యం, సాంప్రదాయం ప్రాముఖ్యం కాదని కాదు. ఒక విశ్వాసికి దేవుని వాక్యం తుది అధికారం అని దీని ఉద్దేశ్యం.

దేవుని వాక్యం సత్యానికి మూలం గనుక, వాక్య జ్ఞానం మనలను పరిచర్య కోసం సిద్ధపరుస్తుంది. దేవుని వాక్యాన్ని ఖచ్చితంగా ప్రకటించినప్పుడు, దేవుని అధికారంతో బోధిస్తాం. సత్యం ఆయనది, మనది కాదు.

**బైబిల్ ఆత్మీయ పాలుగలది**

క్రొత్తగా జన్మించిన శిశువులు పాలను అపేక్షించినట్లుగా, విశ్వాసులు బైబిల్ ను ఆపేక్షించాలని పేతురు చెప్పాడు (1 పేతురు 2:2). ఒక శిశువు భౌతికంగా ఎదగటానికి పాలు ఎంత అవసరమో, ఒక క్రైస్తవుడు ఆత్మీయంగా ఎదగటానికి లేఖనం అంతే అవసరం. అనుదినం దేవుని వాక్యం భుజించకుండా, ఆత్మీయ పరిపక్వత కలగదు.

బైబిల్ బాష్య నైపుణ్యాలు నేర్చుకుంటూ, దేవుని వాక్య సత్య వివేచన అభ్యసిస్తుండగా, మనం పరిపక్వత చెటుతాం (హెబ్రీయులకు 5:14). ఇతరులకు బోధించటానికి దేవుని వాక్యాన్ని వినియోగించే మన సామర్థ్యం పెరుగుతుంది.

**బైబిల్ తేనె లాగా తియ్యగా ఉంటుంది**

కీర్తనాకారుడు దేవుని వాక్యాన్ని తేనెతో పోల్చాడు (కీర్తన 19:10, కీర్తన 119:103). తేనె ఆరోగ్యకరం, మధురం. దేవుని వాక్య అధ్యయనం ఆనందంగా భావించాలి తప్ప అసహ్యంగా కాదు. యుద్ధంలో ఉన్న సైనికుడు ఇంటి నుండి వచ్చిన ఉత్తరం చదివి ఆనందించినట్లుగా, దేవుడు తన పిల్లలకు ఇచ్చిన ఉత్తరమైన దేవుని వాక్యాన్ని చదివి, ఆనందించాలి.

యూదుల పిల్లలు ధర్మశాస్త్రం చదవటానికి పాఠశాలకు మొదటిగా వెళ్లినప్పుడు, బోధకుడు వర్ణమాలలోని మొదటి అక్షరంపై తేనె వేస్తాడు, అప్పుడు ఆ పిల్లవాడు దాని మాధుర్యాన్ని రుచి చూడటానికి ఆ పేజి నాకుతాడు. బోధకుడు ఈ పద్ధతిలో పాఠం బోధించినప్పుడు, "పిల్లవాడు [ధర్మశాస్త్రాన్ని] ఆనందంగా, మంచి రుచితో అనుసంధానించటం నేర్చుకుంటాడు."[1]

**బైబిల్ ఆత్మఖడ్గం**

దేవుని వాక్యం ఆత్మీయ యుద్ధాల్లో మన ఆయుధం (ఎఫెసీయులకు 6:17). యేసు అరణ్యంలో శోధనను ఎదుర్కొన్నప్పుడు, ఆయన ద్వితీయోపదేశకాండం నుండి వాక్యాన్ని ప్రస్తావిస్తూ సాతాను దాడులకు ప్రతిస్పందించాడు (మత్తయి 4:1-11).

ఆత్మీయ విజయం కోసం, ప్రభావవంతమైన పరిచర్య కోసం లేఖనం మనల్ని బలపరుస్తుంది. బైబిల్ అధ్యయనం ద్వారా, అబద్ధ సిద్ధాంతానికి ప్రతిస్పందించటానికి, మన సంఘాన్ని సత్య సిద్ధాంతంలో స్థిరపరచటానికి, నేటి ప్రపంచంలో ప్రభావవంతమైన పరిచర్య చేయటానికి మనం సిద్ధంగా ఉన్నాం.

---

[1] Efraim Rubin, "Honey in Jewish Law, Lore, Tradition, and More," నవంబర్ 15, 2023 న యాక్సెస్ చేయబడింది, https://www.chabad.org/library/article_cdo/aid/2697265/jewish/Honey-in-Jewish-Law-Lore-Tradition-and-More.htm

**లేఖన అధ్యయనానికి అనుచిత కారణాలు**

► హెబ్రీయులకు 4:12-13 చదవండి.

లేఖన అధ్యయనానికి చాలా మంచి కారణాలు ఉన్నాయి, కాని కొందరు తప్పుడు ఆలోచనలతో లేఖనం చదువుతారు లేక అధ్యయనం చేస్తారు.

కొంతమంది తమ అభిప్రాయాలను సమర్థించడానికి సాక్ష్యాలను సేకరించటానికి లేఖనాన్ని అధ్యయనం చేయవచ్చు. బహుశా, వారు తమ ఆధీనంలో ఉన్నవారిని నియంత్రించడానికి జ్ఞానాన్ని ఉపయోగించాలనుకోవచ్చు.

కొందరు అతిశయ కారణాలవల్ల లేఖన అధ్యయనం చేస్తారు. బహుశా, ఆత్మీయ హోదా సంపాదించుకుని, ఇతరులకంటే ఉన్నతంగా ఉండాలనుకుంటారు. బహుశా తమ విజయాలను బట్టి ప్రజలు వారి గురించి మంచిగా మాట్లాడాలని కోరుకుంటారు. లేక, లేఖన అధ్యయనం దేవుని అనుగ్రహం సంపాదించుకోవటానికి సహాయపడుతుందని భావిస్తారు.

ఇవన్నీ లేఖనం చదవడానికి లేదా అధ్యయనానికి తప్పు కారణాలు. లేఖనానికి సరైన వైఖరిని హెబ్రీయులకు 4:12-13 చూపిస్తుంది. స్వార్థపూరిత లక్ష్యాలను సాధించడానికి లేఖనాన్ని ఉపయోగించడం బదులుగా, ఇది మనది కాదు, దేవుని వాక్యమని జ్ఞాపకముంచుకోవాలి. దానిని దేవుని యెడల భక్తితో అధ్యయనం చేయాలి. బైబిల్ మన అధికారం, మనం దానికి సమర్పించుకోవాలి. దాన్ని ఇతరులకు బోధించినప్పుడు, వినయంతో చేయాలి.

ఈ విధంగా దేవుని వాక్యాన్ని అధ్యయనం చేసి బోధించినప్పుడు, అది మన జీవితాలలో పాపం లేదా లోపాన్ని వెల్లడిస్తుంది మరియు దాని నుండి తిరిగి మారే మార్గాన్ని చూపిస్తుంది. అది మన జీవితాలను, అలాగే మనం సేవించే మరియు నడిపించే వారి జీవితాలను మార్చుతుంది.

## నేను బైబిల్ ఎలా అధ్యయనం చేయాలి?

► మీరు లేఖనంలో ఒక వాక్యభాగాన్ని అధ్యయనం చేసేటప్పుడు, ప్రస్తుతం ఏ ప్రక్రియ ఉపయోగిస్తున్నారు? వాక్యభాగంలో అర్థాన్ని వెలికి తీయటానికి ఉపయోగించే నిర్దిష్ట దశలు గురించి చర్చించండి.

బైబిల్ అధ్యయనం ముఖ్యమని జియన్‌హోంగ్ అంగీకరించాడు. అయితే, లేఖనం ఎలా అధ్యయనం చేయాలో అతనికి తెలియలేదు. అతనికి ఒక పద్ధతి లేదా విధానం అవసరం.

ఈ కోర్సు ఉద్దేశ్యం, ప్రభావవంతమైన బైబిల్ అధ్యయనానికి ఒక విధానం అందించడం. ప్రసంగం సిద్ధం చేసేటప్పుడు, పాస్టర్లు ఈ దశలు వాడుకోవచ్చు. బైబిల్ పాఠాలు సిద్ధం చేసేటప్పుడు, బైబిల్ బోధకులు ఈ దశలు వాడుకోవచ్చు. ప్రతి విశ్వాసి తమ వ్యక్తిగత ఆత్మీయ అభివృద్ధిలో ఈ పద్ధతి ఉపయోగిస్తూ మేలు పొందొచ్చు

ఈ కోర్సు అందించే పద్ధతిలో, మూడు దశలు ఉంటాయి.

**పరిశీలన**

ఈ దశలో, "నేను బైబిల్లో ఏం చూస్తున్నాను?" అని ప్రశ్నిస్తాం. ఈ దశలో, లేఖనం గురించి సాధ్యమైనంత ఎక్కువ వివరాలు పరిశీలిస్తాం. చాలామంది పాఠకులు పరిశీలన చేయకుండా, నేరుగా బాష్యంలోకి వెళ్తారు. లేఖనం ఏం చెబుతుందో జాగ్రత్తగా పరిశీలించకుండా, దానిని నిజంగా అర్థం చేసుకోలేం. పరిశీలన దశలో, వాక్యభాగంలోని వివరాలు చూస్తాం. లేఖన సందేశానికి ముఖ్యమైన వివరాలు గుర్తించడం నేర్చుకుంటాం. మరిముఖ్యంగా, పదాలు, ఆకృతి, సాహిత్య రూపం, పరిస్థితి గురించి అధ్యయనం చేస్తాం.

***పదాలు***

బైబిల్లో ఒక పుస్తకం అధ్యయనం చేసినప్పుడు, పుస్తకమంతటిలో ఎక్కువసార్లు ఉపయోగించిన పదాల కోసం చూస్తాం. 1 యోహాను పత్రికలో, *ఎరుగుట* అనే పదాలు 5 అధ్యాయాల్లో 30కంటే ఎక్కువసార్లు కనబడతాయి. యోహాను పత్రిక అధ్యయనం చేసినప్పుడు, పత్రిక అంతటిలో ఈ పదం కనుగొంటూ మొదలుపెట్టొచ్చు. యోహాను ఎక్కడైతే *ఎరుగుట* అనే పదాన్ని ఉపయోగించాడో, ఆ ప్రదేశాలు అతని సందేశాన్ని అనువదించటానికి సహాయపడతాయి. యోహాను సందేశం అర్థం చేసుకోవాలంటే, "మనం ఏం ఎరగాలని యోహాను చెప్పాడు?" "ఎరిగినవారి లక్షణాలు ఏంటి?" అని ప్రశ్నించుకోవాలి.

***ఆకృతి***

బైబిల్లోని పుస్తకాలు పరిశుద్ధాత్మ ప్రేరణలో జాగ్రత్తగా నిర్మించబడ్డాయి. మీరు యోహాను సువార్తవంటి పుస్తకం అధ్యయనం చేసినప్పుడు, యేసు ఎవరోయని చూపించే ఏడు సూచక క్రియలతో యోహాను తన సువార్తను చక్కగా అమర్చాడని తెలుసుకుంటారు. పుస్తక ఆకృతి పరిశీలించినప్పుడు, అది యోహాను ఉద్దేశ్యం గురించి ఒక మంచి అవగాహన కలిగిస్తుంది.

మనం ఒక వాక్యభాగం అధ్యయనం చేసినప్పుడు, ఆకృతి కథను అనుసరించటం చూడొచ్చు (లూకా 9:28-36లోవలే) బహుశా, ఇది తుది తీర్మానాలకు కారణాలు ఇస్తుంది (రోమా 6:1-13లోవలే). అది, సూచనల జాబితా ఇవ్వడానికి వివరాలు ఉపయోగిస్తుంది (ఎఫెసీయులకు 6:13-18లోవలే). ఇతర ఆకృతి విధానాలు కూడా ఉన్నాయి.

### *సాహిత్య రూపం*

పౌలు రాసిన పత్రికలు చక్కగా అమర్చబడ్డాయి, ఒక న్యాయవాది తన వాదనను ముగింపుకు చేర్చడానికి సిద్ధపరచినట్లుగా, తన అభిప్రాయాన్ని వాదించాడు. రోమా లేక ఇతర పత్రికలు మంచిగా చదవాలంటే, పౌలు తర్కం జాగ్రత్తగా అనుసరించాలి.

దీనికి విరుద్ధంగా, యోనా గ్రంథం ఒక చిన్న చారిత్రాత్మక కథనం, ఇది ప్రజలందరి యెడల దేవుని ప్రేమను వివరిస్తుంది. దానిని మంచిగా చదవాలంటే, "ఇది ఎందుకు ఆశ్చర్యమైన, అసాధారణ కథ?" అని ప్రశ్నించాలి. అప్పుడు మీరు "ఈ కథ వివరాలు ఏంటి?" అని అడుగుతూ, వ్యాఖ్యానించడానికి సిద్ధంగా ఉంటారు.

### *పరిస్థితి*

ఇక్కడ మనం ఇలాంటి ప్రశ్నలు అడుగుతాం, "ఫిలిప్పీయులకు ఆనందించుడి అనే సందేశం రాసినప్పుడు పౌలు ఎక్కడున్నాడు?" అతడు రోమాలో, విచారణ మరియు బహుశ ఉరిశిక్ష కోసం సిద్ధంగా ఉన్నాడు. తాను సంతోషంగా ఉండటానికిగల కారణాలు ఈ పరిస్థితి మనకు చూపిస్తుంది, ఎందుకంటే అతని వ్యక్తిగత పరిస్థితి బాగోనప్పుడు కూడా ఈ ఆనందం అనుభవించాడు.

"ప్రకటన గ్రంథంలో, దేవుని శాశ్వత ప్రణాళిక బయలుపరచడానికి ఆకాశములు తెరువబడినప్పుడు యోహాను ఎక్కడున్నాడు?" పత్మాసు ద్వీపంలో పరవాసిగా ఉన్నాడు. హింస కాలం, దేవుని విజయ సందేశాన్ని విశ్వాసానికి గొప్ప ప్రోత్సాహకరంగా చేసింది.

### **బాష్యం**

ఈ దశలో, "బైబిల్ అర్థం ఏంటి?" అని అడుగుతాం. సాధ్యమైనంత ఎక్కువ పరిశీలనలు సేకరించిన తర్వాత, లేఖన సందేశం కోసం చూస్తాం. ఒక్కొక్క అధ్యాయం, వచనాల్లోని సందేశంతో పాటుగా పుస్తకమంతటినీ ఒక్కటిగా ఐక్యపరిచే పెద్ద పెద్ద విషయాలు కనుగొనటం నేర్చుకుంటాం. "ఈ పుస్తకం మొదటి శ్రోతలకు ఇచ్చే సందేశం ఏంటి?" అని అడుగుతాం. అన్ని సమయాల్లో, ప్రదేశాల్లో, సంస్కృతుల్లో వాస్తవమైన సూత్రాలు కోసం చూస్తాం.

## అన్వయం

ఈ దశలో, "నేటి జీవితం, పరిచర్యకు బైబిల్ ని నేను ఎలా అన్వయిస్తాను? " అని అడుగుతాం. మన జీవితాలకు అన్వయించుకోకుండా అర్థాన్ని గ్రహిస్తే చాలదు.

తన పాఠ్యపుస్తకంలో, హోవార్డ్ హెండ్రిక్స్ అన్వయానికి సంబంధించి రెండు ప్రశ్నలు సూచించాడు:[2]

1. అది నాకెలా వర్తిస్తుంది? ఇది నా జీవితంలో లేఖన అన్వయం పై దృష్టిపెడుతుంది.
2. అది ఇతరులకు ఎలా వర్తిస్తుంది? ఇది నేను పరిచర్య చేస్తున్న వారి జీవితంలో లేఖన అన్వయంపై దృష్టిపెడుతుంది.

ఇంగ్లాండ్ దేశంలో, సంఘ చరిత్రకు సంబంధించి అత్యంత గౌరవనీయమైన పండితుడైన, ఒక విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఉన్నాడు. విద్యాపరంగా, అతనికి బైబిల్ బాగా తెలుసు; వ్యక్తిగతంగా, ఏ దేవుని లేక దేవుని వాక్యాన్ని నమ్మడు. అతనికి పరిశీలన, బాష్యం గురించి బాగా తెలుసు. దురదృష్టవశాత్తూ, అతడు లేఖన సత్యాన్ని తన జీవితానికి ఎన్నడు అన్వయించుకోలేదు.

యాకోబు, అలాంటి వ్యక్తి గురించి ఇలా చెప్పాడు: "ఎవ డైనను వాక్యమును వినువాడైయుండి దానిప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా" (యాకోబు 1:23-24). ఇంగ్లాండ్ లోని ప్రొఫెసర్ ఒక తీవ్రమైన సందర్భం: అయితే, లేఖనం తెలిసి కూడా అనుదినం దాని ప్రకారం జీవించలేని వారు చాలామంది ఉన్నారు. నిజమైన బైబిల్ అధ్యయనం ఆచరణాత్మక అన్వయింపుకు తప్పక నడిపిస్తుంది.

## బాష్యంలో పరిశుద్ధాత్ముని పాత్ర

► అవిశ్వాసి లేఖన అర్థాన్ని గ్రహించగలడా?

ఈ ప్రశ్నకు సమాధానం, "గ్రహించగలడు, కాని పాక్షికంగా." ఈ కోర్సులో, మన బాష్యాన్ని మార్గనిర్దేశం చేసే ప్రక్రియను అధ్యయనం చేస్తాం. దేవుని వాక్య సందేశం అర్థం చేసుకోవడానికి ఈ దశలు సహాయపడతాయి. బైబిల్ ను, ఇతర పుస్తకాలవలే చదివినప్పుడు, ఏ పాఠకునికైనా సత్యాన్ని బయలుపరుస్తుంది.

---

[2] Howard G. Hendricks and William D. Hendricks, Living by the Book (Chicago: Moody Publishers, 2007)

అయితే, పరిశుద్ధాత్ముని వెలిగింపు లేకుండా, ఒకని అవగాహన ఎల్లప్పుడు పరిమితమే. కేవలం మేధస్సు ను ఉపయోగించి అధ్యయనం చేయడం ఆత్మీయ సత్యాన్ని ఎన్నడు బయలుపరచదు. పౌలు ఇలా రాశాడు:

> ఒక మనుష్యుని సంగతులు అతనిలోనున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు. దేవునివలన మనకు దయచేయబడినవాటిని తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవుని యొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్యజ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము. ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు, అవి అతనికి వెఱ్ఱితనముగా ఉన్నవి, అవి ఆత్మానుభవముచేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు (1 కొరింథీయులకు 2:11-14).

ఒక అవిశ్వాసి లేఖన సందేశం కొంత వరకు అర్థం చేసుకుంటాడు, కాని బైబిల్లోని లోతైన సత్యాలు పరిశుద్ధాత్ముని వెలిగింపు ద్వారానే బయలుపరచబడతాయి. లేఖన అధ్యయనం సమాచార సేకరణకు మించినది; అందుకు విశ్వాసం, విధేయత అవసరం. మనం దేవుని వాక్య అధికారానికి లోబడే వరకు, దేవుడు మన జీవితాల్లో రూపాంతర కార్యం చేయడు. దీని కారణంగా:

1. మన లేఖన అధ్యయనానికి ముందు ప్రార్థన చేయాలి. మన అధ్యయనంలో సహాయం చేయమని పరిశుద్ధాత్ముని అడగాలి. యాకోబు ఇలా రాశాడు, "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్ర హింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడు" (యాకోబు 1:5).

2. మన లేఖన అధ్యయనం తర్వాత వ్యక్తిగత ప్రతిస్పందన ఉండాలి. బైబిల్ అధ్యయన లక్ష్యం మేధోపరమైన సమాచారం కంటే మించింది, దాని ఉద్దేశ్యం వ్యక్తిగత పరివర్తనం. మన అధ్యయనం ద్వారా మనం మారకపోతే, అధ్యయన ఉద్దేశ్యం కోల్పోయినట్లే. ఈ మార్పు కేవలం పరిశుద్ధాత్ముని ద్వారా వస్తుంది.

యేసు చెప్పిన, విత్తనం మరియు విత్తువాని ఉపమానంలో, కొన్ని విత్తనాలు త్రోవప్రక్కన పడగా పక్షులు వాటిని మింగివేశాయి. కొన్ని విత్తనాలకు వేరు లేనందున, మాడి ఎండిపోయాయి. కొన్ని విత్తనాలను ముండ్లపొదలు అణచివేశాయి. ఇంకొన్ని మంచి నేలను పడి, ఫలించాయి. మంచినేలను విత్తబడినవాడు, వాక్యము విని గ్రహించువాడని

యేసు వివరించాడు (మత్తయి 13:3-23). వాక్యాన్ని విని గ్రహించకుండ ఉండటం సాధ్యమని ఈ ఉపమానం చూపిస్తుంది. పూర్ణ హృదయంతో జాగ్రత్తగా పరిశుద్ధాత్మ స్వరం విన్నప్పుడే దేవుని వాక్యం పూర్తిగా గ్రహిస్తాం.

## పాఠం 1 ముఖ్య విషయాలు

(1) బైబిల్ అధ్యయనానికి కారణాలు:

- దేవుడు లేఖనం ద్వారా తనని తాను వెల్లడిపరచుకున్నారు.
- బైబిల్ ఒక దీపమయి
- బైబిల్ ఆత్మీయ పాలుగలది
- బైబిల్ తేనె లాగా తియ్యగా ఉంటుంది
- బైబిల్ ఆత్మ ఖడ్గం

(2) బైబిల్ అధ్యయన ప్రక్రియలో మూడు దశలున్నాయి.

- పరిశీలన: నేను బైబిల్లో ఏం చూస్తున్నాను?అధ్యయనం:
    - పదాలు
    - ఆకృతి
    - సాహిత్య రూపం
    - పరిస్థితి
- భాష్యం: బైబిల్ అర్థం ఏంటి?
- అన్వయం: నేటి జీవితం, పరిచర్యకు బైబిల్ ని నేను ఎలా అన్వయిస్తాను? అడగండి:
    - అది నాకెలా వర్తిస్తుంది?
    - అది ఇతరులకు ఎలా వర్తిస్తుంది?

(3) మనం బైబిల్ అధ్యయనం చేస్తున్నప్పుడు పరిశుద్ధాత్ముని వెలిగింపు తప్పక ఉండాలి. దీని కారణంగా

- మన లేఖన అధ్యయనానికి ముందు ప్రార్థన చేయాలి.
- మన లేఖన అధ్యయనం తర్వాత వ్యక్తిగత ప్రతిస్పందన ఉండాలి.

## పాఠం 1 అభ్యాసం

బాష్య ప్రక్రియ ఆరంభించాలంటే, క్రిందివాటిలో ఒక వాక్యభాగం ఎంచుకోండి.

- ద్వితీయోపదేశకాండము 6:1-9
- యెహోషువ 1:1-9
- మత్తయి 6:25-34
- ఎఫెసీయులకు 3:14-21
- కొలొస్సయులకు 3:1-16

కోర్సు అంతటిలో మీరు ఈ లేఖనం అధ్యయనం చేస్తారు. ఈ మొదటి పాఠం కోసం, లేఖనాన్ని జాగ్రత్తగా చదవండి. మూడు విషయాల్లో నోట్సు తీసుకోండి:

1. పరిశీలన: మీరు ఎన్నుకున్న వాక్యభాగంలో సాధ్యమైనంత వివరణ జాబితా చేయండి. లేఖన ఆధారంగా, మీ వివరణలు భిన్నంగా ఉంటాయి. మీకు సహాయం చేయు కొన్ని ప్రశ్నలు ఇక్కడ ఉన్నాయి:
   - లేఖనంలో నమోదు చేసిన సంఘటనలు ఎక్కడ జరిగాయి?
   - ఈ లేఖనంలో పాత్రలు ఎవరు?
   - ఈ లేఖనం ఏం అజ్ఞాపిస్తుంది?
   - ఈ లేఖనంలో ఏ పదాలు పునరావృతం అయ్యాయి?
2. భాష్యం: 2-3 వాక్యాల్లో, వాక్యభాగంలోని ప్రధాన సందేశం సంగ్రహించండి.
3. అన్వయం: మీ జీవితం, పరిచర్యలో లేఖనాన్ని అన్వయించుకునే 2-3 మార్గాలు జాబితా చేయండి.

# పాఠం 2

# పరిశీలన: వచనాన్ని పరిశీలించడం

## పాఠం లక్ష్యాలు

(1) లేఖనాలను శ్రద్ధగా చదవడంలోని ప్రాముఖ్యతను గ్రహించడం.

(2) అధ్యయనం చేసే ప్రతి వచనంలో ముఖ్య ప్రశ్నలు అడగడం.

(3) లేఖనాన్ని క్రమబద్ధంగా అధ్యయనం చేయటానికి ప్రణాళిక వేసుకోవడం.

(4) ఎంపిక చేసుకున్న వచనాలను లోతుగా పరిశీలించడాన్ని సాధన చేయడం.

## పరిచయం

"నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులను చూచునట్లు నా కన్నులు తెరువుము."
- కీర్తన 119:18

►ఈ కోర్సు కోసం మీరు కలుసుకునే ప్రదేశానికి వచ్చేటప్పుడు మీ ప్రయాణం గురించి మీ గుంపులో ఒకరు లేక ఇద్దరు సభ్యులు వివరించండి. సాధ్యమైనన్ని వివరాలు ఇవ్వండి. మార్గంలో మీరు ఏదైనా రెస్టారెంట్లు, చర్చిలు, లేక వ్యాపారాలు చూశారా? ఆగమని చెప్పే సూచనలు లేక లైట్లు ఎన్ని చూశారు? ఎన్ని మలుపులు తీసుకున్నారు? సాధారణం మీ ప్రయాణంలో చూడని అసాధారణ విషయం ఏదైనా చూశారా? ప్రతి దాని గురించి వివరించిన తరువాత, మీరు ఎంత వరకు పరిశీలించారో, ఎంత వరకు గమనించలేదో చర్చించండి.

కిరణ్ బైబిల్ చదివినప్పుడు, ఒక మానసిక చిత్రంతో (మనసులో ఒక ఆలోచనతో) ముగించాడు. మార్కు 1:29-31 వచనాలను చదివి, సంగ్రహించుమని కిరణ్‌ని మీరడిగితే, అతను, "యేసు నలుగురు శిష్యులతో (సీమోను, అంద్రెయ, యాకోబు, మరియు యోహాను) గలిలయలోని సమాజమందిరాన్ని విడిచి, సీమోను అత్త జ్వరంతో ఉండగా సీమోను ఇంటికి వెళ్ళారు. యేసు ఆమె చేయి పట్టుకుని లేవనెత్తగా, వెంటనే ఆమెకున్న జ్వరం వదిలిపోయింది. ఆమె బాగై, వారికి భోజనం కూడా ఏర్పాటు చేయగలిగింది. విశ్రాంతి తీసుకుని, పూర్తిగా కోలుకునే సమయం కూడా ఆమెకు అక్కర్లేదు!" అని చెబుతాడు.

వికాస్ బైబిల్ చదివినప్పుడు, అతను వచనాలు చదివాడు కాని కొన్ని వివరణలు మాత్రమే చూశాడు. మార్కు 1:29-31 ను క్లుప్తంగా చెప్పమని వికాస్‌ని మీరడిగితే, అతను, "యేసు సీమోను ఇంటిని దర్శించి, అక్కడ ఎవరినో బాగు చేశాడు" అని చెబుతాడు.

వీరిలో ఎవరు బాగా పరిశీలించారు? ఎవరు ఎక్కువ కాలం కథను గుర్తుపెట్టుకుంటారు? ఈ కథ బాష్యాన్ని ఆధారం చేసుకోవడానికి ఏ పాఠకుని దగ్గర ఎక్కువ సమాచారం ఉంది? సమాధానం స్పష్టంగా ఉంది. మార్కు 1:29-31లో ఏం జరిగిందో కిరణ్ చూశాడు. వికాస్ అధ్యాయం చదివాడు కాని పరిశీలన చేయలేదు.

బైబిల్ అధ్యయనంలో మొదటి దశ, పరిశీలన. ఈ దశలో, "ఈ లేఖన భాగంలో నేనేం చూస్తున్నాను?" అని ప్రశ్నించుకోవాలి. ప్రభావవంతమైన బైబిల్ బాష్యానికి ముఖ్య విషయం, సాధ్యమైనంత పరిశీలన చేయడం. ఈ పాఠంలో, వచనంలోని ముఖ్య వివరాలు పరిశీలించడం నేర్చుకుంటాం. ఈ పని చేస్తుండగా ఓపికతో ఉండండి; ఎంత ఎక్కువ పరిశీలిస్తే, బాష్యానికి అంత సమాచారం అందుతుంది.

## వచనంలో నుండి పరిశీలనలు

అపొస్తలుల కార్యములు 1:8:

> అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు
>
> యెరూషలేములోను,
>
> యూదయ సమరయ దేశములయందంతటను
>
> భూదిగంతముల వరకును,
>
> నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను

ఒక్క వచనంలో మనం ఏం పరిశీలించగలం?

**మొదటి పదం ఏంటి?**

"అయినను." *అయినను* అనేది మునుపటి వచనాలతో కలిపే పదం. అపొస్తలుల కార్యములు 1:6లో, "ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" ఇప్పుడు మృతుల్లో నుండి లేచావు గనుక నీ రాజ్యం స్థిరపరుస్తావా? అని అడిగారు. యేసు రెండు ప్రకటనలతో స్పందించాడు.

- "కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు; వాటిని తెలిసికొనుట మీ పనికాదు" (అపొస్తలుల కార్యములు 1:7). ఇది తండ్రి పని.
- "మీరు శక్తినొందెదరు ... నాకు సాక్షులైయుందురు." ఇది మీ పని.

**ఎవరు భాగస్తులు?**

"మీరు." యేసు ఎవరితో మాట్లాడుతున్నాడు? అపొస్తలులతో (అపొస్తలుల కార్యములు 1:2, 4). కొంత సమయం తీసుకుని, "ఈ అపొస్తలులు ఎవరు?" అని అడగండి. అపొస్తలుల గురించి మీ తెలిసిన విషయాలన్ని జాబితా చేయండి. ఈ వచనం ఎవరి గురించి మాట్లాడుతుందనేది, పెంతెకొస్తు దినాన జరిగిన అద్భుతమైన పరివర్తన చూపిస్తుంది.

- వారు యూదులు; యేసు వారిని సమరయకు పంపుతున్నాడు!
- దయ్యంపట్టిన కుమారుని స్వస్థపరచడానికి వారు శక్తిలేనివారు (మార్కు 9:14-29); వారు శక్తి పొందుకుంటారు.
- యేసును పట్టుకున్నప్పుడు వారు భయంతో పారిపోయారు (మత్తయి 26:56); భూదిగంతాల వరకు వారు సాక్షులై ఉంటారు.

**వాక్యంలోని క్రియా పదం ఏంటి?**

"పొందెదరు." ఏం జరుగుతుందో క్రియాపదం చెబుతుంది. ఈ సందర్భంలో, క్రియాపదం భవిష్యత్లో పొందబోయే దానిని చూపిస్తుంది.

**వారు ఏం పొందుతారు?**

"శక్తి." అపొస్తలుల కార్యములు గ్రంథం, అపొస్తలుల పరిచర్యలో ఈ శక్తిని చూపిస్తుంది.

► ఇక్కడ మీరు మొదలుపెట్టొచ్చు. మిగిలిన వచనం చూసి, ఈ ప్రశ్నలకు సమాధానాలు రాయండి:

- **వారు శక్తిని ఎప్పుడు పొందుకుంటారు?**
- **ఎవరు వారికి శక్తినిస్తారు?**
- **శక్తి పొందడం వలన ఏం జరుగుతుంది?** (సాక్ష్యానికి ముందు శక్తి పొందుతారు. ఈ శక్తి పొందడం వలన ఇతరులతో సువార్త పంచుకోవాలనే ఆశ కలుగుతుంది)

- **వారు ఎవరికి సాక్షులైయుంటారు?**
- **ఎక్కడ సాక్షులైయుంటారు?** (ఈ నాలుగు ప్రాంతాలు గురించి మీకు ఏం తెలుసు? సమరయ ప్రత్యేకత ఏంటి? యూదులైన ఈ అపొస్తలులు అక్కడికి వెళ్ళాలనుకుంటున్నారా?)

**మీ పరిశీలన శక్తిని పెంచుకోవాలి**

మనోజ్ మంద దృష్టిగలవాడు. పాఠశాలలో ఉన్నప్పుడు, టీచర్ ని సరిగా చూడలేకపోయాడు. ముందు బోర్డు పై ఉన్న అక్షరాలు సరిగా చదవలేకపోయాడు. ఒకరోజు, కళ్లద్దాలు పెట్టుకున్నాడు. వెంటనే ముందెన్నడూ చూడని వాటిని చూడగలిగాడు! టీచర్ ముఖం స్పష్టంగా చూడగలిగాడు. బోర్డుపై రాసినవి సులభంగా చదవగలిగాడు. అతడు ఉత్సాహంతో నిండిపోయాడు!

శ్రద్ధ పరిశీలన అంటే, మందదృష్టిని తొలగించుకోవడానికి కళ్లద్దాలు పెట్టుకోవడం వంటిది. లేఖనాన్ని ఎలా పరిశీలించాలో నేర్చుకోవడం వల్ల లేఖనం ఏం సెలవిస్తుందో అనే విషయంపై మన అవగాహన పెరుగుతుంది.

అపొస్తలుల కార్యములు 1:8వ అభ్యాసం, మీరు చదివిన దానిని ప్రస్తుతం ఎలా పరిశీలిస్తున్నారో చూపిస్తుంది. మీ పరిశీలనా శక్తి పెంచుకోవడానికి సహాయపడే కొన్ని చిట్కాలు అధ్యయనం చేద్దాం. లేఖనాన్ని మరింత స్పష్టం చేసే ప్రశ్నలు అడగటం మీరు నేర్చుకుంటారు. ఆ తర్వాత ఇతర వచనాలు చదవుతారు.

మీరు బైబిల్లో ఒక వచనం చదివేటప్పుడు, "ఈ వచనం నాకు తెలుసు!" అని చెప్పొద్దు. బదులుగా, ఒక నూతన విధానంలో కళ్ళు తెరువుమని దేవుణ్ణి అడగండి. ఈ అధ్యాయంలోని సాధనం, నూతన దృష్టితో చదవడానికి సహాయపడుతుంది.[3]

**అవగాహన కోసం చదవండి**

ప్రతి సంవత్సరం బైబిల్ చదువుతానని 10 ఏళ్ళ బాలుడు నిర్ణయించుకున్నాడు. అది మంచి నిర్ణయమే; దురదృష్టవశాత్తూ, ప్రభావవంతంగా బైబిల్ ఎలా చదవాలో అతనికి తెలీదు. ప్రతి రోజు ఎంత వరకు చదవాలో క్యాలెండర్లో ఉంది, కాని ఎప్పుడూ వెనకబడిపోయేవాడు. ఒక ఆదివారం మధ్యాహ్నం, అన్ని చదవటానికి ప్రయత్నించాడు. క్యాలెండర్లో చూసుకున్నప్పుడు 20 అధ్యాయాలు వెనకబడిపోయాడు (లేవీయకాండములో). కాబట్టి, ఒక్క

---

[3] ఈ పాఠంలోని దశలు, *Living by the Book,* by Howard G. Hendricks మరియు William D. Hendricks (Chicago: Moody Publishers, 2007).Yలో 8-17 అధ్యాయాల నుండి వచ్చాయి. ఈ అధ్యాయాలు చదవడంవల్ల మీరు అదనపు అభ్యాసం మరియు వివరణ పొందొచ్చు.

మధ్యాహ్నంలో లేవీయకాండము అంతా చదివేశాడు. చదవగలిగినంత వేగంగా చదివి, ముగించటానికి ప్రయత్నించాడు. చదివిన 10 నిమిషాలకు, లేవీయకాండము సందేశాన్ని చెప్పలేడు. అతడు అర్థం చేసుకోకుండా చదివాడు.

అర్థం చేసుకోవడానికి చదవటం కష్టమైన పని. సత్యాన్ని కనుగొనడం గురించి బైబిల్ ఇలా వివరిస్తుంది: "వెండిని వెదకినట్లు దాని వెదకినయెడల దాచబడిన ధనమును వెదకినట్లు దాని వెదకినయెడల యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట యెట్టిదో నీవు గ్రహించెదవు దేవునిగూర్చిన విజ్ఞానము నీకు లభించును" (సామెతలు 2:4-5). లేఖనం జాగ్రత్తగా చదవండి. ప్రశ్నలు అడగండి. నోట్సు రాసుకోండి. మనసుతో చదవండి.

మీ సొంత మాటల్లో లేఖనాన్ని వ్యాఖ్యానించడం ద్వారా కొన్నిసార్లు నూతన అవగాహన పొందొచ్చు. బహుశ మీ వ్యాఖ్యానం అంత పాండిత్యంగా ఉండనప్పటికీ, వాక్యభాగ అర్థం గురించి లోతుగా ఆలోచించేలా సహాయపడుతుంది.

**చదువుతున్నప్పుడు ప్రశ్నలు అడగండి**

మీ మనసుతో చదవడానికి ముఖ్యమైంది, ప్రశ్నలు అడగటం.

► ఈ భాగం కొనసాగించే ముందు లూకా 24:13-35 చదవండి. పాఠం చదవుతుండగా, లూకా 24 లోకెళ్లి ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వండి.

**(1) ఎవరు?**

వాక్యభాగంలో ఉన్న వ్యక్తులెవరు? వారి గురించి మీకు ఏం తెలుసు?

లూకా 24:13-35లోని వ్యక్తులు ఎవరు? పునరుత్థాన దినమందు క్లెయొపా మరియు పేరులేని సహచరుడు[4] ఎమ్మాయి గ్రామానికి వెళ్తున్నారు. వారు యేసు అద్భుతాలు, బోధలు తెలిసినవారు. ఈ ఆదివారం, క్రీస్తు శ్రమలు, పునరుత్థానం గురించి యేసే స్వయంగా వివరించగా మొదట విన్నవారు; పునరుత్థానానికి మొదట సాక్షులలో భాగమయ్యారు.

**(2) ఏంటి?**

వాక్యభాగంలో ఏం జరుగుతుంది? అది చారిత్రక వాక్యభాగమైతే, ఏ సంఘటనలు జరుగుతున్నాయి? అది పత్రికైతే, రచయిత ఏం బోధిస్తున్నాడు?

---

[4] పేరులేని సహచరుడు లూకా అని ఒక సంప్రదాయం సూచిస్తుంది, ఇది కథలోని వివరాలన్నిటిని వివరిస్తుంది.

లూకా 24లో సంఘటన, యేసు ప్రత్యక్షత. యేసు పునరుత్థాన వాస్తవాన్ని చూడగలుగునట్లు ఈ ఇద్దరు మనష్యుల కళ్ళు తెరువబడ్డాయి (లూకా 24:31).

**(3) ఎప్పుడు?**

మునుపటి ప్రశ్నలా, సమయం మన పఠనానికి సందర్భాన్ని ఇస్తుంది. బైబిల్ అధ్యయనంలోని పరిశీలన దశలో, వాక్యభాగంలోనే సమయ వివరాలు గురించి చూస్తాం. ఖాళీ సమాధిని కనుగొన్న రోజునే ఎమ్మాయి ప్రయాణం జరిగిందని లూకా 24:13 ద్వారా నేర్చుకుంటాం.

ఖాళీ సమాధిని కనుగొన్న కొన్ని గంటలకే ఈ ఇద్దరు శిష్యులు యేసును కలిశారు. వారు మాట్లాడుకుంటూ, ఆలోచిస్తుండగా, వారి మనోభావాలెలా ఉన్నాయో ఇది చెబుతుంది (లూకా 24:15). గత మూడు దినాలుగా వీరి భావోద్వేగ పరిస్థితి ఎలా ఉందో ఆలోచించండి.

గురువారం, యేసును పట్టుకోవడం చూసినప్పుడు, నిరాశకు గురైయ్యారు. శుక్రవారం, యేసు తుది శ్వాస విడిచినప్పుడు, మెస్సీయ రాజ్య నిరీక్షణను కోల్పోయారు. ఇప్పుడు ఇది ఆదివారం, సమాధి ఖాళీగా ఉంది. వారు ఎమ్మాయి గ్రామానికి వెళ్తుండగా, ఈ అర్ధంకాని సంఘటనలు గురించి ఆలోచించటానికి ప్రయత్నించారు.

**(4) ఎక్కడ?**

"ఇది ఎక్కడ జరిగింది?" అని అడగటం ఎల్లప్పుడు సహాయకరం. ఈ ప్రశ్నకు సమాధానాలు కనుగొనడంలో బైబిల్ అట్లాస్ మీకు సహాయపడుతుంది. కొన్ని బైబిళ్ళ వెనుక భాగంలో మ్యాప్/పటం ఉంటుంది.

లూకా 24లో, క్లెయొపా మరియు పేరులేని సహచరుడు, యెరూషలేము నుండి ఎమ్మాయి గ్రామానికి వెళ్తున్నారు, అది పట్టణానికి 11 కిలోమీటర్ల దూరంలో పశ్చిమాన ఉంది. వారు ఇంత దూరం నడిచే సమయానికి, సాయంత్రమైంది. అయితే వారి కళ్ళు తెరువబడిన తర్వాత, వీరు అనందంగా యెరూషలేముకు తిరిగి వెళ్లిపోయారు. ఈ వార్త మరుసటి రోజు వరకు ఆగలేదు!

**(5) ఎందుకు?**

సమయానికి సంబంధించిన ప్రశ్నకు సమాధానం ఇచ్చినప్పుడు, శిష్యులు ఎందుకు నిరాశపడ్డారో చూశాం. యేసు చనిపోయినప్పుడు, మెస్సీయపై పెట్టుకున్న వారి ఆశలన్నీ ముగిసిపోయాయి గనుక వారు నిరాశపడ్డారు.

**(6) ఎలా?**

ఈ ప్రత్యక్షత శిష్యుల జీవితాలను ఎలా మార్చివేసింది? యేసు మృతుల్లో నుండి లేచాడనే నమ్మకంతో వారు యెరూషలేముకు తిరిగి వెళ్లారు. అప్పటి నుండి లక్షలాదిమంది ప్రజలవలె, వారి జీవితాలు పునరుత్థానం ద్వారా మారాయి.

**అదే వాక్యభాగాన్ని లేదా పుస్తకాన్ని అనేకసార్లు చదవండి**

జి. క్యాంప్ బెల్ మోర్గాన్ 20వ శతాబ్దపు గొప్ప బోధకులలో ఒకడు. మోర్గాన్ ఎన్నడు బైబిల్ కాలేజికి వెళ్లలేదు, కాని ప్రభావవంతమైన బైబిల్ బోధకుడయ్యాడు. వాక్యభాగం బోధించే ముందు, తాను ఎంచుకున్న వాక్యభాగానికి సంబంధించి, బైబిల్ పుస్తకమంతటినీ 40సార్లు చదువుతాడు. ఈ ప్రకియ ద్వారా, ప్రతి వచనం గ్రంథమంతటికీ ఎలా సరిపోతుందో నేర్చుకున్నాడు. అతనికి పుస్తకంలో ముఖ్య విషయాలు తెలుసు; రచయిత సందేశం అర్థం చేసుకున్నాడు. ఒకసారి మోర్గాన్ ఇలా చెప్పాడు, "బైబిల్ ఎన్నడు సోమరితనానికి లొంగదు." బైబిల్ అధ్యయనం కష్టమైన పని.

"నేను బైబిల్ పుస్తకాన్ని 40సార్లు ఎలా చదవగలను? బైబిల్ ను ఎప్పటికీ పూర్తి చేయలేను" అని మీరు అనొచ్చు. అది మీరు అనుకున్నంత కష్టం కాదు. చాలామంది పెద్దలు నిమిషానికి 100 పదాలు చదవగలరు; వారు ఒక గంటలో 6,000పదాలు చదవగలరు. బైబిల్లోని 33 పుస్తకాల్లో 6,000 పదాలు కంటే తక్కువ ఉన్నాయి. ఇందులో పౌలు పత్రికలు, సాధారణ పత్రికలు, చిన్న ప్రవక్తలు, పాత నిబంధన పుస్తకాలైన రూతు, ఎస్తేరు, ప్రసంగి, మరియు విలాపవాక్యములు ఉన్నాయి. రోజుకు ఒక గంటలో, 40 రోజుల్లో 40సార్లు ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు, కొలొస్సయులకు, 1 మరియు 2 థెస్సలొనీకయులకు చదవగలరు.

పుస్తకమంతా చదవటంవల్ల, అది ఎలా క్రమపరచబడిందో అర్థమౌతుంది. మునుపు, మనం అపొస్తలుల కార్యములు 1:8 చదివాం, అక్కడ యేసు శిష్యులను యెరూషలేము, యూదయ, సమరయ మరియు భూదిగంతాల వరకు సాక్షులుగా పంపాడు. మీరు అపొస్తలుల కార్యములు గ్రంథం పదే పదే చదివినప్పుడు, ఇది పుస్తకమంతటికీ ఒక నమూనాగా ఉండటం మీరు చూస్తారు. అపొస్తలుల కార్యములు మొదటి భాగంలో, హింసవలన అపొస్తలులు యెరూషలేం నుండి మిగిలిన యూదయ ప్రదేశాలకు వెళ్ళారు. అపొస్తలుల కార్యములు 8లో, ఫిలిప్పు సమరయకు సువార్త తీసుకెళ్ళాడు; అపొస్తలుల కార్యములు ముగిసే సమయానికి, పౌలు రోములో ప్రకటించాడు, అక్కడ నుండి సువార్త భూదిగంతాలవరకు వెళ్తుంది.

*పదే పదే చదవడానికి కొన్ని సూచనలు*

1. **బైబిల్ ను గట్టిగా చదవండి లేక చదివేటప్పుడు వినండి.** రాసిన పుస్తకాలపై ఆధారపడే సంస్కృతులకు చెందిన ప్రజలు, మొదటి క్రైస్తవులు బైబిల్ ను చదువుతున్నప్పుడు విన్నారనే సంగతి మర్చిపోతారు. ఎఫెసి సంఘానికి పౌలు పత్రికలు పంపినప్పుడు, ప్రతి సభ్యునికి ఫోటోకాపీ తీసి ఇవ్వలేదు! ఒక నాయకుడు ఇతరుల కోసం ఆ పత్రిక చదివేవాడు. చరిత్రలో చాలావరకు, చాలామంది దేవుని వాక్యాన్ని చదివి నేర్చుకోవడం కంటే విని నేర్చుకున్నారు. పౌలు పత్రికలు సంఘాల్లో చదివారు; ప్రవక్తలు వారి సందేశాలను వినిపించారు. పత్రికను గట్టిగా చదవడం ద్వారా లేక ఆడియో పుస్తకంగా వినడం ద్వారా, ఆదిమ సంఘం లేఖనాన్ని విన్నట్లుగా దేవుని వాక్యం మాట్లాడడం మీరు వింటారు.[5]

2. **బైబిల్ ను వివిధ అనువాదాల్లో చదవండి** (మీ భాషలో ఒక అనువాదం కంటే ఎక్కువ అందుబాటులో ఉంటే). కొన్ని అనువాదాలు తమ పద్ధతిలో మరింత సాంకేతికంగా ఉంటాయి; కొన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి ఉద్దేశించబడ్డాయి. ఒకటి కంటే ఎక్కువ అనువాదాలు చదవటంవల్ల, సందేశంలో నూతన అవగాహనలు పొందొచ్చు. మీకు ఒకటి కంటే ఎక్కువ భాషలు తెలిస్తే, మరో భాషలో కూడా లేఖనం చదవడం సహాయకరం.[6]

3. **మీరు చదివే ప్రతిసారి విభిన్నమైన విషయాలపై దృష్టిపెట్టండి.** ఉదాహరణకు, ఒక వ్యక్తి ప్రతిరోజు ఒక వారంపాటు ఆదికాండము 3 చదివి, ప్రతిసారి ఆ అధ్యాయాన్ని వేర్వేరు కోణంలో నుండి చూడొచ్చు:

   సోమవారం: పరలోకపు తండ్రి కోణంలో ఆదికాండము 3 చదవచ్చు. తన పిల్లల పాపం చూసినప్పుడు తండ్రి ఎలా భావిస్తాడు?

   మంగళవారం: అధ్యాయంలో అతి ముఖ్యమైన వచనం ఏంటి?

   బుధవారం: సాతాను కోణంలో ఆదికాండము 3 చదవచ్చు. తన పిల్లలతో దేవునికున్న సంబంధాన్ని ఎలా నాశనం చేశాడు?

   గురువారం: సిలువలో యేసు బలియాగం గుర్తుచేసుకుంటూ ఆదికాండము 3 చదవండి.

---

[5] www.faithcomesbyhearing.com 700 కంటే ఎక్కువ భాషల్లో ఆడియో బైబిళ్లు కలిగి ఉంది.

[6] www.biblegateway.com అనేక భాషల్లో బైబిల్ అనువాదాలను ఉచితంగా మీకు అందిస్తుంది.

శుక్రవారం: ఆదాము మరియు హవ్వల కోణంలో చదవండి. దేవుని తీర్పు గురించి విన్నప్పుడు వారు ఎలా భావించారు?

శనివారం: మొట్టమొదటిసారిగా బైబిల్ ను చదువుతున్న వారి కోణంలో నుండి ఆదికాండము 3 చదవండి. బైబిల్ అంతటిని అర్థం చేసుకోవడానికి ఈ కథ ఎలా ప్రాముఖ్యం?

ఒక్క సంవత్సరంలో బైబిల్ చదవడానికి ఎంపిక చేసిన ప్రణాళికలు www.bible.comలో అందుబాటులో ఉన్నాయి. జి. క్యాంప్‌బెల్ మోర్గాన్ నమూనా ఆధారంగా మరొక ప్రణాళిక, నెలలో ఒక పుస్తకాన్ని అనేకసార్లు చదవడం. ఒక్క గంటలో లేక అంత కంటే తక్కువ సమయంలో కూడా, 33 బైబిల్ పుస్తకాలు చదవొచ్చు గనుక, నెలలో ప్రతిరోజు ఒక పుస్తకం 30సార్లు చదవగలరు. ఈ ప్రక్రియ నెమ్మదిగా ఉన్నప్పటికీ, పుస్తకం పదే పదే చదవడంవల్ల దేవుని వాక్యం లోతుగా అర్థం చేసుకుంటారు. ఈ పద్ధతిలో చదవండి, ఆరు సంవత్సరాల్లో బైబిల్ అంతటిని 16సార్లు చదవగలరు.[7]

## వ్యాకరణాన్ని అధ్యయనం చేయండి

దేవుడు మనతో అనేక మార్గాల్లో మాట్లాడతాడు, మరిముఖ్యంగా రాయబడిన వాక్యం ద్వారా మాట్లాడతాడు. లేఖన అవగాహన కోసం మీరు భాషాపేత్త కానక్కర్లేదు, రాసిన భాషను మీరు ఎంత మంచిగా అర్థం చేసుకుంటే, దేవుని వాక్య సత్యాన్ని అంతే మంచిగా గ్రహిస్తారు.

ఒక ఉదాహరణగా, పౌలు రాసిన ఒక సుప్రసిద్ధ వచనం తీసుకుని, వ్యాకరణం అధ్యయనం చేద్దాం. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1). వచనం యొక్క వ్యాకరణాన్ని పరిశీలించినప్పుడు, మనం వీటిని చూస్తాం:

### *క్రియా పదాలు*

క్రియాపదాలు, చర్య లేక ఉనికిని తెలియజేస్తాయి. రోమా 12:1లో రెండు క్రియా పదాలున్నాయి:

- **బతిమాలుకొనుట** అంటే, "విజ్ఞప్తి" లేక "అడుక్కోవడం." మీరు పౌలు అభ్యర్థలో ఆవశ్యకతను భావించగలరా? ఇది సామాన్య సలహా కాదు; దేవునికి పూర్తిగా అర్పించుకోవాలని తన పాఠకులను బతిమాలుకుంటున్నప్పుడు, లోతైన భావావేశం కనిపిస్తుంది.

---

[7] పెద్ద పుస్తకాలు, కొన్ని రోజుల్లోనే ముప్పైసార్లు చదవగల ఫిలేమోనుకు మరియు తీతుకు వంటి చిన్న పుస్తకాలతో సమతుల్యం చేయబడతాయి.

- **సమర్పించుకొనుట** అనేది సకర్మక్రియ. దీనికి నిబద్ధత అవసరం. మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని, దేవునికి పూర్తిగా అప్పగించుకొనుడని పౌలు తన పాఠకులను పిలుస్తున్నాడు.

*నామవాచకాలు*

రోమా 12:1లో, మన అధ్యయనానికి ముఖ్యమైన నామవాచకాలు ఇవి:

- **సహోదరులు**. పౌలు విశ్వాసులకు రాస్తున్నాడు. పాపులను మారుమనసు కోసం పిలవడం లేదు; మరింత సమర్పణతో ఉండాలని విశ్వాసులను పిలుస్తున్నాడు.

- **శరీరములు.** రోమా 12 మిగిలిన భాగం, *శరీరములు* అంటే జీవితమంతటినీ సూచిస్తుంది. దీనికి మనం "మీ జీవితమంతటిని సమర్పించుకోవాలి" అనే వివరణ ఇవ్వొచ్చు.

- **వాత్సల్యములు.** దేవుని వాత్సల్యమును బట్టి పౌలు పిలుస్తున్నాడు. ఈ వచనానికి ముందున్న వాక్యభాగంలో, దేవుడు అందరి యెడల, యూదులు మరియు అన్యజనుల యెడల కరుణ చూపుతాడని పౌలు వివరించాడు (రోమా 11:32).

- **యాగము.** మోషే ధర్మశాస్త్రంలో, అరాధికుడు బలిగా జంతువును తీసుకొచ్చేవాడు. క్రీస్తు రాజ్యంలో, మన జీవితం సజీవ యాగంగా అర్పించడానికి మనం పిలువబడ్డాం.

*విశేషణాలు*

విశేషణాలు మరియు క్రియావిశేషణాలు అంటే వివరణాత్మక పదాలు, విశేషణాలు, "అవి విశేషంగా చెప్పే పదాల అర్థాన్ని వివరిస్తాయి."[8] రోమా 12:1లో, *యాగము* అనే పదం అనేక పదాల శ్రేణి ద్వార విశేషంగా చెప్పబడింది.

- మన యాగం **సజీవం**. మనం ఇకమీదట మృతమైన జంతువును సమర్పించము; మన జీవితాలను అనుదినం సమర్పించుకుంటాం.

- మన యాగం **పరిశుద్ధం**. పాత నిబంధన అరాధికుడు బలియాగం కోసం కుంటిదైన లేక అంగవైకల్య కలిగిన జంతువును తీసుకురాలేడు; క్రొత్త నిబంధన విశ్వాసి యాగముగా అపవిత్రమైన, అవిధేయత కలిగిన జీవితాన్ని అర్పించలేడు.

---

[8] Howard G. Hendricks and William D. Hendricks, *Living by the Book* (Chicago: Moody Publishers, 2007), 121

- పరిపూర్ణమైన, ఇష్టపూర్వకమైన యాగం **దేవునికి అనుకూలమైనది**.

***ఉపసర్గిక పదాలు*** *(Prepositional Phrases):*

ఉపసర్గ పదాలంటే లో, పై, పైన, కి, కు మరియు ద్వారా. ఈ చిన్న పదాలు పెద్ద అర్థాన్ని కలిగియుంటాయి. రోమా 12:1లో, రెండు ఉపసర్గిక పదసమూహాలు ముఖ్యమైనవి:

- "దేవుని వాత్సల్యమును **బట్టి**" అనే మాట పౌలు విజ్ఞప్తికి ఆధారం. ఇది ఒక సైనికుడు శత్రువుకి లొంగిపోవటం కాదు; కాని, ప్రేమగల తండ్రి చిత్తానికి కుమారుడు అనందంగా లొంగిపోవటం.
- మన యాగాలు "**దేవునికి**" అనుకూలము గా ఉండాలి. క్రైస్తవునికి, దేవుని ఆమోదమే తుది బహుమానం.

***సంయోజక (సంబంధం కలిగించు) పదాలు***

*మరియు* లేక కాని అనే సంయోజక పదాలు శక్తివంతమైనవి. ఒక రచయిత సంయోజక పదాలను, ఇటుకరాళ్లను కలిపి ఉంచే సున్నంతో పోల్చాడు.[9] అపొస్తలుల కార్యములు 1:8లో, *అయినను* అనే పదం శిష్యుల అపార్థాన్ని సూచిస్తుందని మనం చూశాం.

రోమా 12:1లో, కాబట్టి అనే మాట మునుపటి వాక్యభాగాన్ని సూచిస్తుంది. మీరు రోమా పత్రిక అంతా చదివితే, మీరు రెండు పెద్ద భాగాలు చూస్తారు:

- రోమా 1-11 సిద్ధాంతాన్ని బోధిస్తుంది: పాపానికి శిక్షావిధి, విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడడం, విశ్వాసి పరిశుద్ధపరచబడడం, మహిమపరచబడడం అనేవి తన పిల్లల పట్ల దేవునికున్న అంతిమ ఉద్దేశ్యం, మరియు ఎన్నుకొనుట అనేది ఈ ఉద్దేశ్యాన్ని నెరవేర్చే దేవుని సాధనం.
- రోమా 12-16 వాక్యభాగం ఈ సిద్ధాంతం యొక్క ఆచరణాత్మక అన్వయింపును చూపిస్తుంది. మనం దేవుని దృష్టిలో నీతిమంతులుగా తీర్చబడ్డాం గనుక ఇలా జీవిస్తాం. మనం విశ్వసించే దాని బట్టి (రోమా 1-11), ఇలా చేస్తున్నాం (రోమా 12-16). రోమా 12:1వ వచనం సంయోజక వచనం.

పౌలు రాసిన చాలా పత్రికల్లో *కాబట్టి* అనే పదం ఒక ముఖ్య గుర్తు. కేవలం విశ్వాసం ద్వారా నీతిమంతుగా తీర్చబడతారనే గొప్ప సత్యాన్ని గలతీ విశ్వాసులకు జ్ఞాపకం చేసిన తర్వాత, అనుదిన జీవితంలో వారు తమ నీతిని ఆచరణలో పెట్టాలని

[9] J. Scott Duvall and J. Daniel Hays, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012), 59

పౌలు చెప్పాడు; "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. **కాబట్టి**, మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కు కొనకుడి" (గలతీయులకు 5:1). క్రీస్తు యేసులో వారు ఎన్నుకోబడ్డారన్న గొప్ప సిద్ధాంతాన్ని బోధించిన తర్వాత, ఆ పిలుపుకు తగినట్లుగా జీవించాలని పౌలు ఎఫెసీయులకు చెప్పాడు; "మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతోకూడిన సంపూర్ణవినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెనని, ప్రభువును**బట్టి** ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను" (ఎఫెసీయులకు 4:3). మీరు మృతిబొందారు, మీ జీవం క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడిందని పౌలు కొలొస్సయులకు చెప్పాడు. దాని ఫలితంగా వాళ్ళు ఎలా జీవించాలి? "**కావున** భూమిమీదనున్న మీ అవయవములను....చంపివేయుడి" (కొలొస్సయులకు 3:5).

**వాక్యభాగంలో ప్రత్యేక వివరాల కోసం చూడండి**.[10]

వాక్యభాగంలో ముఖ్య ఆలోచనలు గుర్తించడానికి బైబిల్ రచయితలు ఉపయోగించే గుర్తించే చిట్కాలు, మీ అధ్యయనానికి క్రొత్త అవగాహన ఇస్తాయి. చూడాల్సిన వివరాలు:

***పునరావృతమయ్యే పదాలు***

ఒక రచయిత ఒక పదాన్ని ఒకటి కంటే ఎక్కువసార్లు ఉపయోగిస్తే, అది ముఖ్య ఆలోచనను సూచిస్తుంది. [పరిశీలన దశలో, పునరావృత పదంలో, లోతైన అర్థాలన్నీ చూడరు, కాని ఆ పదాన్ని గుర్తించి, "ఈ పదం ఎందుకు పునరావృతమైంది?" అని అడగాలి.

► క్రింది వాక్యభాగాలు చదివి, పునరావృత పదాలు గుర్తించండి:

**2 కొరింథీయులకు 1:3-7.** ఈ వాక్యభాగంలో *ఆదరణ* అనే మాట ఎన్నిసార్లు పునరావృతమయ్యింది**?** ఈ వాక్యభాగంలో పునరావృత పదాలను గమనించినప్పుడు**,** మీరు అడగగల ప్రశ్నల ఉదాహరణలు:

- *ఆదరణ* అనే మాట ప్రతిసారి ఒకే విధంగా ఉపయోగించబడిందా? (కొన్నిసార్లు అది నామవాచకం; మరికొన్నిసార్లు క్రియాపదం.)
- ఏ విశేషకాలు ఉపయోగించారు? (*సమస్తమైన ఆదరణ; మా ఆదరణ*; మీ ఆదరణ.)

[10] ఈ జాబితా J. Scott Duvall and J. Daniel Hays, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012) నుండి తీసుకోబడింది.

యోహాను 15:1-10. ఈ వాక్యభాగంలో *నిలిచియుండుడి* అనే మాట ఎన్నిసార్లు పునరావృతమయ్యింది? ఈ వాక్యభాగంలో పునరావృత పదాలను గమనించినప్పుడు, మీరు అడగగల ప్రశ్నలకు ఉదాహరణలు:

- ఆయనయందు నిలిచియుండుటకు షరతులు ఏంటి?
- ఈ వాక్యభాగంలోని హెచ్చరిక, ఆయనయందు నిలిచియుండకపోవడం సాధ్యమని సూచిస్తుందా?
- ఆయనయందు నిలిచియుండకపోతే ఏమౌతుంది?
- ఆయనయందు నిలిచియుంటే ఏ ఆశీర్వాదాలు ఉంటాయి?

### *వ్యత్యాసాలు*

అనేకమంది బైబిల్ రచయితలు ప్రజలు లేక ఆలోచనలకు భిన్నంగా ఉంటారు. మీరు ఒక వచనంలో కాని అనే పదం చూసినప్పుడు, అది రెండు భిన్న ఆలోచనలను కలుపుతుంది. అనేక సామెతలు ఈ విధమైన విరుద్ధత ఉపయోగిస్తాయి.

- విమర్శకునికి స్పందించడానికి రెండు మార్గాలు ఉన్నాయి: "మాట క్రోధమును చల్లార్చును. నొప్పించు మాట కోపమును రేపును" (సామెతలు 15:1).

- ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలంటే రెండు మార్గాలు ఉన్నాయి: "నాయకులు లేని జనులు చెడిపోవుదురు ఆలోచనకర్తలు అనేకులుండుట రక్షణకరము" (సామెతలు 11:14).

- బీదల యెడల మన వైఖరి, దేవుని యెడల మన వైఖరిని తెలియజేస్తుంది: "దరిద్రుని బాధించువాడు వాని సృష్టికర్తను నిందించువాడు బీదను కనికరించువాడు ఆయనను ఘనపరచువాడు" (సామెతలు 14:31).

క్రొత్త నిబంధన రచయితలు కూడా వ్యత్యాసాలు ఉపయోగించారు. పౌలు మన పాత జీవితాలకు (చీకటి), మన క్రొత్త జీవితాలకు (వెలుగు) మధ్యనున్న వ్యత్యాసాన్ని వివరించాడు; "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, **ఇప్పుడైతే** ప్రభువునందు వెలుగైయున్నారు" (ఎఫెసీయులకు 5:8).

1 యోహాను 1:5-7లో, యోహాను చీకటి మరియు వెలుగును రెండు విధాలుగా వివరించాడు:

- దేవుడు వెలుగై యున్నాడు; ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు.
- మనమును, చీకటిలో కాకుండా వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము.

### *పోలికలు*

వైరుధ్యం, వ్యత్యాసాలను చూస్తుంది, పోలిక సారుప్యతలను చూస్తుంది.

- "సోమరి తనను పని పెట్టువారికి పండ్లకు పులుసు**వంటివాడు** కండ్లకు పొగవంటివాడు" (సామెతలు 10:26).
- "దప్పిగొనినవానికి చల్లని నీరు **ఎట్లుండునో** దూరదేశమునుండి వచ్చిన శుభసమాచారము అట్లుండును" (సామెతలు 25:25).

► యాకోబు 3:3-6 చదవండి. నాలుకను మూడింటితో పోల్చారు. పోలికల ద్వారా మీరు ఏం నేర్చుకుంటారు?

► సామెతలు 26:7-11 లోని ప్రతి వచనంలో, *సమానుడు* అనే మాట ఉంది. ప్రతి వచనంలో, పోలిక అధ్యయనం చేయండి. మీరు సామెతలు 26:7 చూస్తున్నట్లయితే, మీకు మీరు ఇలా చెప్పుకుంటారు: "కుంటివాని కాళ్లు పట్టులేక యున్నట్లు మూర్ఖుల నోట సామెత పాటి లేకుండును **ఎందుకంటే**..." మూర్ఖుల నోటి సామెతకు మరియు కుంటివాని కాళ్ళకు మధ్య మీరు ఏ సారుప్యత చూస్తారు?

### *జాబితాలు*

మీరు బైబిల్ చదువుతున్నప్పుడు, జాబితాలు గుర్తించి, ముఖ్యమైన లక్షణాల కోసం వాటిని అధ్యయనం చేయాలి.

► పాఠంలో ముందుకు వెళ్ళడానికి ముందు, క్రింద ఇచ్చిన జాబితా చదవడానికి సమయం కేటాయించండి:

- 1 కొరింథీయులకు 3:6లో, పౌలు కొరింథులో తన పరిచర్యలోని భాగాలను చూపించాడు.
- 1 యోహాను 2:16 తండ్రి నుండి కాక లోకం నుండి వచ్చు విషయాలను జాబితా చేస్తుంది.
- గలతీయులకు 5:19-21 పాప స్వభావ కార్యాల జాబితా ఇస్తుంది.
- గలతీయులకు 5:22-23 ఆత్మ ఫలం జాబితా ఇస్తుంది.

### *ఉద్దేశ్య ప్రకటనలు*

*అది, తద్వారా,* లేక *కి* వంటి పదాలు క్రియకు లేక చర్యకు ప్రేరణను ఇస్తుంది లేక చర్యా ఫలితం గురించి వివరిస్తుంది. ఉద్దేశ్యం మరియు ఫలితం మధ్య సంబంధాన్ని పరిగణించడానికి సమయం కేటాయించండి; లేఖనం ఉపదేశం ఎందుకు ఇస్తుందో అడగండి.

- “మీరు నన్ను ఏర్పరచుకొనలేదు.... నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని” (ఎందుకు?) “మీరు వెళ్లి ఫలించుటకును, మీ ఫలము నిలిచియుండుటకును” (యోహాను 15:16).
- “నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను” (ఎందుకు?) “నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు” (కీర్తన 119:11).
- “యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని” (ఆయన మనలను ఎందుకు నిర్ణయించుకున్నాడు?), “మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే” (ఎఫెసీయులకు 1:4).

ఇతర సమయాల్లో, ఉద్దేశ్యం ఎలా నెరవేర్చబడిందో ప్రకటన చూపిస్తుంది:

- “యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధిపరచు కొందురు? నీ వాక్యమునుబట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా?” (కీర్తన 119:9).
- మన జీవితానికి నిశ్చయత ఏంటి? “గాని ఆత్మ చేత శారీర క్రియ లను చంపినయెడల జీవించెదరు” (రోమా 8:13).

### *షరతులతో కూడిన వాక్యాలు*

*అయితే* (*if*) అను పదంతో మొదలయ్యే వాక్యాలు షరతును కలిగియుంటాయి. కొన్నిసార్లు పాఠకులు షరతు నెరవేర్చకుండా బైబిల్ వాగ్దానాలు నెరవేరతాయని అనుకుంటారు; అయితే, షరతులతో కూడిన వాగ్దానం ఒక ప్రత్యేక షరతు నెరవేర్పుపై ఆధారడి ఉంటుంది. దీనిని తరచు షరతులతో కూడిన వాక్యం ద్వారా చూడొచ్చు.

**షరతు**: “కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల”

**ఫలితం**: “వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను” (2 కొరింథీయులకు 5:17).

**షరతు**: “నా నామమున”

**ఫలితం**: “మీరు నన్నేమి అడిగినను నేను చేతును” (యోహాను 14:14).

### చదువుతున్నప్పుడు ప్రార్థించండి

తుది సూచన స్పష్టంగా అనిపించవచ్చు, కాని ముఖ్యమైంది. క్రైస్తవునికి బైబిల్ అధ్యయనం, ప్రార్థనా జీవితం వేర్వేరుగా ఉండకూడదు. బైబిల్ పఠనాన్ని, ప్రార్థనను వేరు చేయడమంటే దేవునితో మన అనుదిన సంభాషణలో రెండు విషయాలను వేరు చేయడమే.

మనకు జ్ఞానం లేనప్పుడు దేవుని సహాయం కోరవచ్చని యాకోబు ధృవీకరించాడు; "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడు" (యాకోబు 1:5). దేవుని వాక్యం అర్థం చేసుకోవడానికి దేవుని సహాయం అవసరమైనప్పుడు, ఇది అద్భుతమైన వాగ్దానం.


కీర్తన 119వ అధ్యాయం ప్రార్థనకు, లేఖనానికి మధ్య సంబంధాన్ని చూపిస్తుంది. కీర్తనాకారుడు దేవుని వాక్యం అధ్యయనం చేస్తున్నప్పుడు, మార్గనిర్దేశం కోసం దేవుణ్ణి పదే పదే వేడుకున్నాడు. అదే విధంగా, మనం అధ్యయనం చేస్తుండగా, దేవుని సహాయం కోరవచ్చు.

- "నేను నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతు లను చూచునట్లు నా కన్నులు తెరువుము" (కీర్తన 119:18).
- "నీ ఉపదేశమార్గమును నాకు బోధపరచుము. నీ ఆశ్చర్యకార్యములను నేను ధ్యానించెదను" (కీర్తన 119:27).
- "యెహోవా, నీ కట్టడలను అనుసరించుటకు నాకు నేర్పుము" (కీర్తన 119:33).

లేఖనంలోని మాటలను, ప్రార్థనగా మార్చే గొప్ప శక్తిని చాలామంది నేర్చుకున్నారు. ఈ వాక్యభాగాలను మీ వ్యక్తిగత ప్రార్థనలుగా మార్చుకోవడానికి ప్రయత్నించండి:

- కీర్తన 23 – దేవుని నడిపింపు మరియు భద్రత కోసం ప్రార్థన
- యెషయా 40:28-31 – దేవుని బలం కోసం ప్రార్థన
- ఫిలిప్పీయులకు 4:8-9 – దైవిక మనసు కోసం ప్రార్థన

**ఉదాహరణ: 1 యోహాను 1:5-7 లో పరిశీలనలు**



## పాఠం 2 ముఖ్య విషయాలు

(1) ఒక వచనాన్ని అధ్యయనం చేయడం ద్వారా పరిశీలన ప్రక్రియ మొదలుపెట్టండి. వచనంలో సాధ్యమైనన్ని ప్రశ్నలు అడగండి.

(2) మీ పరిశీలనా శక్తిని పెంచే దశలు:

- అవగాహన కోసం చదవండి.
- చదువుతున్నప్పుడు ప్రశ్నలు అడగండి.
  - ఎవరు?
  - ఏంటి?
  - ఎప్పుడు?
  - ఎక్కడ?
  - ఎందుకు?
  - ఎలా?
- అదే వాక్యభాగాన్ని లేదా పుస్తకాన్ని అనేకసార్లు చదవండి.
- వ్యాకరణాన్ని అధ్యయనం చేయండి. వీటి కోసం చూడండి:
  - క్రియాపదాలు
  - నామవాచకాలు
  - విశేషకాలు
  - ఉపసర్గిక పదాలు
  - సంయోజక పదాలు
- వాక్యభాగంలో ప్రత్యేక వివరాల కోసం చూడండి. ఈ క్రిందివాటి కోసం చూడండి:
  - పునరావృతమయ్యే పదాలు
  - వ్యత్యాసాలు
  - పోలికలు
  - జాబితాలు
  - ఉద్దేశ్య ప్రకటనలు

- షరతులతో కూడిన వాక్యాలు

- చదివేటప్పుడు ప్రార్థించండి.

**పాఠం 2 అభ్యాసాలు**

(1) యెహోషువ 1:8 పై పరిశీలనల జాబితా చేయండి. ఒక పేపరులో వచనం రాసి, ప్రశ్నలు అడగటం మొదలుపెట్టండి: "ఎవరు? ఏంటి? ఎప్పుడు? ఎక్కడ? ఎందుకు? ఎలా?" ఈ పాఠం చివరి భాగంలో ఇచ్చిన ఉదాహరణ, సూచనలు ఉపయోగించి, మీరు చేయగల పరిశీలనలన్ని చేయండి. ఈ దశలో, మీరు వచనాన్ని బాష్యం చేయట్లేదు లేక ప్రసంగం తయారు చేయట్లేదు. వచనంలో వివరాలు కోసం చూస్తున్నారు.

(2) మరింత అభ్యాసం కోసం, మత్తయి 28:18-20 కి కూడా అదే ప్రకియ అనుకరించండి.

# పాఠం 3

# పరిశీలన: పెద్ద వాక్యభాగాలను చూడడం

## పాఠం లక్ష్యాలు

(1) లేఖనం చదివేటప్పుడు సందర్భం యొక్క ప్రాముఖ్యతను గుర్తించడం.

(2) పుస్తకంలో ఉద్ఘాటించిన వివరాలను పరిశీలిస్తూ, బైబిల్ రచయిత ఉద్దేశ్యం, అభిప్రాయం యెడల సున్నితంగా ఉండడం.

(3) లేఖనంలో పెద్ద వాక్యభాగాలపై (ఎక్కువ వచనాలు ఉన్న వాక్యభాగాలు) పరిశీలనను అభ్యాసం చేయడం.

(4) తదుపరి అధ్యయనం కోసం పట్టికలో సమాచారం సేకరించడం.

## పరిచయం

మనం చదివే కొన్ని విషయాలకు ప్రాముఖ్యత ఉండదు; మనం ప్రయాణించేటప్పుడు సమయం గడవాలని నవలను చదువుతాం. మనం చదివే కొన్ని విషయాలకు తక్కువ ప్రాముఖ్యత ఉంటుంది; లోకంతో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి వార్తా పత్రిక చదువుతాం. మనం చదివే కొన్నింటికి నిత్యత్వపు ప్రాముఖ్యత ఉంటుంది; మనం దేవుని స్వరం వినటానికి బైబిల్ చదువుతాం. లేఖనం "ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతికి 3:16-17) అని పౌలు రాశాడు. ఈ కారణంగా, బైబిల్ జాగ్రత్తగా చదువుతూ, దేవుడు మాటలు వింటాం.

2వ పాఠంలో, కొన్ని ప్రత్యేకమైన, నిర్దిష్టమైన వచనాలను గురించి పరిశీలనలు చేశాం. ఈ పాఠంలో, (ఎక్కువ వచనాలు ఉన్న) వాక్యభాగాలు అధ్యయనం చేద్దాం. వాక్యంలో ఒక భాగం, అధ్యాయాలు, లేక పుస్తకమంతా కావచ్చు. చారిత్రిక కథనంలో, పెద్ద వాక్యభాగం అంటే బహుశా కథ మొత్తం. సువార్తలలో, ఒక ఉపమానం, అద్భుతం, లేక ప్రసంగాన్ని అధ్యయనం చేయొచ్చు. పత్రికలో, ఒక పెద్ద వాక్యభాగం అంటే, ఒక విషయంపై దృష్టిపెట్టే ఒక భాగం కావచ్చు.

వాస్తవానికి బైబిల్ ను అధ్యాయాలు మరియు వచనాలుగా విభజించలేదు. 13వ శతాబ్దంలో, చదవడానికి సులభంగా ఉండాలని, స్టీఫెన్ లాంగ్టన్ బైబిల్ ను అధ్యాయాలుగా విభజించాడు. 16వ శతాబ్దంలో, రాబర్ట్ ఎస్టిన్నే బైబిల్ ను వచనాలుగా విభజించి ముద్రించాడు. అధ్యాయాలు, వచనాల విభజనలు బైబిల్ అధ్యయనానికి సహాయపడతాయి;

అయితే, అవి ఎల్లప్పుడు వాక్యభాగపు సహజ విభజనకు అనుగుణంగా ఉండవు. మీ అధ్యయనాన్ని అధ్యాయ విభజనలు నియత్రించకూడదు; వాక్యభాగపు సహజ విభజనను తార్కికంగా అనుకరించండి.

ఈ పాఠంలో, నెహెమ్యా 1:4-11 వాక్యభాగం అధ్యయనం చేద్దాం. ఇది మీ భవిష్యత్ అధ్యయనానికి మాదిరి ఇస్తుంది. ఒక భాగాన్ని అధ్యయనం చేయడానికి అనేక మార్గాలు నేర్చుకుంటాం. ప్రతి విధమైన అధ్యయనం ప్రతి పుస్తకానికి సరిపోదని గ్రహించండి. ఈ పాఠం, మీరు ఉపయోగించగల సాధనాలను (tools) ఇస్తుంది. మీరు బైబిల్లో ఒక పుస్తకం అధ్యయనం చేస్తుండగా, "ఈ పుస్తకానికి ఏ సాధనం మంచిది?" అని మీరు నిర్ణయించుకోవాలి.

**వాక్యభాగ సందర్భాన్ని కనుగొనడం**

నెహెమ్యా 1:4-11:

> ఈ మాటలు వినినప్పుడు నేను కూర్చుండి యేడ్చి, కొన్ని దినములు దుఃఖముతో ఉపవాసముండి, ఆకాశమందలి దేవుని యెదుట విజ్ఞాపన చేసితిని.
>
> ఎట్లనగా—ఆకాశమందున్న దేవా యెహోవా, భయంకరుడవైన గొప్ప దేవా, నిన్ను ప్రేమించి నీ ఆజ్ఞలను అనుసరించి నడుచువారిని కటాక్షించి వారితో నిబంధనను స్థిరపరచువాడా, నీ చెవియొగ్గి నీ నేత్రములు తెరచి నీ సన్నిధిని దివారాత్రము నీ దాసులైన ఇశ్రాయేలీయుల పక్షముగా నేను చేయు ప్రార్థన అంగీకరించుము. నీకు విరోధముగ పాపముచేసిన ఇశ్రాయేలు కుమారుల దోషమును నేను ఒప్పుకొనుచున్నాను. నేనును నా తండ్రి యింటివారును పాపము చేసియున్నాము. నీ యెదుట బహు అసహ్యముగా ప్రవర్తించితిమి, నీ సేవకుడైన మోషేచేత నీవు నిర్ణయించిన ఆజ్ఞలనైనను కట్టడలనైనను విధులనైనను మేము గైకొనకపోతిమి.
>
> నీ సేవకుడైన మోషేతో నీవు సెలవిచ్చినమాటను జ్ఞాపకము తెచ్చుకొనుము; అదేదనగా—మీరు అపరాధము చేసినయెడల జనులలోనికి మిమ్మును చెదర గొట్టుదును. అయితే మీరు నావైపు తిరిగి నా ఆజ్ఞలను అనుసరించి నడిచినయెడల, భూదిగంతములవరకు మీరు తోలివేయబడినను అక్కడ నుండి సహా మిమ్మునుకూర్చి, నా నామము ఉంచుటకు నేను ఏర్పరచుకొనిన స్థలమునకు మిమ్మును రప్పించెదనని నీవు సెలవిచ్చితివి గదా.
>
> చిత్తగించుము, నీవు నీ మహా ప్రభావమును చూపి, నీ బాహుబలముచేత విడిపించిన నీ దాసులగు నీ జనులు వీరే. యెహోవా చెవియొగ్గి నీ దాసుడనైన నా మొఱ్ఱను, నీ నామమును భయభక్తులతో ఘనపరచుటయందు

ఆనందించు నీ దాసుల మొఱ్ఱను ఆలకించి, ఈ దినమందు నీ దాసుని ఆలోచన సఫలపరచి, ఈ మనుష్యుడు నాయందు దయచూపునట్లు అనుగ్రహించుమని నిన్ను బతిమాలుకొనుచున్నాను, అని ప్రార్థించితిని.

నేను రాజునకు గిన్నె అందించువాడనై యుంటిని.

వాక్యభాగాన్ని చదివేటప్పుడు, ఆ వాక్యభాగమున్న సందర్భాన్ని అర్థం చేసుకోవాలి. నెహెమ్యా 1:4, అధ్యాయ ఆరంభాన్ని సూచిస్తుంది.

ఈ మాటలు వినినప్పుడు....

"ఈ మాటలు" నెహెమ్యా ప్రతిచర్యకు కారణమైన ఏ పదాలు విన్నాడో తెలుసుకోవడానికి ముందున్న వచనాలను చూడాలి.

నెహెమ్యా 1:1 నెహెమ్యా గ్రంథమంతటికీ సందర్భాన్ని అందిస్తుంది:

హకల్యా కుమారుడైన నెహెమ్యా యొక్క చర్యలు. ఇరువదియవ సంవత్సరములో కిస్లేవు మాసమున నేను షూషను కోటలో ఉండగా.

ఈ వచనాన్ని అధ్యయనం చేసేటప్పుడు అడగాల్సిన ప్రశ్నలను 2వ పాఠం ఇచ్చింది.

**ఎవరు?** "నెహెమ్యా, హకల్యా కుమారుడు." ఈ పుస్తకంలో తర్వాత ప్రస్తావించబడిన మరొక నెహెమ్యా ఉన్నాడు (నెహెమ్యా 3:16). ఇక్కడ ఏ నెహెమ్యా గురించి చెప్పారో కుటుంబ పేరు ("హకల్యా కుమారుడు") చూపిస్తుంది.

**ఎప్పుడు?** "ఇరువదియవ సంవత్సరములో కిస్లేవు మాసమున." హెబ్రీ నెల కిస్లేపు, నవంబరు నుండి డిసెంబరుతో సమానమని బైబిల్ నిఘంటువు ద్వారా మనం నేర్చుకుంటాం.[11] "ఇరువదియవ సంవత్సరములో" అనే మాట, రచయిత ఉద్దేశ్యం, నెహెమ్యా జీవితంలో ఇరువదియవ సంవత్సరమా, ఒక చారిత్రక సంఘటన యొక్క ఇరువదియవ సంవత్సరమా, లేక మరో సూచనా అనేది మనకు తెలీదు కాబట్టి ఇది అంత సమాచారం ఇవ్వదు. ఈ సమయంలో, ఈ మాట ప్రక్కన మనం ఒక ప్రశ్న గుర్తు పెట్టొచ్చు. దీనికి జవాబు, నెహెమ్యా 2లో, "అర్తహషస్త రాజు ఏలుబడికాలమున ఇరువదియవ సంవత్సరములో" అని నేర్చుకుంటాం. అర్తహషస్త రాజు ఏలుబడికాలమున ఇరువదియవ సంవత్సరముపు నవంబరు/డిసెంబరులో నెహెమ్యా మొదలుపెట్టాడు.

---

[11] *International Standard Bible Encyclopedia*, 'Kislev' https://www.studylight.org/encyclopedias/eng/isb/k/kislev.html. అక్టోబర్ 6, 2023 న యాక్సెస్ చేయబడింది.

**ఎక్కడ?** నెహెమ్యా "షూషను కోటలో" ఉన్నాడు. పర్షియాలో రెండు రాజభవనాలు ఉన్నాయని మనం బైబిల్ నిఘంటువు లేక అట్లాస్ ద్వారా తెలుసుకుంటాం. వేసవికాలపు రాజభవనం ఎక్-బతానాలో ఉంది. శీతాకాలపు రాజభవనం, షూషనులో ఒక విలాసవంతమైన రాజభవనం. శీతాకాలపు రాజభవనమైన షూషను కోటలో నెహెమ్యా అర్తహషస్త రాజుతో ఉండగా ఈ పుస్తకం మొదలౌతుంది.

మీరు వాక్యభాగాన్ని కంప్యూటర్లో చదువుతున్నట్లైతే, ప్రతి పదానికి మధ్య సంబంధం చూడటానికి వాక్యభాగ ఆకారాన్ని మార్చడం సహాయకరంగా ఉంటుంది. అప్పుడు వాక్యభాగం (నెహెమ్యా 1:1) ఇలా కనిపిస్తుంది:

హకల్యా కుమారుడైన నెహెమ్యాయొక్క చర్యలు.
ఇరువదియవ సంవత్సరములో
కిస్లేవు మాసమున
నేను షూషను కోటలో ఉండగా

1వ వచనం నెహెమ్యా గ్రంథ సందర్భాన్ని అందిస్తుంది. 2, 3 వచనాలు నెహెమ్యా ప్రార్థనా సందర్భం చూపిస్తాయి. నెహెమ్యా షూషను కోటలో ఉండగా, "నా సహోదరులలో హనానీయను ఒకడును యూదులలో కొందరును వచ్చిరి." నెహెమ్యా రెండు విషయాలు గురించి అడిగాడు.

చెరపట్టబడిన శేషములో తప్పించుకొనిన యూదులనుగూర్చియు,

యెరూషలేమునుగూర్చియు నేను వారి నడుగగా వారు—

ప్రతిస్పందనగా, యూదా నుండి వచ్చినవారు, రెండు సమస్యలు పేర్కొన్నారు:

- "చెరపట్టబడినవారిలో శేషించినవారు ఆ దేశములో బహుగా శ్రమను నిందను పొందుచున్నారు;"
- "మరియు యెరూషలేముయొక్క ప్రాకారము పడద్రోయబడినది; దాని గుమ్మములును అగ్నిచేత కాల్చ బడినవని."

ఇది, నెహెమ్యా ప్రార్థనను ప్రేరేపించిన సమస్యలు చూపిస్తుంది. ప్రార్థనా సందర్భం చదివిన తర్వాత, ప్రార్థన గురించి పరిశీలనలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

## వాక్యభాగం చదివేటప్పుడు ఏం చూడాలి

వాక్యభాగంలో మీరు చేసే పరిశీలనలు వాక్యభాగ శైలిపై ఆధారపడి ఉంటాయి. చారిత్రక కథనంలో, *ఎవరు, ఏంటి, ఎప్పుడు* మరియు *ఎక్కడ* అనే ప్రశ్నలుంటాయి. సిద్ధాంత సంబంధ వాక్యభాగంలో, బోధనకు సంబంధించిన ప్రశ్నలుంటాయి.[12]

నెహెమ్యా 1:5-11 ఒక ప్రార్థన. అతని ప్రార్థన:

- "భయంకరుడవైన గొప్ప దేవా, నిన్ను ప్రేమించి నీ ఆజ్ఞలను అనుసరించి నడుచువారిని కటాక్షించి వారితో నిబంధనను స్థిరపరచువాడా" **స్తోత్రము.**
- "నీకు విరోధముగ పాపముచేసిన ఇశ్రాయేలు కుమారుల దోషమును" **బట్టి ఒప్పుకోలు.**
- "అయితే మీరు నావైపు తిరిగి నా ఆజ్ఞలను అనుసరించి నడిచినయెడల, భూదిగంతములవరకు మీరు తోలివేయబడినను అక్కడ నుండి సహా మిమ్మునుకూర్చి, నా నామము ఉంచుటకు నేను ఏర్పరచుకొనిన స్థలమునకు మిమ్మును రప్పించెదనని నీవు సెలవిచ్చితివి గదా" అను దేవుని వాగ్దాన ఆధారంగా **అభ్యర్థన.**

ఈ దశలో, వాక్యభాగంలో అసాధారణ వివరాలను గమనించడం ప్రాముఖ్యం. నెహెమ్యా ప్రార్థన తర్వాత జీవితానికి సంబంధించిన వివరణ ఉంది: "నేను రాజునకు గిన్నె అందించువాడనై యుంటిని." మొదటిగా, ఇది అంత ప్రాముఖ్యం కాదని అనిపిస్తుంది, కాని కథనంలో ముందుకెళ్లే కొద్దీ ఈ విషయం ప్రాముఖ్యం అవుతుంది.

*గిన్నె అందించుట* అనే పదాన్ని బైబిల్ నిఘంటువులో చదివితే,[13] గిన్నె అందించువాడు సామాన్య సేవకుని కంటే గొప్పవాడని నేర్చుకుంటాం; అతడు ఉన్నతాధికారి, రాజుకు నమ్మకస్తుడు.[14]

వాక్యభాగంలో ఏ వివరాలు పరిశీలించాలి? వీటి కోసం చూడండి:

---

[12] [ఈ విభాగంలోని ఎక్కువ భాగం క్రింద పేర్కొన్న పుస్తకంలోని 4వ అధ్యాయం నుండి మార్చి ఉపయోగించబడింది:] J. Scott Duvall మరియు J. Daniel Hays, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012).

[13] *Holman Bible Dictionary*, 'Cupbearer' https://www.studylight.org/dictionaries/eng/hbd/c/cupbearer.html. అక్టోబర్ 6, 2023 న యాక్సెస్ చేయబడింది.

[14] J. D. Douglas, *New Bible Dictionary*, (2nd edition), (Wheaton: Tyndale House, 1982)

### సాధారణ నుండి నిర్దిష్ట సంబంధాలు

అనేక భాగాలు సాధారణ పరిశీలనతో మొదలై, ఆ తర్వాత నిర్దిష్ట వివరాలను ఇస్తాయి. ఈ వివరాలు తరువాతి వివరణతో సాధారణ ప్రకటనకు మద్దతిస్తాయి.

పౌలు పత్రికల్లో, సాధారణ నుండి నిర్దిష్ట సంబంధాలు సర్వసాధారణం. గలతీయులకు 5:16 శారీరిక జీవితానికి ఆత్మీయ జీవానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తుంది; "నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు." ఈ సాధారణ ప్రకటనను, క్రమంగా వచ్చే నిర్దిష్టతలు మద్దతు ఇస్తాయి. గలతీయులకు 5:19-21 వాక్యభాగం శరీర కార్యాలను గుర్తిస్తుంది; గలతీయులకు 5:22-23 ఆత్మఫలాన్ని గుర్తిస్తుంది.

కొన్ని కథనాలు సాధారణమైన పద్ధతి నుండి నిర్దిష్టమైన పద్ధతిని కలిగి ఉంటాయి. ఆదికాండము 1 మరియు 2 అధ్యాయాలు ఈ పద్ధతిని పాటిస్తాయి, ఒక సాధారణ ప్రకటనతో ఆరంభమై, నిర్దిష్ట వివరాలను ఇస్తాయి. ఇది మూడు దశల్లో వస్తుంది:

1. ఆదికాండము 1:1 సాధారణ ప్రకటన ఇస్తుంది: "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను."
2. ఆదికాండము 1:3-31 సృష్టి గురించి మరిన్ని వివరాలను అందిస్తుంది. మొదటి రోజు, దేవుడు వెలుగు సృష్టించాడు; రెండవరోజు, దేవుడు నీటిని ఆకాశాల నుండి వేరుచేశాడు; మొదలగునవి.
3. ఆదికాండము 2 మరింత నిర్దిష్టమైంది. కథను వివరించేవ్యక్తి సాధారణ సృష్టితో మొదలుపెట్టి నిర్దిష్టమైన మానవుని సృష్టి గురించి మాట్లాడాడు. కథ, లోకసృష్టి నుండి మొదలై, ఒక ప్రత్యేకమైన ప్రదేశమైన ఏదెను తోటకు చేరుతుంది. దేవుని పేరు కూడా మారింది. ఆదికాండము 1వ అధ్యాయం *దేవుడు* అని ఉపయోగిస్తుంది, అంటే శక్తిని సూచించడానికి వాడే సార్వత్రిక పదం. ఆదికాండము 2 *దేవుడైన యెహోవా* అనే పేరు ఉపయోగిస్తుంది, అంటే ఆదాము హవ్వతో ఆయన సన్నిహిత సంబంధాన్ని సూచించే వ్యక్తిగతమైన పేరు.[15]

ఈ పద్ధతి సాధారణం నుండి నిర్దిష్టమైన అంశాల వరకు వెళ్తుంది. 1 కొరింథీయులకు 13లో, 1-2 వచనాల్లో పౌలు ప్రేమ విశిష్టతలు చూపించాడు. ఈ అధ్యాయం పౌలు బోధను సంగ్రహించే సాధారణ ప్రకటనతో ముగుస్తుంది: "కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును; వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే."

---

[15] హీబ్రూ పేరైన ఎలోహీమ్‌ను ఇంగ్లీష్ బైబిళ్లలో "God"గా అనువదించారు; ఇది విశ్వవ్యాప్తంగా వినియోగించే మహాత్మక పేరు. హీబ్రూ పేరైన యహ్వేను ఇంగ్లీష్ బైబిళ్లలో "LORD"గా అనువదించారు; ఇది నిర్గమకాండము 3:14లో ప్రకటించబడిన వ్యక్తిగత పేరు.

## ప్రశ్నోత్తరాల భాగాలు

వాక్యభాగం ప్రశ్నతో మొదలైనప్పుడు, ఆ ప్రశ్న మిగిలిన వాక్యభాగమంతటి ప్రాముఖ్యతను చూపిస్తుంది. ఈ పద్ధతి రోమాలో సాధారణం. కృప, పాప జీవితాన్ని అనుమతిస్తుందని వాదించేవారిని, "ఆలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందుమా?" (రోమా 6:1) అని పౌలు ప్రశ్నించాడు. ఆ తర్వాత, దేవుని కృప క్రైస్తవునికి పాపంపై జయమిస్తుందని చూపించాడు, "అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము?" (రోమా 6:2).

మార్కు సువార్త తరచు ఈ విధానాన్ని, ఆకృతిని ఉపయోగిస్తుంది. మార్కు 2:1—3:6లో, ఐదు భాగాలు ప్రశ్నతో మొదలౌతాయి. నాలుగుసార్లు, ప్రత్యర్థులు ప్రశ్నలడిగారు. ప్రతిసారి, యేసు తన వాదనతో స్పందించాడు. చివరి సన్నివేశంలో, యేసు ప్రశ్న అడుగగా, పరిసయ్యులు సమాధానం చెప్పలేకపోయారు. ఇది పెద్ద వాక్యభాగానికి ఆకృతిని ఎలా ఏర్పాటు చేస్తుందో గమనించండి. ఇది లేకుండా, ఐదు భిన్నమైన కథలు చదువుతాం. పశ్నలు సమాధానాలతో రూపించబడిన ఆకృతిని మనం చూసినప్పుడు, ఐదు కథలు మెస్సీయగా మనుష్యకుమారుని అధికారానికి ఒక సాక్ష్యమిస్తాయి.

1. పక్షవాయువుగలవాని స్వస్థపరచడం (మార్కు 2:1-12)

   ప్రశ్న: "దేవుడొక్కడే తప్ప పాపమును క్షమింపగలవాడెవడని"

   జవాబు: పక్షవాయువుగలవాని స్వస్థపరచుట ద్వారా యేసు తన అధికారం చూపించాడు.

2. పాపులతో భోజనం చేయడం (మార్కు 2:13-17)

   ప్రశ్న: "పరిసయ్యులలోనున్న శాస్త్రులు ఆయన సుంకరులతోను పాపులతోను భుజించుట చూచి—ఆయన సుంకరులతోను పాపులతోను కలిసి భోజనముచేయుచున్నాడేమని ఆయన"

   జవాబు: "నేను పాపులనే పిలువ వచ్చితినిగాని నీతిమంతులను పిలువరాలేదని."

3. ఉపవాసం (మార్కు 2:18-22)

   ప్రశ్న: "యోహాను శిష్యులును పరిసయ్యుల శిష్యులును ఉపవాసము చేయుదురు గాని నీ శిష్యులు ఉపవాసము చేయరు".

   జవాబు: "పెండ్లికుమారుడు తమతోకూడ ఉన్నంతకాలము ఉపవాసము చేయదగదు గాని."

4. విశ్రాంతిదిన నియమాలు (మార్కు 2:23-28)

ప్రశ్న: “చూడుము, విశ్రాంతిదినమున చేయకూడనిది వారేల చేయుచున్నారని ఆయన నడిగిరి.”

జవాబు: “అందువలన మనుష్యకుమారుడు విశ్రాంతిదినమునకును ప్రభువై యున్నాడని.”

5. విశ్రాంతిదినమందు స్వస్థపరచుట (మార్కు 3:1-6)

ప్రశ్న: “విశ్రాంతిదినమున మేలుచేయుట ధర్మమా కీడుచేయుట ధర్మమా?”

జవాబు: యేసు విరోధులు మౌనంగా ఉన్నారు.

**సంభాషణ**

సువార్తలు తరచుగా, యేసు తన చుట్టూ ఉన్నవారితో సంభాషించటం గురించి మాట్లాడతాయి. ఇలాటి ప్రశ్నలు అడుగుతూ యేసు బోధను మరింత ఉత్తమంగా అర్థం చేసుకోగలం:

- సంభాషణలో పాల్గొన్నది ఎవరు?
- ఏ ప్రేక్షకులు సంభాషణ వింటున్నారు? వారెలా స్పందించారు?
- సంభాషణకు దానితీసిన సంఘర్షణ లేక పరిస్థితి ఏంటి?

మత్తయి 21:23–22:46వ వచనభాగం యేసు, మరియు తన శత్రువులకు మధ్య జరిగిన వరుస సంభాషణలు చూపిస్తుంది. ప్రతి గుంపు, యేసును చిక్కుల్లో పెట్టడానికి రూపించిన ప్రశ్నలు అడిగారు.

- మొదట, మతాధికారులు ఆయన అధికారాన్ని ప్రశ్నించారు (మత్తయి 21:23-46).
- పరిసయ్యులు, హేరోదీయులు (సాధారణంగా వీరికి మధ్య శత్రుత్వం ఉంటుంది) కలిసిపోయి, ఆయనను మాటల్లో ఇబ్బంది పెట్టాలని పన్నులు గురించి ప్రశ్నించారు (మత్తయి 22:15-22).
- సద్దూకయ్యులు (పునరుత్థానాన్ని నమ్మరు), పునరుత్థానం తర్వాత వివాహం గురించి ప్రశ్నించారు (మత్తయి 22:23-32).
- పరిసయ్యులు మరోసారి ఆజ్ఞలు గురించి ప్రశ్నించారు (మత్తయి 22:34-40).
- చివరిగా, యేసు ఒక ప్రశ్న అడిగి వారితో వాదనను ముగించాడు, వారు దానికి జవాబు చెప్పలేకపోయారు (మత్తయి 22:41-46).

ప్రతి గుంపు యేసును మాటల్లో ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తుండగా జనసమూహం చూస్తున్నారు, ప్రశ్నలడుగుతున్న ప్రతివాని నోరు యేసు మూయిస్తుండగా వారు చూస్తూ నిలబడ్డారు. “జనులది విని ఆయన బోధకాశ్చర్యపడిరి” (మత్తయి 22:33).

యోబు గ్రంథంలో సంభాషణ ప్రాముఖ్యం. ఈ పుస్తకంలో దేవునికి, సాతానుకి మధ్య సంభాషణ జరిగింది, యోబుకు, తన స్నేహితులకు మధ్య సంభాషణ జరిగింది, యోబుకి, దేవునికి మధ్య సంభాషణ జరిగింది.

హబక్కూకు గ్రంథమంతా, దేవునికి, ప్రవక్తకు మధ్య జరిగిన సంభాషణే. ఈ పుస్తక ఆకృతి ఇలా ఉంది:

**హబక్కూకు ప్రశ్నలు**: దేవుడు యూదా పాపాన్ని ఎందుకు సహిస్తున్నాడు? (1:1-4)?

**దేవుని జవాబు**: బబులోను యూదాను ఓడిస్తుంది (1:5-11).

**హబక్కూకు ప్రశ్నలు:** యూదాకు తీర్పుతీర్చుటకు దేవుడు దుష్టత్వంతో నిండిన బబులోనును ఎలా వాడుకుంటాడు (1:12-2:1)?

**దేవుని జవాబు**: హబక్కూకు దేవుని ఉద్దేశాలు నమ్ముతూ జీవించాలి (2:2-20).

### భావోద్వేగ స్వరస్థాయి

భావోద్వేగ స్వరం, రచయిత వ్యక్తపరుస్తున్న భావాలను సూచిస్తుంది. లేఖనం సంక్షేప సమాచారానికి మించింది; ప్రేమగల దేవునికి, ఆయన సృజించిన ప్రజలకు మధ్య సంబంధం తెలియజేసే కథ. అలాంటి సన్నిహిత సంబంధంలో భావ్వోద్వేగం ఉంటుంది. శ్రద్ధగా చదివేవారు, రచయిత భావాలపై దృష్టిపెడతారు.

వాక్యభాగంలో భావోద్వేగ స్వరస్థాయి కనుగొనాలంటే, భావాన్ని (ఆనందం, అపహాస్యం, దుఖం) లేక సంబంధాన్ని (తండ్రి, కుమారుడు, కుమార్తె) తెలియజేసే పదాలు కోసం చూడాలి. రచయిత హృదయాన్ని, కథలోని పాత్రల ప్రేరణను జాగ్రత్తగా ఆలకించండి.

► ఫిలిప్పీ 1:1-8, ఆ తర్వాత గలతీ 1:1-9 చదవండి. రెండు వాక్యభాగాల్లో భావోద్వేగ స్వరం ఏంటి? ఈ పరిచయాల నుండి, ఫిలిప్పీ సంఘంతో అదే విధంగా గలతీ సంఘంతో పౌలుకు ఉన్న సంబంధం గురించి మీరేమి ఊహించగలరు?

## పుస్తకమంతటినీ చదివేటప్పుడు ఏం చూడాలి?

పుస్తకమంతటినీ చదివేటప్పుడు, పుస్తక ఆకృతి, పుస్తకంలోని ముఖ్య విషయాలు కోసం చూడాలి. ఈ దశలో పరిశీలించాల్సిన విషయాలు:

## నొక్కి చెప్పిన విషయాలు

పరిశీలన ద్వారా పుస్తకంలో ఏం నొక్కి చెప్పారో కనుగొనగలం:

### *కేటాయించిన స్థలం*

ఒక పుస్తకం ఒక విషయానికి కేటాయించే స్థలం, రచయితకు ఏది ముఖ్యమో తెలియజేస్తుంది. ఆదికాండము లో, నలుగురు (అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మరియు యోసేపు) గురించి 12-50 అధ్యాయాల్లో చదువుతాం. దీనిని, సృష్టి, పతనం, జలప్రళయం, బాబెలు గోపురం గురించి వివరించడానికి కేవలం 11 అధ్యాయాలు కేటాయించడంతో పోల్చారు. పరిశీలన దశలో దీనిని గమనించడం వలన, బాష్యం దశలో "ఎందుకు?" అనే ప్రశ్న వేయడానికి సిద్ధపడతాం.

నెహెమ్యా గ్రంథం చదువుతున్నప్పుడు, ప్రార్థన ఆ గ్రంథంలో కేంద్ర స్థానం తీసుకోవడం గమనిస్తాం. నెహెమ్యా జీవితంలోని ప్రతి ముఖ్య దశలో, అతడు ప్రార్థించాడు. దీనిని గమనించడం వలన, నెహెమ్యా ప్రవర్తన గురించి మరింత బాగా అర్థం చేసుకుంటాం.

### *ప్రకటిత ఉద్దేశ్యం*

కొన్ని పుస్తకాల్లో, రచయిత తన ఉద్దేశ్యం గురించి చెబుతాడు. ఈ సామెతలు గ్రంథం రాయటానికి సొలొమోను ఉద్దేశ్యం గురించి, సుదీర్ఘమైన ప్రకటనతో సామెతల గ్రంథం మొదలౌతుంది (సామెతలు 1:2-6). యోహాను సువార్త, రచయిత ఉద్దేశం తెలియజేస్తుంది: "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్ముటనట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును" (యోహాను 20:31).

### *మెటీరియల్ క్రమము*

చారిత్రిక కథనాల్లో, మెటీరియల్ క్రమం రచయిత ఉద్దేశ్యాన్ని చూపిస్తుంది. 2 సమూయేలు 1-10 దావీదు విజయ పాలన గురించి చెబుతుంది. 2 సమూయేలు 11 దావీదు బత్షెబతో చేసిన పాపాన్ని నమోదు చేస్తుంది. ఆ సమయం నుండి, 2 సమూయేలు దావీదు రాజ్యంలో వచ్చిన కష్టాలు గురించి వివరిస్తుంది. ఈ కష్టాలు దావీదు పాపం ఫలితంగా వచ్చిన దేవుని తీర్పని 2 సమూయేలు గ్రంథ రచయిత చూపిస్తాడు.

నెహెమ్యా గ్రంథాన్ని మూడు పెద్ద భాగాలుగా విభజించవచ్చు. నెహెమ్యా 1-6లో, నెహెమ్యా పట్టణప్రాకారాలను పునఃనిర్మించాడు. నెహెమ్యా 7-12 అధ్యాయాలు చెరలోనుండి యెరూషలేముకు తిరిగి వచ్చిన వారి జాబితాను ఇస్తుంది, నిబంధన పునరుద్ధరణ వివరిస్తుంది. నెహెమ్యా 13 నెహెమ్యా యెరూషలేముకు రెండవసారి తిరిగి వచ్చిన

తర్వాత ఎదురైన సమస్యలను గురించి మాట్లాడుతుంది. పట్టణప్రాకారాలను కట్టడం చాలదని ఈ క్రమం చూపిస్తుంది; యూదా చెరకు దారితీసిన అసలు సమస్యలు పరిష్కరించాలంటే ఆత్మీయ ఉజ్జీవం అవసరం.

### పునరావృతమైన విషయాలు

బైబిల్ రచయిత నొక్కి చెప్పే మరో మార్గం, పునరావృతం

#### *పునరావృతమైన పదాలు లేక పదబంధాలు*

జ్ఞాపకము చేసికొనుము అనే పదం నెహెమ్యా గ్రంథమంతటిలో పదే పదే కనిపిస్తుంది. నెహెమ్యా దేవునిని ఇలా కోరాడు, "నీ సేవకుడైన మోషేతో నీవు సెలవిచ్చినమాటను జ్ఞాపకము తెచ్చుకొనుము" (నెహెమ్యా 1:8). యెరూషలేము ప్రజలు బెదిరింపుకు గురైనప్పుడు, "మహా ఘనుడును భయంకరుడునగు యెహోవాను జ్ఞాపకము చేసికొనుడి" (నెహెమ్యా 4:14). అని నెహెమ్యా వారికి చెప్పాడు. దేవుడు తనను, తన నమ్మకత్వాన్ని జ్ఞాపకం చేసుకొనుమని నెహెమ్యా ముమ్మారు ప్రార్థించాడు. నెహెమ్యాకు జ్ఞాపకం చేసుకోవడం ముఖ్యం; దేవుడు గతంలో చేసిన కార్యాలు, భవిష్యత్తులో ఆయనయందు విశ్వాసాన్ని ఇస్తాయి.

► కీర్తన 119:1-32 చదవండి. ప్రతి వచనం, దేవుని వాక్యాన్ని సూచించే ఒక పదాన్ని వాడుతుంది. దీని నుండి, దేవుని వాక్య ప్రాముఖ్యత గురించి కీర్తనాకారుడు ఏం నమ్మాడో ఒక జాబితా చేయండి.

#### *పునరావృతమైన పాత్రలు*

అపొస్తలుల కార్యములు అంతటా ముఖ్యమైన ప్రదేశాలలో బర్నబా పదే పదే కనిపిస్తాడు. బర్నబా కనిపించిన ప్రతిసారి, తన మారుపేరుకు అనుగుణంగా జీవిస్తాడు "హెచ్చరిక పుత్రుడు" (అపొస్తలుల కార్యములు 4:36). బర్నబా సౌలును అపొస్తలుల యొద్దకు తీసుకొచ్చి, సౌలు మారుమానస్సు గురించి సాక్ష్యమిచ్చాడు (అపొస్తలుల కార్యములు 9:27). సౌలుతో పాటు, బర్నబా అంతియొకయలో సంఘం నిర్మించాడు (అపొస్తలుల కార్యములు 11:22-26). పౌలు సందేహించినప్పటికీ, బర్నబా అపరిపక్వతగల మార్కు అను మారుపేరుగల యోహానును ప్రోత్సహించాడు (అపొస్తలుల కార్యములు 12:25 మరియు అపొస్తలుల కార్యములు 15:36-39). అపొస్తలుల కార్యములు గ్రంథంలో, బర్నబా ఒకటి కంటే ఎక్కువసార్లు కనిపించడం, విశ్వాసులను శిష్యులుగా చేయాలనే యేసు ఆజ్ఞను ఆది సంఘం ఎలా నెరవేర్చిందో చూపిస్తుంది.

*పునరావృతమైన సంఘటనలు లేక పరిస్థితులు*

న్యాయాధిపతులు గ్రంథం, ఇశ్రాయేలు యెహోషువ నాయకత్వంలో గొప్ప విజయాలు సాధించి, సామాజిక దురవస్థలోకి ఎలా క్షీణించిందో చూపిస్తుంది. ఏడుసార్లు ఆ చక్రం పునరావృతమైంది, ఇశ్రాయేలీయులు దేవుని దృష్టిలో చెడుతనం చేసి, తమ శత్రువుల చేతిలో ఓడిపోయారు. ప్రతిసారి దేవుడు న్యాయాధిపతిని లేవనెత్తి, వారిని విడిపించాడు. ఈ పునరావృతమయ్యే కథ, రాజ్యం స్థిరంగా క్షీణించిందని చూపిస్తుంది.

**దిశలో మార్పులు**

దిశలో మార్పు అంటే, రచయిత ఉద్ఘాటనలో మార్పు. ఉదాహరణకు, పౌలు పత్రికల దిశ, పత్రిక మధ్యలో మారుతుంది. దేవుడు తన ప్రజలకు ఏం చేశాడు అనే విషయంతో ఎఫెసీయులకు మొదలౌతుంది; ఎఫెసీయులకు రెండవ భాగం, దేవుని ప్రజలు ఆయనకు విధేయతగా ఏం చేయాలో ఉద్ఘాటిస్తుంది.

ఎఫెసీయులకు 1-3లో, వివరణాత్మక క్రియాపదాలు దేవుడు తన ప్రజల కోసం ఏం చేశాడో చూపిస్తాయి. దేవుడు:

- మనకు ఆశీర్వాదము అనుగ్రహించెను (ఎఫెసీయులకు 1:3, 6)
- మనలను ఏర్పరచుకొనెను (ఎఫెసీయులకు 1:6)
- కుమారులుగా స్వీకరించుటకు ప్రణాళిక వేసాడు (ఎఫెసీయులకు 1:5)

ఎఫెసీయులకు 4:1తో ఆరంభించి, దేవుడు మన కోసం చేసిన విమోచనా కార్యానికి తగిన రీతిలో జీవించాల్సిన బాధ్యత గురించి పౌలు విశ్వాసులతో మాట్లాడాడు. ఎఫెసీయులకు 4–6లో, చాలా క్రియాపదాలు అజ్ఞార్థకం. పౌలు మనలను ఆజ్ఞాపించాడు:

- సత్యమే మాట్లాడవలెను (ఎఫెసీయులకు 4:25)
- దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి (ఎఫెసీయులకు 4:30)
- ప్రేమగలిగి నడుచుకొనుడి (ఎఫెసీయులకు 5:2)
- జాగ్రత్తగా నడుచుకొనుడి (ఎఫెసీయులకు 5:15)
- నీ తండ్రిని తల్లిని సన్మానింపుము (ఎఫెసీయులకు 6:2)
- దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి (ఎఫెసీయులకు 6:11)

దేవుడు మన కోసం చేసిన కార్యాన్ని బట్టి ఆనందించడం నుండి ఆయన కృపకు తగినట్లుగా మనం ఎలా జీవించాలో అనే విషయంలోకి వెళ్ళే దిశలో మార్పు, క్రియాపదాల్లో కనిపిస్తుంది. అలాటి మార్పులను జాగ్రత్తగా పరిశీలించడం వలన, ఎఫెసీయులకు రాసిన పత్రికలో పౌలు సందేశాన్ని సరిగా బాష్యం చేయటానికి సిద్ధపడతాం.

**సాహిత్య రూపం**

ఒక పుస్తకాన్ని క్రమపరచటానికి అనేక మార్గాలు ఉన్నప్పటికీ, మూడు రకాల సాహిత్య నిర్మాణాలను సులభంగా గుర్తించవచ్చు.[16]

***జీవిత చరిత్ర సంబంధ నిర్మాణం***

చారిత్రిక పుస్తకాలు తరచు నిర్దిష్ట వ్యక్తుల గురించి చెబుతాయి. కథ, ఒక వ్యక్తి జీవితంలో జరిగిన సంఘటనపై ఆధారపడుతుంది. ఉదాహరణకు:

| **ఆదికాండము 12-50: నలుగురు గొప్ప వ్యక్తులు** | |
|---|---|
| **అధ్యాయాలు** | **వ్యక్తి** |
| ఆదికాండము 12-25 | అబ్రాహాము |
| ఆదికాండము 25-26 | ఇస్సాకు |
| ఆదికాండము 27-36 | యాకోబు |
| ఆదికాండము 37-50 | యోసేపు |

1 మరియు 2 సమూయేలు గ్రంథాలు ఇశ్రాయేలు మొదటి ఇద్దరు రాజులైన సౌలు, దావీదు ఆరంభం మరియు పతనం గురించి మాట్లాడతాయి.

[16] ఈ మెటీరియల్ Howard G. Hendricks and William D. Hendricks, *Living by the Book* (Chicago: Moody Publishers, 2007) లో 15వ అధ్యాయం నుండి తీసుకోనబడింది.

| 1 & 2 సమూయేలు: ఇశ్రాయేలు మొదటి రాజులు | |
|---|---|
| **అధ్యాయాలు** | **రాజుల ఆరంభం/పతనం** |
| 1 సమూయేలు 1-8 | సమూయేలు ప్రవక్త |
| 1 సమూయేలు 9-12 | సౌలు ఆరంభం |
| 1 సమూయేలు 13-31 | సౌలు పతనం మరియు దావీదు ఆరంభం |
| 2 సమూయేలు 1-10 | దావీదు విజయం |
| 2 సమూయేలు 11-24 | దావీదు కష్టాలు |

***భౌగోళిక ఆకృతి***

భౌగోళికశాస్త్రం కొన్ని పుస్తకాలకు ఆకృతి ఏర్పాటు చేస్తుంది. విభిన్న భౌగోళిక ప్రాంతాల్లో సంఘటనలు జరుగుతున్నప్పుడు కథ ముందుకు సాగుతుంది. ఈ పుస్తకాల ఆకృతి వివరించడానికి బైబిల్ అట్లాస్ సహాయపడుతుంది.

| నిర్గమకాండము: ఇశ్రాయేలు ప్రయాణాలు | |
|---|---|
| **వాక్యభాగం** | **ప్రదేశం** |
| నిర్గమకాండము 1:1-3:16 | ఐగుప్తులో ఇశ్రాయేలు |
| నిర్గమకాండము 13:17-18:27 | అరణ్యంలో ఇశ్రాయేలు |
| నిర్గమకాండము 19-40 | సీనాయి పర్వతం యొద్ద ఇశ్రాయేలు |

“యెరూషలేములోను, యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును” (అపొస్తలుల కార్యములు 1:8). నాకు సాక్షులై ఉండుడని యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించాడు. అపొస్తలుల. కార్యాల. గ్రంథం, ఆది సంఘం ఈ ఆజ్ఞను నెరవేరవేర్చిందో చూపిస్తుంది.

| అపొస్తలుల కార్యములు : సువార్త భుదిగంతాలవరకు చేరడం | |
|---|---|
| **అధ్యాయాలు** | **ప్రదేశం** |
| అపొస్తలుల కార్యములు 1-7 | యెరూషలేము |
| అపొస్తలుల కార్యములు 8-12 | యూదయ మరియు సమరయ |
| అపొస్తలుల కార్యములు 13-28 | భూదిగంతాల వరకు |

***చారిత్రక, కాలక్రమానుగత ఆకృతి***

కొన్ని పుస్తకాలు ముఖ్య చారిత్రిక సంఘటనల ఆధారంగా, సాధారణంగా కాలక్రమానుగతంగా ఆకృతి చేయబడ్డాయి. ఈ సంఘటనలను గుర్తించడం వలన పుస్తకాన్ని గూర్చిన సంక్షిప్త అవగాహన పొందవచ్చు.

యెహోషువ గ్రంథం, కనానును జయించి, అందులో స్థిరపడటం గురించి మాట్లాడుతుంది. యెహోషువ గ్రంథం ఆకృతి, విజయంలో ప్రాథమిక సంఘటలు గురించి తెలియజేస్తుంది.

- కనానులోకి వెళ్ళడం (యెహోషువ 1—5)
- యెరికోను పట్టుకోవడం (యెహోషువ 6)
- హాయిని ఓడించడం (యెహోషువ 7—8)
- షెకెములో నిబంధన పునరుద్ధరణ (యెహోషువ 9)
- దక్షిణ దండయాత్ర (యెహోషువ 10)
- ఉత్తర దండయాత్ర (యెహోషువ 11—12)
- భూవిభజన మరియు ఏర్పాటు (యెహోషువ 13—23)
- షెకెములో నిబంధన పునరుద్ధరణ (యెహోషువ 24)

యోహాను తన సువార్తను రాసిన ఉద్దేశం, పుస్తకంలో పేర్కొన్నాడు. “మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్ము నట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను” (యోహాను 20:30-31). యోహాను సువార్త, రచయిత ఉద్దేశ్యం నెరవేర్చే ఏడు సూచక క్రియలు చుట్టూ నిర్మితమైంది. ఈ ఏడు సూచక క్రియలు సువార్త అంతటికి ఆకృతినిస్తాయి:

- నీటిని ద్రాక్షారసంగా మార్చడం (యోహాను 2:1-12)
- ప్రధాని కుమారుని స్వస్థపరచడం (యోహాను 4:46-54)
- బేతెస్థ యొద్ద మనుష్యుని స్వస్థపరచడం (యోహాను 5:1-47)
- 5,000 మందికి ఆహారం పెట్టడం (యోహాను 6:1-4)
- నీటిపై నడవడం (యోహాను 6:15-21)
- పుట్టు గ్రుడ్డివాని స్వస్థపరచడం (యోహాను 9:1-41)
- లాజరును తిరిగి జీవింపజేయడం (యోహాను 11:1-57)
- యేసు పునరుత్థానం (యోహాను 20:1-31)

## పెద్ద చిత్రం చూడడం

ఇప్పటి వరకు, మనం కొన్ని ప్రత్యేక వచనాల వివరాలు, సుదీర్ఘ వాక్యభాగాల వివరాలు, మరియు పుస్తకమంతటి వివరాలు పరిశీలించాం.[17] పరిశీలన దశలో చివరి మెట్టు, ఉపయోగించడానికి సులభంగా ఉండే విధంగా పరిశీలనలను క్రమపరచాలి. దీని చేయడానికి, పరిశీలనలో తెలుసుకున్న విషయాలను సంగ్రహ పట్టికలో (summary chart) పెట్టడం ఒక ఉత్తమ మార్గం. ఇది లేఖనంలో అనేక భాగాలతో సంబంధాన్ని చూపిస్తుంది. ఇది, బైబిల్ అధ్యయనంలో బాష్య దశకు సిద్ధమవ్వటానికి స్పష్టమైన సారాంశాన్ని కూడా ఇస్తుంది.

ఈ చార్ట్ ను క్రమపరచడానికి అనేక మర్గాలున్నాయి. చార్ట్ లో వర్గీకరణ, మీరు అధ్యయనం చేస్తున్న వాక్యభాగం శైలిపై ఆధారపడి ఉంటుంది. ఈ భాగంలో, బైబిల్ అధ్యయనంలో చార్ట్ ఎలా సహాయపడుతుందో చూపించడానికి అనేక రకాల పట్టికలు ఉపయోగిస్తాం.

### సంబంధిత సంఘటనల శ్రేణిని పట్టిక చేయడం

అధ్యాయ విభజనలు ఎల్లప్పుడు పుస్తక ఆకృతికి అనుగుణంగా ఉండవని ఇంతకుముందు చూశాం. సంఘటనల సంబంధాన్ని చూపించే పట్టిక, బహుళ అధ్యాయాల్లో వరుస సంఘటనల ఐక్యతను చూపించగలదు. ఇది తరచు సంఘటనల మధ్య పోలికలు, వ్యత్యాసాలను చూపిస్తుంది.

---

[17] ఈ భాగంలోని మెటీరియల్, Howard G. Hendricks and William D. Hendricks, *Living by the Book* (Chicago: Moody Publishers, 2007) 24-25 అధ్యాయలపై ఆధారపడి ఉంది.

మార్కు 4:35—మార్కు 5:42 వరుసగా నాలుగు అద్భుతాలను వెల్లడి చేస్తుంది. మీరు ఈ నాలుగు కథలు పోల్చి చూసినప్పుడు, తుఫాను మధ్యలో యేసు శిష్యులు చూపిన విశ్వాస లేమికి మరియు కొందరు అసాధారణ ప్రజల విశ్వాసానికి మధ్య వ్యత్యాసం చూపిస్తున్నట్లు గ్రహిస్తారు; దయ్యంపట్టిన వ్యక్తి, రక్తస్రావంగల స్త్రీ, సమాజమందిరపు అధికారి. ఈ గొప్ప విశ్వాస కథలకు శిష్యులు సాక్షులుగా ఉన్నారని మార్కు చూపిస్తుంది. ఈ నాలుగు కథలు ప్రక్క ప్రక్కన చూడండి:

| నాలుగు అద్భుతాలు | | |
|---|---|---|
| **అద్భుతం** | **కథలో వ్యక్తులు** | **విశ్వాసం యొక్క పాత్ర** |
| తుఫానును గద్దించుట | • యేసు<br>• శిష్యులు | శిష్యులకు విశ్వాసం లేకపోవడం (మార్కు 4:40). |
| దయ్యంపట్టిన వ్యక్తిని స్వస్థపరచడం, | • యేసు<br>• దయ్యంపట్టిన వ్యక్తి<br>• పట్టణ ప్రజలు<br>• శిష్యులు (చూస్తున్నారు) | • అతడు యేసుకు నమస్కరించి (మార్కు 5:6) యేసు గురించి సాక్ష్యమివ్వడం (మార్కు 5:18-20).<br>• పట్టణప్రజలు యేసును తిరస్కరించడం (మార్కు 5:10). |
| రక్తస్రావంగల స్త్రీని స్వస్థపరచడం | • యేసు<br>• స్త్రీ<br>• శిష్యులు (చూస్తున్నారు) | స్త్రీ విశ్వాసంతో యేసును పట్టుకోవడానికి చొరవ తీసుకుంది (మార్కు 5:28, 34). |
| యాయీరు కుమార్తెను లేపడం | • యేసు<br>• యాయీరు, తన కుమార్తె<br>• ఏడ్చువారు<br>• పేతురు, యాకోబు, యోహాను | యాయీరు విశ్వాసం (మార్కు 5:23). |

### మీ వంతు

మత్తయి 13:1-23 ఆధారంగా పట్టికను సిద్ధపరచండి.


1. కథ మూడుసార్లు చదవండి.
2. మీరు చేయగలిగిన పరిశీలనలు చేయండి.
3. ఉపమానంలోని ప్రధాన విషయాలతో పట్టిక పూర్తిచేయండి.

పట్టికే మన లక్ష్యం కాదని గుర్తుంచుకోండి; వాక్యభాగాన్ని అధ్యయనం చేసి, దానిని మీ జీవితంలో అన్వయించుకోవడానికి పట్టిక మీకు సహాయం చేస్తుంది. మార్పు, రూపాంతరమే బైబిల్ అధ్యయన లక్ష్యం. ఈ ఉపమానం అధ్యయనం చేసేటప్పుడు, "నేను ఏ రకమైన నేల? నా జీవితంలో ఫలించడానికి నేను దేవుని వాక్యాన్ని అనుమతిస్తున్నానా లేదా?" అని ప్రశ్నించుకోండి.

| మత్తయి 13:1-23 – నేలల ఉపమానం | | | |
|---|---|---|---|
| **నేల రకం** | **వృద్ధి** | **వృద్ధికి ఆటంకాలు** | **ఫలితాలు** |
| త్రోవప్రక్క | వృద్ధి లేదు – విత్తనం మ్రింగివేశాయి. | సత్యాన్ని గ్రహించలేదు. నేల గట్టిగా ఉంది. | ఫలం లేదు |
| | | | |
| | | | |
| | | | |

### మీ వంతు

మార్కు 5:21-43 చదవండి. ఇక్కడ ఒక కథలో రెండు అద్భుతాలు ఉన్నాయి. యాయీరు, తన కుమార్తె కథ మధ్యలో రక్తస్రావంగల స్త్రీ కథ మధ్యలో ప్రవేశిస్తుంది. ఈ రెండు కథల మధ్య పోలికలు, వ్యత్యాసాలు ఏంటి? ఆకృతి ఇలా ఉంది:




| మార్కు 5:21-43: పోలికలు మరియు వ్యత్యాసాలు | | |
|---|---|---|
| | **యాయీరు** | **రక్తస్రావంగల స్త్రీ** |
| **పోలిక** | గొప్ప విశ్వాసం కనుపరచాడు | గొప్ప విశ్వాసం కనుపరచింది |
| | | |
| | | |
| **వ్యత్యాసం** | అధికారంగల వ్యక్తి | హోదాలేని స్త్రీ |
| | బహిరంగంగా యేసు దగ్గరకు వచ్చాడు | రహస్యంగా యేసు దగ్గరకు వచ్చింది |
| | | |
| | | |

**పుస్తకమంతటిని పట్టిక చేయడం**

పుస్తకమంతటినీ సంగ్రహించడంలో పట్టిక సహాయపడుతుంది. ఇది పుస్తకం యొక్క ప్రధాన ఉద్దేశ్యాన్ని చూపిస్తుంది. పట్టిక తయారు చేసేటప్పుడు, పుస్తకమంతటినీ అనేకసార్లు చదవండి. పెద్ద వాక్యభాగాల కోసం కోసం చూడండి. మీరు చదువుతుండగా, పునరావృతమయ్యే పదాలు, ప్రశ్నలు జవాబులు, పుస్తక ఆకృతి చూపించే ఇతర సంబంధాలను గుర్తించండి.

| 1 పేతురు అధ్యయనం- శ్రమలు అనుభవిస్తున్న పరిశుద్ధులకు ప్రోత్సాహం | | |
|---|---|---|
| **రక్షణ (1:1–2:10)** | **లోబడుట (2:11–3:12)** | **శ్రమ (3:13–5:11)** |
| • రక్షణ ఆధిక్యతలు (1:2-12)<br>• రక్షణ ఫలాలు (1:13-25)<br>• రక్షణ ప్రక్రియ (2:1-10) | • దేశంలో (2:13-25)<br>• కుటుంబంలో (3:1-12) | • పౌరునిగా (3:13–4:6)<br>• విశ్వాసిగా (4:7-19)<br>• కాపరిగా (5:1-11) |
| **క్రైస్తవుని గమ్యం** | **క్రైస్తవుని కర్తవ్యం** | **క్రైస్తవుని క్రమశిక్షణ** |

1 పేతురులోని మూడు పెద్ద విభాగాలు ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయి. మనం తండ్రి చిత్తానికి లోబడే వరకు (2:11–3:12) శ్రమను అర్థం చేసుకోలేం (3:13–5:11); ఆయన రక్షణ శక్తి మనకు అర్థమవ్వనంతవరకు (1:1–2:10) తండ్రి చిత్తానికి లోబడలేము.

### మీ వంతు

ఎఫెసీయులకు రాసిన పత్రికపై పట్టిక సిద్ధపరచండి. ఈ పట్టిక, పౌలు పత్రికలో నాలుగు విషయాలు కనుగొనడానికి సహాయపడుతుంది.

ఒక ఉదాహరణ ఇవ్వబడింది. మీరది చేయడం పూర్తయ్యాక, ఇలా ప్రశ్నించండి:

- ప్రతి విషయానికి మధ్యనున్న సంబంధం ఏంటి?
- ఈ విషయాల్లో ఒకటైన ఇతర విషయాలకంటే ప్రధానమైందిగా ఉందా?
- ప్రతి విషయం, పుస్తకమంతటి ఆకృతితో ఎలా సంబంధం కలిగియుంది?

| **విషయం** | **ఈ విషయం పై వచనాలు** | **పౌలు బోధనా సారాంశం** |
|---|---|---|
| **కృప** | | |
| **సాతాను** | 2:1-2 | |
| **మన నడక** | | |
| **ప్రార్థన** | | |

## పాఠం 3 ముఖ్య విషయాలు

(1) మీరు వాక్యభాగాన్ని ఆ తర్వాత పుస్తకమంతటినీ అధ్యయనం చేస్తూ, పరిశీలన ప్రకియ కొనసాగించండి. వాస్తవానికి బైబిల్ ని అధ్యాయాలుగా, వచనాలుగా విభజించలేదు. మీ అధ్యయనంలో సహజ విభజనను ఉపయోగించేలా చూసుకోండి.

(2) ఒక భాగం చదివేటప్పుడు, వీటి కోసం చూడండి:

- సాధారణ నుండి నిర్దిష్ట సంబంధాలు
- ప్రశ్నోత్తరాల భాగాలు
- సంభాషణ
- భావోద్వేగ స్వరస్థాయి

(3) పుస్తకమంతటినీ చదివేటప్పుడు, వీటి కోసం చూడండి:

- నొక్కి చెప్పిన విషయాలు. రచయిత విషయాలను వీటితో ఉద్ఘాటించవచ్చు:
  - కేటాయించిన స్థలం
  - ప్రకటిత ఉద్దేశ్యం
  - మెటీరియల్ క్రమం
- పునరావృతమైన విషయాలు.
  - పునరావృతమైన పదాలు లేక పదబంధాలు
  - పునరావృతమైన పాత్రలు
  - పునరావృతమైన సంఘటనలు లేక పరిస్థితులు
- దిశలో మార్పులు.
- సాహిత్య రూపం.
  - జీవిత చరిత్ర సంబంధ నిర్మాణం
  - భౌగోళిక ఆకృతి
  - చారిత్రక, కాలక్రమానుగత ఆకృతి

(4) లేఖనంలో ఒక భాగాన్ని లేక పుస్తకమంతటినీ పట్టికే ద్వారా చూపడం, ఆకృతిని స్పష్టం చేస్తుంది.

## పాఠం 3 అభ్యాసం

పాఠం 1లో, ఈ కోర్సు సమయంలో అధ్యయనం చేయడానికి ఒక వాక్యభాగం ఎన్నుకున్నారు. ఈ పాఠంలో ఇచ్చిన దశలను అనుకరించి, మీరు ఎన్నుకున్న వాక్యభాగంలో సాధ్యమైనంత ఎక్కువ పరిశీలనలు చేయండి. మీరు అప్పుడే వచనాన్ని వివరించడం లేదు లేక ప్రసంగం సిద్ధం చేయట్లేదని గుర్తుంచుకోండి. వాక్యభాగంలో వివరాలు కోసం చూస్తున్నారు అంతే. ఒకవేళ ఉపయోగకరమైతే, మీ పరిశీలనలను సంగ్రహించే పట్టిక సిద్ధం చేయండి. ఒక బృందంగా అధ్యయనం చేస్తున్నట్లయితే, మీ తదుపరి సమావేశంలో పరిశీలనలు పంచుకోండి.

# పాఠం 4

# భాష్యం: పరిచయం

## పాఠం లక్ష్యాలు

(1) లేఖనానికి సరైన భాష్యం చెప్పడం లోని ప్రాముఖ్యతను గ్రహించడం.

(2) బైబిల్ బాష్యాన్ని కష్టతరం చేసే కొన్ని సవాళ్లను గుర్తించడం.

(3) సరికాని బాష్యానికి దారితీసే సాధారణ తప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండడం.

(4) బైబిల్ బాష్యంలో విభిన్న అభిప్రాయాల యెడల వినయంగా, సహనంగా ఉండడం.

## పరిచయం

1వ పాఠంలో మీకు జియన్‌హోంగ్ గుర్తున్నాడా? జియన్‌హోంగ్ ప్రతిరోజు బైబిల్ చదివాడు, కాని అతడు చదువుతున్న వాక్యం ద్వారా దేవుని స్వరం వినలేదు. ఏం పొరపాటు జరిగింది? జియన్‌హోంగ్ చదివిన దానిని వ్యాఖ్యానించడానికి ప్రక్రియ లేదు. అతడు చదివాడు, కాని గ్రహించలేదు.

> "నీ ధర్మశాస్త్రము ననుసరించుటకు
> నాకు బుద్ధి దయ చేయుము
> అప్పుడు నా పూర్ణహృదయముతో
> నేను దాని ప్రకా రము
> నడుచుకొందును."
> - కీర్తన 119:34

చదివి, గ్రహించని ఒక వ్యక్తి గురించిన కథను అపొస్తలుల కార్యములు 8 చెబుతుంది. ఫిలిప్పు, ఆదిమ సంఘంలో పరిచారకుడు. అతను యెరూషలేము నుండి గాజాకు వెళ్ళే మార్గంలో పరిశుద్ధాత్మ అతన్ని నడిపించాడు. అక్కడ అతడు యెరూషలేము దేవాలయంలో ఆరాధన ముగించుకుని తిరిగి వస్తున్న ఐతియొపీయ అధికారిని కలిశాడు. ఆ అధికారి ప్రయాణంలో యెషయా గ్రంథం చదువుతున్నాడు.

"నీవు చదువునది గ్రహించుచున్నావా?" (అపొస్తలుల కార్యములు 8:30) అని ఫిలిప్పు అధికారిని అడిగాడు. అప్పుడా అధికారి, "ఎవడైనను నాకు త్రోవ చూపకుంటే ఏలాగు గ్రహింపగలనని" (అపొస్తలుల కార్యములు 8:31) చెప్పాడు. ఫిలిప్పు దేవుని వాక్యం వివరిస్తుండగా, అతను యేసును దేవుని కుమారునిగా అంగీకరించి, నూతన విశ్వాసిగా బాప్తిస్మం పొందాడు.

మనం చదివిన దానిని ఎలా అర్థం చేసుకోవాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. వచ్చే కొన్ని పాఠాల్లో, లేఖనాన్ని అర్థం

చేసుకొనే ప్రక్రియను అధ్యయనం చేస్తాం. బాష్యానికి ఆచరణాత్మక దశలు సేర్చుకుంటాం.

## బాష్యం ప్రాముఖ్యత

ముగ్గురు న్యాయమూర్తులు కోర్టులో తమ పని గురించి చర్చించుకుంటున్నారు. మొదటి న్యాయమూర్తి చెప్పాడు, "దోషులు ఉన్నారు, నిర్దోషులు ఉన్నారు. వారెవరో గుర్తిస్తాను." సంపూర్ణ సత్యం ఉందని ఈ న్యాయమూర్తి నమ్మాడు. దోషులు ఉన్నారు, నిర్దోషులు ఉన్నారు, నిజం ఏంటనేది ప్రకటించడమే న్యాయమూర్తి పని.

రెండవ న్యాయమూర్తి చెప్పాడు, "దోషులు ఉన్నారు, నిర్దోషులు ఉన్నారు. ఒక వ్యక్తి దోషియా లేక నిర్దోషియా అనేది గ్రహించడానికి ప్రయత్నిస్తాను. సంపూర్ణ సత్యం ఉందని ఈ న్యాయమూర్తి నమ్మాడు, కాని ఒక వ్యక్తి విషయంలో తన అభిప్రాయం తప్పు కావచ్చని కూడా గ్రహించాడు.

మూడవ న్యాయమూర్తి చెప్పాడు, "నేను నా తీర్పు చెప్పే వరకు ఒక వ్యక్తి దోషి కాదు లేక నిర్దోషి కాదు." ఈ న్యాయమూర్తి సంపూర్ణ సత్యం నమ్మడు. అతని తీర్పులో నిజముందని భావిస్తాడు.

బాధకలిగించే విషయమేమిటంటే, లేఖనానికి సంపూర్ణ అర్థం ఉందని చాలామంది విశ్వాసులు నమ్మరు. వారు ఇలా చెబుతారు, "మీ విషయంలో ఏది నిజమో నా విషయంలో అది నిజం కాకపోవచ్చు." ఈ దృక్పథం ప్రకారం, ప్రతి పాఠకుడు తన సొంత "సత్యం" సృష్టించుకుంటాడు. బైబిల్ ప్రకటన అంటే వారు దానికి ఇచ్చే అర్థమేనని భావిస్తారు.

కథలోని రెండవ న్యాయమూర్తివలే, క్రైస్తవులు రెండు ముఖ్య సత్యాలను గ్రహించాలి:

1. లేఖన అర్థం సంపూర్ణం, మరియు వాక్యభాగంలో దేవుని సత్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయడం మన పని.

2. మన అవగాహన పరిమితిగలది. కాబట్టి, మన బాష్యం తప్పు కావచ్చు. మనం వినయంగా ఉండాలి.

పరిశీలన దశలో, "వాక్య భాగంలో నేను ఏం చూడాలి?" అని అడిగాం. బాష్య దశలో, "వాక్యభాగ అర్థం ఏంటి?" అని అడిగాం. తర్వాత, మన జీవితాల్లో లేఖన అన్వయం గురించి చూద్దాం.


"రచయిత ఏం చెప్పాలని ఆశించాడు?" అని అడుగుతూ బాష్యం ప్రక్రియ మొదలుపెడదాం. ఇది మనల్ని "ఈ లేఖనం నాకు ఎలా వర్తిస్తుంది?" అనే ప్రశ్నకు సిద్ధపరుస్తుంది.

## సరైన బాష్యానికి సవాళ్లు

బైబిల్ వంటి ప్రాచీన వాక్యభాగాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే ఆధునిక పాఠకులకు అనేక సవాళ్లు ఉన్నాయి.

మొదటి రచయిత నుండి సమయం, దూరం మనలను వేరు చేస్తుంది కాబట్టి బాష్యం కష్టంగా ఉంటుంది. మనం వేరొక భాష మాట్లాడుతాం. మన సంస్కృతి, బైబిల్ రచయిత సంస్కృతికి భిన్నమైంది.

**బైబిల్ ను బాష్యం చేయుట**[18]




మన కాలానికి, బైబిల్ ను బాష్యం చేసేటప్పుడు ఎదుర్కొనే సవాళ్లను ఈ చిత్రం చూపిస్తుంది. బైబిల్ ను ప్రాచీన లోకం కోసం రాశారు (1), మొదటి పాఠకులు నేటి పాఠకుల కంటే భిన్న సంస్కృతిలో జీవించారు. (2) వారి ప్రపంచాన్ని నేటి ప్రపంచం నుండి వేరు చేసే నది, బైబిల్ అవగాహనను మనకు మరింత కష్టతరం చేస్తుంది. ఈ నది మన సంస్కృతి మరియు బైబిల్ ప్రపంచానికి మధ్య వ్యత్యాసాలతో రూపించబడింది. ఆధునిక పాఠకునికి, అసలు రచయితకు మధ్య వ్యత్యాసం ఏంటి?

**భాష వ్యత్యాసాలు**

బైబిల్ ను మూడు భాషల్లో రాశారు: హెబ్రీ, గ్రీకు మరియు అరమాయిక్. నేడు, చాలామంది బైబిల్ ను తమ సొంత భాషలో చదువుతున్నారు. ఇది మనకు, రచయితకు మధ్య దూరాన్ని కలిగిస్తుంది. రెండవ భాష మాట్లాడేవారు భాషలో

---

[18] చిత్రం: “Interpreting the Bible” Anna Boggs చేతి చిత్రణ, https://www.flickr.com/photos/sgc-library/52377290578 నుండి అందుబాటులో ఉంది, CC BY 2.0 కింద లైసెన్స్ పొందింది. J. Scott Duvall మరియు J. Daniel Hays యొక్క ఆలోచన, *Grasping God’s Word* (Grand Rapids: Zondervan, 2012).

కష్టాలు అర్థం చేసుకుంటారు.

**సాంస్కృతిక వ్యత్యాసాలు**

భాషలో కష్టాలు ఉన్నట్లే సాంస్కృతిక వ్యత్యాసం వలన కూడా కష్టాలు ఉన్నాయి. లేఖన రచయితల సంస్కృతికి మన ప్రపంచానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. మనం లేఖనం అధ్యయనం చేసేటప్పుడు, "బైబిల్ సందేశాన్ని ఉత్తమంగా అర్థం చేసుకుని, బాష్యం చేయటానికి సహాయపడే ప్రాచీన లోక సంస్కృతి గురించి నేను ఏమి నేర్చుకోగలను?" అని అడగాలి.

**తెలియని భౌగోళిక పరిస్థితులు**

బైబిల్లో జరిగిన సంఘటనలు, నిజమైన ప్రదేశాల్లో నివసించే నిజమైన ప్రజలకు సంభవించినవి. మనం భూగోళశాస్త్రాన్ని ఎంత మంచిగా అర్థం చేసుకుంటే, మన ప్రపంచాన్ని వారి ప్రపంచాన్ని వేరు చేసే నదిని అంత మంచిగా దాటగలుగుతాం.

యెరూషలేము నుండి యెరికోకు వెళ్లే మార్గం ప్రమాదకరమైన కొండ ప్రాంతమని తెలుసుకోవడం వలన, యాజకుడు లేవీయుడు జాగ్రత్తపడ్డారని వివరిస్తుంది (లూకా 10:31-32). గాయపడిన వ్యక్తికి సహాయం చేయడానికి తన సొంత ప్రాణాన్ని పణంగా పెట్టిన సమరయుని కనికరాన్ని కూడా ఇది అభినందిస్తుంది. (లూకా 10:33-34).

"మార్కు 6లో, 5,000మందికి ఆహారం పెట్టిన తర్వాత మార్కు 8లో 4,000మందికి ఆహారం పెట్టే సామర్థ్యాన్ని శిష్యులు ఎందుకు అనుమానించారు?" అని పాఠకులు అడిగారు. పటం జవాబిస్తుంది. మార్కు 7లో, యేసు దెకపొలి వెళ్లాడు, ఇది అన్యజనుల ప్రాంతం. శిష్యులకు, "యేసు వీరికి ఆహారం పెట్టగలడా?" అనేది ప్రశ్న కాదు, కాని "ఆయన వారికి ఆహారం పెడతాడా?" అనేది ప్రశ్న. అన్యజనులు కూడా అదే అద్భుతానికి అర్హులని వారు నమ్మలేదు. యేసు ప్రజలందరి కోసం వచ్చాడని వారు ఇంకా గ్రహించలేదు.

| | మార్కు 6 | మార్కు 7 | మార్కు 8 |
|---|---|---|---|
| **ప్రదేశం** | గలిలయ | *ప్రయాణం* | దెకపొలి |
| **ప్రజలు** | యూదులు | - | అన్యజనులు |

యేసు గలిలయ సముద్రంలో తుఫానును ఎలా గద్దించాడో మార్కు 4 సెలవిస్తుంది. బైబిల్ అట్లాస్ లో, గలిలయ సముద్రం ఒక పెద్ద సరస్సు అని, సముద్ర మట్టానికి 210 మీటర్లు దిగువన ఉందని మనం నేర్చుకుంటాం. సరస్సు చుట్టూ ఉన్న ఎత్తైన ప్రదేశం ఒక గొట్టంలాగా పనిచేస్తుంది కాబట్టి, గాలులు కొన్ని నిమిషాల్లోనే పెద్ద తుఫానుగా

మారిపోతాయి. ఈ సముద్రంలో జాలర్లుగా తమ జీవితాలు గడిపిన శిష్యులు పెద్ద పెద్ద తుఫానులకు అలవాటుపడ్డారు. వారు తమ ప్రాణాలు గురించి భయపడ్డారనేది వాస్తవం, అది సాధారణ తుఫాను కాదని తెలియజేస్తుంది. ఇది అసాధారణమైన శక్తివంతమైన తుఫాను, కాని దానిని నెమ్మదిపరచడానికి యేసు కొన్ని మాటలే పలికాడు. "ఈయన ఎవరో, గాలియు సముద్రమును ఈయనకు లోబడుచున్నవని" (మార్కు 4:36-41) వారు ఆశ్చర్యపోయారు.

**తెలియని సాహిత్య రూపాలు**

ప్రతి విధమైన సాహిత్యాన్ని వేరుగా చదవాలి. మనం రోమా పత్రిక చదివేటప్పుడు, మనం దేవునితో ఎలా సరిచేయబడ్డామో పౌలు చూపిస్తుండగా, అతని వాదన జాగ్రత్తగా గమనించాలి. ఉపమానం చదివేటప్పుడు , ఒక అద్భుతమైన కథ ద్వారా కథకుడు బోధించడం వింటాం.

**ముగింపు**

చిత్రాన్ని మళ్ళీ చూడండి. భాష, సంస్కృతి, భూగోళం, సాహిత్యమనే నది మనలను వేరు చేస్తున్నప్పటికీ, బైబిల్ సందేశం సంస్కృతులన్నిటితో మాట్లాడుతుంది. ఇది (3) నదిపై వంతెన. ఈ వంతెన బైబిల్ బోధించే సూత్రాలతో రూపించబడింది. ఈ సూత్రాలు యుగాల్లోని సంస్కృతులన్నిటికి వర్తిస్తాయి.

(4) బైబిల్ కథలో మనం యెక్కడున్నామో గమనించాలని పటం అడుగుతుంది. క్రీస్తు రాకడ పాత నిబంధన నియమాలను, అనేక ప్రవచనాలను నెరవేర్చింది. దీన్ని జ్ఞాపకం ఉంచుకోవడం వలన, లేఖనాలను అర్థం చేసుకొని, అన్వయించే మన విధానం మారుతుంది.

చివరిగా, నేటి మన ప్రపంచానికి వచ్చేశాం. (5). ఈ దశలో, మనం కనుగొన్న సూత్రం (3) మన ప్రపంచానికి ఎలా అన్వయిస్తుందో అని అడుగుతాం.

రాబోవు పాఠాల్లో ఈ చిత్రాన్ని మళ్ళీ చూద్దాం. ప్రస్తుతానికి, మీరు దశలు గురించి తెలుసుకోవాలి.

**బైబిల్ కి భాష్యం చెప్పేవారు చేసే సాధారణ తప్పులు**

బైబిల్ బాష్యకర్తలు అనేక సాధారణ తప్పులు చేస్తుంటారు.

**వాక్యభాగాన్ని తప్పుగా చదవటం**

"ధనం సమస్తమైన కీడులకు మూలము" అని పౌలు చెప్పినట్లుగా కొందరు ప్రసంగికులు ప్రసంగించారు. అయితే పౌలు అలా చెప్పలేదు! "ఎందుకనగా ధనాపేక్షసమస్తమైన కీడులకు మూలము" (1 తిమోతికి 6:10) అని చెప్పాడు. ధనాన్ని

ప్రేమించకుండా, దానిని కలిగియుండటం సాధ్యమే, మరియు ధనం లేనప్పటికీ దానిని ప్రేమించడం కూడా సాధ్యమే. పౌలు హెచ్చరిక ప్రధానంగా ధనానికి సంబంధించింది కాదు; ధనాపేక్షగల హృదయానికి సంబంధించింది.

కొందరు క్రైస్తవులు కీర్తన 37:4ను తప్పుగా చదివి ఇలా చెబుతారు, "దేవుడు నా హృదయ వాంఛలు తీర్చుతానని వాగ్దానం చేశాడు. నేను ఐశ్వర్యవంతుడిని కావాలి, కాబట్టి దేవుడు నన్ను ఐశ్వర్యవంతుడ్ని చేస్తాడు." అయితే "యెహోవానుబట్టి సంతోషించుము ఆయన నీ హృదయవాంఛలను తీర్చును" అని కీర్తనాకారుడు చెప్పాడు. మనం యెహోవానుబట్టి సంతోషిస్తే, దేవుడు మనకు సంతోషాన్ని ఇస్తాడని కీర్తన వాగ్దానం చేస్తుంది. తర్వాత, మనం నీతికొరకు ఆకలిదప్పులు గలవారుగా ఉంటే, నీతితో తృప్తిపరచబడతామని యేసు వాగ్దానం చేశాడు (మత్తయి 5:6). ఈ వాగ్దానం ఆర్థిక శ్రేయస్సు గురించి కాదు; దానికంటే ఉత్తమైన - ఆత్మీయ శ్రేయస్సును గురించిన వాగ్దానం.

ఈ కోర్సులో మనం నేర్చుకున్న మొదటి దశ, పరిశీలన. మన పరిశీలనలు ఖచ్చితంగా ఉండాలి, లేదంటే మనం వాక్యానికి బాష్యం చెప్పే విషయంలో పొరపాట్లు చేసే ప్రమాదం ఉంది. వాక్యభాగాన్ని తప్పుగా చదవకుండా జాగ్రత్తపడండి. ఇవి బైబిల్ అధ్యయనంలో మొదటి మూడు దశలు అని ఎవరో చెప్పారు:

1. వాక్యభాగం చదవటం.
2. వాక్యభాగం మళ్లీ చదవటం
3. 2వ దశ తర్వాత, వాక్యభాగం మళ్లీ చదవటం!

**వాక్యభాగాన్ని వక్రీకరించడం**

చరిత్ర అంతటా, అబద్ధ బోధకులు తమ తప్పులు సమర్థించుకోవడానికి లేఖనాలను వక్రీకరించారు. కొందరు, ఉద్దేశ్యపూర్వకంగా పాపంలో కొనసాగాలనే తమ కోరికను సమర్థించుకోవడానికి, విశ్వాస మూలంగానే నీతిమంతులుగా తీర్చబడతారను తన బోధను వక్రీకరిస్తారని పౌలు హెచ్చరించాడు (రోమా 6:1-2). బానిసత్వాన్ని సమర్థించడానికి లేక ప్రభుత్వం ఒక జాతి ప్రజలను హత్య చేసే విధానాన్ని సమర్థించడానికి లేఖనాలు ఉపయోగించిన సందర్భాలు ఉన్నాయి. నేడు, కొందరు సువార్తికులు దేవుని వాగ్దానాలను సంపద సువార్తగా వక్రీకరిస్తున్నారు, ఇది లేఖన సత్యానికి విరుద్ధం.

లేఖనాలను వక్రీకరించేవారు తమ నాశనం కొని తెచ్చుకుంటారని పేతురు హెచ్చరించాడు (2 పేతురు 3:16). అదే విధంగా, వాక్యాన్ని బోధించే బోధకులు ముఖ్యమైన బాధ్యతను కలిగి ఉన్నారని యాకోబు మాట్లాడాడు. (యాకోబు 3:1). బైబిల్ బోధించే మనం, అబద్ధ ఆలోచనలను సమర్థించడానికి లేఖనాన్ని వక్రీకరించకుండా జాగ్రత్త వహించాలి.

**ఊహాత్మక అర్థం ఇవ్వటం**

ముగ్గురు న్యాయమూర్తుల కథ, బైబిల్ బాష్యకర్తలు చేసే మరో సాధారణ తప్పును ఉదహరిస్తుంది: లేఖనం యొక్క అర్థం పాఠకుని ఊహ నుండి వస్తుందనే ఆలోచన. కొందరు ఇలాగే అడుగుతారు, “లేఖనమంటే నేను ఏమి భావిస్తున్నాను?” భావోద్వేగం, భావం ముఖ్యమైనప్పటికీ, లేఖన తుది సత్యం రచయిత రాసిన దానిలో ఉంది కాని, అతను రాసిన దానిని నేను ఎలా అర్థం చేసుకుంటున్నాననే విషయంలో కాదు.

**అతి నమ్మకంగా ఉండటం**

తాను ఎన్నడూ తప్పు చేయనని అనుకునే బాష్యకర్త తన సొంత తర్కాన్ని నమ్ముతాడు. వాక్య అర్థం గురించి ఒక నిర్ధారణకు రావటానికి మనం వాక్యాన్ని అధ్యయనం చేస్తాం; అయితే, మన నిర్ధారణలు తప్పుగా ఉన్నప్పుడు దానిని ఒప్పుకునే వినయం మనకు ఉండాలి. ఏ ఒక్కరి దగ్గరా అన్ని సమాధానాలు ఉండవు.

భాష్యానికి వినయం ప్రాముఖ్యం. మీరు బైబిల్ అధ్యయనం చేస్తున్నప్పుడు, దైవికమైన క్రైస్తవులు విభేదించే విషయాలు కనుగొంటారు. అంటే, ఒకవైపువారు ఉద్దేశ్యపూర్వకంగా లేఖనాలను వక్రీకరించారని కాదు దీని అర్థం; లేఖన సత్యానికి కట్టుబడియున్న రెండు బృందాల మధ్య యదార్థమైన అసమ్మతి కావచ్చు. మన సొంత భాష్యం విషయంలో వినయం కలిగి ఉంటూ, భిన్నాభిప్రాయాలు గలవారిని సహించగలగాలి.

**మీ వంతు**

లేఖనాలను ఉల్లేఖిస్తున్నామని భావిస్తూ, ప్రజలు చేసే కొన్ని తప్పుడు ప్రకటనలు క్రింద ఉన్నాయి. జాగ్రత్తగా చదివారనే అభినందలు పొందటానికి, ప్రతి ఉదాహరణలో వక్రీకరించిన వాక్యభాగాన్ని కనుగొని, అసలు బైబిల్ ఏం చెబుతుందో గమనించండి. మీ కోసం మొదటి ఉదాహరణ పూర్తి చేశాం.

| కొందరు ఏం చెబుతారు | బైబిల్ ఏం సెలవిస్తుంది |
|---|---|
| "ధనం సమస్తమైన కీడులకు మూలము." | "ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము" (1 తిమోతికి 6:10). |
| "పని అనేది శాపం." | |
| "మీరు సహింపలేనిది దేవుడు ఎన్నడు మీకు ఇవ్వడు." | |

## పాఠం 4 ముఖ్య విషయాలు

(1) "వాక్యభాగ అర్థం ఏంటి?" అని వాక్యానికి బాష్యం చెప్పే దశలో అడుగుతాం.

(2) బాష్యాన్ని కష్టతరం చేసే కొన్ని సవాళ్లు:

- భాష వ్యత్యాసాలు
- సాంస్కృతిక వ్యత్యాసాలు
- తెలియని భౌగోళిక పరిస్థితులు
- తెలియని సాహిత్య రూపాలు

(3) సరికాని/తప్పు బాష్యానికి దారితీసే కొన్ని సాధారణ పొరపాట్లు:

- వాక్యభాగాన్ని తప్పుగా చదవటం
- వాక్యభాగాన్ని వక్రీకరించడం
- ఊహాత్మక అర్థాన్ని ఇవ్వడం
- అతి నమ్మకంగా ఉండటం

# పాఠం 5

# భాష్యం: సందర్భం

## పాఠం లక్ష్యాలు

(1) లేఖన భాష్యానికి చారిత్రక-సాంస్కృతిక నేపథ్య విలువను అర్థం చేసుకోవడం.

(2) వాక్యభాగంలో చారిత్రక-సాంస్కృతిక నేపథ్యం కనుగొనడానికి ప్రశ్నలు ఉపయోగించడం.

(3) ఒక వచనం దాని చుట్టూ ఉన్న సందర్భానికి ఎలా సరిపోతుందో చూడడం.

(4) సందర్భం అధ్యయనం చేసేటప్పుడు సాధారణ తప్పులు నివారించడం.

## పరిచయం

► మీ భాషలో అనేక అర్థాలున్న ఒక పదం పేర్కొనండి. ఎవరైనా ఆ పదం వాడినప్పుడు, వారి ఉద్దేశ్యం ఏంటో మీకు ఎలా తెలుస్తుంది?

బైబిల్ భాష్యంలో అతి ముఖ్యమైన ఒక విషయం, మనం చదివే వాక్యభాగపు సందర్భం. ఈ పాఠంలో, మనం చారిత్రిక-సాంస్కృతిక నేపథ్యం గురించి అదే విధంగా ఒక వాక్యభాగం చుట్టూ ఉన్న బైబిల్ సందర్భం గురించి అధ్యయనం చేయడం నేర్చుకుంటాం.[19]

## చారిత్రక-సాంస్కృతిక సందర్భం

► 2 తిమోతికి 4:6-22 చదవండి.

“శీతకాలము రాకమునుపు నీవు వచ్చుటకు ప్రయత్నముచేయుము” (2 తిమోతికి 4:21) అని పౌలు తిమోతికి రాశాడు. ఈ నేపథ్యం వెలుగులో పౌలు అభ్యర్ధన వినండి:

- పౌలు రోమా చెరసాలలో ఉన్నాడు. తన విశ్వాసాన్ని బట్టి త్వరలో హతసాక్షి అవుతాడు.
- తిమోతి, వందల కిలోమీటర్లు దూరంలో ఉన్న ఎఫెసులో పరిచర్య చేస్తున్నాడు.

---

[19] ఈ అధ్యాయంలోని ఎక్కువ భాగం 6-7 అధ్యాయాల నుండి వచ్చాయి J. Scott Duvall and J. Daniel Hays, *Grasping God’s Word* (Grand Rapids: Zondervan, 2012).

- శరదృతువులో సముద్ర ప్రయాణం ప్రమాదకరంగా ఉండేది మరియు శీతాకాలంలో అసాధ్యం. తిమోతి శీతాకాలానికి ముందే చేరుకోవాలంటే, ఈ పత్రిక తనకు చేరిన వెంటనే త్వరగా బయలుదేరాలి.


పౌలు అభ్యర్థన వెనుకున్న భావోద్వేగాన్ని మనం అభినందించడానికి చారిత్రక సందర్భం మద్దతిస్తుంది. పౌలు “అనుకూలమైనప్పుడు దర్శించు” అని చెప్పలేదు. “నేను చనిపోయేలోపు నిన్ను చూడాలి. నీవు శీతాకాలం వరకు వేచియుంటే, ప్రయాణం అసాధ్యమౌతుంది. ఆలస్యమవ్వకముందే రమ్ము” అని పౌలు తన ఆత్మీయ కుమారుని వేడుకున్నాడు. మీకు చారిత్రక సందర్భం గురించి ఏమి తెలియకపోయినా, పత్రికలో అదే సందేశం ఉంది కాని, సందర్భం పౌలు అభ్యర్థనలోని తీవ్రతను చూపిస్తుంది.

ప్రపంచంలో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోగల ఒకే భాషలో దేవుడు బైబిల్ ను అందించలేదు కాబట్టి చారిత్రిక-సాంస్కృతిక నేపథ్యం ప్రాముఖ్యమైంది. లేఖనం గురించి రెండు ప్రకటనలు ప్రాముఖ్యం:

1. లేఖన సూత్రాలు ప్రతి కాలంలో, ప్రతి ప్రదేశంలో ఉన్న ప్రతి వ్యక్తికి వర్తిస్తాయి.

2. లేఖన సూత్రాలు, నిర్దిష్ట కాలంలో, నిర్దిష్ట ప్రదేశంలో ఉన్న నిర్దిష్ట ప్రజలకు ఇవ్వడం జరిగింది.

**బైబిల్ ను బాష్యం చేయుట**[20]




| | | |
|---|---|---|
| **1** | వారి పట్టణం | లేఖన అసలు సందేశం |
| **2** | నది | ప్రాచీన ప్రపంచం నుండి మన ప్రపంచాన్ని వేరు చేసే చారిత్రక-సాంస్కృతిక వ్యత్యాసాలు |
| **3** | వంతెన | వాక్యభాగంలో బోధించిన సూత్రం |
| **4** | పటం | క్రొత్త నిబంధనతో సంబంధం (పాత నిబంధన వాక్యభాగాలతో) |
| **5** | మన పట్టణం | మన లోకంలో ఆ సూత్రం యొక్క అన్వయింపు |

లేఖనంలోని చారిత్రిక-సాంస్కృతిక నేపథ్యాలు ఎంత చక్కగా అర్థం చేసుకుంటే, బైబిల్ సార్వత్రిక సూత్రాన్ని అంతే చక్కగా అర్థం చేసుకుంటాం.

మనం చారిత్రిక-సాంస్కృతిక సందర్భం అధ్యయనం చేస్తున్నప్పుడు, అసలు శ్రోతలకు ఇచ్చిన సందేశాన్ని అర్థం చేసుకోవడానికి బైబిల్ ను "వారి పట్టణంలో" చదువుతాం. ఆ తర్వాత "నది" - మన ప్రపంచాన్ని ప్రాచీన ప్రపంచాన్ని

[20] చిత్రం: "Interpreting the Bible" Anna Boggs చేతి చిత్రణ, https://www.flickr.com/photos/sgc-library/52377290578 నుండి అందుబాటులో ఉంది, CC BY 2.0 కింద లైసెన్స్ పొందింది. J. Scott Duvall మరియు J. Daniel Hays యొక్క ఆలోచన, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012).

వేరు చేసే సాంస్కృతిక వ్యత్యాసాలను చూద్దాం. మనం బైబిల్ ప్రపంచాన్ని యెంత చక్కగా అర్థం చేసుకుంటే, దేవుని వాక్యం నేటి మన లోకానికి ఏం చెబుతుందో అంతే చక్కగా చూడగలుగుతాం.

వాక్యభాగాన్ని దాని వాస్తవిక సందర్భంలో చదవటం ప్రాముఖ్యం ఎందుకంటే అది, బైబిల్ భాష్యపు ముఖ్య సూత్రానికి పునాది: నేడు బైబిల్ వాక్యభాగపు సరైన భాష్యం ఏదైనా అది తప్పనిసరిగా, ఆ వాక్యభాగపు అసలైన సందేశానికి అనుగుణంగా ఉండాలి. వాక్యభాగపు అసలైన సందేశంతో విభేదించే అర్థాన్ని నేను కనుగొనకూడదు.

చారిత్రక-సాంస్కృతిక సందర్భం అంటే ఏంటి? చారిత్రక-సాంస్కృతిక సందర్భం అంటే, వాక్యభాగాన్ని అర్థం చేసుకోవడంలో సహాయం చేయటానికి, వాక్యభాగం వెలుపల నుండి వచ్చే ప్రతిదీ. ఇది ఇలాంటి ప్రశ్నలకు జవాబులు కలిగియుంటుంది:

- అరణ్యంలో ఇశ్రాయేలీయుల జీవితం ఎలా ఉంది (నిర్గమకాండము—ద్వితీయోపదేశకాండము సందర్భం)?
- మొదటి శతాబ్దపు పాలస్తీనా సంస్కృతి ఏంటి (సువార్తల సందర్భం)?
- గలతీయులకు మరియు ఫిలిప్పీయులకు రాసిన పత్రికలో పౌలుకు నిరాశ కలిగించిన అబద్ధ బోధకులు ఎవరు?

చారిత్రక-సాంస్కృతిక సందర్భాన్ని అధ్యయనం చేసేటప్పుడు అడగాల్సిన కొన్ని ప్రశ్నలు:

**(1) బైబిల్ రచయిత గురించి మనకు ఏం తెలుసు?**

దేవుడు మానవ రచయితల ద్వారా మాట్లాడాడు గనుక, రచయితలను గురించినా అవగాహన దేవుని వాక్యం మరింత ఉత్తమంగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

పౌలు పత్రికలు చదివేటప్పుడు, మారుమనస్సుకు ముందు తన జీవితం గుర్తుచేసుకోండి. అతడు ఆరంభంలో తన "శరీరమును ఆస్పదము చేసికొనుట," (ఫిలిప్పీయులకు 3:4-6) గురించి వివరించినప్పుడు, పరిసయ్యులు ధర్మశాస్త్రానికి విధేయత చూపినందున ఉన్నతంగా గౌరవించబడ్డారని తెలుసుకోవాలి. వారి వేషధారణ, యేసును వారు తిరస్కరించిన విధానాన్ని మనం గుర్తుచేసుకున్నప్పుడు, దేవుని ధర్మశాస్త్రం వివరాల యెడల వారి ప్రేమను కూడా గుర్తుచేసుకోవాలి.

మరోవైపు, పౌలు పాపులలో "నేను ప్రధానుడను" (1 తిమోతికి 1:15) అని తన గురించి చెప్పుకున్నప్పుడు, పౌలు సంఘాన్ని హింసించి, క్రైస్తవులను మరణానికి అప్పగించాడని గుర్తుచేసుకోవాలి. ఇతడు, దమస్కు మార్గంలో క్రీస్తును ఎదుర్కొక మునుపు, తన జీవితం ఎలా ఉందో గుర్తుచేసుకుంటూ జీవించాడు.

నిర్గమకాండము చదివేటప్పుడు, ఫరో రాజభవనంలో మోషే ఆధిక్యతలు గురించి మనం నేర్చుకోవాలి. రాజభవన జీవితాన్ని గమనించినప్పుడు, హెబ్రీయులకు 11:25 మోషే గురించి ఏం సెలవిస్తుందో, అది మరింత అర్థవంతంగా ఉంటుంది; "...అల్పకాలము పాప భోగము అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి." యువకుడైన మోషే అనుభవించిన విద్యా, సాంస్కృతిక ఆధిక్యతలు చూసినప్పుడు, గొప్ప రాజ్యాన్ని నడిపించడానికి దేవుడు తన సేవకుని సిద్ధపరచటం మనం చూస్తాం.

**(2) బైబిల్ శ్రోతలు గురించి మనకు ఏం తెలుసు?**

బైబిల్ రచయిత గురించి నేర్చుకోవడంతో పాటుగా, వాస్తవిక శ్రోతలను గురించి కూడా సాధ్యమైనంతవరకు నేర్చుకోవాలి.

1 మరియు 2 దినవృత్తాంతములలోని విషయాలు, ఎక్కువగా సమూయేలు మరియు రాజులు గ్రంథాలు నుండి పునరావృతమౌతాయి. ఎందుకు? దినవృత్తాంతములు ఇశ్రాయేలు చెర నుండి తిరిగివచ్చిన తర్వాత రాశారు. దేవుడు ఇశ్రాయేలును తీర్పు అనుభవించడానికి ఎందుకు అనుమతించాడో రాజులు గ్రంథం చూపిస్తుంది; దేవుడు తన ప్రజలపట్ల ఇంకా శ్రద్ధ చూపుతున్నాడని దినవృత్తాంతముల గ్రంథం చూపిస్తుంది.

యెరూషలేము నాశనానికి ముందు దినాల్లో యిర్మీయా ప్రకటించాడు. మనం అతని తీర్పు సందేశం చదువుతున్నప్పుడు, వాగ్దానం చేసిన తీర్పు జరుగబోతుందని గుర్తుంచుకోవాలి. అయితే, యిర్మీయా గ్రంథంలో దేవుని ఈ వాగ్దానం కూడా మనం చదువుతాం, "నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణకలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 29:11). ప్రజలను ఖైదీలుగా పరాయి దేశానికి తీసుకెళ్లబోతున్నప్పుడు ఈ వాగ్దానం వచ్చింది. తన ప్రజల కొరకైన దేవుని ప్రణాళికలో, వారిని మారుమనస్సుకు నడిపించే తీర్పులు భాగం.

1 యోహాను పత్రిక అబద్ధ బోధలు ఎదుర్కొంటున్న క్రైస్తవుల గురించి మాట్లాడుతుంది: కేవలం ఆత్మ మంచిది; శరీరం చెడ్డది. యేసు నిజమైన మానవుడు కాడు; మానవుడుగా కనిపించాడు అని అబద్ధ బోధకులు బోధించారు. యేసుకు భౌతిక శరీరం ఉందని యోహాను తన శ్రోతలకు గుర్తుచేశాడు.. "ఆదినుండి ఏది యుండెనో, మేమేది వింటిమో, కన్నులార ఏది చూచితిమో, ఏది నిదానించి కనుగొంటిమో, మా చేతులు దేనిని తాకి చూచెనో" (1 యోహాను 1:1).

కొందరికి మాత్రమే బయలుపరచబడిన మర్మ జ్ఞానం ద్వార రక్షణ కలుగుతుందని అబద్ధ బోధకులు బోధించారు. దేవుని గురించి నిజంగా తెలుసుకోవాలంటే విధేయత చూపాలని యోహాను చెప్పాడు; "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనినయెడల, దీనివలననే ఆయనను ఎరిగియున్నామని తెలిసికొందుము" (1 యోహాను 2:3). నిత్యజీవం

అనుగ్రహించే జ్ఞానంలో ప్రేమ ఉంది; “మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములోనుండి జీవములోనికి దాటియున్నామని యెరుగుదుము” (1 యోహాను 3:14).

**(3) గ్రంథం చారిత్రక సందర్భం గురించి మనకు ఏం తెలుసు?**

ఇలా ప్రసంగించే ప్రసంగికుని గురించి ఆలోచించండి, “ఒక క్రైస్తవుడు భార్యను ఎలా పొందుకోవాలో నేడు నేను ప్రకటించబోతున్నాను. న్యాయాధిపతులు 21:20-21 సెలవిస్తుంది, మనం పొరుగు గ్రామానికి వెళ్లి, పొదల మాటున వేచియుండాలని. గ్రామంలో నుండి ఒక స్త్రీ వచ్చిన వెంటనే, ఆమెను పట్టుకుని, ఇంటికి పారిపోవాలి. భార్యను ఎన్నుకోవడానికి ఇది బైబిల్ అందించే నమూనా.” మీరు ఈ ప్రసంగికుడు ఇచ్చే లేఖన అన్వయాన్ని అనుమానించాలి!

బోధకుని అన్వయంలో ఉన్న తప్పు ఏంటి? బెన్యామీను గోత్రపు పురుషులు, ఒక సందర్భంలోనే ఈ విధంగా భార్యలను పొందారని న్యాయాధిపతులు సెలవిస్తుంది. ఒక మంచి కారణంతో చేశారని కూడా సెలవిస్తుంది- ఇశ్రాయేలు గోత్రాల్లో ఒకదానిని రక్షించడానికి ఇలా చేశారు. అయితే, ప్రసంగికుడు చారిత్రక సందర్భాన్ని పట్టించుకోలేదు. ఈ కథ న్యాయాధిపతులు గ్రంథం చివర్లో వస్తుంది, దేవుని ప్రణాళికలో నుండి ఇశ్రాయేలు ఎలా దిగజారిపోయిందో ఈ పుస్తకం చూపిస్తుంది. వివాహ విషయంలో దేవుని ప్రణాళిక చూపించడానికి బదులుగా, దేవుని ప్రజలు తిరుగుబాటు చేసినప్పుడు ఏం జరుగుతుందో ఈ కథ చూపిస్తుంది.

కొన్నిసార్లు మనకు రచయిత లేక శ్రోతలు గురించి పెద్దగా తెలీదు కాని చారిత్రక సందర్భం తెలుసు. రూతు గ్రంథం ఎవరు రాశారో మనకు తెలీదు, కాని న్యాయాధిపతులు పాలించిన కాలంలో జరిగిన సంఘటనలు మనకు తెలుసు (రూతు 1:1). ఇది, ఇశ్రాయేలు పరిస్థితి అస్తవ్యస్తంగానున్న కాలం (న్యాయాధిపతులు 21:25). ఇశ్రాయేలీయులు దేవుని యెడల చూపిన అవిశ్వాసానికి భిన్నంగా, రూతు గ్రంథం, మోయాబీయురాలును, విధవరాలైన రూతు విశ్వాసంపై దృష్టిపెడుతుంది.

చనిపోయిన నయోమి కుమారులకు న్యాయబద్ధమైన వారసుడిని ఇవ్వటానికి, బోయజు రూతును ఎలా నిస్వార్థంగా వివాహం చేసుకున్నాడో ఈ కథ చెబుతుంది. బంధువు-విమోచకుడుగా, నయోమికి కుమారుడిని ఇవ్వాలని బోయజు తన వ్యక్తిగత స్వాస్థ్యపు హక్కులు త్యాగం చేశాడు. అలా చేయడంవల్ల, బోయజు దావీదు వంశావళిలో స్థానం పొందాడు (మత్తయి 1:6, 16).

యోనా గ్రంథాన్ని భాష్యం చెప్పేటప్పుడు చారిత్రక నేపథ్యం ముఖ్యం:

- నీనెవె, ఇశ్రాయేలుకు బద్ధ శత్రువైన అష్షూరుకు రాజధాని.

- యోనా నీనెవెలో ప్రకటిస్తున్న అదే సమయంలో, ఇశ్రాయేలుపై దేవుని తీర్పు అష్షూరీయుల ద్వార వస్తుందని ఆమోసు మరియు హోషేయ హెచ్చరించారు.

మానవ దృక్పథంలో, యోనా అష్షూరీయులకు ప్రకటించటానికి ఎందుకు ఇష్టపడలేదో అర్థమౌతుంది. యోనా గ్రంథం దేవుని దృక్పథం చూపిస్తుంది, ఏ మినహాయింపు లేకుండా ప్రజలందరినీ ప్రేమించే దేవుని దృక్పథం.

**(4) గ్రంథం సాంస్కృతిక నేపథ్యం గురించి మనకు ఏం తెలుసు?**

లేఖనపు చారిత్రక-సాంస్కృతిక సందర్భం కూడా బైబిల్ ప్రపంచంలోని సాంస్కృతిక ఆచారాలను చూస్తుంది. మొదటి శతాబ్దపు పాలస్తీనా ఆచారాల నేపథ్యంలో యేసు ఉపమానాలు చదివినప్పుడు, క్రొత్త అవగాహనలు పొందుతాం:

- మంచి సమరయుడు ఉపమానం (లూకా 10:30-35) యూదా శ్రోతలకు ఆశ్చర్యకరం. గాయపడిన ప్రయాణికుడికి సహాయం చేయడంలో మతాధికారులు విఫలమైనప్పుడు యేసు శ్రోతలు ఆశ్చర్యపడలేదు. అయితే, ఆ రక్షించేవాడు రబ్బీ లేక పరిసయ్యుడని వారు అనుకున్నారు. డానికి బదులుగా, యేసు ప్రేమకు మాదిరిగా తృణీకరించిన సమరయుని సూచించాడు.

- తప్పిపోయిన కుమారుని ఉపమానంలో (లూకా 15:11-32), యూదుల తండ్రులు గౌరవించబడ్డారని గుర్తుంచుకోవాలి. తండ్రి, కుమారుడిని తిరిగి చేర్చుకోవడానికి నిరాకరించాడు లేక బహుశా దాసుడుగా అంగీకరించాడని శ్రోతలు వినాలనుకున్నారు. దానికి బదులుగా, తప్పిపోయిన కుమారుడు తిరిగి వచ్చిన ఆనందంలో తండ్రి తన గౌరవాన్ని ప్రక్కన పెట్టాడు. ఈ చర్య ఆశ్చర్యకరం కాబట్టి, కొన్ని తూర్పు సంస్కృతులు ఈ కథను "పరిగెడుతున్న తండ్రి ఉపమానం" అని పిలుస్తారు. అదే విధంగా, మనం క్షమాపణ సంపాదించుకోవాలని మన కోసం వేచియుండడు; బదులుగా, తిరుగుబాటు చేసే పాపుల కోసం వెదకుతాడు. ఇది అపారమైన ప్రేమను చూపించే తండ్రి చిత్రం.

పౌలు పత్రికలను మొదటి శతాబ్దపు సాంస్కృతిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటూ చదవాలి. ఎఫెసీయులకు 5:21–6:9 పౌలు శ్రోతలకు దిగ్భ్రాంతి కలిగించింది. భార్య భర్తకు లోబడాలనే పౌలు ఆజ్ఞ సాధారణమైంది. భర్తలు క్రీస్తు తనను తాను త్యాగం చేసుకున్న మాదిరిని అనుసరించాలనే ఆజ్ఞ, రోమా శ్రోతలకు నూతనమైంది. పిల్లలు తల్లిదండ్రులకు విధేయత చూపాలి, కాని వారు తమ పిల్లలకు కోపం రేపకూడదని రోమా ప్రపంచంలో తండ్రులకు ఎవరు చెప్పలేదు.

పౌలు ఫిలిప్పీయులకు, తమ పౌరత్వం పరలోకంలో ఉన్నట్లుగా జీవించమని చెప్పినప్పుడు (ఫిలిప్పీ. 3:20), రోమా సామ్రాజ్యంలో ప్రత్యేక పౌరసత్వ అధికారాలు కలిగియున్న పట్టణానికి అతడు రాస్తున్నాడు. ఆ పట్టణం, పదవి విరమణ

చేసిన సైనికుల నివాసం కోసం స్థాపించారు కాబట్టి, ఫిలిప్పీ పట్టణస్తులు తమ పౌరత్వానికి ఎంతో విలువిచ్చారు. తమ నిజమైన పౌరస్థితి పరలోకంలో ఉందని, భూలోక పట్టణంలో కాదని పౌలు గుర్తుచేశాడు. ఈ చారిత్రక-సాంస్కృతిక నేపథ్యం తెలుసుకోవడం వల్ల, ఫిలిప్పీయులకు రాసిన పత్రికపై మంచి అవగాహన లభిస్తుంది.

**చారిత్రక-సాంస్కృతిక సందర్భం కనుగొనడం**

మనం చూసినట్లుగా, ఒక వాక్యభాగంపై చారిత్రక-సాంస్కృతిక సందర్భం గురించిన మన అధ్యయనం, ప్రశ్నలు అడగటంతో మొదలౌతుంది. మన ప్రశ్నలకు జవాబులు ఎలా కనుగొంటాం? జవాబులు అందించే కొన్ని బైబిల్ అధ్యయన వనరులు గురించి కోర్సు అనుబంధం (appendix) వివరిస్తుంది. Shepherds Global Classroom అందించు పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన పరిచయ కోర్సులు కూడా మీరు ఉపయోగించవచ్చు. ఈ కోర్సులు బైబిల్ లోని ప్రతి పుస్తకానికి నేపథ్యం అందిస్తాయి.

## బైబిల్ సందర్భం

బైబిల్ భాష్యానికి మరొక పరిశీలన, చుట్టూ ఉన్న సందర్భం. "ఈ వచనం, వాక్యభాగం, అధ్యాయం, మరియు పుస్తకం మిగిలిన బైబిల్ అంతటిలో ఎలా సరిపోతుంది?" అని అడగటం ముఖ్యం.

లేఖలో, చిరిగిన ఒక కాగితపు ముక్క మీకు దొరికిందని అనుకోండి. ఆ కాగితంలో, "అవును, 7 చాలు" అని రాసి ఉంది. ఆ వాక్యం అర్థం ఏంటి?

- బహుశా రచయిత ఎవరినో కలవాలి. సమావేశం రాత్రి 7:00 కు అయితే మంచిదని అతడు ధృవీకరిస్తున్నాడు.
- బహుశా రచయిత భార్య "శుక్రవారం రాత్రి ఎంతమందిని భోజనానికి పిలవాలి?" అని అడిగింది. అప్పుడతడు, "ఏడు (ప్రజల సంఖ్య) చాలు" అని చెప్పాడు.
- బహుశా రచయిత పుస్తకం $8.00కు అమ్మమని చెప్పాడు. "$7.00కి ఇస్తారా?" అని ఎవరో అడిగారు. అప్పుడా రచయిత, "అవును, $7 చాలు" అని చెప్పాడు.

సందర్భం తెలిసినప్పుడే, ఆ ఒక్క వచనాన్ని మనం అర్థం చేసుకోగలం. మనం వాక్యభాగమంతటి (paragraph) సందర్భంలో వాక్యం (sentence) చదువుతాం. పత్రిక అంతటి సందర్భంలో వాక్యభాగం చదువుతాం. విస్తృతంగా, ఇద్దరు వ్యక్తుల మధ్య వరుస పత్రికల సందర్భంలో మనం పత్రికను చదవవచ్చు.

లేఖనం ఒకే విధంగా పనిచేస్తుంది. నిర్దిష్ట వచనాలను (individual verses) దాని చుట్టూ ఉన్న వచనాలు, అధ్యాయం, మరియు పుస్తకమంతటి సందర్భంలో చదవాలి. సందర్భం, తక్షణ వాక్యభాగం నుండి మొత్తం బైబిల్ సందర్భంపై దృష్టి సారిస్తుంది.


వచనాన్ని సరిగా అర్థం చేసుకోవాలంటే, చుట్టూ ఉన్న సందర్భాన్ని చూడాలి. దేవుని ధర్మశాస్త్రాన్ని ఆనందించే వ్యక్తికి కీర్తన 1:3 అద్భుతమైన వాగ్దానం ఇస్తుంది. అతడు నీటికాలువల యోరను నాటబడి, ఫలమిచ్చు చెట్టువలె ఉంటాడు. “అతడు చేయునదంతయు సఫలమగును.” ఇది ప్రతి నమ్మకమైన విశ్వాసికి అనుగ్రహించబడే భౌతిక సంబంధమైన శ్రేయస్సు గురించిన వాగ్దానమని కొందరు చెబుతారు.

అయితే మీరు కీర్తన 1చదివినప్పుడు, అది భౌతిక సంబంధమైన ఆశీర్వాదాలపై దృష్టి ఉంచదుగాని దేవుని ధర్మశాస్త్ర ప్రకారం నడిచేవారి ఆత్మీయ అభివృద్ధిపై దృష్టిసారిస్తుంది. కీర్తన వాగ్దానంతో ముగుస్తుంది; “నీతిమంతుల మార్గము యెహోవాకు తెలియును దుష్టుల మార్గము నాశనమునకు నడుపును” (కీర్తన 1:6). వ్యత్యాసం, దేవుని మార్గం (చూసి, దేవుడు ఆమోదించే) మరియు నాశన మార్గం మధ్య ఉంది.

మిగిలిన కీర్తనలను మరియు బైబిల్ అంతటిని అనుసరించి, ఈ సందేశం ధృవీకరించవచ్చు. విశ్వాసి శ్రేయస్సు, భౌతిక ఆస్తులలో కాదుగాని దేవుని ఆమోదంలో ఉంది. ఇది నిజమైన శ్రేయస్సు.

సందర్భానుసారంగా వాక్యభాగం చదవాలంటే, ఈ మూడు దశలు అనుసరించండి:

1. పుస్తకాన్ని భాగాలుగా ఎలా విభజించాలో నిర్ణయించుకోండి. మీరు చదువుతున్న వచనం యొక్క తక్షణ సందర్భం ఏంటి?
2. ఒకటి లేక రెండు వాక్యాల్లో వాక్యభాగంలోని ప్రధాన ఆలోచనను సంగ్రహించండి. ఆ భాగమంతటి సందేశాన్ని అర్థం చేసుకోవడానికి ఇది సహాయపడుతుంది.
3. పుస్తకమంతటిని చదివి, “నేను చదువుతున్న వాక్యభాగం పుస్తక సందేశానికి ఎలా సరిపోతుంది?” అని అడగండి.




*బైబిల్ మొత్తం > పుస్తకం మొత్తం > భాగం లేక అధ్యాయం > వచనం*

*బైబిల్ > పౌలు పత్రికలు > రోమా > రోమా 12-15 > రోమా 12:1-2*

రోమా 12:1-2 దేవునికి పూర్తిగా సమర్పించుకోవాలని మనల్ని పిలుస్తుంది.

> కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి.

ఈ సమర్పణ క్రైస్తవుని అనుదిన జీవితంలో ఎలా కనిపిస్తుందో చూపించే వాక్యభాగాన్ని ఇది ఆరంభిస్తుంది (రోమా 12-15). తక్షణ సందర్భం నుండి రోమా 12-15, దేవునితో సంబంధం విషయంలో మనం ఎలా సరిచేయబడ్డామో చూపించే సిద్ధాంతపరమైన 11 అధ్యాయాల తరువాత వస్తుంది.

రోమా సందర్భం కాకుండా, పౌలు రాసిన ప్రతి పత్రిక, క్రైస్తవ విశ్వాసాన్ని ఆచరణలో పెట్టాలనే తన ఆసక్తిని చూపిస్తుంది. చివరిగా రోమా 12:1-2, దేవునికి విధేయత చూపాలి, ఆయనకు సమర్పించుకోవాలనే బైబిల్ సందేశమంతటికీ సరిపోతుంది. ఉదాహరణకు, రోమా 12:1-2 భాష, లేవీయకాండములో బల్యర్పణ భాషను ప్రతిబింబిస్తుంది. మనం బైబిల్ అంతటి సందర్భాన్ని మంచిగా అర్థం చేసుకుంటే, పౌలు మాటలు అంత శక్తివంతంగా ఉంటాయి.

**మీ వంతు**

► క్రింద ఇచ్చిన ప్రతి వచనం చదివి, వాటి తక్షణ సందర్భం చదవండి. వచనంపై మీ అవగాహనను సందర్భం ఎలా ప్రభావితం చేసిందో చర్చించండి.

1. మత్తయి 18:20 చదవండి. దాని అర్థం ఏంటి?
2. ఇప్పుడు మత్తయి 18:15-20 చదవండి. ఇది 18:20 అర్థాన్ని ప్రభావితం చేస్తుందా?

1. రోమా 8:28 చదవండి. ఇది ఏం వాగ్దానం చేస్తుంది?
2. ఇప్పుడు రోమా 8:28-30 చదవండి.? 8:28లో మంచి వాగ్దానం ఏంటి?

1. ప్రకటన 3:20 చదవండి. ఎవరు ఆహ్వానితులు?
2. ఇప్పుడు ప్రకటన 3:14-21 చదవండి. ఈ ఆహ్వానం ఎవరికి ఉద్దేశించినది?

## సందర్భాన్ని అధ్యయనం చేయడంలో ఎదురయ్యే సాధారణ తప్పులు

ఈ పాఠం ముగించడానికి, లేఖన సందర్భం అధ్యయనం చేసేటప్పుడు భాష్యకర్తలు చేసే కొన్ని సాధారణ తప్పులు చూద్దాం.

### సరిగా లేని సమాచారం ఉపయోగించడం

ఒక విద్యార్థి మత్తయి 19:23-26పై వివరణ ఇచ్చాడు. యేసు కాలంలో యెరూషలేముకు వెళ్ళే ఒక గుమ్మాన్ని "సూదిబెజ్జము" అని పిలిచేవారు. ఈ గుమ్మం చాలా క్రిందికి ఉండడం వలన, ఒంటె ఆ గుమ్మంలో పట్టడానికి దానిపై ఉన్న ఆ భారాన్ని దించేవారని చెప్పాడు.

విద్యార్థి వివరణలో రెండు సమస్యలు ఉన్నాయి:

1. యేసు కాలంలో ఈ గుమ్మానికి ఏ చారిత్రక ఆధారం లేదు. "సూదిబెజ్జము" అంటే, యేసు కాలంలో దాని అర్థం ఏంటో ఇప్పుడు కూడా అదే అర్థం, కుట్టు సూది బెజ్జం.
2. అతని నేపథ్య సమాచారం తప్పు కాబట్టి, విద్యార్థి లేఖన విషయంలో తప్పుడు నిర్ణయానికి వచ్చాడు. అతని ప్రదర్శన, మన జీవితంలో అదనపు వాటిని విడిచిపెట్టి, పరలోకరాజ్యంలో ప్రవేశించాలని సూచిస్తుంది.

అయితే, దేవుని రాజ్యంలో ప్రవేశించడం ధనవంతులకు, బలవంతులకు చాలా కష్టమని యేసు బోధించలేదు; అది అసాధ్యమని బోధించాడు! శిష్యులు దీనికి బాగా ఆశ్చర్యపోయి, "ఎవడు రక్షణపొందగలడని?" ప్రశ్నించారు.

"అది కష్టమే, కాని మీరు కష్టపడి ప్రయత్నిస్తే ప్రవేశించగలరు" అని యేసు చెప్పలేదు. ఆయన సువార్త సుసమాచారంతో స్పందించాడు: "ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సమస్తమును సాధ్యమని." సందర్భం అధ్యయనం చేసేటప్పుడు, తప్పుడు సమాచారం మిమ్మల్ని తప్పు దారిలో నడపించకుండ జాగ్రత్తపడండి.

### సందేశం కంటే సందర్భం అధ్యయనానికి ప్రాధాన్యతనివ్వాలి

రెండవ అతి పెద్ద ప్రమాదం, వాక్యభాగ సందేశం కంటే సందర్భ అధ్యయనానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం. తప్పుడు జ్ఞానం ఉప్పొంగజేయును గాని ప్రేమ క్షేమాభివృద్ధి కలుగజేయునని పౌలు కొరింథీ క్రైస్తవులకు జ్ఞాపకం చేశాడు (1 కొరింథీయులకు 8:1).[21] మనం అధ్యయనం చేస్తున్న వాక్యభాగ సందేశం మర్చిపోయేంతగా, సందర్భం యొక్క వివరాల ఆకర్షణలో పడిపోవడం సాధ్యం.

ఒక వ్యక్తి సమరయ సంస్కృతి గురించి అంతా నేర్చుకుని, "నీవును వెళ్లి ఆలాగు చేయుమని" (లూకా 10:37) చెప్పిన మంచి సమరయుని ఉపమాన ఉద్దేశ్యం మర్చిపోవచ్చు. ఈ సందర్భంలో, మన జ్ఞానం వ్యర్థం. లేఖన సందేశం అర్థం చేసుకోవడానికి అధ్యయనం చేయండి; దానికోసమే అధ్యయనంలో మునిగిపోవద్దు. మీ గొప్ప జ్ఞానాన్ని బట్టి ఉప్పొంగిపోకుండా, మరింత ప్రభావవంతంగా ప్రసంగించడానికి, బోధించటడానికి అధ్యయనం చేయండి!

### పాఠం 5 ముఖ్య విషయాలు

(1) సరైన భాష్యానికి, ఏదైన ఒక లేఖనభాగ సందర్భాన్ని అధ్యయనం చేయటం అవసరం.

(2) చారిత్రక-సాంస్కృతిక సందర్భం, బైబిల్ సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకుంటుంది. ఇలా అడుగుతుంది:

- బైబిల్ రచయిత గురించి మనకు ఏం తెలుసు?
- బైబిల్ శ్రోతలు గురించి మనకు ఏం తెలుసు?
- గ్రంథం చారిత్రక సందర్భం గురించి మనకు ఏం తెలుసు?
- గ్రంథం సాంస్కృతిక నేపథ్యం గురించి మనకు ఏం తెలుసు?

(3) ఒక వచనం మిగిలిన బైబిల్ అంతటికి ఎలా సరిపోతుందో, బైబిల్ సందర్భం పరిగణిస్తుంది.

[21] పౌలు జ్ఞానానికి వ్యతిరేకి కాదు; యువ సంఘాలకు మంచి బోధనను అందించటానికి అతడు తన పత్రికలు రాశాడు. అయితే, కొరింథీయుల అతిశయ "జ్ఞానము" క్షేమాభివృద్ధి కలిగించక, నాశనము కలిగించింది.

## పాఠం 5 అభ్యాసం

పాఠం 1లో, ఈ కోర్సు సమయంలో అధ్యయనం చేయడానికి ఒక వాక్యభాగం ఎన్నుకున్నారు. మీరు ఎంచుకున్న వాక్యభాగపు చారిత్రక-సాంస్కృతిక, బైబిల్ ఆధారిత సందర్భం అధ్యయనం చేయండి. సందర్భం గురించి ఈ పాఠంలోని చర్చకు అనుగుణంగా సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలకు జవాబిస్తూ ఒక పేజిని సిద్ధం చేయండి.

ఇలా అడగండి:

- రచయిత ఎవరు?
- అతడు ఎప్పుడు రాశాడు?
- అతని నేపథ్యం ఏంటి?
- అతని శ్రోతలు ఎవరు?
- వారి సమస్యలు ఏంటి?
- వాక్యభాగం చుట్టూ ఉన్న పరిస్థితులు ఏంటి?
- ఈ పుస్తక సమయంలో, జరిగిన చారిత్రక సంఘటనలు ఏంటి?
- ఈ పుస్తక వివరణకు సహకరించే సాంస్కృతిక విషయాలు ఏంటి?

వాక్యభాగపు బైబిల్ సందర్భాన్ని నిర్ణయించడానికి అధ్యాయాన్ని చదవండి.

# పాఠం 6

# భాష్యం: సాహిత్య రూపాలు

### పాఠం లక్ష్యాలు

(1) లేఖనంలో కనిపించే అనేక సాహిత్య రూపాల లక్షణాలు గుర్తించడం.

(2) సాహిత్య రూపం లేఖన బాష్యంపై ఎలాటి ప్రభావం చూపుతుందో గ్రహించడం.

(3) లేఖనంలోని ఒక నిర్దిష్ట చారిత్రక కథనాన్ని, అనుసరించడానికి మాదిరిగా బాష్యం చేయవచ్చో లేదో గ్రహించడం.

(4) లేఖనంలోని ఏ వాక్యభాగంలోనైనా అన్ని సమయాల్లో అందరికీ వర్తించే సూత్రాలు గుర్తించడం.

(5) నేటి విశ్వాసులకు పాత నిబంధన వాక్యభాగాల ఉపయోగం గురించి వివరించడం.

### పరిచయం

*తరగతి నాయకునికి గమనిక: మెటీరియల్ ను పూర్తి చేయాలి గనుక మీరు ఈ పాఠాన్ని రెండు సెషన్ లలో బోధించాలని సిఫార్సు చేస్తున్నాం. రెండవ సెషన్ తరువాత మాత్రమే విద్యార్థులకు అభ్యాసాలు ఇవ్వాలి.*

సాహిత్య రూపాల అవగాహన లేఖన భాష్యానికి సహాయకరం

దావీదు గొర్రెల యెడల శ్రద్ధ చూపాడని బైబిల్ చెప్పినప్పుడు (1 సమూయేలు 16:11), అక్షరాలా గొర్రెలు గురించి మాట్లాడుతుందని మనకు తెలుసు ఎందుకంటే అతడు ఒక గొర్రెల కాపరి. యోహాను ఘటసర్పము (ప్రకటన 12:3) లేక సింహము లేక ఎలుగుబంటి వంటిది చూశాడని ప్రకటన గ్రంథం చెప్పినప్పుడు, ఆ జంతువులు ఇతర విషయాల్ని సూచిస్తున్నాయని మనకు తెలుసు ఎందుకంటే ప్రకటన గ్రంథంలో అనేక చిహ్నాలు ఉన్నాయి.

దేవాలయ నిర్మాణం కోసం సొలొమోను దేవదారు మ్రానులు తీసుకువచ్చాడని 1 రాజులు 5:6 చెప్పినప్పుడు, ఆయన అక్షరాలా మ్రానులు తెచ్చాడని మనకు తెలుసు. నీతిమంతుడు నీటికాలువల యోరను నాటబడిన మొక్కవలే ఉన్నాడని కీర్తన 1:3 చెప్పినప్పుడు, అది పోలిక ద్వార ఒక విషయాన్ని సూచిస్తుందని మనకు తెలుసు. చెట్లన్నియు చప్పట్లు కొట్టునని యెషయా 55:12 చెప్పినప్పుడు, ప్రకృతి కూడా వేడుక జరుపుకునే అంతటి ఆనందం ఉందని అర్థం.

సాహిత్య రూపాల అవగాహన లేఖన భాష్యానికి సహాయకరం సాహిత్య రకాల యెడల అవగాహన లేఖన భాష్యానికి చాలా ముఖ్యం. కావ్య గ్రంథం (కీర్తనలు) పత్రిక (రోమా) కంటే భిన్నంగా మాట్లాడుతుంది. భిన్నత్వాల్ని అర్థం

చేసుకోవడం, ప్రతి పుస్తకాన్ని రచయిత ఉద్దేశించినట్లుగా భాష్యం చేయగలగుటకు సహాయపడుతుంది. ఇక్కడ లేఖనంలోని ప్రధాన రకాల సాహిత్యాలకు పరిచయం ఉంది.

## సాహిత్య రూపం: చరిత్ర

బైబిల్లో అధిక భాగం చరిత్రే: పంచగ్రంథాలు, చారిత్రక పుస్తకాలు, సువార్తలు, అపొస్తలుల కార్యములు మరియు ఇతర చిన్న భాగాలు, నిజమైన ప్రజలు మరియు సంఘటనలను గూర్చిన చారిత్రక కథనాలు.

(బైబిల్ లో ప్రవక్తలు చెప్పిన కల్పిత ఉదాహరణలు, యేసు చెప్పిన ఉపమానాలు కూడా ఉన్నాయి. ఇవి చారిత్రక కథనాలకు భిన్నమైనవి గనుక వీటి భాష్యాన్ని తదుపరి భాగంలో చర్చించుకుందాం.)

### చరిత్ర పఠనంలో అడగాల్సిన ప్రశ్నలు

మీరు బైబిల్ చరిత్ర చదువుతున్నప్పుడు ఈ ప్రశ్నలు అడగాలి:

**(1) కథ ఏంటి?**

చరిత్ర చదువుతున్నప్పుడు, మనం కథ రూపకల్పన చూస్తాం. ఉదాహరణకు, లూకా సువార్త గలిలయలో యేసు పరిచర్యను సూచిస్తుంది; ఆ తర్వాత యేసు యెరూషలేము ప్రయాణంపై, శిష్యత్వాన్ని గురించి ఆయన బోధపై దృష్టిపెడుతుంది; యెరూషలేములో యేసు మరణం, పునరుత్థానంపై దృష్టి పెడుతూ లూకా తన సువార్త ముగిస్తాడు. అపొ. కార్యాల గ్రంథంలో, సంఘ పరిచర్య అభివృద్ధి గురించి చెప్పాడు. మరలా, భౌగోళిక ఆకృతిని అనుసరించాడు. సువార్త యెరూషలేములో ప్రకటించబడింది; ఆ తరువాత యూదయ, సమరయ; చివరకు, పౌలు రోములో చేసిన పరిచర్య ద్వారా సువార్త భూదిగంతాల వరకు వ్యాపించింది.

**(2) కథలో ప్రజలు ఎవరు?**

బైబిల్ లో చారిత్రక ప్రజలు గురించి మనం చదివినప్పుడు, మనం పెంపొందించుకోవలసిన బలాలు, విడిచిపెట్టవలసిన బలహీనతలు గురించి నేర్చుకుంటాం. మనం ఇలాంటి ప్రశ్నలు అడుగుతాం, "నెహెమ్యా ప్రభావంతమైన నాయకుడవ్వడానికి కారణం ఏంటి?" సౌలు వైఫల్యానికి, దావీదు విజయానికి మధ్య వ్యత్యాసం ఏంటి?" పేతురు, పౌలు సువార్త విధానాల్ని పోల్చి చూస్తాం. బైబిల్ చరిత్రలో, ప్రజల చిత్రాన్ని పొందుతాం.

**(3) చారిత్రక కథనం అనుసరించడానికి మాదిరి ఇస్తుందా?**

కథ చదివేటప్పుడు, అక్కడున్న చర్యలు మనం అనుసరించడానికి మాదిరిగా ఉన్నాయా అని మనం ప్రశ్నించాలి. దేవుడు తన ప్రజల నుండి ఏమి ఆశిస్తున్నాడో చారిత్రక కథనం ఒక మాదిరి ఇస్తుంది. దీనికి భిన్నంగా, బహుశా ఇది అనుసరించడానికి మాదిరి ఇవ్వని ముఖ్య చరిత్రను అందిస్తుంది.

న్యాయాధిపతులు 21 వ అధ్యాయం ఉపయోగించి, భార్యను ఎలా పొందుకోవాలో ప్రసంగించిన ప్రసంగికుని ఉదాహరణ మీకు గుర్తుందా? ఆ ఉదాహరణలో, "న్యాయాధిపతులు గ్రంథం ఇలా చేయమని ఆజ్ఞాపిస్తుందా లేక ఈ చర్యను కేవలం వివరిస్తుందా?" అని ప్రసంగికుడు ప్రశ్నించలేదు. న్యాయాధిపతులు 21 ఇశ్రాయేలు చర్యల్ని వివరిస్తుంది; ఎలా ప్రవర్తించాలో ఆజ్ఞాపించదు.

చరిత్ర చదివేటప్పుడు, "ఇది అనుసరించే ఉదాహరణా?" లేక "ఇది కేవలం వివరణా?" అని మనం ప్రశ్నించాలి. అనేక సందర్భాల్లో, జవాబు చాలా సులభం; భార్యను అపహరించాలని న్యాయాధిపతులు 21 అజ్ఞాపిస్తుందని ఏ ఒక్కరు భావించరు. అయితే, అనేక సందర్భాలు అస్పష్టంగా ఉన్నాయి. అపొస్తలుల కార్యములు గ్రంథం మరి ముఖ్యంగా కష్టమైనది. దేవుడు ఆది సంఘ కాలంలో చేసిన అద్భుతకార్యాలు చేయాలని నేటి సంఘాలు ఆశిస్తున్నాయా? ఆత్మతో నింపబడిన ప్రతి విశ్వాసి అన్యభాషలు మాట్లాడాలా?

వాక్యభాగం మనం అనుకరించటానికి మాదిరి ఇస్తుందా లేదా అనే విషయాన్ని మనం ఎలా నిర్ణయిస్తాం? ఈ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకపోతే, న్యాయాధిపతులు మరియు అపొస్తలుల కార్యాల గ్రంథం వంటి చారిత్రక పుస్తకాల్ని మనం అపార్థం చేసుకుంటాం. ఈ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకపోతే, మన ఇష్టానుసారంగా బైబిల్ వివరాల్ని విస్మరిస్తాం లేక ఉద్ఘాటిస్తాం. ఈ సూత్రం గుర్తుంచుకోండి: **చారిత్రక వాక్యభాగం అనుసరించడానికి మాదిరిని ఇచ్చినప్పుడు, ఇతర వాక్యభాగాల్లో స్పష్టమైన సూచనలు లేక పునరావృత ఉదాహరణలు మనం ఆశించవచ్చు.**

ఉదాహరణకు, ఆది క్రైస్తవులు సౌవార్తీకరణ విషయంలో ఎంతో ఆసక్తిగా ఉన్నారని అపొస్తలుల కార్యాల గ్రంథం చూపిస్తుంది. శిష్యులను చేయమని మత్తయి 28:19-20 మనకు ఆజ్ఞాపిస్తుంది గనుక ఇది మనం అనుసరించవలసిన ఉదాహరణ అని మనకు తెలుసు. సంఘంలో పరిశుద్ధాత్మ కార్యాలను అపొస్తలుల కార్యాల గ్రంథం చూపిస్తుంది. పరిశుద్ధాత్ముడు ఆయన అనుచరుల పరిచర్యను బలపరుస్తాడని యేసు వాగ్దానం చేశాడు గనుక ఇది సంఘ జీవితంలో సర్వసాధారణం అని మనకు తెలుసు (అపొస్తలుల కార్యములు 1:8). మనం సౌవార్తీకరణ విషయంలో విఫలమైతే లేక మన పరిచర్యలో పరిశుద్ధాత్మ శక్తిని కనుపరచు విషయంలో విఫలమైతే, మనం అపొస్తలుల కార్యాల గ్రంథం మాదిరికి అనుగుణంగా జీవించడంలేదని అర్థం. ఈ కథలు సంఘానికి ఉదాహరణలు.

క్రైస్తవులు సమస్తాన్ని సమిష్టిగా కలిగియున్నారు మరియు వ్యక్తిగత గృహాలలో ఆరాధించారని కూడా అపొస్తలుల కార్యాల గ్రంథం సెలవిస్తుంది. ఈ ఆచరణలను లేఖనభాగం ఆజ్ఞాపిస్తుందా? లేదు. పేతురు అననీయకు చెప్పినట్లుగా, ఒకరి సంపదను పంచిపెట్టడం స్వచ్ఛందమే కాని కోరదగినవి కాదు (అపొస్తలుల కార్యములు 5:3-4). అలాగే, వ్యక్తిగత గృహాలలో ఆరాధించమని లేఖనం మనలను ఆజ్ఞాపించదు.[22]

ఆ ఆచారాలు లేఖనంలో ఆజ్ఞాపించలేదు గనుక, అవి సంఘ చరిత్రలో భాగమేగాని ఖచ్చితంగా అనుసరించవలసిన మాదిరి కాదని మనం చెప్పగలం. అపొస్తలుల కార్యాల గ్రంథం, చరిత్రలో ఒక నిర్దిష్ట సమయాన్ని వివరిస్తుంది; ఈ ఆచారాలను అన్ని సమయాలకు వర్తిస్తాయని ఆజ్ఞాపించలేదు.

**(4) ఈ చారిత్రక కథనంలో ఏ సూత్రాలు బోధించారు?**

పౌలు ప్రకారం, బైబిల్ చరిత్ర మన బోధన కొరకు ఇవ్వబడింది (1 కొరింథీయులకు 10:11). మానవ చరిత్రలో దేవుడు ఎలా పనిచేశాడు, అదే విధంగా దేవునికి ఇష్టమైనవి లేక ఇష్టం కానివి ఏవి అనే విషయాలను ఇది చూపిస్తుంది. పాఠకులుగా, మనం చారిత్రక కథనాల్లో సూత్రాలు కనుగొనాలి.

"ఇశ్రాయేలీయులు దేవునిపై సణిగి, శిక్షను పొందారు. మీరు ఫిర్యాదు చేయకూడదు" అని ఈ కథ చెప్పదు. అయితే ఇశ్రాయేలు దేవునిపై ఫిర్యాదు చేసింది; మనం వారి పాప పర్యవసానాలను చూసి, అది బోధించే సూత్రాన్ని అర్థం చేసుకోవాలని" చెబుతుంది. చరిత్ర నేరుగా ఆజ్ఞాపించకుండా, అనుసరించవలసిన సానుకూల ఉదాహరణలు, నివారించవలసిన ప్రతికూల ఉదాహరణలను ఇస్తుంది. యెహోషువ గ్రంథంలో, దేవునికి విధేయత చూపడం జయమిస్తుందని చూస్తాం; న్యాయాధిపతులు గ్రంథంలో, అవిధేయత గందరగోళం సృష్టిస్తుందని చూస్తాం.

**అపొస్తలుల కార్యాల గ్రంథం**

అపొస్తలుల కార్యాల గ్రంథం, యేసు భూమిపై జీవించిన తరువాత ఏమి జరిగిందో చారిత్రక నివేదికను ఇస్తుంది. క్రొత్త నిబంధన పాఠకులకు, అపొస్తలుల కార్యాల గ్రంథం, సంఘాలకు రాసిన పత్రికలకు నేపథ్యాన్ని ఇస్తుంది.

పరిశుద్ధాత్మ శక్తిని పొందిన సంఘం, సువార్త ప్రకటించే పనితోనే ఆగిపోలేదని అపొస్తలుల కార్యాల గ్రంథం, చూపిస్తుంది. సంఘం సిద్ధాంతపరమైన విషయాలు, అంతర్గత విభజనలు, అబద్ధ బోధకులు, పరిపాలనలో పోరాటాలు, వేషధారులు, అపవిత్రాత్మలను ప్రతిఘటించడం, సమాజం మరియు ప్రభుత్వం నుండి హింస, ప్రయాణంలో విపత్తులు కూడా

---

[22] నేడు ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల క్రైస్తవులు బహిరంగ ఆరాధనకంటే గృహ ఆరాధనను సురక్షితంగా భావిస్తున్నారు. ఇది సార్వత్రిక ఆజ్ఞ కాదుగాని స్థానిక పరిస్థితులపై ఆధారపడి ఉంది.

ఎదుర్కొంది. అయినా, సంఘం ఆనందంగా, విజయవంతంగా ముందుకు సాగింది. పరిశుద్ధాత్ముడు సంఘాన్ని బలపరచాడు గనుక వ్యక్తులు, సమాజాలు సువార్త ద్వారా మార్పుచెందాయి.

అపొస్తలుల కార్యాల గ్రంథం రాయడంలో లూకా ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రపంచమంతటా సువార్త ప్రకటించాలనే పనిని నెరవేర్చడానికి సంఘాన్ని ధైర్యపరచడం. ఈ ఉద్దేశ్యం, ఈ క్రింది విషయాలలో గ్రంథమంతా కనిపిస్తుంది. ఇలాంటి ఇతర విషయాలను కూడా చేర్చవచ్చు.

- తన శిష్యులు భూదిగంతాల వరకు సువార్త ప్రకటిస్తారని యేసు చెప్పాడు (అపొస్తలుల కార్యములు 1:8).
- పెంతెకొస్తు దినాన సువార్త ప్రకటించడానికి ఆత్మ శిష్యులను బలపరిచాడు, 3,000మంది విశ్వసించారు (అపొస్తలుల కార్యములు 2:41).
- ప్రజలు అనుదినం సంఘంలో చేర్చబడ్డారు (అపొస్తలుల కార్యములు 2:47).
- గమలియేలను యూదా నాయకుడు, దేవుని పనిని ఆపలేమని చెప్పాడు (అపొస్తలుల కార్యములు 5:39).
- హింసించబడిన విశ్వాసులు యెరూషలేము విడిచి, సువార్తను వ్యాపింపజేశారు (అపొస్తలుల కార్యములు 8:1, 4).
- హింసకు కారకుడైన నాయకుడు మారుమనసు పొంది, గొప్ప సువార్తికుడయ్యాడు (అపొస్తలుల కార్యములు 9:13-22).
- పౌలు, ఇతరులు ప్రపంచమంతటా సువార్త యాత్రలు చేశారు (అపొస్తలుల కార్యములు 13-21).
- పౌలు అధికారులకు సువార్త ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 24-26).
- రోమా సామ్రాజ్యానికి రాజధానియైన రోములో పౌలు ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 28).

### *అపొస్తలుల కార్యాల గ్రంథ అన్వయం*

పరిచర్య ఎలా చేయాలో, బాప్తిస్మం, సంఘ క్రమం ఎలా నిర్వహించాలో, పరిశుద్ధాత్మను ఎలా అనుభవించాలో అపొస్తలుల కార్యాల గ్రంథం చెబుతుందని కొన్నిసార్లు పాఠకులు భావిస్తారు. ఈ విషయాలను ఆది సంఘం ఎలా చేసిందో అపొస్తలుల కార్యాల గ్రంథం చూపిస్తుంది; అయితే, అపొస్తలుల కార్యాల గ్రంథాన్ని సంఘ పరిచర్యకు ఒక మార్గదర్శినిగా రచయిత ఉద్దేశించలేదు.

అపొస్తలుల కార్యాల గ్రంథంలో సంఘం చేసినట్లుగా మనం కూడా ప్రతిదీ అలాగే చేయాలని భావించకూడదు కాని, సంఘం సవాళ్లను ఎలా ఎదుర్కొందో చూసి, నేర్చుకోవచ్చు.

పరిశుద్ధాత్మ శక్తి, జ్ఞానం ద్వారా సమస్యలన్నిటిని ఎదుర్కొంటూ, ఆచరణాత్మ సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన నిర్మాణాలను అభివృద్ధి చేస్తూ సంఘం సువార్త పనిలో ఎలా కొనసాగాలో అపొస్తలుల కార్యాల గ్రంథం మనకు చూపిస్తుంది.

## సాహిత్య రూపం: పాత నిబంధన ధర్మశాస్త్రం

### పాత నిబంధన ధర్మశాస్త్రం విలువ

చారిత్రక విభాగాలు క్రైస్తవులకు సూత్రాలు వివరించటం తప్ప పాత నిబంధన నేడు విశ్వాసికి అంత అవసరం లేదని కొందరు క్రైస్తవులు భావిస్తారు. పాత నిబంధన నియమాలు నేడు విశ్వాసులకు వర్తించవని భావిస్తారు.

విశ్వాసి విషయంలో, పాత నిబంధన నియమాన్ని ఉపయోగించడంలో మార్పును గూర్చి అపొస్తలుడైన పౌలు రాశాడు. క్రీస్తు మరణం ధర్మశాస్త్ర శిక్షను తొలగించింది గనుక ధర్మశాస్త్ర ఆచారాలు అనుసరించని విశ్వాసులకు మనం తీర్పుతీర్చకూడదని చెప్పాడు (కొలొస్సయులకు 2:14-17). అపొస్తలులు యూదుల ఆచారాల నియంత్రణలో లేరని చెప్పాడు (గలతీయులకు 2:14-16). అన్యజనులకు సంఘ కాపరియైన వ్యక్తి సున్నతి పొందనక్కరలేదని చెప్పాడు (గలతీయులకు 2:3). యూదుల ఆహార నియమాలు, ప్రత్యేక దినాల విషయంలో ప్రతి వ్యక్తి తన మనస్సాక్షిని అనుసరించాలని, ఈ అవసరాల విషయంలో విశ్వాసులు ఒకరినొకరు తీర్పుతీర్చుకోకూడదని చెప్పాడు (రోమా 14). విశ్వాసి ధర్మశాస్త్ర విషయమై మృతినొందినవాడు, గనుక మనం ధర్మశాస్త్ర ఉద్దేశ్యం నెరవేర్చే విధానంలో దేవుని సేవిస్తున్నాం కాని ప్రత్యేక అవసరాలు కాదని చెప్పాడు (రోమా 7:4, 6). మరి ముఖ్యంగా, ధర్మశాస్త్ర క్రియల మూలంగా ఏ ఒక్కరు తీర్పుతీర్చబడరని చెప్పాడు (రోమా 3:20).

పాత నిబంధన ధర్మశాస్త్రం విశ్వాసికి ముఖ్యమైనదని చూపించే ప్రకటనలు బైబిల్ లో ఉన్నాయి. పాత నిబంధన ధర్మశాస్త్రం దేవుని స్వభావ వ్యక్తీకరణ గనుక, దేవుని ప్రేమించినవాడు ఆయన ధర్మశాస్త్రాన్ని పాటిస్తాడు ( కీర్తన 1:2, కీర్తన 119:7, 16, 70 చూడండి). ధర్మశాస్త్రం పరిశుద్ధమైనది, ఆజ్ఞ పరిశుద్ధమైనది, నీతిగలది అని పౌలు చెప్పాడు (రోమా 7:12). ఇలా కూడా చెప్పాడు, "దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతికి 3:16). అతడు ఆ ప్రకటన చేసిన సమయంలో, *లేఖనం* అను పదం ప్రధానంగా పాత నిబంధన గ్రంథాన్ని సూచిస్తుంది. లేఖనాలు రక్షణ విషయంలో తనను జ్ఞానవంతునిగా చేస్తాయని పౌలు తిమోతికి చెప్పాడు (2 తిమోతికి 3:15). విశ్వాసులుగా పాత

నిబంధనలోని ఏ భాగాన్ని కూడా మనం విస్మరించకూడదని ఈ ప్రకటనలు బోధిస్తాయి. దేవుని ధర్మశాస్త్రం పాటించడం ద్వారా మనం రక్షించబడనప్పటికీ, మన విషయంలో ఆయన చిత్తాన్ని గ్రహించి, తద్వారా ఆయనను మెప్పించాలి (2 కొరింథీయులకు 5:9-10).

**పాత నిబంధన నియమాల వర్గీకరణ**

నేడు విశ్వాసులు పాత నిబంధన ధర్మశాస్త్రాన్ని ఎలా ఉపయోగించాలో గ్రహించడానికి, నియమాల వర్గీకరణను పరిశీలిద్దాం.

**ఆచార నియమాలు**, బలులు, ఆచారాలు, ఆహారం, ప్రత్యేక దినాలు గురించి మాట్లాడతాయి. ఈ నియమాలను క్రీస్తు నేరవేర్చాడని పౌలు చెప్పాడు (కొలొస్సయులకు 2:16-17). హెబ్రీయులకు రాసిన పత్రిక, పాత నిబంధన ఆచారాల అర్థానికి అధికమైన అన్వయాన్ని ఇస్తుంది. ఉదాహరణకు, దేవాలయంలోని వస్తువులు రక్తం చేత శుద్ధిచేయబడతాయి, ఇది విశ్వాసులను శుద్ధి చేసే క్రీస్తు రక్తానికి సాదృశ్యంగా ఉంది (హెబ్రీయులకు 9:14, 21-24).

ఒక రాజ్యమైన ఇశ్రాయేలుకు **పౌర నియమాలు** ఇవ్వబడ్డాయి. పౌర నియమాలను నియమితులైన అధికారులు అమలు చేస్తారు కాని వ్యక్తులు కాదు. ఉదాహరణకు, శకునము చెప్పువారిని బ్రతుకనియ్యకూడదు (నిర్గమకాండము 22:18**),** కాని విచారణ, మరణశిక్షను ప్రజలు కాదు నియమించబడిన అధికారులు అమలు చేయాలి. ద్వితీయోపదేశకాండము 17:2-12 స్థానిక ప్రభుత్వం సాక్షులను విచారించి, న్యాయం తీర్చే విధానాన్ని వివరిస్తుంది; మరింత కఠిన కేసులకు ఉన్నత న్యాయస్థానం ఉంది.

పౌర నియమాలు నేడు భిన్నంగా ఉన్నాయి, ప్రాచీన ఇశ్రాయేలు పౌర చట్టాలను ఆచరించడానికి విశ్వాసులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవలసిన అవసరత లేదు. అయితే, ఆ నియమాలు దేవుని నీతి గురించి, ప్రజల నుండి ఆయన ఆశించు నీతి గురించి మనకు బోధిస్తాయి. ఉదాహరణకు, నిర్గమకాండము 22:18 లో ఇచ్చిన నియమం, ఒక వ్యక్తి శకునం చెప్పడం తప్పు అని బోధిస్తుంది. ఇతర నియమాలు, దేశంలోని బీదలను రక్షించి, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని దేవుడు ఆశిస్తున్నాడని సెలవిస్తాయి (ద్వితీయోపదేశకాండము 24:14-15, 17-22).

బైబిల్ భాష్యకర్త మొదట పాత నిబంధన పౌర నియమాల అర్థాన్ని గ్రహించి, ఆ తరువాత నేడు విశ్వాసి ఆ నియమాన్ని ఎలా అన్వయించాలో చూస్తాడు. మనం ఇలా అడగాలి, "దేవుని చింత ఏంటి? దేవుని ఉద్దేశ్యం ఏంటి? దేవుడు విలువిచ్చే వాటి గురించి ఈ నియమం ఏమి వెల్లడి చేస్తుంది?" ఆ తరువాత, ఏ ఆధునిక అన్వయం దేవుని సంతోషపరుస్తుందో పరిగణించాలి.

**నైతిక నియమాలు** సరైన జీవితానికి దేవుని శాశ్వతమైన అవసరాన్ని గురించి మాట్లాడుతుంది. నైతిక నియమాలు, నిజాయితీ, లైంగికత, విగ్రహారాధన మరియు ఇతర విషయాలను గురించి మాట్లాడుతుంది (నిర్గమకాండము 20:4-5, 13-16). అనేక నైతిక నియమాలు క్రొత్త నిబంధనలో కూడా పునరావృతమయ్యాయి. దేశ నియమాలు పూర్తిగా లేక స్థిరంగా దేవుని నియమాలను పాటించనప్పటికీ, నైతిక నియమాలు నేడు దేశంలో పౌర నియమాలకు ఆధారంగా ఉన్నాయి. ప్రజలకు దేవుడు ఇచ్చిన నియమాలు సాంఘిక నియమాలకంటే గొప్పవి.

మన నియమాల వర్గీకరణ పరిపూర్ణమైనది కాదు. పాత నిబంధన వాక్యభాగాలలో, కొన్నిసార్లు మూడు రకాల నియమాలు ఉంటాయి, వర్గీకరించలేని నియమాలు కూడా ఉంటాయి. అది పరిపూర్ణం కానప్పటికీ, పాత నిబంధన నియమాలు క్రొత్త నిబంధన విశ్వాసులకు ఎలా వర్తిస్తాయో అర్థం చేసుకోవడానికి ఈ వర్గీకరణలు సహాయపడతాయి.

### పాత నిబంధన ధర్మశాస్త్రానికి భాష్యం చెప్పడం[23]

మీరు పాత నిబంధన ధర్మశాస్త్రం అధ్యయనం చేస్తున్నప్పుడు, అధ్యయనం చేసే నియమం యొక్క విస్తృత సందర్భాన్ని పరిగణలోకి తీసుకోవాలి. చుట్టూ ఉన్న కథనాన్ని గమనించండి. నియమం తక్షణ సందర్భానికి ఎలా సరిపోతుంది?

తరువాత ఇలా అడగండి:

**(1) మొదటి శ్రోతలకు ఈ వాక్యభాగం యొక్క అర్థం ఏంటి?**

ఇశ్రాయేలు ధర్మశాస్త్రాన్ని ఎలా అర్థం చేసుకుందో గ్రహించాలంటే, ఇలాంటి ప్రశ్నలు అడగాలి:

- నియమానికి, దాని చుట్టూ ఉన్న వచనాలకు సంబంధం ఉందా?
- నియమం, ఇశ్రాయేలు చరిత్రకు సంబంధించి నిర్దిష్ట పరిస్థితికి ప్రతిస్పందనగా ఉందా?
- నియమం, పాత నిబంధన బలలుల వ్యవస్థకు సంబంధించినదిగా ఉందా?

**(2) బైబిల్ శ్రోతలకు, మన ప్రపంచానికి మధ్య వ్యత్యాసాలు ఏంటి?**

మన లోకానికి మరియు క్రొత్త నిబంధనకు మధ్య ఉన్న వ్యత్యాసం కంటే మన లోకానికి, పాత నిబంధనకు మధ్య ఎక్కువ వ్యత్యాసాలు ఉన్నాయి. ఉదాహరణకు:

- మనం ప్రధాన దేవాలయాన్ని దర్శించము; పరిశుద్ధాత్ముడు ప్రతి విశ్వాసిలో నివసిస్తున్నాడు.

---

[23] ఈ భాగం J. Scott Duvall and J. Daniel Hays, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012) నుండి తీసుకున్నారు.

- బలుల ద్వారా దేవునిని దగ్గరికి రాము; క్రీస్తు ఒక్కసారే అందరి కోసం చనిపోయాడు (హెబ్రీ. 10:10).
- దేవుని వాక్యం మన దేశ ధర్మశాస్త్రం/చట్టం కాదు. మనం లౌకిక ప్రభుత్వాల అధీనంలో జీవిస్తున్నాం.

**(3) ఈ వాక్యభాగంలో బోధించిన సూత్రాలు ఏంటి?**

పాత నిబంధన ధర్మశాస్త్రం ఆశించే నిర్దిష్టమైన చర్య బహుశ నేడు అవసరం లేదు. ధర్మశాస్త్రం బోధించే శాశ్వతమైన సూత్రం కోసం మనం చూడాలి. ఇది, లేఖనాన్ని దాని ప్రాచీన నేపథ్యం నుండి ఆధునిక లోకానికి నడిపించే ఒక వంతెన. ఈ సూత్రం, పాత నిబంధన శ్రోతలకు, సమకాలీన శ్రోతలకు వర్తిస్తుంది.

1-2 వాక్యాల్లో సూత్రాన్ని పేర్కొనండి. సూత్రం నిజంగా బైబిల్ ప్రకారమే అని ధృవీకరించడానికి, ఈ ప్రశ్నలు అడగండి:

- ఈ సూత్రాన్ని ధర్మశాస్త్రం స్పష్టంగా చూపిస్తుందా?
- ఈ సూత్రం అన్ని కాలాలలో, అన్నిచోట్ల ఉన్న ప్రజలకు వర్తిస్తుందా?
- ఈ సూత్రం మిగిలిన వాక్యభాగమంతటికీ అనుగుణంగా ఉందా?

**(4) క్రొత్త నిబంధన ఏ విధంగానైన ఈ సూత్రాన్ని అంగీకరిస్తుందా?**

ముందు చెప్పిన మూడు ప్రశ్నలలో ప్రతి ఒక్కటి, ఏ వాక్యభాగ భాష్యానికైనా ఉపయోగపడుతుంది. మనం పాత నిబంధన వాక్యభాగాలను అధ్యయనం చేస్తున్నప్పుడు, భాష్యం ప్రక్రియలో ఈ చివరి ప్రశ్నను జోడించాలి. మీరు పాత నిబంధన వాక్యభాగంలో సార్వత్రిక సూత్రం కనుగొంటే, అది నేడు అమలులో ఉంటుంది. అయితే, అన్వయం పాత నిబంధన కాలానికి భిన్నంగా ఉంటుందని క్రొత్త నిబంధన చూపిస్తుంది.

ఉదాహరణకు, నిర్గమకాండము 20:14, "వ్యభిచరింపకూడదు" అని ఆజ్ఞాపిస్తుంది. కొండమీద ప్రసంగంలో, కేవలం క్రియలకు మాత్రమే కాదుగాని ఆలోచనలకు కూడా అన్వయించునట్లు యేసు దీనిని వివరించాడు (మత్తయి 5:28). యేసు బోధన నిర్గమకాండము 20:14 సూత్రాన్ని రద్దు చేయదు; లోతైన అన్వయాన్ని ఇస్తుంది.

**సాహిత్య రూపం: కావ్యం**

బైబిల్ లో చాలా కావ్యం ఉంది. యోబు, కీర్తనలు, సామెతలు, మరియు పరమగీతము దాదాపు పూర్తిగా కావ్య రూపంలో ఉన్నాయి, ప్రసంగి లో కూడా కొంత కావ్యం ఉంది. ప్రవక్తల గ్రంథాల్లో కూడా కావ్యం ఎక్కువ ఉంది. కావ్యం అంటే లోతైన భావోద్వేగాలను చూపించడానికి ఉపయోగించే రచనా శైలి. ఇది, చారిత్రక కథనాల వివరాలు తెలియపరచడానికి లేక తార్కిక వాదాలు సృష్టించడానికి రూపించబడలేదు. కావ్యంలో, కవి హృదయ భావన వింటాం; కవిత్వంలో వ్యక్తపరచిన భావాల విషయంలో సున్నితంగా ఉంటాం.

కావ్యం ఎల్లప్పుడు అలంకార రూపకాలను ఉపయోగిస్తుంది, దాని వివరాలను అక్షరార్థంగా తీసుకోనవసరం లేదు.

కీర్తనలు గ్రంథం నుండి ఒక కావ్య ప్రకటనకు ఒక ఉదాహరణ ఇక్కడుంది: “[దేవా] నీవు వారిని వెనుకకు త్రిప్పివేసెదవు నీ వింటి నారులను బిగించి వారిని ముఖముమీద కొట్టుదువు” (కీర్తన 21:12). అక్షరాల బాణాలు విసిరే విల్లు దేవుడు కలిగిలేడని మనం గ్రహిస్తాం. తనకు శత్రువైన ప్రతి ఒక్కరిని దేవుడు ఓడించగల సమర్థుడని రచయిత సెలవిస్తున్నాడు. దేవుని విజయంలో నమ్మకముంచమని రచయిత విశ్వాసులకు చెబుతున్నాడు.

కావ్యం, బైబిల్ లో మరోచోట సూటిగా చెప్పిన సత్యాన్ని ఊహాత్మకంగా తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. సరళ వాక్యభాగంలో బోధించనప్పుడు, కావ్య వాక్యభాగంలో కూడా సిద్ధాంతం లేక ఆచారాన్ని అభివృద్ధి చేయవద్దు.

హెబ్రీ కావ్యం కొన్నిసార్లు శబ్ద నమూనాలను ఉపయోగిస్తుంది కాని సాంప్రదాయక ఆంగ్ల కవిత్వం ప్రాస విధానాన్ని కలిగియుండదు. హెబ్రీ కావ్య లక్షణాలను అర్థం చేసుకోవటం వలన దాని అందాన్ని అభినందించగలం.

**హెబ్రీ కావ్య లక్షణాలు**

***సమాంతరత***

హెబ్రీ కావ్యం తరచు సమాంతరతపై ఆధారపడి ఉంటుంది. రెండు సమాంతర ప్రకటనలు కలిపి ఉపయోగిస్తారు; రెండవ ప్రకటన మొదటి ప్రకటనకు అర్థాన్ని ఇస్తుంది కాని అదనపు అర్థాన్ని ఎన్నడూ జోడించదు.

మూడు రకాల సమాంతరతలు ఉన్నాయి:

- ఒక వచనం ఒకే విషయాన్నీ రెండు విధాలుగా సెలవిస్తుంది (కీర్తన 25:4, కీర్తన 103:10, సామెతలు 12:28).
- రెండు విషయాలు ఒకదానికొకటి ఎలా భిన్నంగా ఉన్నాయో వచనం చూపిస్తుంది (కీర్తన 37:21, సామెతలు 10:1, 7).
- వచనం ఒక ప్రకటన చేస్తుంది తరువాత ప్రకటనలో వివరాలు ఇస్తుంది (కీర్తన 14:2, కీర్తన 23:1, సామెతలు 4:23).

సమాంతరతలను అర్థం చేసుకుంటున్నప్పుడు, రెండవ మాట మొదటి మాటకు ఏమి జత చేస్తుందని అడగండి. అది మొదటి మాటను బలపరుస్తుందా, మొదటి మాటకు వ్యతిరేకంగా ఉందా, లేక క్రొత్త సమాచారం జోడిస్తుందా? అని చూడండి.

### *అలంకారాలు*

బైబిల్ పుస్తకాలన్నిటిలో అలంకారాలు ఉన్నప్పటికీ, ఇవి కావ్యంలో ముఖ్యమైనవి. హెబ్రీ కావ్యంలో ఉండే అలంకారాలు ఏమనగా:

1. ఏదో ఒక విషయంలో ఒకేలా ఉండే రెండు విషయాల పోలిక: "యెహోవా నా కాపరి" (కీర్తన 23:1).
2. ఒక విషయాన్ని ఉద్ఘాటించడానికి అతిశయోక్తిని ఉపయోగించడం. దావీదు తన దు:ఖాన్ని ఇలా వివరించాడు: "నేను మూలుగుచు అలసియున్నాను ప్రతి రాత్రియు కన్నీరు విడుచుచు నా పరుపు తేలజేయుచున్నాను" (కీర్తన 6:6).
3. ఏదైనా ఒక విషయం మనిషి అయినట్లుగా దానిని గురించి మాట్లాడాడు: "జ్ఞానము వీధులలో కేకలు వేయుచున్నది సంతవీధులలో బిగ్గరగా పలుకుచున్నది" (సామెతలు 1:20).
4. మానవుల లక్షణాలు ఉపయోగించి దేవుని గురించి వివరించడం: "(దేవుడు) ఆయన నరులను కన్నులార చూచుచున్నాడు తన కనుదృష్టిచేత ఆయన వారిని పరిశీలించుచున్నాడు" (కీర్తన 11:4).

కావ్య అలంకారాలను అర్థం చేసుకుంటున్నప్పుడు, సాధారణ మాట ద్వారా మనం అర్థం చేసుకోలేని ఏ విషయాన్ని ఈ చిత్రం చూపిస్తుందని అడగండి. ఉదాహరణకు, "దేవుడు నా యెడల శ్రద్ధ చూపువాడు" అనే మాటకంటే "యెహోవా నా కాపరి" అనే మాట గొప్పది. అది ఆయన శ్రద్ధ గురించి మాట్లాడుతుంది కాని ఆయన ప్రేమ, ఆయన నాయకత్వం, శత్రువుల నుండి ఆయన ఇచ్చే భద్రత, ఆయనకు దూరమైనప్పుడు ఆయన ఇచ్చే క్రమశిక్షణ గురించి కూడా మాట్లాడుతుంది.

## కీర్తనల గ్రంథం

### *కీర్తనల రకాలు*

అనేక రకాల కీర్తనలు ఉన్నాయి. స్తుతి కీర్తనలు, దేవుని గుణాలు, ఆయన ఆశీర్వాదాలు, ఆయన జోక్యం చేసుకోవడాన్ని బట్టి ఆయన్ని ఘనపరుస్తాయి (కీర్తన 23, 29). దేవుని ధర్మశాస్త్రాన్ని గూర్చిన కీర్తనలు, దేవుని జ్ఞానం, ఆయన నీతిని ఘనపరుస్తాయి (కీర్తన 119). దుఃఖ కీర్తనలు, భావోద్వేగాలను దేవునికి తెలియజేస్తూ, ఆయన సహాయం కోరుతూ, ఆయన చిత్తానికి లోబడతాయి (కీర్తన 3, 13, 22). రాజరిక కీర్తనలు, దేవుని ఘనపరచు రాజు ద్వారా దేశానికి వచ్చే ఆశీర్వాదాలను గూర్చి వివరిస్తాయి, ఈ కీర్తనలు రాబోవు మెస్సీయ రాజ్యం గూర్చి కూడా వివరిస్తాయి (కీర్తన 21, 72).

ఆగ్రహ/కోప కీర్తనలు, దుష్టులకు తీర్పు తీర్చి, తన సేవకుల పక్షాన వ్యాజ్యమాడమని దేవునికి మొరపెడతాయి (కీర్తన 69:21-28, కీర్తన 59). ఇతర రకాల కీర్తనలను జాబితా చేయవచ్చు.

***కీర్తనల అన్వయం***

కీర్తనలు గ్రంథాన్ని ఉపయోగించు కొన్ని మార్గాలను క్రొత్త నిబంధన తెలియజేస్తుంది. కీర్తనలు మనం దేవునికి చేసే ఆరాధనను వ్యక్తపరుస్తాయి (ఎఫెసీయులకు 5:19). అవి సిద్ధాంతానికి, ప్రోత్సాహానికి కూడా ప్రయోజనకరం (కొలొస్సయులకు 3:16).

కీర్తనల గ్రంథంలో వ్యక్తపరచిన ప్రతి వైఖరి మనం కలిగి ఉండవలసిన వైఖరికి మాదిరి కాదు. అయితే, ప్రతి వైఖరి దేవునికి అప్పగించుకోవాలని కీర్తనలు నుండి మనం నేర్చుకుంటాం. ప్రార్థనలో, మీరు మీ భావాలను దేవునికి వ్యక్తపరచుకోవచ్చు. నిరుత్సాహం, భయం లేక కోపంతో బాధపడుతున్న విశ్వాసి నమ్మకాన్ని దేవుడు పునరుద్ధరిస్తాడని కీర్తనల గ్రంథం మనకు చూపిస్తుంది.

**సాహిత్య రూపం: జ్ఞాన సాహిత్యం**

యోబు, సామెతలు, ప్రసంగి, కీర్తనలు గ్రంథంలో కొన్ని భాగాలు, యాకోబు పత్రిక జ్ఞాన సాహిత్యంగా పిలువబడే సాహిత్య ప్రక్రియను సూచిస్తాయి. సామెతలు, ప్రసంగి గ్రంథాల్లో, జీవిత సూత్రాలను నేర్చుకునే యువ పాఠకులకు ఉపదేశాలు ఉన్నాయి.

**యోబు గ్రంథం**

యోబు గ్రంథంలోని సుదీర్ఘ వాక్యభాగాలు, యోబుతో పాటుగా వివిధ ఉపదేశకుల మాటలు కలిగియున్నాయి. ఉపదేశకులు వివిధ అభిప్రాయాలు తెలియజేస్తారు. బైబిల్ భాష్యకర్త ఆ ఉపదేశాల్లోని ప్రకటనలు తీసుకుని, వాటిని బైబిల్ సూత్రాలుగా బోధించకూడదు. యోబు గ్రంథం, ఆ ప్రకటనలను దేవుని మాటలతో, ఆయన దృక్పథంతో విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది. యోబు 38-42లో దేవుడు ఉపదేశాలకు స్పందించాడు, యోబు 1-2 కూడా దేవుని దృక్పథాన్ని చూపిస్తుంది.

**సాహిత్య రూపం: సామెతలు**

సామెతలు అంటే, జీవితం గురించి క్లుప్తంగా, స్పష్టంగా చెప్పిన పరిశీలనలు. ఇవి, సాధారణంగా జరిగే విషయాలను తెలియజేస్తాయి కాని, మినహాయింపులు ఉండవని కాదు.

పైపైన చూస్తే, సామెతను అర్థం చేసుకోవడం సులభంగానే అనిపిస్తుంది. అయితే, ఈ సాహిత్య రూపం ఒక ప్రత్యేక సవాలును విసురుతుంది. సామె,త జీవితం గురించి ఒక సాధారణ సూత్రాన్ని ఇస్తుంది, కాని అది ప్రతి పరిస్థితికి వర్తించదు. ఉదాహరణకు, సామెతలు 21:17 ఇలా చెబుతుంది,

> సుఖభోగములయందు వాంఛగలవానికి లేమి కలుగును ద్రాక్షారసమును నూనెయు వాంఛించువానికి ఐశ్వర్యము కలుగదు.

సాధారణ సూత్రంగా, పని కంటే సుఖభోగాన్ని ప్రేమించువారికి పేదరికం కలుగుతుంది. ఈ సాధారణ సూత్రం వాస్తవమే, కాని అనేక మినహాయింపులు ఉన్నాయి. కొందరు ధనవంతులు పని చేయకుండా తమ ధనం సంపాదించుకున్నారు. వారు తినుచు, త్రాగుచూ గడిపారు కాని ధనవంతులయ్యారు. ఇతరులు కష్టపడి పనిచేసి కూడా పేదరికంలో ఉన్నారు. సామెత, సాధారణ సూత్రాన్ని బోధిస్తుందే, కాని సార్వత్రిక సూత్రాన్ని కాదు.

కేవలం సామెతలు గ్రంథంలోనే కాదుగాని బైబిల్ లో అనేక సామెతలు ఉన్నాయి. ఇక్కడ, యేసు మాట్లాడిన ఒక సామెత ఉంది: "కత్తి పట్టుకొను వారందరు కత్తిచేతనే నశింతురు" (మత్తయి 26:52). హింసతో మరణించని హింసాత్మకంగా jeeవించిన వ్యక్తులు ఉన్నారు. మరలా, ఒక సాధారణ పరిశీలనగా సామెత వాస్తవమే, కాని మినహాయింపులు కూడా ఉన్నాయి.

మనం సామెతను భాష్యం చెప్పేటప్పుడు మూడు ప్రశ్నలు అడగాలి:

**(1) ఈ లేఖనంలో బోధించిన సాధారణ సూత్రం ఏంటి?**

సామెతలు 21:17లో కనిపించే సూత్రం, కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ విలువ. అనేక సామెతలు, ఒక పేరాలో వివరించగలిగిన సూత్రాన్ని క్లుప్తంగా వివరిస్తాయి.

**(2) ఈ సూత్రానికి ఏ మినహాయింపులు ఉన్నాయి?**

సామెతలు 21:17 విషయంలో, అనుదిన జీవితంలో మినహాయింపులు మనం చూస్తాం. ఇది సూత్రానికి విరుద్ధంగా లేదు; సాధారణ సూత్రాలకు మినహాయింపులు ఉన్నట్లు బుద్ధిగలవాడు గ్రహించాలని ఇది చూపిస్తుంది

**(3) బైబిల్ లో ఎవరు ఈ సూత్రాన్ని అనుసరిస్తారు?**

సామెతలను అర్థం చేసుకుంటున్నప్పుడు, సామెత సూత్రాన్ని అనుసరించే వ్యక్తిని బైబిల్ లో కనుగొనడం సహాయకరం. ఉదాహరణకు, సామెతలు ఇలా సెలవిస్తుంది, "అహంకారము వెంబడి అవమానము వచ్చును వినయముగలవారి

యొద్ద జ్ఞానమున్నది” (సామెతలు 11:2). నిజ జీవితంలో ఈ సామెత ఎలా వర్తిస్తుందో, సౌలు అహంకారం మరియు దావీదు తన పాపాన్ని బట్టి వినయంతో ఒప్పుకోవడం అనేవి చూపిస్తాయి.

**సామెతలు గ్రంథం**

సామెతల గ్రంథంలో అధిక భాగం సొలొమోను రాశాడు. బుద్ధి కలిగించుట, జ్ఞానంగలవాడు మరింత జ్ఞానం వృద్ధి చేసుకోవడంఈ గ్రంథం యొక్క ఉద్దేశమనే విషయాన్ని సామెతల గ్రంథంలోనే చూస్తాం (సామెతలు 1:4-5).

సామెతల గ్రంథం మూడు రకాల ప్రజలను గురించి మాట్లాడుతుంది. సాధారణ వ్యక్తి పెద్దవాడయ్యాడు కాని జీవాన్ని గూర్చిన అనుభవం, అవగాహన పొందలేదు. సాధారణ వ్యక్తి జ్ఞానం పొంది, తనను నాశనం చేసే తప్పిదాలు నివారించవలసి ఉంది.

దేవుని సూత్రాల ప్రకారం ఎలా జీవించాలో గ్రహించినవాడు బుద్ధిగలవాడు. ప్రజలు జ్ఞానవంతులు కావాలంటే దేవునియందలి భయభక్తులు కలిగియుండాలి (సామెతలు 9:10). బుద్ధిగలవారు నేర్చుకోవడం కొనసాగిస్తారు.

బుద్ధిహీనుడు జ్ఞానాన్ని (దేవుని సూత్రాలు) తిరస్కరిస్తాడు, వినడానికి ఇష్టపడడు. చెడ్డ ప్రవర్తన కలిగినవాడై, తప్పుడు నిర్ణయాలవలన బాధననుభవిస్తాడు. బుద్ధిహీనుడు తెలివితేటలు లేనివాడు కాడుగాని జీవితాన్ని గ్రహించడు ఎందుకంటే అతడు దేవుని నడిపింపును తిరస్కరించాడు.

సామెతలు గ్రంథంలో తరచూ కనిపించే విషయాలు ఏవంటే (1) సోమరితనం వలన కలుగు ప్రమాదం, పని విలువ (2) లైంగిక పాపాల ఫలితంగా కలుగు ప్రమాదాలు, (3) వివిధ సంబంధాల్లో నైతిక ప్రవర్తనలు.

**ప్రసంగి గ్రంథం**

ప్రసంగి గ్రంథాన్ని సొలొమోను రాశాడు (ప్రసంగి 1:1).

ప్రసంగి గ్రంథ సందేశం: కేవలం ఈ ఒక్క జీవితమే ఉంటే, జీవితంలోగాని లేక ఏ గొప్ప సాధనలోగాని న్యాయం లేక ఉద్దేశ్యం ఉండవు.

భూసంబంధమైన జీవితం ప్రజలకు సంతృప్తిని లేక ఉద్దేశ్యాన్ని ఎందుకు ఇవ్వలేదో ప్రసంగి గ్రంథం వివరిస్తుంది. ఈ జీవితంలో:

- న్యాయం విస్మరించబడతారు.
- అందరు చనిపోతారు, మర్చిపోబడతారు.

- దుష్టులు వర్ధిల్లుతారు.
- జ్ఞానం బలమైనది కాని త్రుణీకరించబడుతుంది.
- బుద్ధి, జ్ఞానం దుఃఖాన్ని వృద్ధి చేస్తాయి.

నిత్యత్వ దృక్పథంతో జీవించు వ్యక్తి ఇలా ఉంటాడని ప్రసంగి చూపిస్తాడు:

- అనందంగా ఉంటాడు కాని, జీవిత విషయాలను తీవ్రంగా పరిగణిస్తాడు.
- మరణం సంభవిస్తుందని జ్ఞాపకం చేసుకుంటాడు.
- మంచివాటిని ఆస్వాదించి, ఆనందిస్తాడు కాని దేవునికి లెక్క అప్పజెప్పుతాడు.
- భూసంబంధమైన లక్ష్యాలకు ప్రాముఖ్యత ఇవ్వడు.

సొలొమోను ఈ ఫలితార్థానికి వచ్చాడు: తీర్పు ఉంది గనుక, యవ్వన ప్రాయం నుండే దేవునియందు భయభక్తులు కలిగి, ఆయన కట్టడల ననుసరించి నడుచుకోవాలి.

### సాహిత్య రూపం: పాత నిబంధన ప్రవచనం

పాత నిబంధన ప్రవచన గ్రంథాలు, ప్రసంగించిన సందేశాల సంకలనాలు. 16మంది ప్రవక్తల సందేశాలు లేఖనాల్లో ఉన్నాయి. కేవలం యిర్మీయా కు రెండు పుస్తకాలు ఉన్నాయి. కొందరు ప్రవక్తలు రాసిన పుస్తకాలు లేఖనాల్లో లేవు (1 దినవృత్తాంతములు 29:29). మనకు చెప్పినంతవరకు, వందలాది ప్రవక్తలు అసలు ఏమి రాయలేదు.

క్రీ.పూ. 760-460 మధ్యకాలంలో 16మంది ప్రవక్తలు పరిచర్య చేశారు (ఇశ్రాయేలు 722లో పతనమైంది. యూదా 587లో పతనమైంది.) చరిత్రలోని ఈ కాలంలో, అనేక రాజ్యాల ఆరంభం, పతనాలు ఇశ్రాయేలును రాజకీయంగా, ఆర్థికంగా, మతపరంగా ప్రభావితం చేశాయి. కొన్ని సందర్భాల్లో, ఇశ్రాయేలు యూదా రాజ్య ప్రజలు అనేకమంది, దేవుని నిబంధనను మీరి విగ్రహారాధన చేశారు.

ప్రవక్తలు దేవుని నిబంధన పక్షాన వాదించారు. వీరు దేవుడు కోరే వాటిని ప్రజలకు జ్ఞాపకం చేశారు. సంవత్సరాల క్రితం, ఇశ్రాయేలు చూపే విధేయత లేక అవిధేయత ఆధారంగా ఆశీర్వాదాలు లేక శాపాలు వస్తాయని దేవుడు వాగ్దానం చేశాడు (లేవీయకాండము 26, ద్వితీయోపదేశకాండము 28-32). ఆ వాగ్దానాల నెరవేర్పు గురించి ప్రవక్తలు ప్రవచించారు. విధేయతకు వాగ్దానం చేసిన ఆశీర్వాదాలలో జీవం, ఆరోగ్యం, అభివృద్ధి, వ్యవసాయ సమృద్ధి, స్వేచ్ఛ, భద్రత మొదలగునవి భాగంగా ఉంటాయి. అవిధేయతకు వాగ్దానం చేసిన శాపాలలో మరణం, రోగం, కరువు, ఇళ్ళు, పట్టణాల

నాశనం, యుద్ధంలో అపజయం, చెర, స్వేచ్ఛను కోల్పోవడం, పేదరికం మరియు అవమానం మొదలగునవి భాగంగా ఉంటాయి.

**ప్రవచనం అంటే, దేవుని నుండి వచ్చు సందేశ సమాచారం.** ప్రవచనం అంటే, ప్రస్తుత పరిస్థితి గురించి మాట్లాడి, ప్రసంగించి, వెంటనే స్పందించాలని పిలుపు ఇవ్వటం. ప్రవక్తల సందేశాల్లో తరచు జరుగబోవు వాటిని ముందుగా తెలియజేసేవారు. అయితే, ప్రవక్త ఒక ప్రసంగికుడు. అతని సందేశంలో జరుగబోవు వాటి గురించి చెప్పినా లేక చెప్పకపోయినా, అతని సందేశం ప్రవచనాత్మకమే.

అనేక సందర్భాల్లో, ప్రవచనంలోని మాటలు ఎప్పుడు ఎలా నెరవేరాయో కూడా మనకు తెలియదు. ఆ వాక్యభాగాలలో నుండి నేర్చుకుంటున్నప్పుడు అది మనకు తెలియవలసిన అవసరం లేదు. తరచు ఆ నెరవేర్పు, ప్రవక్త జీవితకాలంలో లేక తన శ్రోతల కాలంలో జరుగదు, అయినప్పటికీ అతని సందేశం తక్షణ అన్వయింపు, ప్రతిస్పందన కోసం ప్రకటించబడింది. ప్రజలు ప్రస్తుత కాలంలో పశ్చాత్తాపపడి, దేవునికి విధేయత చూపటానికి, ప్రవక్తలు భవిష్యత్ దేవుని రాజ్యాన్ని కారణంగా చూపించారు (హబక్కూకు 2:14).

ప్రవక్తల సంభాషణ మరియు దృష్టాంతాల పద్ధతులు తరచు అసాధారణంగా, నాటకీయంగా ఉంటాయి. వారి సందేశాల్లో అలంకార రూపకాలు ఉపయోగించేవారు, మరికొన్నిసార్లు భౌతికంగా చేసి చూపించేవారు. **అయితే, ప్రజలు క్రొత్తగా, అసాధారణంగా ఏదో చేయాలని వారు ప్రసంగించలేదుగాని, దేవుని ధర్మశాస్త్రానికి విధేయత చూపాలని ప్రసంగించారు.**

ప్రజలను తిరిగి నిబంధనలోకి (దేవునితో వారి సంబంధం) ఆకర్షించిన ప్రవక్తల ప్రసంగాలు, దేవుని నిబంధనలోకి మనలను తిరిగి ఆకర్షించే విధంగా నేడు ప్రసంగించవచ్చు.

ముందుగా చెప్పుట/అంచనా (భవిష్యత్తులో జరుగబోవు సంఘటనలు) తక్షణ ప్రభావం కోసం ఉద్దేశించబడింది. ప్రజలు పశ్చాత్తాపపడి, దేవునికి విధేయత చూపుటకు పిలువబడ్డారు. ఈ ఉద్దేశ్యం నేడు ప్రసంగ ఉద్దేశ్యానికి దగ్గరగా ఉంది.

కొన్ని ప్రవచనాలు షరతులతో కూడి ఉంటాయి. శ్రోతలు మారుమనస్సు పొందడం ద్వారా, ప్రకటించిన తీర్పును తప్పించుకోగలరు (యిర్మీయా 18:7-11, యిర్మీయా 26:13-19). యోనా సందేశం కనికరాన్ని అందించనప్పటికీ, నీనెవెలోని యోనా శ్రోతలు నాశనాన్ని తప్పించుకున్నారు (యోనా 3:4-5, 9-10).

దేవుని తుది ఉద్దేశ్యాల నెరవేర్పు షరతులతో కూడినది కాదు; ఉదాహరణకు, యెషయా 43:5-6 లో, తన స్వశక్తి చేత ఇశ్రాయేలును చెరలో నుండి విడిపిస్తానని దేవుడు వాగ్దానం చేశాడు, కాని వాక్యభాగంలో ఇశ్రాయేలు నెరవేర్చవలసినవి ఇవ్వలేదు. ఇంకనూ, ఈ సంఘటనలలో ఒకరి సొంత ఎంపికలు ఒకరి స్థానాన్ని నిర్ణయిస్తాయి.

ప్రవచన గ్రంథాల్లో చారిత్రక కథనాలు ఉన్నాయి కాని ఉపదేశాలు కావ్య రూపాలు ఉన్నాయి. అక్షరార్థంగా అర్థం చేసుకోవలసిన చారిత్రక కథనాలకు మరియు చిహ్నాలు గల కావ్య వాక్యభాగాలకు మధ్య తేడా కనుగొనటం అంత కష్టమైన పని కాదు.

**ప్రవక్తల గ్రంథాల్లో ముఖ్యమైన పదాలు, భావాలు**

**విగ్రహారాధన**: నిబంధన యొక్క ప్రాథమిక ఉల్లంఘన

**వ్యభిచారం**: తరచు విగ్రహారాధనతో కూడిన పాపం, విగ్రహారాధనను సూచించడానికి అలంకార రూపకంగా ఉపయోగించబడుతుంది.

**రాజ్యాలు**: దేవుని నిబంధనలో లేని లోకాన్ని సూచిస్తుంది. రెండు ఉప-భావాలు:

1. రాజ్యాలు ఎల్లప్పుడు ఇశ్రాయేలుకు విరోధంగా ఉంటాయి.
2. ఇశ్రాయేలు రాజ్యం, ఇతర రాజ్యాల మధ్య తనను ఘనపరచాలని దేవుడు ఆశించాడు.

**దేవాలయం**: దేవుని సన్నిధికి కేంద్రం. రెండు ఉపభావాలు:

1. వేషధారణతో చేసే ఆరాధన దేవునిని అవమానిస్తుంది.
2. శత్రువులు దేవాలయాన్ని ఆక్రమించుకోవడం, ఇశ్రాయేలు పూర్తి ఓటమిని, దేవుని సన్నిధిని కోల్పోవడాన్ని చూపిస్తుంది.

**భూమి/స్వాస్థ్యం**: దేవుడు ఇశ్రాయేలీయులను ఆశీర్వదించే ప్రత్యేక స్థలం.

**చెర**: దేవుడు అనుగ్రహించిన స్థలం నుండి ఇతర రాజ్యాలకు బానిసత్యం. చెర అంటే ఇశ్రాయేలు దేవుని ఆశీర్వాదాన్ని కోల్పోయిందని అర్థం.

**వర్షం** (సంబంధిత పదాలు): దేవుడు ఇశ్రాయేలీయులకు అనుగ్రహించిన స్థలంలో ఆయన నిరంతర ఆశీర్వాదాలకు సూచన. వర్షం లేకపోవటం, దేవుని అసమ్మతిని సూచిస్తుంది.

**పంట** (సంబంధిత పదాలు): వర్షం, భూమికి సంబంధించిన దేవుని ఆశీర్వాదాలు.

**యెహోవా దినం**: భవిష్యత్తు, దుష్టులను నాశనం చేసే దేవుని ఆకస్మిక తీర్పు. తీర్పు ఇతర రాజ్యాలకే అని భావించిన ఇశ్రాయేలీయులు, వారికి కూడా తీర్పు ఉందని విని భయపడ్డారు.

**గుర్రాలు:** సైనిక దళాన్ని సూచిస్తాయి

**ఐగుప్తు నుండి విడుదల**: ఇశ్రాయేలును ఒక రాజ్యంగా చేసి, దేవునిని వారి రాజుగా చేసిన చారిత్రక సంఘటన. విగ్రహారాధన, విడుదల తరువాత ఏర్పడిన నిబంధనను అవమానించింది.

**ప్రవచన సాహిత్యాన్ని అర్థం చేసుకొనుట**

ప్రవచనాత్మక సాహిత్యం, అర్థం చేసుకోవడానికి అత్యంత కష్టమైన సాహిత్య రకాలలో ఒకటి. ప్రవచనాత్మక సాహిత్యాన్ని ప్రభావవంతంగా అర్థం చేసుకోవాలంటే, ఈ ప్రశ్నలు అడగండి:

**(1) ప్రవక్త తన సమాజానికి ఏమి చెప్పాడు?**

సుప్రసిద్ధ అభిప్రాయానికి భిన్నంగా, ప్రవచనాత్మక సాహిత్యం కేవలం భవిష్యత్ ప్రవచనాలను గూర్చినదే కాదు. ప్రవక్త మొదట తన సమాజంతో మాట్లాడాడు.

ఉదాహరణకు, ఆమోసు దేవునికి అవిధేయులైన ఇశ్రాయేలుకు రాశాడు. ప్రజలు సంపన్నులై, దేవుని ధర్మశాస్త్రాన్ని విడిచిపెట్టిన యెడల ఎలాంటి పర్యవసానాలు ఉండవని భావించారు. ఆమోసు తీర్పు సందేశం ప్రకటించాడు: న్యాయాన్ని, నీతిని విడిచిపెట్టినందున ఇశ్రాయేలు తీర్పుకు గురౌతుంది (ఆమోసు 5:7).

**(2) అతని సందేశానికి ప్రజలు యేమని స్పందించారు?**

ఆమోసు సందేశానికి ఇశ్రాయేలు స్పందన, బేతేలులో ప్రధాన యాజకుడైన అమజ్యా సమాధానంలో కనిపిస్తుంది. యూదాకు తిరిగి వెళ్లి, ఇకమీదట ఉత్తర రాజ్యంలో ప్రకటించకూడదని అతడు ఆమోసు కు ఆజ్ఞాపించాడు. (ఆమోసు 7:10-13).

**(3) ప్రవక్త సందేశంలో ఏ సూత్రం నేటి సమాజానికి వర్తిస్తుంది?**

ప్రాచీన ఇశ్రాయేలులో నీతి న్యాయాలు దేవుని ప్రజలకు ప్రామాణికంగా ఉన్నట్లే, దేవుడు తన ప్రజల నుండి నేడు నీతి న్యాయాలు కోరుతున్నాడు. నీతిగా జీవించాలనే దేవుని పిలుపును విస్మరించి, దేవుని ఇంటిలో మనం ఆరాధించలేం. (ఆమోసు 5:22-24).

ఈ ప్రశ్నలు ప్రవక్త సమాజంలో నుండి ప్రవచన సత్యాన్ని తీసుకొచ్చి, నేటి సమాజానికి వర్తింపజేస్తాయి. ప్రవక్త సమాజాన్ని చూడడం ద్వారా, నేడు మనం చేసే భాష్యం వాస్తవిక సందేశంపై ఆధారితమైనదని నిశ్చయించుకుంటాం.

## సాహిత్య రూపం: అంత్యకాల సంభవాల సాహిత్యం

అంత్యకాల సంభవాలను గురించిన లేఖనాల్లో దానియేలు, జెకర్యా, యోవేలు, ప్రకటన, మరియు బైబిల్ లో ఇతర పుస్తకాలలోని వాక్యభాగాలు ఉన్నాయి.

అంత్యకాల సంభవాలకు సంబంధించిన పుస్తకాల రచయితలు తమ సందేశాన్ని దర్శనం లేక కలలో పొందుకున్నారు. ఇది ఎక్కువ శాతం సాదృశ్యాత్మకమైనది. ఇది జంతువుల్ని లేక వింతైన, క్రూర మృగాల్ని చిహ్నాలుగా ఉపయోగిస్తుంది.

సంఘటనల్ని కాలక్రమానుసారంగా ఉపయోగించడానికి బదులుగా ప్రతి ఒక్క దాని గురించి మాట్లాడేటప్పుడు వేర్వేరు వివరణలు ఇస్తూ ఒకే సంఘటన/సందర్భం గురించి పదే పదే మాట్లాడతాయి.

సాధారణంగా ఒక లేఖనభాగాన్ని అర్థం చేసుకోవాలంటే, రచయిత ఆ లేఖనభాగాన్ని అలంకార రూపకంగా ఉద్దేశిస్తే తప్ప, దానిని అక్షరార్థంగా తీసుకోవాలి. అంత్యకాల సంభవాల సాహిత్యంలో, రచయిత అనేక విషయాల్ని అలంకార రూపకాలుగా ఉండాలని ఉద్దేశించాడని భాష్యకర్త అర్థం చేసుకోవాలి. అలంకారిక వర్ణనలకు ఉదాహరణలు, దానియేలు దర్శనాల్లోని జంతువులు, క్రూర మృగాలు.

- జంతు చిహ్నాలకు ఉదాహరణలు: దానియేలు 7:3-7, ప్రకటన 12:3, ప్రకటన 16:13, మరియు జెకర్యా 6:1-3.

అంత్యకాల సంభవాలను గురించిన రచనలు సాధారణంగా, ప్రస్తుత చెడు, అన్యాయపు లోకంలో విశ్వాసాన్ని కాపాడుకునే సవాళ్లతో వ్యవహరిస్తుంది. తీవ్రమైన సార్వత్రిక యుద్ధాన్ని వివరిస్తుంది.

బైబిల్ లో అంత్యకాల సంభవాలను గురించిన రచనలు, చెడును శిక్షించి మంచికి ఫలమిచ్చే దేవుని అంతిమ విజయాన్ని చూపిస్తాయి. తన ప్రజలకు సహాయం చేసే సార్వభౌమ దేవునిపై దృష్టిపెడతాయి.

అంత్యకాల సంభవాలను గురించిన రచనలో, చిహ్నాలన్నిటిని అర్థం చేసుకోలేకపోయినా, చెప్పిన సంఘటన కాలక్రమాన్ని భాష్యకర్త ఏర్పాటు చేయలేకపోయినా, ప్రధాన సందేశాన్ని అర్థం చేసుకోగలం.

- గొప్ప, తుది యుద్ధాన్ని వివరించే వాక్యభాగాల ఉదాహరణకు: యోవేలు 2:9-11, ప్రకటన 19:11-21, మరియు ప్రకటన 20:7-9.
- తుది విజయం, దేవుని నిత్య రాజ్యం గురించి బోధించే వాక్యభాగాల ఉదాహరణలు: దానియేలు 7:14, 27 మరియు జెకర్యా 14:9.

అంత్యకాల సంభవాలను గురించిన పుస్తకాలతో పాటుగా, ఇతర కొన్ని వాక్యభాగాల్ని కూడా అంత్యకాల సంభవాల రచనలుగా పరిగణించవచ్చు. ఎందుకంటే దేవుడు అకస్మాత్తుగా జోక్యం చేసుకుని దుష్టశక్తులకు తీర్పుతీర్చి నీతిమంతుల్ని విడిపిస్తాడని అవి చెబుతాయి. ఈ లేఖనభాగాల్లో దర్శనాలు, లేక జంతువులు వంటి అంత్యకాల సంభవాల రచనలోని ఇతర లక్షణాలు ఉండవు. (ఉదాహరణలు ఏవనగా, యెహెజ్కేలు 37-39, యెషయా 24-27, మత్తయి 24, మార్కు 13, లూకా 21, 2 థెస్సలొనీకయులకు 2, మరియు 2 పేతురు 3.)

**అంత్యకాల సంభవాలను గురించిన లేఖనాల సాధారణ అన్వయం**

ప్రపంచ సమస్యకు అంతిమ పరిష్కారం సంస్కృతి లేక సాంఘిక పురోగతి కాదు. రాజకీయ సంస్కరణ లేక విప్లవం కాదు. దేవుడు జోక్యం చేసుకోవడమే పరిష్కారం. ప్రస్తుతం ఆయన తన ప్రజలకు విశ్వాసం, బలం, దయ అనుగ్రహిస్తున్నాడు. భవిషత్తులో ఆయన అకస్మాత్తుగ వచ్చి, లోకమంతటినీ పూర్తిగా మార్చేస్తాడు.

విశ్వాసులు విశ్వాసంతో సహించాలి. సంపూర్ణ దేవుని ప్రణాళిక లేక లోక సంఘటనలు గురించి ప్రస్తుత అవగాహన అవసరం లేదు. విశ్వాసం కలిగి ఉండడం అంటే ప్రజలు తక్షణ ఫలితాల్ని అంచనా వేయగలరని కాదు. బదులుగా, నిజమైన విశ్వాసం గల ప్రజలు, ప్రతి పరిస్థితిలోనూ దేవునిపట్ల విధేయత చూపుతారు, ఎందుకంటే చివరకు విధేయత విలువైనదని వారికి తెలుసు.

**సాహిత్య రూపం: ఉపమానం**

ఉపమానం అనగా ఆత్మీయ సత్యాన్ని ప్రకృతి విషయాలతో లేక జీవన పరిస్థితులతో పోల్చే బోధనా సాధనం. ఆత్మీయ సత్యానికి, సహజ సత్యానికి మధ్య సారుప్యతను చూపిస్తారు తద్వారా మనం ఆత్మీయ సత్యాన్ని మరింత బాగా అర్థం చేసుకోగలుగుతాం.

యేసుకు ఉపమానాలు బోధించడం అంటే ఎంతో ఇష్టం (మత్తయి 13:34). ఆయన 30 ఉపమానాలు చెప్పాడు, ఇతర అనేక అలంకార రూపక సమాంతరాలు ఉపయోగించాడు.

ఉపమానాల ద్వారా, యేసు ప్రార్థన గురించి (దేవాలయంలో పరిసయ్యుడు, సుంకరి, లూకా 18:9-14), మన పొరుగువాళ్లని ప్రేమించడం గురించి (మంచి సమరయుడు, లూకా 10:29-37), దేవుని రాజ్య స్వభావం గురించి (మత్తయి 13 ఉపమానాలు), పాపులకు దేవుని కనికరం గురించి (తప్పిపోయిన కుమారుడు, లూకా 15:11-32) బోధించాడు.

తన శ్రోతలను సూటిగా నిందించకుండా, గద్దించడానికి ఉపమానాలు యేసుకు సహాయపడ్డాయి. యేసు చెప్పిన ఉపమానాలు ఆసక్తికరంగా ఉండటం వలన, అవి యేసు శ్రోతలు ఆయన మాటలు వినేలా చేశాయి. అకస్మాత్తుగా వారు "ఆయన నా గురించి మాట్లాడుతున్నాడు" అని గ్రహించి ఆశ్చర్యపోయారు. దావీదు గురించి పేదవాని గొర్రె ఉపమానం చెప్పినప్పుడు ప్రవక్తయైన నాతాను కూడా ఇదే చేశాడు (2 సమూయేలు 12:1-10). “ఆ మనుష్యుడవు నీవే,” అని నాతాను చెప్పినప్పుడు, ఆ ఉపమానం తన గురించే అని దావీదు తెలుసుకున్నాడు.

**ఉపమానాలను అర్థం చేసుకోవడం**

భాష్యకర్త ఇవి గమనించాలి:

- ఉపమానం ఎలా పరిచయం చేశారు?
- ఉపమానం ముగింపు ఏంటి?
- ఉపమానం ఎలాంటి సమాధానాన్ని లేక వైఖరిలో ఎలాంటి మార్పును కోరుతుంది?
- మొదటి శ్రోతల ప్రతిస్పందన ఏమై ఉంటుంది?

**(1) ఉపమానాన్ని ఎలా పరిచయం చేశారు?**

యేసు తరచు ఒక ప్రశ్నకు లేక వైఖరికి సమాధానంగా ఉపమానాలు చెప్పాడు. ఉపమానం ఏ పరిస్థితిలో తెలుసుకోవడం, దాని సందేశం అర్థం చేసుకునే విషయంలో భాష్యకర్తకు సహాయపడుతుంది.

మన ఉపమాన భాష్యం, యేసు ఆ ఉపమానం చెప్పడానికి కారణమైన సంభాషణ లేక పరిస్థితికి వ్యక్తిరేకంగా ఉంటే, మనం దాని అర్థాన్ని సరిగా గ్రహించనట్లే.

**ప్రశ్నకు సమాధానంగా ఉపమానాలు**. సంభాషణ సమయంలో, “నా పొరుగువాడెవడని**?”** ధర్మశాస్త్రోపదేశకుడు యేసును అడిగాడు. “నువ్వెళ్ళే దారిలో అవసరతలో ఉన్న నీ పొరుగువాడు-నీ బాధ్యత” అని యేసు సూటిగా చెప్పొచ్చు. బదులుగా, మంచి సమరయుడు కథ ద్వారా, యేసు పరోక్షంగా జవాబు చెప్పాడు.

అగస్టీన్, ఉపమానం ఏ ప్రశ్నకైతే జవాబిచ్చాడో దానిని నిర్లక్ష్యం చేశాడు గనుక తప్పుగా అర్థం చేసుకున్నాడు. ఇది అగస్టీన్ ఇచ్చిన వివరణ: యేసు (సమరయుడు) ఆదాముని (మనుష్యుడు) సాతాను (దొంగలు) నుండి విడిపించి, అతన్ని భద్రత కోసం సంఘానికి (సత్రం) తీసుకెళ్లాడు. యేసు పాపాన్ని కట్టిపడేయడానికి (గాయాలు) పొలుకు (సత్ర యజమాని) రెండు దేనారాలు (ఈ జీవం, రాబోవు జీవం గురించిన వాగ్దానాలు) ఇచ్చాడు. అగస్టీన్ భాష్యం, యేసు మరియు ధర్మశాస్త్రోపదేశకునికి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించినది కాదు గనుక అది తప్పు.

**వైఖరికి సమాధానంగా ఉపమానాలు.** లూకా 15:1-3 ఇలా సెలవిస్తుంది, "ఒకప్పుడు సమస్తమైన సుంకరులును పాపులును ఆయన బోధ వినుటకు ఆయన దగ్గరకు వచ్చుచుండగా పరిసయ్యులును శాస్త్రులును అది చూచి–ఇతడు పాపులను చేర్చుకొని వారితోకూడ భోజనముచేయుచున్నాడని చాల సణుగుకొనిరి. అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను":

- ఒక కాపరి గొర్రె తప్పిపోయింది. గొర్రె దొరికినప్పుడు అతడు ఎంత ఆనందించాడో చూడండి.
- ఒక స్త్రీ నాణెం పోయింది. నాణెం దొరికినప్పుడు ఆమె ఎంత ఆనందించిందో చూడండి.
- ఒక తండ్రి, కుమారుడు తప్పిపోయాడు. కుమారుడు దొరికినప్పుడు అతడు ఎంత ఆనందించాడో చూడండి.

ఈ మూడు ఉపమానాల ద్వారా, యేసు చెప్పిన విషయం ఏంటంటే, "నేను పాపులతో తింటున్నానని మీరు ఆశ్చర్యపోవద్దు. ఒక్క పాపి మారుమనసు పొందినప్పుడు పరలోకంలో ఎంత ఆనందమో చూడండి."

**ఉపమానంలోని ప్రధాన పాఠం, దాన్ని ప్రేరేపించిన ప్రశ్న లేక పరిస్థితికి నేరుగా సంబంధించినదని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం.**

**(2) ఉపమానం ముగింపు ఏంటి? ఉపమానం ఎలాంటి సమాధానాన్ని లేదా వైఖరిలో ఎలాంటి మార్పును కోరుతుంది?**

వేర్వేరు అన్వయాలు సాధ్యమైనప్పటికీ, ఉపమానం సాధారణంగా ఒక ప్రధాన విషయాన్ని తెలియజేస్తుంది. ఉపమానంలో ఉన్న ప్రతి ప్రధాన పాత్ర ఒక పాఠాన్ని ఉదహరిస్తుంది.

తప్పిపోయిన కుమారుడు ఉపమానంలో ప్రధాన పాఠం ఇప్పటికే మనం చూశాం: మారుమనస్సు పొందే ఒక్క పాపి విషయమై పరలోక మందు ఎక్కువ సంతోషం కలుగుతుంది. ఈ ప్రధాన విషయం, యేసు ఉపమానాన్ని ప్రేరేపించిన పరిస్థితికి సమాధానం: పరిసయ్యులు పాపుల్ని క్షమించడానికి ఇష్టపడకపోవడం. మూడు పాత్రల్లో ప్రతి ఒక్కటి ప్రధాన విషయానికి సంబంధించి నేరుగా ఒక పాఠాన్ని బోధిస్తుంది.

| పాత్ర | పాఠం |
|---|---|
| **తప్పిపోయిన కుమారుడు** | పశ్చాత్తాపంతో దేవుని వైపు తిరిగిన పాపులకు క్షమాపణ దొరుకుతుంది. |
| **ప్రేమగల తండ్రి** | క్షమించడానికి ఇష్టపడకుండా ఉండక, మన పరలోకపు తండ్రి క్షమించడంలో సంతోషిస్తాడు. |
| **అన్నయ్య** | క్షమించని వ్యక్తికి తండ్రివంటి ప్రేమ ఉండదు. |

యేసు క్షమించలేని అన్నయ్యకు క్షమించే తండ్రికి మధ్య వ్యత్యాసాన్ని వివరించాడు. క్షమించలేని పరిసయ్యులను గద్దించడం యేసు ఉద్దేశ్యం. వాళ్ల తప్పుడు వైఖరుల్ని బట్టి వాళ్లు మారుమనసు పొందాలని ఆయన ఆశించాడు.

ఈ ఉపమానం నుండి ప్రకటించే ఎవ్వరైనా, పాపిని పశ్చాత్తాపపడమని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో తండ్రి ప్రేమ, క్షమాపణను నొక్కి చెప్పాలి. లేక విశ్వాసులు అవిశ్వాసుల పట్ల దేవుని క్షమాపణ వైఖరి చూపించాలని ప్రకటించాలి.

**(3) వాస్తవిక శ్రోతల ప్రతిస్పందన ఏమై ఉంటుంది?**

ఉపమానం మొదటి శ్రోతల్ని ఎలా ప్రభావితం చేసిందో అర్థం చేసుకోవాలంటే, వాళ్ల సంస్కృతిని అర్థం చేసుకోవాలి. యేసు ఉపమానాలు తరచూ ఆయన సంస్కృతి నియమాలకు విరుద్ధంగా ఉన్నాయి. దీని వల్ల వాళ్లు ఆశ్చర్యపోయారు.

ఉదాహరణకు, మళ్ళీ తప్పిపోయిన కుమారుని ఉపమానం చూడండి. కుమారుడు తన ఆస్తిని ముందుగానే అడగడం అవమానకరమైన కార్యంగా యేసు శ్రోతలు పరిగణించి ఉంటారు. ఆ తర్వాత కుమారుడు దాన్ని వృథా చేశాడు. కుమారుడు తిరిగి వచ్చినప్పుడు, తండ్రి అతన్ని తిరస్కరిస్తాడని, చూడడానికి ఇష్టపడడని, అతన్ని కొట్టి పంపించేస్తాడని శ్రోతలు అనుకున్నారు. కుమారుడ్ని ఆహ్వానించడానికి తండ్రి పరిగెత్తుకుని వెళ్లినప్పుడు శ్రోతల ఆశ్చర్యం ఒక్కసారి ఊహించుకోండి.

మంచి సమరయుడు ఉపమానంలో, యాజకుడు లేవీయుడు గాయపడ్డ వ్యక్తిని పట్టించుకోకుండా వెళ్లిపోవడం శ్రోతలకు ఆశ్చర్యంగా లేదు ఎందుకంటే వాళ్లు దేవాలయ అధికారుల్ని అవినీతిపరులుగా, వేషధారులుగా పరిగణించారు. వాళ్లు పరిసయ్యుల్ని గౌరవించారు, సహాయం చేసిన మూడవ వ్యక్తి పరిసయ్యుడు అనుకున్నారు. మూడవ వ్యక్తి జాతిని బట్టి, మతపరమైన హోదా లేకపోవడం వల్ల తృణీకరించబడిన సమరయుడు అని వినగానే వాళ్ల ఆశ్చర్యం ఒక్కసారి ఊహించండి.

ఉపమానం యొక్క సాంస్కృతిక నేపథ్యం పరిగణలోకి తీసుకున్నప్పుడు, సందేశాన్ని మరింత తేటగా చూడగలుగుతాం.

**ఉపమానాలలో వివరాలు, సాదృశ్యాలు**

ప్రతి ఉపమానంలోని ప్రతి వివరణ సాదృశ్యాత్మకంగా ఉందని కొందరు ప్రసంగికులు అపార్థం చేసుకుంటారు. ఉదాహరణకు, మంచి సమరయుడు ఉపమానం గురించి, ప్రయాణికుడు యెరూషలేము నుండి యెరికోకి వెళ్లుతున్నప్పుడు, ఆ పట్టణం దేవుడు శపించింది కాబట్టి అది తప్పుడు నిర్ణయమని కొందరు భావిస్తారు. ఉపమాన ఉద్దేశ్యం, ఒక వ్యక్తి పొరుగువారిని ఎలా ప్రేమించగలడు అనే విషయాన్ని వివరించడం కాబట్టి ఇది మంచి భాష్యం కాదు. దీనిలో ఉన్న వివరాలు దేనికీ చిహ్నాలు కావు.

మార్కు 4:30-32లోని ఉపమానంలో, చెట్టులో పక్షులు దేనిని సూచిస్తున్నాయో ప్రసంగికులు భావించారు, కాని పక్షులను గురించిన ప్రస్తావన ఒక చిన్న విత్తనం పెరిగి పెద్దదై, పక్షులు కొమ్మల మీద కూర్చోడానికి వీలు కలిగిస్తుందని మాత్రమే సూచిస్తుంది.

తప్పిపోయిన కుమారుని ఉపమానంలో, సాదృశ్యపరమైన అర్థం కనుగొనడానికి ఎటువంటి ఆధారం లేదు. ఉదాహరణకు, పందులు సాదృశ్యాలు కాదు. కుమారుని దరిద్ర స్థితిని సూచించడానికి పందులను ప్రస్తావించారు: యూదుడైన బాలుడు సాధారణంగా పందులకు దగ్గరగా ఉండడు.

ఉపమాన విషయాలు సాదృశ్యాత్మకంగా ఉండడం అరుదు. ఉపమానంలో సాదృశ్యాత్మకమైన వివరణకు ఒక ఉదాహరణ, గురుగులు మరియు గోధుమల ఉపమానం (మత్తయి 13:38-39). ఈ ఉపమానంలోని వివరాలు సాదృశ్యాత్మకమని మనకు తెలుసు ఎందుకంటే యేసు ప్రత్యేకంగా వాటి గురించి చెప్పాడు.

**ఉపమానాలను ప్రసంగించడం**

ఒక ప్రసంగికుడు ఉపమానాన్ని తన సంస్కృతిలో సుపరిచితమైన పరిస్థితి కోసం తీసుకోవచ్చు. అయితే, ఆ ఉపమానం మొదటి శ్రోతలకు ఎలా వర్తిస్తుందో అర్థం చేసుకోవడానికి సమయం కేటాయించాలి. లేని యెడల, అతడు అదే సందేశాన్ని తన శ్రోతలకు ఇవ్వలేడు.

ఒక భాష్యకర్త ఒక ఉపమానాన్ని ఇతర స్పష్టమైన లేఖనాల మద్దతులేని సిద్ధాంతానికి లేదా అన్వయానికి ఆధారంగా ఉపయోగించకూడదు.

## సాహిత్య రూపం: పత్రిక

**పత్రికల లక్షణాలు**[24]

క్రొత్త నిబంధన పుస్తకాల్లో ఎక్కువగా పౌలు, యాకోబు, పేతురు, యోహాను మరియు యూదా రాసిన పత్రికలు ఉన్నాయి. అయితే పత్రిక మధ్య వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, కొన్ని లక్షణాలు సాధారణమైనవి. క్రొత్త నిబంధన పత్రికలు ఏవంటే:

1. **అధికారికమైనవి**. క్రొత్త నిబంధన పత్రికలు రచయిత ఉనికికి ప్రత్యామ్నాయం. పత్రిక రచయిత అధికారాన్ని సూచిస్తుంది; ఈ అధికారాన్ని ఎల్లప్పుడు ఆరంభ వచనాల్లో పేర్కొంటారు.[25]

2. **పరిస్థితికి సంబంధించినవి**: క్రొత్త నిబంధన పత్రికలు ఎల్లప్పుడు నిర్దిష్ట పరిస్థితులు లేక సమస్యలు గురించి మాట్లాడతాయి. ఉదాహరణకు, రక్షణ యూదుల ఆచారాల్ని అనుసరించడం ద్వారా వస్తుందని ఆలోచిస్తున్న సంఘానికి గలతీ పత్రికను రాశారు. క్రీస్తులో మన స్వాతంత్ర్యం గురించి పౌలు నొక్కి చెప్పాడు. దీనికి భిన్నంగా, కొరింథీ సంఘం ఆ స్వేచ్ఛను తీవ్రంగా తీసుకుని- లైంగిక అనైతికతను సహిస్తుంది. 1 కొరింథీయులకు రాసిన పత్రికలో, మనం విధేయులముగా ఉండాలని పౌలు నొక్కి చెప్పాడు.

3. **విశ్వాసులకు ఉద్దేశించబడ్డాయి.** పత్రికలు, ప్రాంతీయ సంఘాలకు (రోమా) లేక వ్యక్తిగత విశ్వాసులకు (ఫిలేమోనుకు) లేక సాధారణ విశ్వాసులకు (యూదా) రాశారు. పత్రికలు పొందిన వాళ్లందరూ దేవునితో రక్షణ సంబంధంలో ఉన్నవాళ్ళు కాదు. తమ క్రియలు మార్చుకుని మారుమనస్సు పొందాలని పౌలు కొరింథీ విశ్వాసులకు పిలుపునిచ్చాడు; సువార్త వైపు తిరిగి రండని గలతీయులకు చెప్పాడు; తీర్పు కోసం ఎదురుచూడమని అన్యాయస్తులైన ధనవంతులకు యాకోబు చెప్పాడు. అయితే, పత్రికలు క్రైస్తవ విశ్వాస కుటుంబ సందర్భములో రాశారు.

---

[24] ఈ భాగంలోని విషయాలు J. Scott Duvall మరియు J. Daniel Hays, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012) నుండి తీసుకున్నారు.

[25] ఉదాహరణకు, ఎఫెసీయులకు 1:1 పౌలు అపొస్తులత్వ అధికారాన్ని పేర్కొంటుంది: "దేవుని చిత్తమువలన క్రీస్తుయేసు అపొస్తలుడైన పౌలు."

| క్రొత్త నిబంధన పత్రికల నిర్మాణం |
|---|
| పరిచయం<br><br>• రచయిత పేరు, స్థితి/హోదా<br>• గ్రహీతలు/శ్రోతలు<br>• అభివందనం<br>• పరిచయ ప్రార్థన<br><br>ముఖ్య భాగం (పత్రిక ప్రధాన సందేశం)<br><br>ముగింపు (ఇందులో ఇలాటి విషయాలు ఉంటాయి)<br><br>• యాత్ర ప్రణాళికలు (తీతుకు 3:12)<br>• అభినందనలు, శుభాలు (రోమా 16)<br>• తుది సూచనలు (కొలొస్సయులకు 4:16-17)<br>• ఆశీర్వాదం (ఎఫెసీయులకు 6:23-24)<br>• దైవస్తోత్రం (యూదా 24-25) |

**పత్రికల భాష్యం**

మీరు ఒక స్నేహితుని నుండి పత్రికను పొందుకున్నప్పుడు, కూర్చొని పత్రిక అంతటినీ చదువుతారు. క్రొత్త నిబంధన పత్రికలు కూడా అలాగే చదవండి. రచయిత పూర్తి సందేశం పొందుకోవడానికి పత్రిక అంతా చదవండి. మీరు చదువుతుండగా, మీ పరిశీలనలు జాబితా చేయండి. మీరు ఎంత ఎక్కువ పరిశీలనలు చేస్తారో, అంత మంచిగా భాష్యం చేయగలుగుతారు.

బైబిల్ పత్రిక చదివేటప్పుడు అనేక ప్రశ్నలు అడుగవలసి ఉంది:

**(1) పత్రిక గ్రహీత ఎవరు?**

పత్రిక పొందిన సంఘం లేక వ్యక్తి గురించి ఎంత ఎక్కువ అవగాహన కలిగియుంటే, పత్రికను అంత ఉత్తమంగా అర్థం చేసుకుంటాం. మనం పౌలు పత్రిక అధ్యయనం చేసేటప్పుడు, గ్రహీత సంఘం గురించి అపొస్తలుల కార్యాలలోని

సూచనలు చదవుతూ మొదలుపెట్టడం సహాయకరంగా ఉంటుంది. ఇలా చేస్తే పత్రికను బాగా అర్థం చేసుకోగలుగుతాం. ఉదాహరణకు:

- ఫిలిప్పీ సంఘం హింసలో పుట్టింది (అపొస్తలుల కార్యములు 16:12-40). కష్ట పరిస్థితుల్లో కూడా వాళ్లు ఆనందించాలనే పౌలు సూచనను ఇది నొక్కి చెబుతుంది.
- ఎఫెసీ (ఇతర పౌలు పత్రికలవలే) పత్రికను విశ్వాసులకు రాశాడు. మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, (ఎఫెసీయులకు 3:15-18) అని ఎఫెసీ విశ్వాసుల కోసం పౌలు ప్రార్థించినప్పుడు, దేవుని పిల్లలు దేవుని పరిపూర్ణత పొందుతారని ప్రార్థిస్తున్నాడు. క్రైస్తవులు "తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై" (ఎఫెసీయులకు 1:4-6) ఉండాలని ప్రార్థిస్తున్నాడు.

**(2) రచయిత ఎవరు? అతనికి గ్రహీతకు ఉన్న సంబంధం ఏంటి?**

మీకు ఎవరైనా పత్రిక/లేఖను పంపినప్పుడు, ఇది "ఎవరు రాశారో?" తెలుసుకోవాలనుకుంటారు. రచయిత గురించి మీకు ఎంత బాగా తెలిస్తే, పత్రిక అంత ఆసక్తిగా ఉంటుంది. అదే విధంగా, బైబిల్ లోని పత్రిక రచయిత గురించి మనకు ఎంత బాగా తెలిస్తే, అతని సందేశం అంత మంచిగా అర్థమౌతుంది.

తన పత్రికల్లో, అపొస్తలుడైన యోహాను ప్రేమ గురించి నొక్కి చెప్పాడు. యోహాను మునుపు "ఉరిమెడు"వానిగా (మార్కు 3:17) ప్రసిద్ధిచెందాడు. అప్పట్లో, పరలోకం నుండి అగ్నిని రప్పించడానికి అతడు, అతని సహోదరుడు యేసు అనుమతి కోరారు (లూకా 9:54). తరువాత రాసిన యోహాను పత్రికలు, పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ నింపుదల ద్వారా అతడు మారాడని చూపిస్తాయి.

శ్రమలో ఉన్న క్రైస్తవులను ప్రోత్సహించడానికి పేతురు తన పత్రికలు రాశాడు. వాళ్లు సాతాను దాడుల్లో ధైర్యంగా ఉండాలని చెప్పాడు (1 పేతురు 5:8-9). మునుపు పేతురు జీవితంలో, అతడు భయంతో యేసును ఎరుగనని ముమ్మారు అబద్ధం చెప్పాడు (మార్కు 14:66-72). తర్వాత తన జీవితంలో జరిగిన మార్పు గురించి పేతురు పత్రికలు చూపిస్తాయి.

పత్రిక చదివేటప్పుడు రచయిత మరియు గ్రహీతలు మధ్య ఉన్న సంబంధం తెలుసుకోవడం సహాయకరం. ఫిలిప్పీ సంఘంతో పౌలుకు ఉన్న సంబంధం, సంతోషాన్ని గురించి రాసిన తన పత్రిక అంతటిలో కనిపిస్తుంది. మరోవైపు, కొరింథులో పౌలు మరియు తిరుగుబాటు చేసిన సభ్యులకు మధ్య సంఘర్షణ, 1 మరియు 2 కొరింథీ పత్రికల్లో బలమైన గద్దింపులకు దారితీసింది.

### (3) ఏ పరిస్థితులు పత్రికను ప్రేరేపించాయి?

పౌలు పత్రికల్ని ప్రేరేపించిన పరిస్థితులు మనకు తెలుసు. 1 మరియు 2 కొరింథీ పత్రికలు, కొరింథులోని సమస్యలు, ప్రశ్నలకు ప్రతిస్పందనగా రాశాడు. పారిపోయిన దాసుడైన ఒనేసీము పక్షాన విజ్ఞప్తిగా ఫిలేమోను పత్రిక రాశాడు.

పత్రిక పరిస్థితుల్ని అర్థం చేసుకునే విలువ గురించి గలతీయులకు రాసిన పత్రిక చూపిస్తుంది. గలతీ పత్రికలో కొన్ని వచనాలు చదివిన తర్వాత, "గలతీ పట్టణంలో ఏం జరుగుతుంది?" అని మీరు అడగాలి. "క్రీస్తు కృపనుబట్టి మిమ్మును పిలిచినవానిని విడిచి, భిన్నమైన సువార్తతట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది" (గలతీయులకు 1:6) అని పౌలు మొదలుపెట్టాడు. ఈ క్రొత్త విశ్వాసులు విశ్వాసం మూలంగా కృప ద్వారానే నీతిమంతులుగా చేయబడే సువార్తను విడిచిపెడుతున్నారనే విషయం త్వరలో స్పష్టమౌతుంది. బదులుగా వాళ్లు క్రియల ద్వారా నీతిమంతులుగా చేయబడు సందేశాన్ని నమ్ముతున్నారు. ఈ క్రొత్త విశ్వాసుల పట్ల పౌలు మాటలు ప్రేమను బట్టి ప్రేరేపించబడ్డాయి. విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా చేయబడు సందేశాన్ని ప్రకటించడానికి అతడు తన జీవితాన్ని సమర్పించుకున్నాడు. గలతీయులు ఆ సత్యాన్ని విడిచి, అబద్ధ బోధను అంగీకరిస్తున్నారని అతడు ఆశ్చర్యపోయాడు.

#### సాహిత్య రూపం: ఉపదేశం

ఉపదేశం అంటే క్రమమైన బోధన. ఇది అంశం 1 నుండి అంశం 2 వరకు క్రమ పద్ధతిలో జరుగుతుంది. ఈ సాహిత్య రూపం క్రొత్త నిబంధన పత్రికల్లో మరిముఖ్యంగా పౌలు పత్రికల్లో సర్వసాధారణం. ఈ పత్రికల్లో, పౌలు ఒక ఉత్తమ బోధకుడిలా సత్యాన్ని స్పష్టంగా వివరిస్తాడు.

*కాబట్టి, మరియు,* లేక, *అయితే* వంటి అనుసంధాన పదాలను ఉపదేశం ఉపయోగిస్తుంది. ఇందులో ఎల్లప్పుడు ప్రశ్నలు, సమాధానాలు ఉంటాయి. వివరణ, సత్యాన్ని స్పష్టంగా, తార్కికంగా వివరిస్తుంది.

కొలొస్సయులకు రాసిన పత్రికలో, పౌలు క్రీస్తు స్వభావం గురించి బోధించాడు. క్రీస్తు మానవుల తత్వజ్ఞానాలకు, సంప్రదాయాలన్నిటికి అతీతుడని పౌలు బోధించాడు. పౌలు ఈ తార్కిక పద్ధతి అనుసరించాడు:

1. పౌలు, క్రీస్తు ఆధిపత్యానికి రుజువు ఇచ్చాడు (కొలొస్సయులకు 1:15-23)
   - సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు.
   - సర్వమును ఆయన ద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను.
   - సంఘం అను శరీరానికి ఆయనే శిరస్సు

- సమాధానం ఆయన ద్వార కలుగుతుంది.

2. పౌలు తన ఉద్దేశ్యాన్ని రాతపూర్వకంగా తన శ్రోతలకు గుర్తుచేశాడు. అన్యజనులను క్రీస్తు యొద్దకు తీసుకురావడానికి క్రీస్తు ఘనమైన సందేశం పౌలుకు అప్పగించబడింది (కొలొస్సయులకు 1:24–2:5)

3. క్రీస్తు ఆధిపత్యాన్ని తిరస్కరించే బోధనలకు వ్యతిరేకంగా పౌలు హెచ్చరించాడు (కొలొస్సయులకు 2:6-23).

   - ప్రజలు, దేవుని ధర్మశాస్త్రం పాటించడం ద్వారా రక్షణ పొందుతారనే బోధ
   - ఆత్మలతో సంభాషించే ప్రమాదకరమైన ఆచారం
   - ఆత్మీయ ఫలితాల కోసం భౌతిక క్రమశిక్షణ అవసరమని చెప్పే తప్పుడు ఉద్దేశ్యం

4. కాబట్టి, క్రీస్తు ఆధిపత్యం వలన, మీరు ఇలా జీవించాలి
   (కొలొస్సయులకు 3-4):

   - క్రీస్తుకు లోబడడం, మన నైతిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది.
     - మేం ఇకమీదట అనైతికంగా ప్రవర్తించము (కొలొస్సయులకు 3:1-11).
     - సమాధానం కలిగి, కృతజ్ఞత భావంతో జీవిస్తాం (కొలొస్సయులకు 3:12-17).
   - క్రీస్తుకు లోబడడం, ఇతరులతో మనకున్న సంబంధంపై ప్రభావం చూపుతుంది (కొలొస్సయులకు 3:18-4:6).

5. ముగింపు మాటలు, కొలస్సీ విశ్వాసుల పట్ల పౌలుకున్న వ్యక్తిగత శ్రద్ధను శ్రోతలకు గుర్తుచేస్తాయి (కొలొస్సయులకు 4:7-18).

పౌలు పత్రిక, క్రీస్తు ఆధిపత్య సిద్ధాంతం గురించిన వివరణ. అది క్రీస్తు స్వభావం గురించి, విశ్వాసులుగా మన జీవితాల్లో ఈ సత్యం యొక్క ప్రభావం గురించి బోధిస్తుంది.

## పాఠం 6 ముఖ్య విషయాలు

(1) సరైన వ్యాఖ్యానం, మనం అధ్యయనం చేస్తున్న వాక్యభాగపు సాహిత్య రూపాన్ని అర్థం చేసుకోవాలని ఆశిస్తుంది.

(2) బైబిల్ లో కనిపించే కొన్ని ముఖ్య సాహిత్య రూపాలు:

- చరిత్ర: వాస్తవ ప్రజలు, సంఘటనల ఖచ్చితమైన చారిత్రక కథనాలు.

  చరిత్రను భాష్యం చెప్పేటప్పుడు, ఇలా అడగాలి:

  - కథ ఏంటి?
  - కథలో ప్రజలు ఎవరు?
  - చారిత్రక కథనం అనుసరించడానికి మాదిరి ఇస్తుందా?
  - ఈ చారిత్రక కథనంలో ఏ సూత్రాలు బోధించారు?

- పాత నిబంధన ధర్మశాస్త్రం

  క్రొత్త నిబంధన విశ్వాసులకు పాత నిబంధన ధర్మశాస్త్రం ప్రాముఖ్యమైంది ఎందుకంటే:

  - అది దేవుని స్వభావాన్ని వ్యక్తపరుస్తుంది.
  - రక్షణ జ్ఞానాన్ని మనకు అనుగ్రహిస్తుంది.
  - దేవుని చిత్తం తెలుసుకోవడానికి మనకు సహాయం చేస్తుంది.

  పాత నిబంధన ధర్మశాస్త్రంలో మూడు వర్గాలను గురించి ఆలోచన చేయడం సహాయకరం:

  - ఆచార నియమాలు
  - పౌర నియమాలు
  - నైతిక నియమాలు

  పాత నిబంధన ధర్మశాస్త్రాన్ని భాష్యం చెప్పేటప్పుడు, ఇలా అడగాలి:

  - మొదటి శ్రోతలకు ఈ వాక్యభాగం యొక్క అర్థం ఏంటి?
  - బైబిల్ శ్రోతలకు, మన ప్రపంచానికి మధ్య వ్యత్యాసాలు ఏంటి?
  - ఈ వాక్యభాగంలో బోధించిన సూత్రాలు ఏంటి?

- క్రొత్త నిబంధన ఏ విధంగానైన ఈ సూత్రాన్ని అంగీకరిస్తుందా?

- కావ్యం

హెబ్రీ కావ్య లక్షణాలు:

- సమాంతరత
- అలంకారాలు

- జ్ఞాన సాహిత్యం: జీవితం ఎలా పనిచేస్తుందో బోధిస్తుంది
- సామెతలు: జీవితం గురించిన పరిశీలనలు క్లుప్తంగా, స్పష్టంగా పేర్కొనబడినవి

సామెతల్ని అర్థం చేసుకున్నప్పుడు, ఇలా అడగాలి:

- ఈ లేఖనంలో బోధించిన సాధారణ సూత్రం ఏంటి?
- ఈ సూత్రానికి ఏ మినహాయింపులు ఉన్నాయి?
- బైబిల్ లో ఎవరు ఈ సూత్రాన్ని అనుసరిస్తారు?

- పాత నిబంధన ప్రవచనం: దేవుని సందేశాలు చెప్పడం

పాత నిబంధన ప్రవచనాన్ని భాష్యం చెప్పేటప్పుడు, ఇలా అడగాలి:

- ప్రవక్త తన సమాజానికి ఏమి చెప్పాడు?
- అతని సందేశానికి ప్రజలు యేమని స్పందించారు?
- ప్రవక్త సందేశంలో ఏ సూత్రం నేటి సమాజానికి వర్తిస్తుంది?

- అంత్యకాల సంభవాల సాహిత్యం

అంత్యకాల సంభవాల సాహిత్యాన్ని భాష్యం చెప్పేటప్పుడు, ఈ విషయాలు గుర్తుంచుకోండి:

- ఇది ఎక్కువ శాతం సాదృశ్యాత్మకమైనది.
- ఇది సంఘటనల్ని ఖచ్చితంగా కాలక్రమానుసారంగా వివరించదు.
- ఇది వేర్వేరు వివరాలు ఇస్తూ, ఒకే సంఘటను పదే పదే వివరించవచ్చు.

అంత్యకాల సంభావనల సాహిత్యంలో అత్యంత ముఖ్య విషయాలు:

- ప్రస్తుత దుష్ట లోకంలో విశ్వాసం కాపాడుకొనే సవాలు.
- తన ప్రజలకు సహాయం చేసే సార్వభౌమ దేవుడు.

- ఉపమానం: ఆత్మీయ సత్యాన్ని ప్రకృతి విషయాలతో లేక జీవ పరిస్థితులతో పోల్చే బోధన. ఉపమానాలనేవి తరచుగా ఒక ప్రశ్నకు లేక వైఖరికి సమాధానంగా చెప్పబడినవి.

  ఉపమానాలు భాష్యం చెప్పేటప్పుడు, ఇలా అడగాలి:

  - ఉపమానం ఎలా పరిచయం చేశారు?
  - ఉపమానం ముగింపు ఏంటి?
  - ఉపమానం ఎలాంటి సమాధానాన్ని లేక వైఖరిలో ఎలాంటి మార్పును కోరుతుంది?
  - మొదటి శ్రోతల ప్రతిస్పందన ఏమై ఉంటుంది?

- పత్రిక

  క్రొత్త నిబంధన పత్రికలు ఏవనగా:

  - అధికారికమైనవి
  - పరిస్థితికి సంబంధించినవి
  - విశ్వాసులకు ఉద్దేశించబడ్డాయి

  పత్రికలు భాష్యం చెప్పేటప్పుడు, ఇలా అడగాలి:

  - పత్రిక గ్రహీత ఎవరు?
  - రచయిత ఎవరు? అతనికి గ్రహీతకు ఉన్న సంబంధం ఏంటి?
  - ఏ పరిస్థితులు పత్రికను ప్రేరేపించాయి?

- వివరణ: క్రమమైన బోధన

**పాఠం 6 అభ్యాసం**

1వ పాఠంలో, ఈ కోర్సు సమయంలో అధ్యయనం చేయడానికి ఒక వాక్యభాగం ఎన్నుకున్నారు. మీ ఎన్నుకున్న వాక్యభాగ సాహిత్య రూపం ఏంటి? వాక్యభాగాన్ని ఇంకా ఎక్కువ అర్థం చేసుకోవడానికి సహాయంగా ఈ పాఠంలో విషయాలను ఉపయోగించండి. నిర్దిష్ట సాహిత్య రూపానికి సంబంధించి భాష్య ప్రశ్నలకు సమాధానం ఇవ్వండి.

# పాఠం 7

# భాష్యం: పద అధ్యయనం

## పాఠం లక్ష్యాలు

(1) లోతైన అధ్యయనం యొక్క విలువను అభినందించడం.

(2) పదాలను అధ్యయనం చేస్తున్నప్పుడు సాధారణ పొరపాట్లను నివారించడం.

(3) పద అధ్యయనం చేస్తున్నప్పుడు ప్రక్రియను అర్థం చేసుకుని అన్వయించడం.

(4) బైబిల్ లో అలంకార రూపక భాషను గుర్తించడం.

## పరిచయం

బైబిల్ లోతైన అర్థంతో కూడినది, కాని విచారకరంగా, కొందరు లేఖన సందేశాన్ని అర్థం చేసుకోకుండా లేఖనం చదువుతారు.[26] బైబిల్ లో, పుస్తకాలు, అధ్యాయాలు, భాగాలు, వచనాలు, మరియు పదాలు ఉన్నాయి. పదాల అర్థం గ్రహించినప్పుడు, మనం అధ్యయనం చేసే వాక్యభాగాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. ఈ పాఠం పదాలు ఎలా అధ్యయనం చేయాలనే విషయాన్ని గురించి మాట్లాడుతుంది. ఒక ప్రత్యేక బైబిల్ సందర్భంలో, దాని అర్థం ఏంటో గ్రహించడానికి ఒక పదాన్ని మనం అధ్యయనం చేస్తాం.

కొన్నిసార్లు ప్రజలు బైబిల్ అధ్యయన వనరులు ఉపయోగించి బైబిల్ గ్రీకు మరియు హెబ్రీ పదాలు అధ్యయనం చేస్తారు. ఆ విధమైన అధ్యయనానికి ఉపయోగించే వనరులు ఎక్కువగా అందుబాటులో లేవు, కాబట్టి వాటిని గురించి ఈ పాఠంలో చర్చించము. బదులుగా, మన స్థానిక భాషలో పదాలను ఎలా అధ్యయనం చేయాలో నేర్చుకుందాం.

పదాల అధ్యయనానికి మూడు-దశల ప్రక్రియ ఉపయోగిద్దాం:

1. అధ్యయనం చేయడానికి పదాలు ఎన్నుకోండి.
2. ఎన్నుకున్న ప్రతి పదానికి సాధ్యమయ్యే అర్థాల జాబితా చేయండి.

---

[26] ఈ పాఠంలో మెటీరియల్ చాలావరకు J. Scott Duvall and J. Daniel Hays, *Grasping God's Word* (Grand Rapids: Zondervan, 2012)లో 9వ అధ్యాయం నుండి తీసుకున్నారు.

3. వాక్యభాగ సందర్భంలో ఎన్నుకున్న పదాల అర్థాన్ని గ్రహించండి.

## పదాల అధ్యయనంలోని సాధారణ తప్పిదాలు

మనం పదాలు అధ్యయనం మొదలుపెడుతుండగా, మనం కొన్ని తప్పులు నివారించాలి. ఈ పొరపాట్లు తప్పుడు భాష్యానికి నడిపిస్తాయి.

### పదం యొక్క మునుపటి అర్థాన్ని విస్మరించడం

కొన్నిసార్లు పదాన్ని ఉపయోగించే విధానం కాలక్రమేణా మారుతుంది. బైబిల్ అనువాదం జరిగి చాలా సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, మన బైబిల్లోని కొన్ని పదాల అర్థాలు, నేడు అదే పదాల అర్థానికి భిన్నంగా ఉండొచ్చని మనం తెలుసుకోవాలి. గతంలో ఆ పదం ఎలా ఉపయోగించారో అర్థం చేసుకోకపోతే, మన అధ్యయనం చేసే వాక్యభాగాన్ని తప్పుగా అర్థం చేసుకుంటాం. (మనం ఇటీవల వచ్చిన బైబిల్ అనువాదాలు చదువుతున్నట్లయితే, అది అంత పెద్ద సమస్య కాదు.)

► మీ భాషలో కాలక్రమేణా దాని అర్థం మారిన ఒక పదం గురించి మాట్లాడండి.

### ప్రతి సందర్భంలోనూ ఒక పదానికి ఒకే అర్థం ఉందని భావించడం

బైబిల్ రచయితలు ఒకటి కంటే ఎక్కువ అర్థాలున్న పదాలు ఉపయోగించారు. ఒకే పదం ఒక సందర్భంలో ఒక విధంగా, మరో సందర్భంలో మరొక విధంగా ఉపయోగించవచ్చు. మనం అధ్యయనం చేస్తున్న వాక్యభాగంలో, ఏ అర్థం సరైనదో తెలుసుకోవడానికి ఆ పదం ఉపయోగించిన సందర్భం చూడాలి.

## పదం యొక్క అధ్యయన ప్రక్రియ

### మొదటి దశ: వాక్యభాగంలో అధ్యయనం చేయాలనుకున్న పదాలు ఎన్నుకోండి

బైబిల్లోని ప్రతి పదాన్ని లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరత లేదు. కొన్నిసార్లు బైబిల్ అర్థం స్పష్టంగా ఉంటుంది. ఉదాహరణకు, దావీదు ఐదు రాళ్లు యేరుకున్నాడని బైబిల్ సెలవిచ్చినప్పుడు (1 సమూయేలు 17:40), దాని అర్థం కోసం *రాయి* అనే పదాన్ని అధ్యయనం చేయనవసరం లేదు.

అధ్యయనానికి పదాలు ఎన్నుకోవాలంటే, వీటి కోసం చూడండి:

- వాక్యభాగ అర్థానికి ప్రాముఖ్యమైన పదాలు
- పునరావృత పదాలు

- భాషా రూపాలు
- అస్పష్టమైన లేక కష్టమైన పదాలు

►రోమా 12:1-2 చదివి, అధ్యయనం కోసం ముఖ్య పదాలు గుర్తించండి. పదం ప్రక్కన, ఆ పదం ఎన్నుకోవడానికి కారణం ఏంటో రాయండి:

1 = ముఖ్య పదం

2 = పునరావృత పదం

3 = భాషా రూపం

4 = అస్పష్ట లేక కష్ట పదం.

కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి.

మీరు గుర్తించిన కొన్ని పదాలు ఏవనగా:

1 = ముఖ్య పదం: *బ్రతిమాలుకొనుచున్నాను, సమర్పించుకొనుడి, అనుసరించుట, నూతనమగుట, రూపాంతరము*

2 = పునరావృత పదాలు: వాక్యభాగంలో ఏమి లేవు

3 = భాషా రూపం: *సజీవ యాగం*

4 = అస్పష్టమైన లేక కష్టమైన పదాలు: *ఆత్మీయ ఆరాధన*

**రెండవ దశ: పదానికి సాధ్యమయ్యే అర్థాలు**

అనేక భాషలలో అనేక భిన్నమైన అర్థాలతో, అనేక విధాలుగా ఉపయోగించబడే పదాలు ఉన్నాయి. సందర్భాన్ని బట్టి ఉపదేశకుడు ఏ అర్థం ఉపయోగిస్తున్నాడో వినేవారికి సహజంగా అర్థమౌతుంది. అప్పుడప్పుడు, వినేవారి సందర్భాన్ని సరిగా పరిగణలోకి తీసుకోనప్పుడు మరియు ఉపదేశకుని ఉద్దేశ్యాన్ని తప్పుగా అర్థం చేసుకున్నప్పుడు, హాస్యాస్పదమైన మరియు తీవ్రమైన అపార్థాలు జరుగుతూ ఉంటాయి.

► ఒకరు ఒక పదానికి అర్థం చెప్పినప్పుడు ఆ అర్థాన్ని మరొకరు అపార్థం చేసుకున్న సందర్భం గురించి మీరు ఆలోచించగలరా?

రెండవ దశలో, పదాన్ని ఉపయోగించగల సాధ్యమైన మార్గాలన్నిటిని పరిగణలోకి తీసుకోవాలి. మన బైబిల్ అనువాదం పురాతనమైనదైతే, గతంలో ఆ పదానికి అదనపు అర్థాలు ఉన్నాయో లేదో కూడా ఆలోచించాలి.[27] మన యొద్ద నిఘంటువు ఉన్నట్లయితే, సాధ్యమయ్యే అర్థాలన్నిటిని జాబితా చేయడానికి అది సహాయపడుతుంది. మనం ఇతరులతో కలిసి అధ్యయనం చేసినప్పుడు, మనం ఆలోచించని అర్థాలు గురించి కూడా ఆలోచించేలాగా వాళ్లు మనకు సహాయపడతారు.

వీలైతే, బైబిల్ యొక్క ఇతర అనువాదాలను పరిశీలించి, వారు కూడా అదే పదాన్ని ఉపయోగిస్తున్నారో లేదో చూడాలి.[28] అనువాదం భిన్నమైన పదాన్ని ఉపయోగిస్తే, రెండు పదాలను పోల్చి చూసి, వ్యత్యాసం ఎక్కడ ఉందో కనుగొనాలి. అవి ఒకే అర్థాన్ని సూచిస్తున్నాయా? లేని యెడల, ఎలా భిన్నంగా ఉన్నాయి? వేరే పదం ఉపయోగించడం వలన వాక్యభాగ అర్థం మారిపోతుందా?

---

[27] పాత బైబిల్ అనువాదాన్ని ఉపయోగిస్తున్నట్లయితే, క్రొత్త బైబిల్ అనువాదము కూడా ఆ ప్రత్యేక సందర్భంలో, ఒక పదం అర్థాన్ని గురించిన అంతర్దృష్టిని మనకు అందిస్తుంది.

[28] వివిధ భాషలు మరియు వెర్షన్లలో బైబిల్ని చదవగల వెబ్సైట్ల కోసం అనుబంధాన్ని చూడండి.

► రోమా 12:1-2లో అధ్యయనానికి మనం ఎన్నుకున్న పదాల్లో సమర్పించుకొనుడి ఒకటి. సమర్పించుకొనుడి అనే పదానికి సాధ్యమైయ్యే అర్థాలన్నిటిని జాబితా చేయడానికి కలిసి పనిచేయండి.

**మూడవ దశ: వాక్య సందర్భంలో ఆ పదం అర్థం ఏంటో గ్రహించండి**

ఒక పదానికి వివిధ ఉపయోగాలు చూసి, సాధ్యమయ్యే అర్థాల జాబితా చేసిన తర్వాత, మీరు అధ్యయనం చేస్తున్న వాక్యభాగంలో పదం అర్థం ఏంటో కనుగొనడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. సందర్భం మిమ్మల్ని నడిపిస్తుంది. గుర్తుంచుకోండి, కొందరికి మాత్రమే తెలిసిన ప్రత్యేక అర్థాన్ని ఉపయోగించాలని రచయిత ఉద్దేశించలేదు. రచయిత పాఠకుడు అర్థం చేసుకోవాలని ఉద్దేశించాడు.

5వ పాఠంలో మనం సందర్భం యొక్క ప్రాముఖ్యతను చూశాం, కాబట్టి ఈ విషయాన్ని వివరంగా సమీక్షించమం. సందర్భ పాత్రను సంక్షిప్తంగా చెప్పాలంటే: పదానికి ఉత్తమ నిర్వచనాన్ని కనుగొనడానికి, మనం ఆ పదం చుట్టుప్రక్కలున్న వచనం, అధ్యాయం, మరియు పుస్తకాన్ని పరిశీలిస్తాం.

సందర్భాన్ని చూసి, ఆ పదానికి అర్థాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తుండగా పరిగణించవలసిన కొన్ని ప్రశ్నలు.

**(1) పదాన్ని నిర్వచించడానికి సహాయపడే వ్యత్యాసం లేక పోలిక వాక్యభాగంలో ఉందా?**

► చదవండి యోహాను 3:16: “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.” నశింపక అనే పదానికి సాధ్యమయ్యే పదాలు కలిసి జాబితా చేయండి (మీ యొద్ద నిఘంటువు ఉంటే దానిని ఉపయోగించవచ్చు.) ఇప్పుడు, వచనంలో ఇచ్చిన వ్యత్యాసాన్ని పరిగణలోనికి తీసుకోండి. నశించడం అనే పదం నిత్యజీవాన్ని కలిగియుండుట అనే పదానికి విరుద్ధం. మీ జాబితాలో, *నశించుట* అనే పదానికి ఏ అర్థం, ఇక్కడ యేసు ఉద్దేశించినదానికి అనుసంధానంగా ఉంది?

**(2)** రచయిత ఈ పదాన్ని ఇతర చోట్ల ఎలా ఉపయోగించాడు**?**

యోహాను 3:16లో లోకమును అనే పదం కూడా ఉపయోగించారు. లోకము అనే పదానికి అనేక అర్థాలు ఉన్నాయి:

- భౌతిక విశ్వం
- ప్రజలందరు
- సుపరిచయ నాగరిక దేశాలు
- దేవుని తిరస్కరించు సాధారణ సమాజం

లేఖనంలో వివిధ ప్రదేశాలలో ఈ విషయాల్ని సూచించడానికి రచయిత లోకమును అనే పదం ఉపయోగించాడు. యోహాను 3:16లో, లోకమును అనే పదానికి ఏ అర్థం వస్తుందో గ్రహించాలంటే, యోహాను ఈ పదాన్ని ఉపయోగించిన ఇతర ఉదాహరణలు కూడా చూడాలి.

- యోహాను 1:10, “ఆయన లోకములో ఉండెను, లోకమాయన మూలముగా కలిగెను గాని లోకమాయనను తెలిసికొనలేదు.” ఈ వచనం యేసు గురించి మాట్లాడుతుంది. లోకమాయనను తెలిసికొనలేదు.
- యోహాను 7:7, “లోకము మిమ్మును ద్వేషింపనేరదుగాని, దాని క్రియలు చెడ్డవని నేను దానినిగూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను గనుక అది నన్ను ద్వేషించుచున్నది.” ఈ వచనంలో యేసు మాట్లాడుతున్నాడు. లోకము ఆయనను ద్వేషిస్తుంది.
- యోహాను 14:17, “లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతోకూడ నివసించును, మీలో ఉండును.” ఆత్మ సత్యాన్ని లోకం పొందలేదు.
- 1 యోహాను 2:15-17, “ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే. లోకమును దాని ఆశయు గతించిపోవుచున్నవి గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును.” లోక విలువలు మరియు అన్వేషణలు దేవునికి పూర్తిగా వ్యతిరేకం.

దేవుని తిరస్కరించే సామాన్య లోకాన్ని సూచించడానికి అపొస్తలుడైన యోహాను లోకమును అనే పదం ఉపయోగించాడు. ఇది యేసు వాగ్దాన పరిధిని చూపిస్తుంది: దేవుడు తనకు దూరంగా ఉన్నవారిని ఎంతగానో ప్రేమించాడు గనుక అందరు రక్షించబడునట్లు తన కుమారుని అనుగ్రహించాడు.

**(3) పద అర్థం గురించి సందర్భం ఏమి తెలుపుతుంది**?

► లూకా 1:68-79 చూడండి.

లూకా 1:71 లో, ఇశ్రాయేలు *రక్షణ* గురించి జెకర్యా ప్రార్థిస్తాడు. అతడు దేన్ని సూచిస్తున్నాడు? ఈ వచనంలో *రక్షణ* అంటే అర్థం ఏంటి?

లేఖనంలో *రక్షణ* అనే విషయానికి అనేక అర్థాలు ఉన్నాయి. అది ప్రత్యేకంగా వీటిని సూచించగలదు:

- ప్రమాదం లేక శత్రువుల నుండి విమోచన
- రోగం నుండి విడుదల
- పాపం నుండి విడుదల

రక్షణ శత్రువుల నుండి విమోచనను సూచిస్తుందని తక్షణ సందర్భం (లూకా 1:68-74) చూపిస్తుంది. విమోచన (రక్షణ) దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనను నెరవేర్చుతుంది (లూకా 1:73).

కొన్ని వచనాలు తర్వాత, లూకా రక్షణ అనే పదాన్ని మరింత లోతైన అర్థంతో ఉపయోగించాడు (లూకా 1:77). పరిశుద్ధాత్ముని నాయకత్వంలో, తన కుమారుడు సర్వోన్నతుని ప్రవక్త అనబడతాడని జెకర్యా చూశాడు. జెకర్యా కుమారుడు పాప క్షమాపణ ద్వారా రక్షణ గురించి ప్రభువు ప్రజలకు బోధిస్తాడు. ఇక్కడ, *రక్షణ* పాప క్షమాపణకు అనుసంధానంగా ఉంది.

ఈ ప్రార్థనలో, రక్షణకు సంబంధించిన వివిధ అర్థాలు ఉపయోగించారు. సందర్భం ద్వారా అర్థాన్ని మనం నిర్ణయిస్తాం.

**కార్యాచరణలు అభ్యసించండి**

*తరగతి నాయకునికి గమనిక: ఈ ఆచరణాత్మక కార్యాచరణలు కోసం తగిన సమయం కేటాయించండి. మీ తరగతి సమయం, ఒక గంట మాత్రమే అయితే, వీటిని అభ్యాసం చేయడానికి సెషన్ మొత్తం కేటాయించండి. ప్రతి అభ్యాసానికి సూచించిన సమయం కేటాయించబడుతుంది. తరగతి సమయంలో కలిసి అభ్యసించడంవల్ల, విద్యార్థులు వాళ్లు నేర్చుకున్న వాటిని ఆచరణలో పెడతారు. ఇతరులతో కలిసి ప్రక్రియకు అనుగుణంగా పదాలు అధ్యయనం చేయడంవల్ల, ఏకాంతంగా పని చేసినప్పుడు చూడలేని దృక్పథాలు, వివరాలు తరచు ఉన్నాయని తెలుసుకోవడానికి సహాయపడుతుంది.*

*చిన్న సమూహ కార్యాచరణల కోసం, ప్రతి గుంపులో ముగ్గురు విద్యార్థులను ఉంచండి. చివరి ఐదు నిమిషాలలో ప్రతి గుంపు కూడా ఒక చోటకి వచ్చి, ఏమి నేర్చుకున్నారో చర్చించాలి.*

► **చిన్న గుంపు కార్యాచరణ (20 నిముషాలు**). మీ గుంపులో, ఒకే పదాన్ని వివిధ అర్థాలతో ఉపయోగించిన అనేక వచనాలను కనుగొనండి. మీరు మొదలుపెట్టడానికి ఇక్కడ కొన్ని ఆలోచనలు ఉన్నాయి: *ఇల్లు, దర్శనం, దినం, పండు*. ఒకే పదం వివిధ అర్థాలు కలిగియున్న వచనాలను కనుగొన్న తర్వాత, ఆ పదం ఉపయోగించ గల మార్గాల జాబితా చేయండి. ప్రతి వచనాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి పదాల అధ్యయనం ఎలా సహాయపడింది?

► **గుంపు అంతటి కార్యాచరణ (10 నిమిషాలు).** ఇప్పుడు మళ్ళీ రోమా 12:1 తీసి, సమర్పించుకొనుడి అనే పదానికి మీరు రాసిన సాధ్యమయ్యే అర్థాలు చూడండి. ఆ వచనంలో ఏ అర్థం ఉద్దేశించబడిందో గ్రహించడానికి పైన ఇచ్చిన ప్రశ్నలను ఉపయోగించండి.

► **చిన్న గుంపు కార్యాచరణ (30 నిమిషాలు).** మీ గుంపులో, పదాల అధ్యయన ప్రక్రియ అభ్యాసం చేయండి. మీరు ఇప్పటికే రోమా 12:1-2 లో పదాలు గుర్తించారు, వాటిని జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. ఆ ప్రతి పదానికి, సాధ్యమయ్యే అర్థాలు జాబితా చేసి, ఆ సందర్భంలో ఏ అర్థం సరిపోతుందో నిర్ణయించండి.

## ప్రత్యేక సందర్భం: అలంకార రూపక భాష

6వ పాఠంలో, అలంకార రూపక భాష గురించి క్లుప్తంగా చూశాం. మనం పదాల అధ్యయనాన్ని ఎంత జాగ్రత్తగా చేసినప్పటికీ, మనం రచయిత యొక్క అలంకార రూపక భాషను తప్పుగా అర్థం చేసుకుంటే, మన భాష్యం తప్పే అవుతుంది. భాషా రూపాల్లో, ముఖ్య విషయం ఏంటంటే, పదాల అక్షరార్థం కాదుగాని, అవి సూచించే ఆలోచన.[29]

మనందరం అలంకార రూపక భాష ఉపయోగిస్తాం. ఒక అమెరికా స్నేహితురాలు తన తోటలో తీసిన ఫోటోలు మీకు చూపిస్తుందని అనుకోండి. మీరు ఆ తోట చూసి ఆశ్చర్యంతో, "అంత అందమైన మొక్కలు ఎలా పెంచావు?" అని మీరు మీ స్నేహితురాలిని అడిగారు. అప్పుడామే, "I have a green thumb" అని సమాధానమిచ్చింది. అంటే ఆమె చేతి బొటన వ్రేలు పచ్చగా ఉందని కాదు అర్థం. ఆమె అమెరికా అలంకార రూపక భాష ఉపయోగించింది, అంటే "నాకు మొక్కలు పెంచే అసాధారణ సామర్థ్యం ఉంది" అని అర్థం.

► మీ భాషలో, అక్షరార్థ అర్థానికి భిన్నంగా ఉన్న కొన్ని వాక్యాలు ఏంటి?

కొన్నిసార్లు ఒక పదాన్ని మరొకదానిని సూచించడానికి ఉపయోగిస్తారు. ఇది, అనేక అర్థాలు కలిగియున్న పదం ఒకటి కాదు. ఉదాహరణకు, బైబిల్ లో కొందరిని కుక్కలు అని పిలిచారు (ప్రకటన 22:15). ప్రజలు కలిగి ఉండకూడని కొన్ని కుక్కల లక్షణాలు కలిగియుండడం వలన ఈ పదాన్ని విమర్శగా ఉపయోగించారు. *కుక్క* అంటే మనం పిలిచే సాధు జంతువైన కుక్కే, కాని ఇక్కడ ప్రజలను సూచించడానికి అలంకార రూపకంగా ఉపయోగించారు. యేసు సీమోనును పేతురు అని పిలిచాడు అంటే బండ అని అర్థం, ఎందుకంటే పేతురు బండకు ఉన్నటువంటి లక్షణాలు కలిగియున్నాడు,

---

[29] ఈ భాగంలోని మెటీరియల్ ను Howard G. Hendricks and William D. Hendricks, *Living by the Book* (Chicago: Moody Publishers, 2007) 36వ అధ్యాయం నుండి తీసుకున్నారు.

అవి ప్రజలు కలిగియుండడం మంచిది (మత్తయి 16:18). యేసు *బండ* యొక్క సాధారణ అర్థం ఉపయోగించి, సీమోను ఒక విధంగా బండలాగా ఉన్నాడు అని చెబుతున్నాడు.

యేసు హేరోదును నక్క అని పిలిచాడు (లూకా 13:32). మనం *నక్క* అనే పదానికి వివిధ అక్షారార్థ అర్థాలు అధ్యయనం చేసి, యేసు ఏ విధమైన జంతువును ఉద్దేశిస్తున్నాడో తెలుసుకోవడానికి సందర్భాన్ని అర్థం చేసుకోనవసరం లేదు. ఇది సాదృశ్యాత్మక ప్రకటన, కాబట్టి హేరోదును నక్క అని పిలవడంలో యేసు ఉద్దేశ్యం ఏంటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. యేసు ఉద్దేశ్యం ఏంటంటే, హేరోదు తెలివిగలవాడు, కాని తన చెడ్డ ప్రవర్తనను బట్టి నమ్మదగినవాడు కాదు.

► ఒక వ్యక్తిని విమర్శించడానికి మీ సంస్కృతిలో ఏ జంతువును సాదృశ్యాత్మకంగా ఉపయోగిస్తారు?

ప్రకటన అక్షరార్థమైందో లేదా సాదృశ్యాత్మకమైనదో ఎలా తెలుస్తుంది? ఇక్కడ పరిగణించవలసిన రెండు మార్గదర్శకాలు ఉన్నాయి:

1. **వాక్యభాగం అలంకార రూపకంగా ఉపయోగించమని చెప్పినప్పుడు, ఆ విధంగా ఉపయోగించండి.** ఆదికాండము 37 రెండు కలలను వివరిస్తుంది. బైబిల్ లో, కల ఎక్కువగా సాదృశ్యాత్మక సందేశాన్ని తెలియజేస్తుంది. దీని కారణంగా, యోసేపు కలలోని ధాన్యపు పన మరో పనకు అక్షరాలా సాష్టాంగపడుతుందని లేక సూర్యచంద్ర నక్షత్రాలు అక్షరాల యోసేపుకు సాష్టాంగపడుతున్నాయని భావించకూడదు. బదులుగా, ఈ కల అనే ప్రకటన, మనం అలంకార రూపక భాష ఆశించాలని చెబుతుంది. ఈ సందర్భంలో, ఆదికాండము 37:8, 10లో దీని భాష్యం ఇవ్వబడింది.

2. **ఒక పదం యొక్క సాహిత్యపరమైన అర్థం అసాధ్యం లేదా అసంబద్ధంగా ఉన్నప్పుడు అలంకారిక అర్థాన్ని ఉపయోగించండి.** ప్రకటన 1:16లో, ప్రభువు నోటినుండి రెండంచుల వాడియైన ఖడ్గము బయలువెడలుచుండగా కనిపించాడు. సాదృశ్యాలతో నిండిన పుస్తకంలో, ఇది యేసు యొక్క అక్షరార్థ చిత్రం కావడం చాలా అసాధ్యంగా అనిపిస్తుంది! ప్రకటనలో ముందుకు సాగినప్పుడు, రెండంచుల వాడియైన పెద్ద ఖడ్గంతో ఉన్న యేసు యొక్క చిత్రం దుష్ట శక్తులపై దేవుని తుది విజయం సందేశానికి సరిపోతుందని మనం చూస్తాము.

దేవుడు తన వాక్య సత్యాన్ని మర్మంగా ఉంచక, దానిని ప్రకటించడానికి ఇచ్చాడని గుర్తుంచుకోండి. బైబిల్లో సాదృశ్యాత్మక భాష చాలావరకు స్పష్టంగా ఉంటుంది. 6వ పాఠంలో సాదృశ్యాత్మక భాషను ఎక్కువగా చూశాం. అలంకార రూపక భాషను ఎలా ఉపయోగించాలో ఇది మీకు సహాయం చేస్తుంది. మీరు భాషా రూపాన్ని గుర్తించిన తర్వాత, "దేవుడు ఈ చిత్రాన్నే ఎందుకు ప్రేరేపించాడు?" " ఈ చిత్రం ద్వారా ఎటువంటి సత్యం బయలుపడుతుంది?" అని అడగండి.

కొన్నిసార్లు ఒక పదం అలంకార రూపకంగా ఉపయోగించబడుతుంది, శాశ్వత చిహ్నంగా మారిపోతుంది. "నా గొఱ్ఱెలు నా స్వరము వినును..." (యోహాను 10:27), అని యేసు చెప్పినప్పుడు, ఆయన్ని అనుసరించే ప్రజలను ఉద్దేశిస్తున్నాడని శ్రోతలకు తెలుసు, మరియు బైబిల్ ఈ పదాన్ని ఇతర చోట్ల కూడా ఉపయోగిస్తుంది (కీర్తన 23, ఉదాహరణకు). ప్రకటన 5 లో, దేవుని సింహాసం యెదుట యూదా గోత్రపు సింహము కనిపిస్తుంది. "యూదా గోత్రపు సింహము" మెస్సీయను సూచించే పేరు అని బైబిల్ నిఘంటువు వివరిస్తుంది. మీరు ఇది తెలుసుకున్న తర్వాత, "యోహాను ఈ పేరు ఎందుకు ఉపయోగిస్తున్నాడు?" "ఈ పేరు యేసు గురించి ఏం సెలవిస్తుంది?" అని మీరు అడుగుతారు. భాషా రూపాన్ని గుర్తించడం వలన, యేసు విమోచన శక్తి గురించి యోహాను ఇచ్చిన చిత్రాన్ని అర్థం చేసుకోగలుగుతాం.

బైబిల్ రచయితలు కొన్నిసార్లు అలంకార రూపక భాష ఉపయోగించారనే వాస్తవం, మనం ఎన్నడూ లేఖనాన్ని అక్షరార్థంగా వివరించకూడదని కాదు. బదులుగా, కొన్నిసార్లు అలంకార రూపక భాష ఉపయోగించారని తెలుసుకొని, రచయిత ఉద్దేశించిన విధంగా వాక్యాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. లేఖనాన్ని రచయిత ఉద్దేశించని విధంగా మార్చడానికి మన ఊహలను అనుమతించకూడదు.

## ముగింపు

సామెతల గ్రంథ రచయిత, బుద్ధిని వెదకే వ్యక్తికి ఈ వాగ్దానం చేశాడు; "వెండిని వెదకినట్లు దాని వెదకినయెడల దాచబడిన ధనమును వెదకినట్లు దాని వెదకినయెడల యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట యెట్టిదో నీవు గ్రహించెదవు దేవునిగూర్చిన విజ్ఞానము నీకు లభించును" (సామెతలు 2:4-5). జ్ఞానం సాధించడానికి దేవుని వాక్యానికి మించిన మూలం మరొకటి లేదు. మీ లేఖన అధ్యయనానికి శాశ్వత ఫలితాలు ఉన్నాయి.

## పాఠం 7 ముఖ్య విషయాలు

(1) పదాల అధ్యయనం అంటే ఒక వాక్యభాగంలో ముఖ్య పదాలను పరిశోధించి, దాని సందర్భంలో వాటి అర్థాలు కనుగొనడం. పదాల అధ్యయనం, మనం అధ్యయనం చేస్తున్న వాక్యభాగాన్ని సరైన రీతిగా అర్థం చేసుకోవడానికి మనకు సహాయం చేస్తుంది.

(2) పదాల అధ్యయనం చేస్తున్నప్పుడు నివారించవలసిన రెండు సాధారణ తప్పులు:

- పదం యొక్క మునుపటి అర్థం విస్మరించడం
- ప్రతి సందర్భంలో ఒకే అర్థం కలిగిన పదం గురించి ఆలోచించడం

(3) పదాల అధ్యయన ప్రక్రియ:

- అధ్యయనం చేయడానికి పదాలు ఎన్నుకోండి.
    - వాక్యభాగ అర్థానికి ప్రాముఖ్యమైన పదాలు
    - పునరావృత పదాలు
    - భాషా రూపాలు
    - అస్పష్టమైన లేక కష్టమైన పదాలు
- ఎన్నుకున్న ప్రతి పదానికి సాధ్యమయ్యే అర్థాల జాబితా చేయండి.
- వాక్యభాగం సందర్భంలో ఎన్నుకున్న పదాల అర్థాన్ని గ్రహించండి.

(4) సందర్భంలో పదం అర్థం ఏంటో గ్రహించడానికి సహాయం చేసే ప్రశ్నలు:

- పదాన్ని నిర్వచించడానికి సహాయపడే వ్యత్యాసం లేక పోలిక వాక్యభాగంలో ఉందా?
- రచయిత ఈ పదాన్ని ఇతర చోట్ల ఎలా ఉపయోగించాడు?
- పద అర్థం గురించి సందర్భం ఏమి తెలుపుతుంది?

(5) అలంకార రూపక భాష అధ్యయనం చేస్తున్నప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు:

- సాదృశ్యపరచబడిన ఆలోచన ముఖ్యమైనది.
- అలంకార రూపక చిత్రం, పదబంధం లేక పదం మరోదానిని సూచిస్తుంది.
- అలంకారిక భాష, అది సూచించే దాని లక్షణాలపై దృష్టిపెడుతుంది.
- రచయిత ఉద్దేశించిన విధంగా లేఖనాన్ని అర్థం చేసుకోవడానికి మనం ప్రయత్నించాలి- అర్థం అక్షరార్థమా లేక సాదృశ్యకమా.

(6) లేఖన ప్రకటనను ఎప్పుడు సాదృశ్యాత్మకంగా అర్థం చేసుకోవాలి:

- వాక్యభాగం తెలియజేసినప్పుడు
- అక్షరార్థ అర్థం అసాధ్యం లేక అసంబద్ధమైనప్పుడు

## పాఠం 7 అభ్యాసాలు

(1) 1వ పాఠంలో, ఈ కోర్సు సమయంలో అధ్యయనం చేయడానికి ఒక వాక్యభాగం ఎన్నుకున్నారు. ఆ వాక్యభాగంలో నుండి, అధ్యయనం చేయడానికి ముఖ్యమైనవిగా మీరు భావించిన వాటిని జాబితా చేయండి. ముఖ్య పదాలు, పునరావృత పదాలు, భాషా రూపాలు, లేక అస్పష్టమైన లేక కష్టమైన పదాలు కోసం చూడండి. ఈ పాఠంలో వివరించిన ప్రక్రియ ఆధారంగా అధ్యయనం చేయండి. ప్రతి పదానికి, సాధ్యమయ్యే అర్థాలు జాబితా చేయండి. సందర్భాన్ని పరిగణలోనికి తీసుకోండి. మీరు అధ్యయనం చేస్తున్న వాక్యభాగం యొక్క సందర్భంలో ఏ అర్థం సరిపోతుంది గ్రహించండి.

(2) మీరు ఇప్పుడే అధ్యయనం చేసిన ప్రతి పదం చూడండి. ప్రతి అధ్యయన పదానికి మీరు తయారు చేసిన సాధ్యమయ్యే అర్థాల జాబితా చూడండి. మీరు అధ్యయనం చేసిన పదం యొక్క అర్థాన్ని అపార్థం చేసుకోవడం, వచనం యొక్క తప్పు భాష్యానికి ఎలా దారితీసే అవకాశం ఉందో? 2-4 వాక్యాల్లో పరిశీలన రాయండి.

# పాఠం 8

# భాష్యానికి సాధారణ సూత్రాలు

## పాఠం లక్ష్యాలు

(1) బైబిల్ బాష్యం యొక్క ప్రాధమిక సూత్రాలను అర్థం చేసుకోవడం.

(2) లేఖన అధ్యయనంలో ఈ సూత్రాలు అన్వయించడం.

(3) ఈ సూత్రాలు పాటించటంలో వైఫల్యం చెందడం, సిద్ధాంతపరమైన తప్పుడు బోధలకు ఎలా నడిపిస్తుందో తెలుసుకోవడం.

## పరిచయం

ఈ పాఠంలోని సూత్రాలు, లేఖన అధ్యయనానికి పునాది. జ్ఞానవంతులైన బైబిల్ బోధకులు, తమ అధ్యయనానికి మార్గనిర్దేశంగా ఈ సూత్రాలను అభివృద్ధి చేశారు. ఈ సూత్రాలు మీ బైబిల్ అధ్యయన పద్ధతులకు ఆధారం కావాలి. ఈ సూత్రాలు అర్థం చేసుకొని, మీ అధ్యయనంలో అన్వయించడానికి సమయం కేటాయించండి.

## రచయిత ఉద్దేశాన్ని పరిగణలోనికి తీసుకోండి

రచయిత తన పాఠకులకు ఏదో చెప్పాలని ఉద్దేశించాడు. ఆ ఉద్దేశించినదే, రచనలోని నిజమైన అర్థం. రచయిత ఉద్దేశించిన సందేశం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించే పనిని బాష్యం చేస్తుంది. రచయిత ఉద్దేశించిన అర్థానికి భిన్నమైన సందేశం కోసం మనం ఎప్పుడూ లేఖనాన్ని ఒక విషయంగా ఉపయోగించకూడదు.

లేఖనంలోని ఒక ప్రకటన, రచయిత ఉద్దేశించిన దానికి మించిన అర్థమించగలదు. అబ్రాహాము ఇస్సాకుతో, "దేవుడే దహనబలికి గొఱ్ఱెపిల్లను చూచుకొనునని" (ఆదికాండము 22:8) చెప్పినప్పుడు, యేసు రాకలో దేవుడు తన మాటలను గొప్ప రీతిలో నెరవేరుస్తాడని అతను గ్రహించియుండకపోవచ్చు. మోషే, అబ్రాహాము చెప్పిన ఈ మాటలు రాసినప్పుడు, ఈ మాటకున్న పూర్తి అర్థాన్ని మోషే కూడా గ్రహించియుండకపోవచ్చు. అయితే, ఈ మాటను యేసు రాకకు అన్వయించడం, మోషే ఉద్దేశించిన భావానికి పూర్తి భిన్నమైన అర్థం కాదు; ఇది, మన రక్షణకు అవసరమైన వాటిని దేవుడు అనుగ్రహిస్తాడనే సూత్రం యొక్క సంపూర్ణమైన, విస్తృతమైన అర్థం.

మొదటి పాఠకులు తన సందేశాన్ని ఆచరణాత్మకంగా అన్వయించాలని ప్రతి బైబిల్ రచయిత ఉద్దేశించాడు. మన సందేశం అన్వయం, మొదటి పాఠకుల సందేశ అన్వయానికి భిన్నంగా ఉండొచ్చు, కాని అదే సూత్రాన్ని అనుసరిస్తుంది. మనం బైబిల్ సూత్రాన్ని విభిన్న పరిస్థితికి అన్వయిస్తున్నాం గనుక, మన చర్య భిన్నంగా ఉండొచ్చు. ఉదాహరణకు, ఇశ్రాయేలు ప్రజలు తమ ఇళ్ల పైకప్పులకు చుట్టూ పిట్టగోడలు కట్టించుకోవాలి (ద్వితీయోపదేశకాండము 22:8). ఆ కాలంలో ఇంటి పైకప్పు చదునుగా ఉండేది, దానిని నివసించే ప్రాంగణంలో భాగంగా వాడేవారు. చదునుగా ఉన్న పైకప్పు లేని ఇంట్లో నివసిస్తున్నట్లయితే, అక్కడికి ఎవరూ వెళ్లరు కాబట్టి, పిట్టగోడ కట్టవలసిన అవసరం లేదు. అయినప్పటికీ, మన ఆస్తివల్ల ప్రమాదాలు జరగకుండా చూసుకోవడం మన బాధ్యత.

భాష్యం చెప్పే వ్యక్తి, వాక్యభాగంలోని వివరాలకు ఊహాత్మక భాష్యాన్ని చెప్పకూడదు. గాయపడిన వ్యక్తికి సహాయం చేసిన సమరయుని గురించి యేసు చెప్పిన కథలో ఊహాత్మక భాష్యానికి ఒక ఉదాహరణ ఇక్కడుంది (లూకా 10:30-35):

> సమరయుడు అంటే సువార్తికుడు, గాయపడిన వ్యక్తి అంటే మారుమనసుపొందిన పాపి, పూటకూళ్ల ఇల్లు అంటే సంఘం, రెండు దేనారములు అంటే బాప్తిస్మం మరియు సహవాసం.

ఈ బాష్యం, మన పొరుగువారిని ప్రేమించడం గురించి యేసు ఉద్దేశించిన విషయాన్ని ప్రక్కన పెట్టేస్తుంది (లూకా 10:27-29, 36-37): అవసరతలో ఉన్నవారిని మనం కలిసినప్పుడు, ప్రేమ చూపాలి.

ఊహాత్మక బాష్యంలో మూడు సమస్యలున్నాయి:

1. అవి భాష్యం చెప్పే వ్యక్తి అభిప్రాయం నుండి వస్తాయి.
2. అవి మంచి బాష్య సూత్రాలను బట్టి నడిపించినవి కావు.
3. వాటిని సాధారణ, సహేతుక పద్ధతుల ద్వారా అంచనా వేయలేం.

## వాక్యభాగంతో మొదలుపెట్టండి, కాని మీ ముగింపు నిర్ణయంతో కాదు

అజయ్ తన గమ్యస్థానం చేరుకునే మార్గం కనుగొనాలని మ్యాప్ లో చూశాడు, కాని "ఈ మ్యాప్ తప్పు" అని చెప్పాడు. అజయ్ యొక్క ప్రయాణికుడు "మ్యాప్ తప్పని నీకెలా తెలుసు?" అని అడిగాడు. అజయ్ చాలా విశ్వాసంతో, "నాకు దారి తెలుసు. ఈ మ్యాప్ తప్పు" అని స్పందించాడు. కొన్ని గంటల తర్వాత, దారితప్పిపోయి, అజయ్ తన ఓటమిని అంగీకరించి, మ్యాప్ ని అర్థం చేసుకుని, అనుసరించడం మొదలుపెట్టాడు. అతడు చేసిన తప్పేంటి? ముగింపు నిర్ణయంతో మొదలుపెట్టాడు. తనకు సరైన సమాధానం తెలుసు అనుకుని, తన ఆలోచనకు భిన్నమైన మార్గం చూపించే మ్యాప్ ని తిరస్కరించాడు.

కొందరు బైబిల్ ను ఇలాగే చదువుతారు. ఒకసారి ఒక ప్రసంగికుడు తను ఇష్టపడని ఒక వచనం చదివాడు. "దీని అర్థం నాకు తెలీదు, కాని దానర్థం అది చెప్తున్నది కాదు" అని అతను చెప్పాడు. అతను తన ముగింపు నిర్ణయంతో మొదలుపెట్టి ("ఈ బోధతో నేను సమ్మతించను"), తర్వాత లేఖనం చదివాడు. అతడు తన ముగింపులో లేఖనాన్ని సరిగా చేర్చలేకపోయాడు, కాబట్టి లేఖనాన్ని వదిలేయాలి అనుకున్నాడు ("దానర్థం అది చెప్తున్నట్లు కాదు").

లేఖనాన్ని అర్థం చేసుకోవాలంటే, ముందు లేఖనంతో మొదలుపెట్టి ఆ తర్వాత ముగింపు అభిప్రాయాన్ని కనుగొనాలి. మనందరికీ కొన్ని ముందస్తు భావనలు ఉంటాయి. ఒక నిర్దిష్ట స్థానం నుండి మొదలుపెడతాం. అది సరే. కాని, మన భావనలు లేఖనంలోని స్పష్టమైన బోధను విస్మరించటానికి కారణమైనప్పుడు సమస్య వస్తుంది. మనం మన ముగింపు అభిప్రాయాలతో కాకుండా లేఖనంతో మొదలుపెట్టాలి. మన ముందస్తు భావనలు లేఖన భాగాన్ని నిర్లక్ష్యం చేయడానికి అనుమతించకూడదు.

**ఒక ఉదాహరణ**

"మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" (మత్తయి 5:48).

కొంతమంది, "ఏ ఒక్కడు పరిపూర్ణుడు కాదు!" అని చెప్పి యేసు ఆజ్ఞను విస్మరిస్తారు. వాళ్ళు తమ ముగింపు అభిప్రాయంతో ("ఏ ఒక్కడు పరిపూర్ణుడు కాదు!" ) మొదలుపెట్టి, యేసు ఉద్దేశ్యం గ్రహించడానికి కూడా ప్రయత్నించరు.

మత్తయి 5:48 చదివేటప్పుడు, "'పరిపూర్ణుడు' అని చెప్పినప్పుడు యేసు ఉద్దేశ్యం ఏంటి? ఏ విధంగా మనం పరలోకపు తండ్రివలే ఉండాలి?" అని మనం అడగాలి. మత్తయి 5:48కు, ముందున్న వచనాలు సమాధానమిస్తాయి: మనం మన పరలోకమందున్న తండ్రివలే మన శత్రువులను ప్రేమించి, వారికి మేలు చేయాలి. "ఆయన చెడ్డవారిమీదను మంచివారిమీదను తన సూర్యుని ఉదయింపజేసి" (మత్తయి 5:45).

## లేఖన బోధలు, లేఖన బోధలకు విరుద్ధం కావు

మానవ రచయిత రాసిన పుస్తకం మనం చదివినప్పుడు, కొన్ని విషయాల్లో దానికదే విరుద్ధంగా ఉండొచ్చు. ఒక విషయంలో ఇద్దరు మానవ రచయితలు భిన్నాభిప్రాయలతో ఉంటారు. అయితే, బైబిల్ దేవుని వాక్యం; అది, దానికదే విరుద్ధంగా ఉండదు.

దేవుడు మారనివాడు (యాకోబు 1:17). కాబట్టి, ఆయన వాక్యాన్ని అనేకమంది మానవ రచయితలు కొన్ని వందల సంవత్సరాల క్రితం రాసినప్పటికిని స్థిరంగా ఉంటుంది. దేవుని వాక్యం దానికదే విరుద్ధంగా ఉండదు.

ఈ సూత్రం ప్రేరణ సిద్ధాంతం యొక్క ఫలితం: "సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ..." (2 తిమోతికి 3:16-17). లేఖనానికి అంతిమ మూలం దేవుడైతే, బైబిల్ దానికదే విరుద్ధంగా ఉండదు. ఇది మంచి బైబిల్ బాష్యానికి ముఖ్యం. రెండు వాక్యభాగాలు, ఒకదానికొకటి విరుద్ధంగా *కనిపించినప్పుడు*, ఒక వాక్యభాగాన్ని మనం తప్పుగా అర్థం చేసుకున్నామా అని ప్రశ్నించుకోవాలి. ప్రతి వాక్యభాగాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడు, రెండు వాక్యభాగాలు వాస్తవమని గ్రహిస్తాం.

**ఒక ఉదాహరణ**

"కాగా ధర్మశాస్త్రసంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసమువలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము" (రోమా 3:28).

"మనుష్యుడు యేసు క్రీస్తునందలి విశ్వాసమువలననేగాని ధర్మశాస్త్రసంబంధమైన క్రియలమూలమున నీతిమంతుడుగా తీర్చబడడని యెరిగి మనమును ధర్మశాస్త్రసంబంధమైన క్రియలమూలమున గాక క్రీస్తునందలి విశ్వాసము వలననే నీతిమంతులమని తీర్చబడుటకై యేసు క్రీస్తునందు విశ్వాసముంచియున్నాము" (గలతీయులకు 2:15-16).

"మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రముకాక క్రియల మూలమునను నీతిమంతుడని యెంచబడునని, మీరు దీనివలన గ్రహించితిరి" (యాకోబు 2:24).

విశ్వాసం మరియు క్రియల యొక్క పాత్రను గురించి, పౌలు, యాకోబు ఒకరినొకరు విభేదించారని కొందరు పాఠకులు భావిస్తారు. మానవుడు ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండా నీతిమంతుడుగా తీర్చబడతాడని పౌలు నొక్కిచెప్పాడు. మానవుడు కేవలం విశ్వాసం వలననే కాదుగాని క్రియల వలన నీతిమంతుడుగా తీర్చబడతాడని యాకోబు రాశాడు.

ఈ రెండు వచనాల సందర్భాలు చూడకుండా, యాకోబు పౌలుతో విభేదించాడని ఒకరు అనుకోవచ్చు. అయితే, ప్రతి వాక్యభాగంలోని సందర్భం పౌలు, యాకోబు ఏం చెబుతున్నారో చూపిస్తుంది. ఒక వ్యక్తి ఎలా రక్షించబడి, నీతిమంతునిగా తీర్చబడతాడో పౌలు చెబుతున్నాడు. విశ్వాసమువలననే మనుష్యుడు నీతిమంతునిగా తీర్చబడతాడు. ఒక వ్యక్తి తాను రక్షణపొందానని ఎలా చూపిస్తాడో యాకోబు చెబుతున్నాడు. మనుష్యుడు క్రియలు మూలముగా తన నీతిని కనుపరుస్తాడు. ఒక వ్యక్తి విశ్వాసం ద్వారా నీతిమంతునిగా తీర్చబడి, ఆ తర్వాత క్రియల ద్వారా నీతిని కనుపరుస్తాడని పౌలు మరియు యాకోబు ఇద్దరూ అంగీకరిస్తారు.

## లేఖనమే లేఖనాన్ని ఉత్తమంతా వ్యాఖ్యానిస్తుంది

ఈ సూత్రానికి ముందు చెప్పిన సూత్రంతో సన్నిహిత సంబంధం ఉంది. లేఖనం దానికదే విరుద్ధం కాదు గనుక అర్థంకాని లేఖనాలను అర్థం చేసుకోవడానికి, కష్టమైన వచనాలను వివరించడానికి సులభంగా అర్థమయ్యే వచనాలను వాడుకోవచ్చు; కష్టమైన వచనాలకు మన భాష్యాన్ని ఆపాదించడానికి సులభమైన వచనాలను వక్రీకరించము.

ఒక బైబిల్ భాష్యానికి సంబంధించిన పాఠ్యపుస్తకం ఇలా సెలవిస్తుంది: "బైబిల్లో అస్పష్టమైన ఒక భాగం మరో భాగంలో స్పష్టంగా ఉంటుంది."[30] లేఖనమంతటిని అధ్యయనం చేయడంవల్ల, సులభమైన వాక్యభాగాలు కష్టమైన వాక్యభాగాలను స్పష్టంగా అర్థం చేసుకోవడంలో సహాయం చేస్తాయి.

**ఒక ఉదాహరణ**

"ఇట్లు కానియెడల మృతులకొరకై బాప్తిస్మము పొందు వారేమి చేతురు? మృతులేమాత్రమును లేపబడనియెడల మృతులకొరకు వారు బాప్తిస్మము పొందనేల?" (1 కొరింథీయులకు 15:29).

ఈ వచనాన్ని బట్టి, బాప్తిస్మం పొందకుండా చనిపోయిన వారి పక్షాన బ్రతికున్నవారు బాప్తిస్మం పొందాలని కొందరంటారు. అయితే, అలా చేయాలని బైబిల్ మనకు ఎక్కడా చెప్పదు. తన పాఠకులు ఆచరించే ఆచారం గురించి పౌలు చెప్పాడు కాని, ఆ ఆచారం ఏంటో మనకు తెలీదు.

లేఖనమే, లేఖనాన్ని ఉత్తమంగా వివరిస్తుంది. 1 కొరింథీయులకు 15:29 వ్యాఖ్యానంలో ఈ సూత్రం మనల్ని నడిపిస్తుంది. కొరింథీయులకు 15:29. మత్తయి 28:19, అపొస్తలుల కార్యములు 2:41, అపొస్తలుల కార్యములు 8:12, మరియు అపొస్తలుల కార్యములు 19:5 మనం చదివినప్పుడు, బాప్తిస్మం సజీవులకని మనం చూస్తాం. 1 కొరింథీయులకు 15:29వ వచనం మృతుల బాప్తిస్మం గురించి స్పష్టంగా ఆజ్ఞాపించదు గనుక, ఆది సంఘపు సాధారణ ఆచారం గురించి ఇతర వచనాలు స్పష్టంగా చెబుతున్నాయి గనుక, 1 కొరింథీయులకు 15 మృతుల బాప్తిస్మాన్ని ఆజ్ఞాపిస్తుందని నమ్మడానికి వీలులేదు.

[30] Walter Kaiser and Moises Silva, An Introduction to Biblical Hermeneutics (Grand Rapids: Zondervan, 1994), 132.

## లేఖనం అర్థం చేసుకోవడానికి రాయబడింది

దేవుని వాక్య అర్థాన్ని కేవలం లేఖనంలోనే సాధారణ బాష్యం ఉపయోగించి కనుగొనవచ్చు. దేవుని వాక్యం రహస్య సంకేతాలతో రాయబడలేదు.

సంఘ ఆరంభం నుండి, సువార్త సత్యం కేవలం సంఘ సభ్యులకే కాదుగాని ప్రతి ఒక్కరికి బహిరంగంగా ప్రకటించబడుతుంది. తనను వెంబడించేవారికి రహస్య సిద్ధాంతాలేమి ఇవ్వలేదని యేసు చెప్పాడు (యోహాను 18:20). తాను బహిరంగంగా మాట్లాడిన సత్యాన్ని ఇతరులకు బోధించాలని, అపొస్తలుడైన పౌలు తిమోతికి చెప్పాడు (2 తిమోతికి 2:2). ఒకవేళ ప్రజలు సత్యాన్ని చూడలేకపోతే, అది రహస్యంగా ఉండటంవల్ల కాదుగాని సాతానుడు వారికి గ్రుడ్డితనం కలుగజేయడంవల్ల అని పౌలు వివరించాడు (2 కొరింథీయులకు 4:1-6). ఎల్లప్పుడు దేవుని సత్యాన్ని బహిరంగంగా ప్రకటించడమే సంఘ పని.

> "ప్రత్యేక బాష్యాలు సాధారణంగా తప్పు."
> - Gordon Fee,
> *How to Read the Bible*

లేఖనాన్ని దాని అర్థం కోసం జాగ్రత్తగా అధ్యయనం చేయాలి, కాని దాని సత్యం మనకు మరుగుగా లేదు. లేఖనంలోని ప్రాథమిక సత్యాలు అస్పష్టమైన వచనాల్లో మర్మాలుగా లేవు. "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది" (కీర్తన 119:105) అని కీర్తనాకారుడు చెప్పాడు. దేవుని వాక్య ఉద్దేశ్యం, మనల్ని నడిపించడం, సత్యాన్ని రహస్యంగా ఉంచడం కాదు.

దేవుని వాక్య సందేశం అర్థం చేసుకోవాలంటే, ప్రత్యేక తాళపు చెవులు అక్కర్లేదు. బైబిల్లో రహస్య సంకేతాలు బయలుపరుస్తామని చెప్పే పుస్తకాలు నమ్మొద్దు. మనమాయన వాక్యం అర్థం చేసుకొనునట్లుగా దేవుడు మాట్లాడాడు.

### ఒక ఉదాహరణ

ప్రతి కొన్ని సంవత్సరాలకు, ఎవరొకరు, "యేసు వచ్చే సంవత్సరంలో వస్తాడని దేవుడు నాకు బయలుపరచాడు" అని చెబుతారు. 1987లోని ఒక సుప్రసిద్ధ పుస్తకం, యేసు 1988లో తిరిగి వస్తాడని చెప్పింది. ప్రాచీన యూదుల పండుగలను అధ్యయనం చేసి, ఈ వాస్తవం కనుగొన్నానని రచయిత చెప్పాడు. అదే రచయిత, ఆ తర్వాత సంవత్సరంలో, 1989లో ఎత్తబడటం జరుగుతుందని మరో పుస్తకం రాశాడు. బైబిల్ ను అర్థం చేసుకోవడానికి మార్మికమైన లేక రహస్య మార్గాలపై ఆధారపడి ముఖ్య బోధలు చేసేవారిని మనం నమ్మకూడదు. "అయితే ఆ దినమునుగూర్చియు ఆ గడియనుగూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు" (మత్తయి 24:36) అని యేసు చెప్పాడు.

## బైబిల్ ఆజ్ఞ, బైబిల్ వాగ్దానాన్ని సూచిస్తుంది

దేవుడు ఆజ్ఞ ఇస్తే, విధేయతను సాధ్యపరుస్తాడని ఈ సూత్రం బోధిస్తుంది.

"కుమారుడా, నన్ను మెప్పించాలంటే రెండు నిమిషాల్లో ఒక మైలు దూరం పరిగెత్తాలి" అని చెప్పే తండ్రిని ఊహించుకోండి. కొంత సమయం, కుమారుడు తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు, కాని ఎల్లపుడు తన తండ్రి అంచనాలను అందుకోవడంలో విఫలమౌతాడు. తుదకు, కుమారుడు నిరుత్సాహపడి, ప్రయత్నించడం మానేస్తాడు. ఈయన మంచి తండ్రా?

దేవుడు, ఒక నిర్హేతుక తండ్రని కొందరు భావిస్తారు. "పరిశుద్ధులై యుండునట్లు,"[31] అని దేవుడు చెప్పినప్పుడు, "మనమాయన ఆజ్ఞలు గైకొనలేమని దేవునికి తెలుసు" అని వారంటారు.

"దేవుని [ఆజ్ఞల] ద్వారా మనుష్యుల బలం కొలవలేమని" జాన్ కెల్విన్ చెప్పాడు."[32] దేవుడు ఇచ్చు ఆజ్ఞలకు, మన బలంతో విధేయత చూపలేం, కాని రక్షించబడిన వారికి విధేయత చూపే శక్తి దేవుడు అనుగ్రహిస్తాడని కెల్విన్ నమ్మాడు. దేవుని వాక్యంలోని ప్రతి ఆజ్ఞ, విశ్వాసిలో దేవుని శక్తి నెరవేరుస్తుందనే వాగ్దానమని జాన్ వెస్లీ బోధించాడు.

ఒకడు తన సహజ, మానవ బలంతో దేవుని ఆజ్ఞను నెరవేర్చలేడు. కాని దేవుని ఆజ్ఞలను ఆయన శక్తి ద్వార మనం నెరవేర్చగలం. ప్రేమగల పరలోకపు తండ్రి, తన ఆజ్ఞలకు విధేయత చూపేలా తన పిల్లలను బలపరుస్తాడు. ప్రేమగల తండ్రి, అసాధ్యమైన ఆజ్ఞలతో తన పిల్లలను నిరాశపరచడు. లేఖనంలోని ప్రతి ఆజ్ఞ, ఆజ్ఞకు విధేయత చూపు కృపతో కూడి ఉంటుంది.

"నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువు ను ప్రేమింపవలెననునదియే" (మత్తయి 22:37) అని యేసు అజ్ఞాపించాడు. ఇది ఆజ్ఞ, మరియు వాగ్దానం. దేవుణ్ణి పూర్ణ హృదయంతో ప్రేమించాలనే దేవుని ఆజ్ఞ, మనమాయన్ని నమ్మితే పూర్ణహృదయం అనుగ్రహిస్తాడనే వాగ్దానాన్ని సూచిస్తుంది.

---

[31] దేవుడు దీన్ని కేవలం ఒక్కసారి కాదు, చాలాసార్లు చెప్పాడు. (లేవీయకాండము 11:44, 45, లేవీయకాండము 20:7, మరియు 1 పేతురు 1:16 చూడండి)

[32] John Calvin యొక్క 1 థెస్సలొనీకయులకు 5:23 పై వ్యాఖ్యానము Paul యొక్క Romans మరియు Thessalonians పత్రికల నుండి నుండి.

**ఒక ఉదాహరణ**

“మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు” (మత్తయి 5:48).

ప్రతి విషయంలో యేసు పరిపూర్ణత కోరడుగాని ప్రేమ గురించి మాట్లాడుతున్నాడని సందర్భాన్ని బట్టి అర్థమౌతుంది. ఇది మన సొంత బలంతో సాధించేది కాదని కూడా అర్థమౌతుంది. ఇది మన సొంత ప్రయత్నాలతో సాధించేది కాదని అర్థమౌతుంది. పరిపూర్ణులుగా ఉండాలని మనకు ఆజ్ఞాపించిన దేవుడు, ఆజ్ఞను నెరవేర్చు దేవుడు. “[దేవుడు] నాకు బలము ధరింపజేయువాడు ఆయనే నన్ను యథార్థమార్గమున నడిపించువాడు ఆయనే” (కీర్తన 18:32) అని కీర్తనాకారుడు సాక్ష్యమిచ్చాడు.

యేసు ఆజ్ఞను సరిగా అర్థం చేసుకోవాలి. యేసు బోధిస్తున్న సందర్భం యొక్క వెలుగులో, పరిపూర్ణమైన (పూర్ణ) హృదయం మరియు పరిశుద్ధమైన (ప్రత్యేకించబడిన) ప్రజలు గురించి బైబిల్ బోధనంతటి వెలుగులో (పూర్ణ) దానిని చదవాలి. ఒక్కసారి మనకిది అర్థమైతే, యేసు ఆజ్ఞ కృపగల వాగ్దానమౌతుంది కాని మానవ ప్రయత్నానికి అసాధ్య ప్రమాణమవ్వదు.


## బైబిల్‌పై మూడు అద్దాలు (lenses)

ఇవాంజెలికల్ క్రైస్తవులంగా, సిద్ధాంతం మరియు ఆచరణ విషయంలో బైబిల్ ను తుది అధికారంగా అంగీకరిస్తాం. బైబిల్ లో రక్షణకు అవసరమైన సమస్త జ్ఞానం ఉంది.

అయితే, మనం చదివిన వాటిని వేర్వేరు మార్గాల్లో అర్థం చేసుకుంటామని గుర్తించడం ముఖ్యం. చాలామంది ఇవాంజెలికల్ క్రైస్తవుల ప్రకారం, మనం బైబిల్ ను మూడు అద్దాల గుండా చదువుతాం. ఈ అద్దాలు ఏ విధంగానైన లేఖన అధికారాన్ని భర్తీ చేయవు. అవి, కేవలం మనం లేఖనాన్ని చదివి, గ్రహించే విధానాలు.

లేఖనాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, ఈ మూడు అద్దాలను ఉపయోగించాలి. ఒక్క అద్దాన్ని పట్టించుకోక పోయినా, లేఖనాన్ని తప్పుగా వ్యాఖ్యానిస్తాం. ఈ అద్దాలను ఉపయోగించి బైబిల్ ను చదివితే, దేవుని వాక్య సందేశాన్ని మరింత ఉత్తమంగా అర్థం చేసుకోగలం.

ఈ అద్దాలకు బైబిల్ తో ఉన్న సంబంధాన్ని చూడటానికి ఈ చిత్రం మీకు సహాయపడవచ్చు. మనం బైబిల్ ను అద్దాల గుండా చూస్తాం.[33]




**1వ అద్దం: సంప్రదాయం**

> "సంప్రదాయం, యుగాల నుండి ఆత్మ బోధనా కార్యకలాపాల ఫలం....ఇది తప్పుపట్టలేనిది కాదు, కాని అది [అప్రాముఖ్యం] కూడా కాదు, మరియు దానిని విస్మరిస్తే, మనల్ని మనం బీదలుగా చేసుకున్నట్లే."
> - J.I. Packer,
> "Upholding the Unity of Scripture Today"

లేఖనాన్ని చూసే మొదటవ అద్దం, సంప్రదాయం. సాంప్రదాయ అద్దం ఇలా అడుగుతుంది, "ఈ లేఖనాన్ని చరిత్ర అంతటా క్రైస్తవులు ఎలా అర్థం చేసుకున్నారు?" సంప్రదాయం, వాక్యభాగంపై చరిత్ర అంతటా ఇతర క్రైస్తవులకున్న అవగాహనలతో పోల్చుతూ, మన అవగాహనను పరీక్షిస్తుంది.

సంప్రదాయంలో, ఆది సంఘం విశ్వాస ప్రమాణాలు, గతంలో క్రైస్తవులను ఐక్యపరచిన గొప్ప సిద్ధాంతాలు, ఆరంభ తరాలవారి బోధలు భాగంగా ఉన్నాయి. సంఘ చరిత్రయంతటా బైబిల్ ను ఎలా వ్యాఖ్యానించారో సంప్రదాయం చూపిస్తుంది.

సంఘ సంప్రదాయం అన్ని విషయాలను అంగీకరించదు; అన్నిచోట్లా, అన్ని సమయాల్లో సంఘం బోధించిందే అత్యంత నమ్మదగిన సంప్రదాయం. వ్యక్తిగత డినామినేషన్ల సంప్రదాయాన్ని పరిగణించాలి కాని, సార్వత్రిక సంఘ సంప్రదాయానికున్న అధికారం దీనికి ఉండదు.

---

[33] ఈ ఉదాహరణ Danny Coleman యొక్క వెబ్లాగ్: https://dannycoleman.blogspot.com/2013/02/quadrilateral-lenses.html. Wolfgang Eckert చేత బైబిల్ యొక్క చిత్రం Pixabay నుండి, https://pixabay.com/illustrations/a-book-bible-literature-pages-6402285/ నుండి తీసుకున్నాం.

తన వాక్యాన్ని అర్థం చేసుకోవడానికి మనకు సహాయంగా దేవుడు సంప్రదాయం ద్వారా మాట్లాడాడు. ఒకవేళ, మీ బాష్యం మరెవరూ చూడని లేఖన అర్థాన్ని ఇస్తే, మీరు పొరబడ్డారని భావించాలి!

**2వ అద్దం: తర్కం**

మనం ఉపయోగించే రెండవ అద్దం, తర్కం. ఈ అద్దం ఇలా అడుగుతుంది, "ఈ లేఖనంలో హేతుబద్ధమైన అవగాహన ఏంటి?" మనం లేఖనంలో చదివిన దానిని అర్థం చేసుకోవడానికి మనసు ఉపయోగించాలని ఈ తర్కపు అద్దం చెబుతుంది. లేఖనాన్ని మనసు ద్వారా హేతుబద్ధంగా అర్థం చేసుకోగలమని ఇది గ్రహిస్తుంది. లేఖనాన్ని అర్థం చేసుకోవడానికి మనం బుద్ధిని, తర్కాన్ని ఉపయోగిస్తాం; అయితే, అది సత్యమని నిరూపించడానికి బుద్ధిని, తర్కాన్ని ఉపయోగించలేనందున లేఖన సత్యాన్ని విస్మరించకూడదు. చాలామంది బైబిల్లోని అద్భుతాలను తిరస్కరిస్తారు ఎందుకంటే అద్భుతాలు ఆలోచనకు, తార్కిక జ్ఞానానికి విరుద్ధమని భావిస్తారు. అయితే, అద్భుతాలు తార్కికతకు విరుద్ధం కాదు ఎందుకంటే అద్భుతాలు చేసే శక్తి దేవునికి ఉందని మనం హేతుబద్ధంగా, తార్కికంగా గ్రహిస్తాం.

కొందరు క్రైస్తవులు తర్కాన్ని, ఆలోచనను వ్యతిరేకిస్తారు; దేవుని వాక్యాన్ని గ్రహించే విషయంలో మన పతనమైన మనసులను నమ్మకూడదని వారు వాదిస్తారు. మానవుల మేధో శక్తి పరిమితమనేది వాస్తవం. అయితే, పౌలు తన వాదనలు చేస్తున్నప్పుడు నిరంతరం తర్కానికి చోటిచ్చాడు. ఉదాహరణకు, రోమా పత్రికలో, తన పాఠకులను, రక్షణ విషయంలో గొప్ప సత్యాల గురించి తార్కిక అవగాహనకు నడిపించే ప్రశ్నలు అడిగాడు. అయితే మన ఆలోచన, భావన తుది అధికారం కానప్పటికీ, లేఖనంలోని హేతుబద్ధమైన అర్థాన్ని మనం విస్మరించకూడదు.

**3వ అద్దం: అనుభవం**

చివరి అద్దం, అనుభవం. ఈ అద్దం ఇలా అడుగుతుంది, "నా అవగాహన ఇతర క్రైస్తవుల అనుభవానికి సరిపోతుందా?" సంపూర్ణ సత్యం కంటే వ్యక్తిగత అనుభవాన్ని నమ్మకూడదు. అయితే, సంప్రదాయం, హేతువుతో సమతుల్యమైనప్పుడు అనుభవం విలువైంది.

ప్రతి అద్దం ముఖ్యమే. కేవలం సంప్రదాయమే వాడితే, అధికారంలో సంఘ బోధను, లేఖనంతో సమానంగా చూసే రోమన్ కాథలిక్ లోపాలకు గురౌతాం. మనం కేవలం హేతువునే వాడితే, మనసును తుది అధికారంగా చూస్తాం. కేవలం అనుభవం మాత్రమే వాడితే, మన బాష్యం పరిమితంగా ఉంటుంది మరియు అది వ్యక్తుల వ్యక్తిగత భావాలు, దృక్పథాలు, అభిప్రాయాలపై ఆధారపడుతుంది. ఈ అద్దాలు, మనం లేఖనాన్ని అర్థం చేసుకొనే మార్గాలు, కానీ అవి లేఖన అధికారానికి విరుద్ధమైన విధానంలో ఉపయోగించకూడదు.

**ఒక ఉదాహరణ**

"తండ్రియెదుట నేను మోకాళ్లూని ... జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను" (ఎఫెసీయులకు 3:14, 19).

ఎఫెసీ విశ్వాసులు దేవునితో వారికున్న సహవాస విషయంలో లోతుగా వేరుపారాలని పౌలు ప్రార్థించాడు. దేవుని సంపూర్ణతతో నింపబడాలని ప్రార్థించాడు. మూడు అద్దాల ద్వార ఈ ప్రార్థన చదివినప్పుడు, మనం ఏం కనుగొంటాం?

**సంప్రదాయం**. దేవుడు విశ్వాసులకు లోతైన జీవితాన్ని వాగ్దానం చేశాడని అన్ని యుగాల క్రైస్తవులు బోధించారు. దేవుడు విశ్వాసుల్లో ఈ ఉద్దేశ్యాన్ని ఎలా నెరవేరుస్తాడనే వివరాలపై క్రైస్తవులు ఏకీభవించరు, కాని సంఘ చరిత్ర అంతటా, విభిన్న నేపథ్యాలుగల క్రైస్తవులు, దేవుడు తన పిల్లలను లోతైన సహవాసంలోకి పిలుస్తున్నాడని అంగీకరించారు.

రెండవ శతాబ్దంలో, మన యెడల దేవుని ఉద్దేశ్యం "మనం ఆయన స్వరూపంలో, పోలికలో సృష్టించబడటం" అని ఐరేనియస్ రాశాడు.[34] ప్రతి విశ్వాసి దేవుని సంపూర్ణతతో నింపబడగలడని ఐరేనియస్ నమ్మాడు. నాల్గవ శతాబ్దంలో, నిస్సా వాడైన గ్రెగోరి వంటి తూర్పుప్రాంత రచయితలు, క్రైస్తవుడు దేవుని సంపూర్ణతతో ఎక్కువగా నింపబడాలని బోధించారు. 17వ శతాబ్దంలో, ఫ్రెంచ్ కాథలిక్ ఫ్రాంకోయిస్ ఫెనెలోన్ ఇలా రాశాడు, దేవుని కృపగల బలం ద్వార మనం "యేసు జీవించినట్లుగా జీవించగలం, ఆయన అలోచించినట్లుగా ఆలోచించగలం...."[35] దేవుని కృప ద్వార, మనమాయన స్వరూపానికి అనుగుణంగా ఉండగలం.

**తర్కం**. పౌలు ప్రార్థన చదివేటప్పుడు, మన తర్కం ఇలా అడుగుతుంది: "నేను ఈ ప్రార్థనకు చేసిన వ్యాఖ్యానం మిగిలిన లేఖనానికి అనుగుణంగా ఉందా?" ఈ ప్రార్థన, క్రైస్తవునికి లోతైన జీవితాన్ని ప్రసాదించే వాగ్దానమని చెప్పడం సహేతుకమేనా? ఇతర లేఖనాలు చూసినప్పుడు, రోమా 12:1, 1 థెస్సలొనీకయులకు 5:23, మరియు ఇతర వాక్యభాగాలు విశ్వాసికి అందుబాటులో ఉన్న లోతైన జీవితాన్ని సూచిస్తున్నట్లు మనం చూస్తాం. దేవుని సంపూర్ణతతో నింపబడటమనే వాస్తవం సహేతుకం.

**అనుభవం**. చరిత్ర అంతటా గొప్ప గొప్ప క్రైస్తవుల అనుభవం, లోతైన జీవితం కొరకైన వారి ఆరాటాన్ని చూపిస్తుంది. సమర్పణగల ప్రతి క్రైస్తవుడు దేవుని కోసం మరింత ఆకలితో ఉంటాడు. ఈ ఆకలి దేవుని కృప ద్వారా తృప్తిపరచబడిందని గొప్ప క్రైస్తవుల సాక్ష్యాలు చూపిస్తాయి.

---

[34] William M. Greathouse, *From the Apostles to Wesley* (Kansas City: Beacon Hill Press, 1979), 38 లో సూచించినట్లుగా

[35] *From the Apostles to Wesley*, 85

## చర్చించవలసిన వాక్యభాగాలనను పరిగణలోనికి తీసుకున్నప్పుడు అడుగవలసిన ప్రశ్నలు

సంఘాల్లో వాక్యభాగాలను వేర్వేరుగా వ్యాఖ్యానిస్తారు, అవి కొన్నిసార్లు స్నేహితుల మధ్య చర్చనీయాంశంగా మారతాయి. ఆ వాక్యభాగాలలో ఒకదానిని మీరు చూసినప్పుడు, మీ అభిప్రాయాన్ని సమర్థించుకోకుండ, ఈ ప్రశ్నలను అనుసరించండి:

- నేను ముగింపు నిర్ణయంతో మొదలుపెడుతున్నానా? నేను చదవడానికి ముందుగానే లేఖనం ఏం చెప్పాలో ఇప్పటికే నిర్ణయించానా?
- ఈ వాక్యభాగం విషయంలో నా బాష్యం, ఇతర వాక్యభాగాలకి విరుద్ధంగా ఉందా?
- ఈ వాక్యభాగం గురించి ఇతర వచనాలు స్పష్టమైన అవగాహన ఇస్తాయా?
- నా బాష్యం రహస్య సందేశ ఆధారంగా ఉందా లేక వాక్యభాగాన్ని సాధ్యమైనంత స్పష్టంగా వ్యాఖ్యానిస్తున్నానా?
- ఈ వాక్యభాగం ఆజ్ఞ ఇస్తుందా? ఇస్తే, ఆజ్ఞ సూచించే వాగ్దానం ఏంటి?
- ఈ వాక్యభాగం గురించి క్రైస్తవ సంఘు సంప్రదాయం ఏం చెబుతుంది?
- ఈ వాక్యభాగంలో స్పష్టమైన, హేతుబద్ధమైన అవగాహన ఏంటి?
- ఈ వాక్యభాగం గురించి ఇతర క్రైస్తవుల అనుభవం ఏం చెబుతుంది?

వాక్యభాగం బాష్యం విషయంలో పూర్తి అంగీకారం కనుగొంటారని ఈ ప్రశ్నలు హామీ ఇవ్వవు. అయితే, అంగీకార విషయాలు కనుగొనే విషయంలో సహాయపడతాయి. దేవుని వాక్య అధికారానికి కట్టుబడియున్న యధార్ధ క్రైస్తవులు, లేఖనంలోని కొన్ని వాక్యభాగాల వ్యాఖ్యాన విషయంలో విభేదించే కారణాలు గుర్తించటానికి సహాయపడతాయి.

## పాఠం 8 ముఖ్య విషయాలు

(1) బైబిల్ బాష్యానికి ప్రాథమిక సూత్రాల అవగాహన, అధ్యయనంలో తప్పుడు ముగింపు నిర్ణయాలకు రాకుండా మీకు సహాయపడుతుంది.

(2) వాక్యభాగంతో మొదలుపెట్టండి, కాని మీ ముగింపు నిర్ణయంతో కాదు. వాక్యభాగాన్ని విస్మరించేలా మీ ఊహలను అనుమతించొద్దు.

(3) లేఖన బోధలు, లేఖన బోధలకు విరుద్ధం కావు. రెండు వాక్యభాగాలు, ఒకదానికొకటి విరుద్ధంగా కనిపించినప్పుడు, ఒక వాక్యభాగాన్ని మీరు తప్పుగా అర్థం చేసుకున్నారేమో చూడండి.

(4) లేఖనమే లేఖనాన్ని ఉత్తమంతా వ్యాఖ్యానిస్తుంది. కష్టమైన వాక్యభాగాలు వివరించటానికి సులభమైన వాక్యభాగాలను సంప్రదించండి.

(5) లేఖనం, అర్థం చేసుకోవడానికి రాయబడింది. వాక్యభాగంలో సులభమైన అర్థం కోసం చూడండి.

(6) బైబిల్ ఆజ్ఞ, బైబిల్ వాగ్దానాన్ని సూచిస్తుంది. ఆజ్ఞ ఇచ్చు దేవుడు, మన విధేయతను బలపరుస్తాడు.

(7) బైబిల్ లో రక్షణకు అవసరమైన సమస్త జ్ఞానం ఉంది.

(8) దేవుని వాక్య అవగాహనలో సహాయపడు మూడు అద్దాలను చూస్తాం:

- సంప్రదాయం: చరిత్ర అంతటా ఇతర క్రైస్తవుల అవగాహనలు
- తర్కం: వాక్య అర్థంలో హేతుబద్ధమైన అవగాహన
- అనుభవం: క్రైస్తవుల ఆత్మీయ అనుభవం

# పాఠం 9

# అన్వయం

## పాఠం లక్ష్యాలు

(1) బైబిల్ అన్వయంలో తప్పుడు మార్గాల పట్ల జాగ్రత్త వహించడం.

(2) వాక్యభాగ భాష్యంలో నుండి అన్వయంలోకి వెళ్ళేటప్పుడు ఒక ప్రక్రియ అనుసరించడం

(3) వాక్యభాగ అన్వయం కనుగొనడానికి ప్రత్యేక ప్రశ్నలు తెలుసుకోవడం.

(4) ఎన్నుకున్న వాక్యభాగాల విషయంలో ఈ దశలు పాటించడం.

## పరిచయం

► మీ ప్రస్తుత బైబిల్ అధ్యయనంలో **భాష్యం, అన్వయం** మధ్య సంబంధం గురించి చర్చించండి. మీరు ప్రసంగించేటప్పుడు లేక బోధించేటప్పుడు, ఏది సులభం: వాక్యభాగాన్ని అర్థం చేసుకోవడమా లేక నేటి లోకానికి దాన్ని అన్వయించడమా? మీరు లేఖనం చదివేటప్పుడు లేక ప్రసంగం వినేటప్పుడు, మీ జీవితానికి అన్వయాన్ని కనుగొనగలుగుతున్నారా?

"పాస్టర్, మనం కలవచ్చా? బైబిల్ గురించి నాకు ఒక పెద్ద ప్రశ్న ఉంది" అని సునీల్ అన్నాడు. ఆ వారం తర్వాత, పాస్టర్ సునీల్ ను కలిసి, అతడు ఎదుర్కొంటున్న సమస్య గురించి అనేక వాక్యభాగాలు చూశాడు. కొన్ని నిమిషాలు తర్వాత, సునీల్ తన బైబిల్ మూసేసి, "నిజాయితీగా చెప్తున్నాను. బైబిల్ ఏం చెబుతుందో నాకు తెలుసు, కాని నేను ఇలా చేయను. ఇది చాలా కష్టం" అని చెప్పాడు.

> "ఎవడైనను వాక్యమును వినువాడైయుండి దానిప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా."
> - యాకోబు 1:23-24

సునీల్ సమస్య భాష్యం కాదు; అన్వయం. లేఖనం ఏం చెబుతుందో పరిశీలించి, దాని అర్థాన్ని గ్రహిస్తే చాలదు; దాన్ని మన జీవితాలకు అన్వయించుకోవాలి. చాలాసార్లు, బైబిల్ అధ్యయనం భాష్య దశతో ఆగిపోతుంది.

మనం, లేఖనం ఏం సెలవిస్తుందో పరిశీలిస్తూ మొదలుపెడతాం; దాని అర్థం ఏంటో గ్రహిస్తాం; ఆ వాక్యభాగాన్ని మన జీవితాలకు అన్వయిస్తూ ముగిస్తాం . ఈ ప్రక్రియను మూడు ప్రశ్నల్లో సంగ్రహించవచ్చు:

- వాక్యభాగం ఏం చెబుతుంది? (పరిశీలన)
- వాక్యభాగం అర్థం ఏంటి? (భాష్యం)
- నా జీవితంలో ఆ వాక్యం ఎలా పనిచేస్తుంది? (అన్వయం)

## అన్వయానికి ప్రత్యామ్నాయాలు

యెహోవా ధర్మశాస్త్రమందు ఆనందించుచు దివారాత్రులు దానిని ధ్యానించువాడు "నీటికాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలెనుండును" (కీర్తన 1:2-3) అని కీర్తనాకారుడు చెప్పాడు. సాతానుడు మనల్ని బైబిల్ కి వ్యతిరేకంగా ఉంచాలని ప్రయత్నిస్తాడు. మనం అనుదినం దేవుని వాక్యాన్ని తీసుకోకపోతే, బలహీనులై ఆత్మీయంగా చనిపోతామని వాడికి తెలుసు.[36]

సాతానుడు మనల్ని దేవుని వాక్యానికి దూరంగా ఉంచలేకపోతే, సత్యాన్ని మన జీవితాలకు అన్వయించుకోకుండా చేస్తాడు. మనం దేవుని వాక్య ప్రకారంగా జీవించనంత కాలం, ఫలభరితంగా ఉండలేం. బైబిల్ చదవకుండ సాతానుడు మనల్ని నిరోధించలేకపోతే, అన్వయాన్ని మరోదానితో భర్తీ చేసే శోధనలో మనల్ని పడేస్తాడు.

### మనం అన్వయాన్ని భాష్యంతో భర్తీ చేస్తాం

లేఖన భాగాన్ని జాగ్రత్తగా ఆధ్యయనం చేసి, దాని అర్థాన్ని నిర్ధారించి, దానిని పాటించకపోవడం సాధ్యమే. పేదవాడి గొర్రెపిల్లను తీసుకున్న ధనవంతుని ఉపమానం, నాతాను దావీదుకు చెప్పినప్పుడు, అతడు సరైన అర్థ వివరణతో ప్రతిస్పందించాడు. "యెహోవా జీవముతోడు నిశ్చయముగా ఈ కార్యము చేసినవాడు మరణపాత్రుడు. వాడు కని కరము లేక యీ కార్యము చేసెను గనుక ఆ గొఱ్ఱెపిల్లకు ప్రతిగా నాలుగు గొఱ్ఱెపిల్లల నియ్యవలెనని" (2 సమూయేలు 12:5-6).

దావీదు భాష్యం సరైనది. అతను యెహోవా జీవముతోడు అని ప్రతిస్పందించాడు; న్యాయాన్ని నొక్కి చెప్పాడు; ప్రతీకారం కోరాడు. దావీదు భాష్యాన్ని ఎవరు తప్పుపట్టలేరు, కాని దావీదు ఆ ఉపమానాన్ని తన జీవితానికి అన్వయించుకోలేదు. ప్రవక్త అన్వయం ఇచ్చాడు, "ఆ మనుష్యుడవు నీవే." (2 సమూయేలు 12:7).

ప్రసంగికులకు, బోధకులకు ఇది ప్రమాదకరం. మనం వ్యక్తిగతంగా విధేయత చూపడాన్ని ప్రక్కన పెట్టి, లేఖనాల్ని ఇతరులకు బోధించగలం. విధేయత లేకుండా బైబిల్ ని అర్థం చేసుకోవడానికి, వివరించడానికి వ్యతిరేకంగా యాకోబు

[36] ఈ పాఠంలోని మెటీరియల్ Howard G. Hendricks and William D. Hendricks, *Living by the Book* (Chicago: Moody Publishers, 2007) నుండి తీసుకున్నారు.

హెచ్చరించాడు. "కాబట్టి మేలైనదిచేయ నెరిగియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును" (యాకోబు 4:17). మనం లేఖనాన్ని సరిగా భాష్యం చేసిన తర్వాత, దాన్ని ఆచరణలో పెట్టడంలో విఫలమవ్వకూడదు. మనం అన్వయాన్ని భాష్యంతో భర్తీ చేయకూడదు.

**మనం సంపూర్ణ విధేయతను పాక్షిక విధేయతతో భర్తీచేస్తాం**

ఒక లేఖన భాగాన్ని అధ్యయనం చేసి, దాని అర్థాన్ని నిర్ధారించి, మనల్ని పూర్తిగా మారడానికి అనుమతించని కొన్ని అన్వయాలు కనుగొనడం సాధ్యమే. లేఖనాలకు విధేయత చూపే భాగాలు మనం కనుగొనవచ్చు కాని మన జీవితాల్లో లోతైన అవిధేయత చూపించు విషయాలను విస్మరించవచ్చు.

మనం ఎఫెసీయులకు 4:29 అధ్యయనం చేస్తూ ఉండొచ్చు, "వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అను కూలవచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీ నోట రానియ్యకుడి." అన్వయం దశలో, మనం ప్రాముఖ్యమైన మన సంబంధాలను పరిశీలిస్తాం. మనం ఇలా అడుగుతాము:

- "నా ప్రసంగాలు నా సంఘాన్ని నిర్మిస్తాయా?" "అవును; నేను నమ్మకమైన సేవకుడను."
- "నేను నా పిల్లల విషయంలో సహాయపడే పదాలు ఉపయోగిస్తానా?" "అవును; నేను ప్రేమగల తండ్రిని."
- "నా భాగస్వామిని నిర్మించుకుంటానా?" "కాదు; నా ప్రతిస్పందనల విషయంలో నేను ఎల్లప్పుడు ప్రతికూలంగా ఉంటాను."

మీరు మీ భాగస్వామితో సంభాషించే విషయంలో మారాలని దేవుని ఆత్మ ఆశిస్తున్నాడు. మీ భాగస్వామితో మీకున్న సంబంధాన్ని రూపించు విధంగా ఈ వాక్యభాగాన్ని అన్వయించుకోనీయకుండ మరో విషయాలలో విధేయత చూపునట్లు సాతానుడు మిమ్మల్ని శోధిస్తాడు. పరిపూర్ణ విధేయతకు కట్టుబడి ఉండనీయకుండా పాక్షిక విధేయతతో జీవించే శోధనలో పడేస్తాడు.

**మారుమనస్సును సాకులతో భర్తీ చేస్తాం**

"బోధకుడా, నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని" (లూకా 10:25) అని ధర్మశాస్త్రోపదేశకుడొకడు యేసును అడిగాడు. ధర్మశాస్త్రోపదేశకుడికి సమాధానం తెలుసు: "నీ దేవుడైన ప్రభువు ను నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణమనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణవివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెననియు, వ్రాయబడియున్నదని" (లూకా 10:27).

ధర్మశాస్త్రోపదేశకుడు లేఖనాన్ని గ్రహించాడు. "అయితే తాను నీతిమంతుడైనట్టు కనబరచుకొనగోరి, అతడు—అవును గాని నా పొరుగువాడెవడని యేసునడిగెను" (లూకా 10:29). అతని సమస్య భాష్యం కాదు; అతని సమస్య అన్వయం. ధర్మశాస్త్రోపదేశకుడొకడు తన ప్రేమలేమిని సమర్థించుకున్నాడు.

బహుశ దేవుని ఆత్మ మీతో, "నీ మాటలు నీ భాగస్వామికి క్షేమాభివృద్ధి కలిగించవు; ఇది నాశనకరమైన సంభాషణ." అని చెప్పవచ్చు. నీవు వాక్యం చదివావు; వాక్యం అర్థం చేసుకున్నావు; ఇది వాక్యాన్ని అన్వయించుకునే సమయం. బదులుగా, మీరు ఇలా అనుకోవచ్చు, "నా భాగస్వామి ఎల్లప్పుడు ప్రతికూలంగా ఉంటారు. నేను ప్రతికూలంగా ఉన్నాను అంటే దాని అర్థం నా భాగస్వామి ప్రతికూలం. అది నా తప్పు కాదు!" మీరు ఏమి చేశారు? దేవుని వాక్యానికి విధేయత చూపడంలో విఫలమైనప్పుడు పశ్చాత్తాపపడకుండా మీ ప్రవర్తనను మీరు సమర్థించుకున్నారు.

### రూపాంతరాన్ని భావోద్వేగంతో భర్తీచేస్తాం

వాక్యం విని దాని ప్రకారం నడువని వ్యక్తి గురించి యాకోబు రాశాడు (యాకోబు 1:23-24). కొన్నిసార్లు ఒక వ్యక్తి వాక్యం విని నిజంగా కదలించబడతాడు, కాని నిజమైన మార్పుకు ప్రతిగా భావోద్వేగ ప్రతిస్పందనను అనుమతిస్తాడు. ప్రతి సేవకుడు ఒక విషయంపై ప్రసంగించడంలో నిరాశను అనుభవిస్తాడు, ప్రజలు "ఆ ప్రసంగం నాతో మాట్లాడింది" అని చెప్తారు గాని, వారిలో ఎటువంటి మార్పు కనుబరచరు.

బహుశా మీరు వివాహం గురించిన సదస్సులో ఎఫెసీయులకు 4:29 బోధన వినవచ్చు. సదస్సు చివర్లో జరిగే సమర్పణ సమయంలో, మీరు మీ భాగస్వామితో "నన్ను క్షమించు. నేను సానుకూల మాటలే మాట్లాడతాను. మంచిగా ఉంటాను!" అని చెబుతారు. అయితే, వెంటనే మునుపటివలే కఠినంగా, ప్రతికూలంగా, బాధించే విధంగా మాట్లాడతారు.

ఏమి జరిగింది? అది భావోద్వేగ ప్రతిస్పందనే గాని నిజమైన మార్పు కాదు. ఇది చాలా ప్రమాదకరం; పదే పదే విఫలమైనప్పుడు, మార్పు అసాధ్యమని భావిస్తాం. సత్యానికి భావోద్వేగ ప్రతిస్పందన తప్పనిసరిగా నిజమైన రూపాంతరం, విధేయతతో ఉండాలి. మనం పరిశుద్ధాత్మని కార్యానికి లోబడినప్పుడు మాత్రమే ఇవి సాధ్యమౌతాయి.

## లేఖనాన్ని అన్వయించే దశలు

తన సహజ ముఖాన్ని అద్దంలో చూసుకుని, అవతలికి పోయి తానేట్టివాడో మర్చిపోయిన వ్యక్తి గురించి చెప్పిన తరువాత, తన జీవితంలో లేఖనాన్ని సరిగా అన్వయించుకునే వ్యక్తి గురించి యాకోబు వివరించాడు: "అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలుకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు

కాక, క్రియను **చేయువాడైయుండి** తన క్రియలో ధన్యుడగును" (యాకోబు 1:25). వాక్యం వింటే సరిపోదు, వాక్యాన్ని అన్వయించుకోవాలి. లేఖనాన్ని సరిగా అన్వయించుకోవాలంటే ఏది అవసరం?

లేఖనాల్ని మన జీవితాలకు అన్వయించుకోవాలంటే, మీరు మూడు విషయాలు అనుసరించాలి:

**దశ 1: లేఖన అర్థం తెలుసుకోవాలి**

అందుకే పరిశీలన మరియు భాష్యం గురించిన పాఠాలు ప్రాముఖ్యం. మనకు లేఖనం తెలియకపోతే, మన అన్వయం సరిగా ఉండదు. "మొదటి శతాబ్దపు క్రైస్తవులు తమ సమాజానికి ఈ లేఖనం ఎలా అన్వయించుకున్నారు?" అనే ఈ ప్రశ్న అడుగుతూ అన్వయం దశను ఆరంభిస్తాం.

ఉదాహరణకు, "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీయులకు 4:13) అని పౌలు రాశాడు. కొందరు బోధకులు ఈ వాగ్దానం తీసుకుని, "క్రీస్తు నన్ను బలపరచును" గనుక మనం కోరినది ఏదైనా దానిని సాధించగలమని చెబుతారు. "క్రీస్తునందు నేను సమస్తాన్ని చేయగలను' గనుక నేడు ఆటలో నేనే గెలుస్తాను" అని జెట్టివారు చెబుతారు. "మీకు విశ్వాసం ఉన్నట్లయితే, 'క్రీస్తునందు మీరు సమస్తం చేయగలరు" గనుక స్వస్థపడతారు" అని స్వస్థతలు చేసేవారు తమ సందేశాలు వినే వారికి భరోసా ఇస్తారు. "దేవుడు మిమ్మును సంపన్నులుగా చేస్తాడు. మీరు చేయవలసినదంతా దేవునితో సహకరించడమే. "క్రీస్తునందు మీరు సమస్తము చేయగలరు'" అని శ్రేయస్సు సువార్త ప్రకటించేవారు చెబుతారు.

"ఫిలిప్పీ క్రైస్తవులు ఈ వచనం ఎలా అన్వయించుకుంటారు?" అని మనం అడిగినప్పుడు, ఇది లోక సంబంధమైన విజయాన్ని గూర్చిన వాగ్దానం కాదుగాని ఆత్మీయ సహనం గురించిన వాగ్దానమని మనం గ్రహిస్తాం. పౌలు రోమా చెరసాలలో ఉన్నాడు; అతని శ్రోతలు హింసించబడుతున్నారు. అతడు లోక సంబంధమైన విజయం పొందానని చెప్పడం లేదు గాని విశ్వాసం మరియు విధేయత ద్వారా ప్రతి పరిస్థితిలో సహనంగా ఉన్నానని చెప్తున్నాడు. పౌలు, అన్ని విషయాల్లో సంతృప్తిగా ఉండడం నేర్చుకున్నాడు ఎందుకంటే క్రీస్తు ద్వారా దేవుడు తన నుండి కోరినది అతడు చేయగలడు. దీనర్థం, సౌకర్యవంతమైన జీవితం కాదు; కష్టసమయాల్లో కూడా అతడు తన సంతృప్తికరమైన విధానాన్ని కోల్పోలేదని చెప్తున్నాడు.

**దశ 2: లేఖనం జీవితానికి ఎలా వర్తిస్తుందో గ్రహించాలి**

ఇతరులకు ప్రభావవంతంగా పరిచర్య చేయాలంటే మొదట తననుతాను తెలుసుకోవాలని పౌలు తిమోతిని హెచ్చరించాడు. "నిన్నుగూర్చియు నీ బోధనుగూర్చియు జాగ్రత్త కలిగియుండుము, వీటిలో నిలుకడగా ఉండుము;

నీవీలాగుచేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు" (1 తిమోతికి 4:16). తిమోతి తన విషయంలో మరియు తాను ప్రకటించు సిద్ధాంతం విషయంలో ఆసక్తిగా ఉన్నప్పుడు, తన శ్రోతలకు ప్రభావవంతంగా పరిచర్య చేయగలడు.

నేను లేఖనం గురించి మరియు మొదటి శ్రోతలకు అది ఎలా అన్వయించబడిందో అనే విషయం గురించి తెలుసుకున్న తరువాత, నా గురించి నేను తెలుసుకోవాలి. అదే విధంగా ఆ వాక్యభాగం నా సమాజానికి ఎలా వర్తిస్తుందో తెలుసుకోవాలి. బహుశ నన్ను నేను చూసుకున్నప్పుడు, దేవుడు నాకు సహాయం చేసి, నన్ను ఆశీర్వదిస్తాడని సాధారణంగా నేను భావించను. ఫిలిప్పీ 4:13వ వచనం జీవిత సవాళ్లను నమ్మకంతో ఎదుర్కోవాలని నాకు సెలవిస్తుంది, ఎందుకంటే "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను."

ఇప్పుడు, అన్వయం స్పష్టంగాను, నిర్దిష్టంగాను ఉంటుంది. ఈ వచనం ప్రక్కన, నేను ఇలా రాయవచ్చు: "క్రైస్తవ విలువలకు వ్యతిరేకంగా ఉన్న సమాజంలో నేను పనిచేస్తుండగా, విశ్వాస విషయంలో నన్ను బలపరచడానికి దేవుని కృపపై ఆధారపడతాను. **క్రీస్తునందు నేను సమస్తాన్ని చేయగలను**." ఇది వచనాన్ని మొదటి శతాబ్దం నుండి ఇరవై ఒకటవ శతాబ్దంలోకి నడిపిస్తుంది.

లేఖనం యొక్క సరైనటువంటి అన్వయం నిజమైన లోకంలో పనిచేస్తుంది. దేవుని వాక్యం జీవితంలోని ప్రతి కోణానికి వర్తిస్తుంది. నేను లేఖనాన్ని అన్వయిస్తుండగా, "ఈ వాక్యభాగంలో మతపరమైన అన్వయం ఏంటి?" అని నేను అడగను కాని దానికి బదులుగా, "జీవితంలోని ప్రతి కోణంలో ఈ వాక్యం ఎలా వర్తిస్తుంది?" అని అడుగుతాను.

జాన్ వెస్లీ ఇలా రాశాడు: "క్రీస్తు సువార్తకు మతం కాదుగాని సమాజం తెలుసు. పరిశుద్ధత కాదు, సాంఘిక పరిశుద్ధత."[37] మనం సువార్తను సమాజానికి వెలుపల ఉన్న సన్యాసుల వలే కాదుగాని ఇతరులతో సంబంధం కలిగిన విశ్వాసులవలే జీవిస్తాం. పరిశుద్ధత విషయంలో ఇతరులకు వేరుగా కాదుగాని, సంఘ సమాజ సందర్భంలో జీవిస్తాం.

మునుపు మనం ఎఫెసీయులకు 4:29 చూశాం. ఈ వచన అన్వయాన్ని పరిగణలోనికి తీసుకున్నప్పుడు, ఇతర క్రైస్తవులతో నాకు ఉన్న సంబంధాలకు దీనిని అన్వయించాలి: "నా మాటలు తోటి విశ్వాసులకు క్షేమాభివృద్ధి కలుగజేస్తున్నాయా లేక పతనం చేస్తున్నాయా?" ఈ వచనాన్ని కుటుంబానికి అన్వయించాలి: "నా సంభాషణ నా కుటుంబాన్ని కడుతుందా, లేక నా భాగస్వామి మరియు పిల్లల నమ్మకాన్ని బలహీనపరుస్తుందా?" నేను ఈ వచనాన్ని వృత్తికి అన్వయించాలి: "నేను సానుకూల మాటలు పలికే ఉద్యోగినా లేక ప్రతికూల ఆలోచనలు పంచే ఉద్యోగినా?" ఎఫెసీయులకు 4:29 జీవితంలోని ప్రతి కోణానికి వర్తిస్తుంది.

---

[37] ముందుమాట John మరియు Charles Wesley's 1739 ముద్రణ *Hymns and Sacred Poems*.

అందుకే, తమ యజమానులతో సరైన సంబంధం కలిగి జీవించే దాసులు అన్ని విషయాల్లో మన రక్షకుడైన దేవుని సిద్ధాంతాన్ని గౌరవిస్తారని పౌలు రాశాడు (తీతుకు 2:10). లేఖనాన్ని జాగ్రత్తగా అన్వయించుకోవడం, మన చుట్టూ ఉన్న ప్రజలకు సువార్తను ఆకర్షణీయంగా చేస్తుంది.

**దశ 3: లేఖనానికి విధేయత చూపాలి**

బైబిల్ అధ్యయనం యొక్క తుది లక్ష్యం, అనుదిన అన్వయం. 2 తిమోతికి 2:3-6 లో పౌలు క్రైస్తవులను సైనికులు, జెట్టివాళ్లు, మరియు వ్యవసాయకులుగా వివరించాడు. ఈ చిత్రాలు, గురి కలిగి పట్టుదలతో ఉన్న వ్యక్తి గురించి వర్ణిస్తాయి. సైనికుడు యుద్ధ సమయంలో విశ్రమించడు; జెట్టివాడు పందెం మధ్యలో ఆగిపోడు; వ్యవసాయకుడు తన పని పూర్తయ్యే వరకు నాటడం ఆపడు. క్రైస్తవ జీవితానికి పట్టుదల అవసరం. "మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" (హెబ్రీయులకు 12:1).

మీరు లేఖన అధ్యయనం చేస్తున్నప్పుడు, "నా జీవితంలో ఈ సత్యాన్ని ఆచరించవలసిన విషయాలు ఏమైనా ఉన్నాయా?" అని అడగాలి. మీ జీవితంలో సత్యాన్ని క్రమబద్ధంగా అన్వయించుకొనునట్లు దేవుని సహాయం కోరండి. మీరు ఇలా చేసినప్పుడు, దేవుడు మరింత సత్యాన్ని మీకు బయలుపరుస్తాడు. ఆత్మీయ ఆహారం కోసం మీరు మరింత ఎక్కువ ఆకలి కలిగియుంటారు.

మీ మాటల విషయంలో దేవుడు మీకు అవగాహన కలుగజేయడానికి ఎఫెసీ 4:29 ద్వారా మాట్లాడినట్లయితే, క్షేమాభివృద్ధి కలిగించే ప్రసంగాన్ని ఆచరించడానికి మీరు కట్టుబడి ఉండాలి. ఇది, ఒకరి జీవితంలోకి కృపను గూర్చి మాట్లాడడానికి రోజుకు ఒక అవకాశం ఇవ్వమని దేవునిని అడిగే అంత సులభం కావచ్చు. దీని అర్థం, మీ హానికమైన సంభాషణ విన్నప్పుడు, నిన్ను హెచ్చరించమని నమ్మకమైన స్నేహితుని అడగడం. ఈ విధంగా అనుదినం దేవుని వాక్యాన్ని మనం ఆచరించగలము.

కాలేజీలో, ఒక యువకుడు ఒక నిర్దిష్టమైన శోధనలో పోరాడుతున్నాడు. హరీష్ కి సంగీతం అంటే చాలా ఇష్టం, కాని అతను కొన్ని సాహిత్య శైలుల సంగీతాన్ని కూడా వినేవాడు, అవి అతని బలహీనత ఉన్న అంశంలో అతనిని శోధించేవి. హరీష్ శోధనపై జయం పొందాలనుకున్నాడు, కాని తన జీవితంలో లేఖనాన్ని సతతంగా అన్వయించలేదు.

సెప్టెంబర్లో, పాఠశాలలో పునరుజ్జీవ సభలు జరుగుతాయి. హరీష్ వేదిక యొద్దకు వెళ్తాడు. తన గదికి తిరిగి వచ్చి, అనుచితమైన సంగీతం వినడం మానేస్తాడు. కొన్ని వారాల పాటు, అతడు మంచి సాక్ష్యం కలిగి ఉంటాడు. ఈ శైలిలో కొన్ని క్రొత్త పాటల రికార్డులు కొంటాడు. వెంటనే నిరుత్సాహపడిపోతాడు; నవంబర్ నెల వచ్చేసరికి, "నేను వెనక్కి జారిపోయాను" అని చెబుతాడు.

ఫిబ్రవరిలో, పాఠశాలలో బైబిల్ కాన్ఫరెన్స్ జరుగుతుంది. హరీష్ వేదిక యొద్దకు వెళ్తాడు. తన పాటలన్నిటిని ప్రక్కన పడేసి, కొన్నివారాల పాటు మంచి సాక్ష్యం కలిగి జీవిస్తాడు. తరువాత ఏప్రిల్ నెలలో, మరికొన్ని రికార్డింగ్లు కొంటాడు, ప్రక్రియ మళ్ళీ మొదలౌతుంది.

హరీష్ కి ఏమి అవసరం? మంచి భాష్యమా? కాదు! అతనికి తన బలహీనత ఏంటో తెలుసు; మంచి మనస్సాక్షి కలిగి ఉండాలని బైబిల్ సెలవిస్తుందని అతనికి తెలుసు; తన ఆత్మీయ జీవితంపై కొన్ని సంగీతాలకు ఉన్నటువంటి ప్రభావం అతనికి తెలుసు. హరీష్ సమస్య భాష్యం కాదు; అతడు తనకు తెలిసిన వాటిని ఆచరించవలసిన అవసరత ఉంది.

మీరు ఏ విషయంలో అన్వయాన్ని ఆచరించవలసిన అవసరత ఉంది?

## అడుగవలసిన ప్రశ్నలు

జీవితానికి లేఖనాన్ని అన్వయించుకొనేటప్పుడు ఈ ఐదు ప్రశ్నలు అడగడం సహాయకరంగా ఉంటుంది.

### (1) నివారించవలసిన పాపం ఉందా?

చాలామంది క్రైస్తవులు తమ జీవితంలో లేఖనానికి అనుగుణంగా లేని విషయాల్ని చూసినప్పుడు నిరుత్సాహానికి గురౌతారు. దేవుడు మన జీవితంలోని పాపం గురించి లేఖనం ద్వారా మాట్లాడినప్పుడు, మనం నిరుత్సాహపడకూడదు. బదులుగా, ఆయన వాక్యానికి ఇష్టపూర్వకంగా విధేయులవ్వాలి.

### (2) స్వతంత్రించుకోవడానికి వాగ్దానం ఉందా?

కొన్నిసార్లు అన్వయం, కేవలం దేవుని వాగ్దానాలు ప్రకటించడమే. వాగ్దానాన్ని భాష్యం చేసే విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి. కొన్నిసార్లు వాగ్దానాలు ప్రత్యేకంగా వ్యక్తులకు లేక ఇశ్రాయేలు దేశానికి చేయబడినవి. వాగ్దానాన్ని దాని సందర్భం నుండి వేరు చేయకుండా జాగ్రత్తపడాలి. అయితే, బైబిల్ సందర్భంలో వాగ్దానాన్ని జాగ్రత్తగా భాష్యం చేసినప్పుడు, ఈ వాగ్దానం విశ్వాసులందరికి వర్తిస్తుందని తెలుసుకున్నప్పుడు, మన జీవితాల్లో ఆ వాగ్దానాన్ని స్వతంత్రించుకోవచ్చు.

### (3) తీసుకోవడానికి ఏదైనా చర్య ఉందా?

“ఈ లేఖన భాగం విషయంలో నేను ఏమి చేయాలి? ఈ వాక్య భాగం ఏ సత్యాన్ని బోధిస్తుంది? నా సిద్ధాంతంలోని తప్పు గురించి నన్ను హెచ్చరిస్తుందా? లేఖనానికి అనుగుణంగా నా ఆలోచన నేను మార్చుకోవాలా? ఈ లేఖనానుసారంగా నేను ఏ చర్య తీసుకోవాలి?” అని అడగాలి.

ప్రార్థన ఒక ఉదాహరణ. మనం దావీదు, పౌలు, నెహెమ్యా మరియు యేసు ప్రార్థనలు చదివినప్పుడు, మన ప్రార్థనా జీవితానికి మాదిరిని కనుగొంటాం. పౌలు లేదా యేసు ప్రార్థనలను అనుకరించడం కంటే ప్రార్థన నేర్చుకోవడానికి మంచి మార్గం లేదు! నేను చదువుతున్నప్పుడు, నా జీవితంలో ప్రార్థనలు స్వీకరించడం ద్వారా స్పందించగలను.

**(4) విధేయత చూపవలసిన ఆజ్ఞ ఉందా?**

పౌలు పత్రికల్లో సాధారణంగా రెండవ భాగంలో ఆజ్ఞలు ఉంటాయి. ఈ ఆజ్ఞలు సూటిగా, స్పష్టంగా ఉంటాయి. కొన్నిసార్లు క్రైస్తవులు తమకు తెలిసిన సులభ అన్వయాన్ని విడిచిపెట్టి, లోతైన సత్యాల కోసం చూస్తారు.

స్పష్టంగా కనిపించు సత్యాన్ని విడిచి, లోతైన సత్యాల కోసం వెదకడంలోని ప్రమాదం గురించి ఎవరో రాశారు. అతడు క్రొత్త నిబంధన గ్రీకులో తన మొదటి అధ్యయనం గురించి చెప్పాడు. మత్తయి 16:24లో “నన్ను వెంబడింపగోరినయెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తి కొని నన్ను వెంబడింపవలెను” అని యేసు చెప్పాడు. అసలు గ్రీకులో భిన్నమైన, ఆశ్చర్యకరమైన అర్థం లేదు. గ్రీకులో, ఈ వచన అర్థం, అదేమి చెబుతుందో అదే దాని అర్థం. అర్థాన్ని గ్రహించడం అంత కష్టం కాదు. బదులుగా, విధేయత చూపడం కష్టం.[38]

కొన్నిసార్లు అవసరమైనదల్లా, “అవును, ప్రభువా నేను లోబడతాను” అని చెప్పడమే.

**(5) అనుసరించడానికి మాదిరి ఉందా?**

లేఖనంలో చాలావరకు జీవిత చరిత్ర ఉంది. మనం జీవిత చరిత్ర చదువుతున్నప్పుడు, “అనుసరించడానికి మాదిరి ఉందా?” అని మనం అడుగుతాం.

ఆదికాండము 18లో మనం అబ్రాహాము గురించి చదివినప్పుడు, మన లోకం కోసం విజ్ఞాపన చేస్తూ అబ్రాహాము మాదిరి అనుసరించవచ్చు. ఒక బోధకుడు నైజీరియాలో బోధిస్తున్నాడు. నైజీరియా ముస్లింలు మరియు క్రైస్తవుల మధ్య సంఘర్షణలతో నలిగిపోతుంది. ఒక విద్యార్థి తన క్లాస్ మేట్స్ ని ఇలా అడిగాడు: “మనం ముస్లింల కోసం ప్రార్థించే దానికంటే ఎక్కువగా ఎందుకు పోరాడతాం? దేవుడు వారిని రక్షణలోకి నడిపిస్తాడని మనం నమ్ముతున్నామా? నమ్మితే, మనం అబ్రాహాము మాదిరి అనుసరించి, వారి రక్షణ కోసం విజ్ఞాపన చేస్తాం!” అది అన్వయం.

---

[38] Andy Crouch, “Information and Formation” in *Christianity Today,* మార్చి 2014 నుండి తీసుకున్నారు. https://www.christianitytoday.com/ct/2014/march/information-and-formation.html. లో ఆన్లైన్ లో అందుబాటులో ఉంది.

## ఆచరణలో పెట్టండి

మనం రోమా 12:1-2లో పరిశీలనలు చేశాం. ఈ వచనాల్లోని ముఖ్య పదాలు అధ్యయనం చేశాం. పౌలు సందేశాన్ని సరిగా భాష్యం చేయడానికి చారిత్రక, సాంస్కృతిక, బైబిల్ నేపథ్యం అధ్యయనం చేశాం.

ఇప్పుడు మనం అత్యంత ముఖ్య దశకు సిద్ధంగా ఉన్నాం. రోమా 12:1-2 ను మీ జీవితంలో ఎలా అన్వయిస్తారు?

► మునుపటి పాఠాల్లో రోమా 12:1-2 పై మీరు చేసిన నోట్సును మరలా చదవండి. మీ జీవితంలో ఈ వాక్యభాగాన్ని అన్వయించుకోవడానికి మూడు నిర్దిష్టమైన విషయాల జాబితా చేయండి.

► మీరు ఈ పాఠం సమూహంతో కలిసి అధ్యయనం చేస్తుంటే, సమూహంతో మీ అన్వయం పంచుకోండి. ఒకవేళ మీరు మళ్ళీ కలిస్తే, జవాబుదారీతనం ఏర్పాటు చేసుకోండి. కొన్ని నిబద్ధతలు తీసుకుని, మీ అన్వయం విషయంలో పురోగతిని తనిఖీ చేయమని సమూహాన్ని అడగండి.

## ముగింపు

ఈ కోర్సు, ఇతరులకు బోధించునట్లుగా బైబిల్ ను అర్థం చేయడాన్ని గూర్చినది. దేవుని వాక్య పరిచారకులుగా ఇందుకే మనం పిలువబడ్డాం. అయితే, ఇందులో ప్రమాదం ఉంది. మనం జాగ్రత్త వహించకపోతే, కేవలం ప్రసంగం, బోధన కొరకే బైబిల్ ను అధ్యయనం చేస్తాం. మన సొంత జీవితాల్లో బైబిల్ సత్యాన్ని అన్వయించుకునే విషయంలో తప్పిపోతాం.

బైబిల్ అధ్యయనం కేవలం నేర్చుకోవడానికి, బోధించడానికే కాదు. దేవుని వాక్యాన్ని, మనల్ని భౌతికంగా పోషించే ఆహారంతో పోల్చవచ్చు. తినడం అనేది, రోజువారి మరియు దీర్ఘకాల ప్రభావాలు కలిగియుంది. ఒక్క ఆరోగ్యకరమైన భోజనంతో మీ క్రొవ్వును మీరు తగ్గించుకోలేరు, ఒక్కరోజు దేవుని వాక్యం చదవడం వలన ఆత్మీయ బలం రాదు. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనుదినం ఆరోగ్యకరమైన ఆహారం అవసరం మరియు ఆత్మీయత బలంగా ఉండాలంటే వాక్యాన్ని అనుదినం భుజించుట అవసరం. అయితే, ఒక మంచి అల్పాహారం కష్ట దినానికి తోడ్పడినట్లుగానే ఒక దిన వాక్య ఆహారం ఆరోజు సవాళ్లు ఎదుర్కొవడానికి తోడ్పడుతుంది.

సేవకులు, సంఘ నాయకులు మరియు బోధకులుగా మన ఆత్మీయ జీవితాలు అనుదినం పోషించబడాలనే విషయాన్ని మరచిపోకూడదు. ఇతరులకు బోధించే మన ప్రయత్నంలో, దేవుని వాక్యమనే ఆహారంతో మన హృదయాలను పోషించుకోవడం మరచిపోకూడదు. మనం మనల్ని పోషించుకున్నప్పుడే, దేవుని ప్రజలకు పరిచారం చేసే ఆత్మ బలం పొందుకుంటాం.

ఈ ప్రమాదం గురించి పౌలుకు బాగా తెలుసు. ఇతరులకు బోధించి తాను అనర్హుడైపోయే భయంకరమైన అవకాశం గురించి రాశాడు (1 కొరింథీయులకు 9:27). మన హృదయాల్లో దేవుని కృపను తిరస్కరిస్తూ, ఇతరులకు బోధించడం ఎంత భయంకరమైన విషయం. ఇతరులకు బోధించడానికి అధ్యయనం చేయండి, కాని దేవుడు మీ హృదయాలతో మాట్లాడునట్లుగా కూడా అధ్యయనం చేయండి.

### ఆచరణలో పెట్టండి

► లూకా 14:25–17:10 ఉపమానాల, హెచ్చరికల శ్రేణి. యేసు చివరిసారిగా యెరూషలేము వెళ్లినప్పుడు, ఆయన తన శిష్యులకు చివరి హెచ్చరికలు ఇచ్చాడు. మీరు యేసు బోధ చదివేటప్పుడు, ఈ వచనాల్లో నిర్దిష్ట అన్వయాలు కనుగొనండి. ఇలా అడగండి:

- నివారించవలసిన పాపం ఉందా?
- స్వతంత్రించుకోవాల్సిన వాగ్దానం ఉందా?
- తీసుకోవడానికి ఏదైనా చర్య ఉందా?
- విధేయత చూపవలసిన ఆజ్ఞ ఉందా?
- అనుసరించడానికి మాదిరి ఉందా?

## పాఠం 9 ముఖ్య విషయాలు

(1) దేవుని వాక్యాన్ని సరిగా భాష్యం చేస్తే చాలదు; దాన్ని మన అనుదిన జీవితాలకు అన్వయించుకోవాలి.

(2) అన్వయాన్ని వేరే వాటితో భర్తీ చేయడానికి సాతాను మనల్ని శోధిస్తాడు.

- అన్వయాన్ని భాష్యంతో భర్తీచేయగలం.
- సంపూర్ణ విధేయతను పాక్షిక విధేయతతో భర్తీచేయగలం.
- మారుమనస్సును సాకులతో భర్తీ చేయగలం.
- రూపాంతరాన్ని భావోద్వేగంతో భర్తీచేయగలం.

(3) లేఖనాల్ని మన జీవితాలకు అన్వయించుకోవాలంటే, మూడు విషయాలు అనుసరించాలి:

- లేఖన అర్థం తెలుసుకోవాలి.
- లేఖనం జీవితానికి ఎలా వర్తిస్తుందో గ్రహించాలి.
- లేఖనానికి విధేయత చూపాలి.

(4) మీ జీవితంలో లేఖనం అన్వయించుకునే విషయంలో మార్గాలు కనుగొనడానికి అడుగవలసిన ప్రశ్నలు:

- నివారించవలసిన పాపం ఉందా?
- స్వతంత్రించుకోవాల్సిన వాగ్దానం ఉందా?
- తీసుకోవడానికి ఏదైనా చర్య ఉందా?
- విధేయత చూపవలసిన ఆజ్ఞ ఉందా?
- అనుసరించడానికి మాదిరి ఉందా?

## పాఠం 9 అభ్యాసం

1వ పాఠంలో, ఈ కోర్సు సమయంలో అధ్యయనం చేయడానికి ఒక వాక్యభాగం ఎన్నుకున్నారు. పరిశీలన, భాష్యం పై మీరు తయారు చేసిన నోట్సు ఆధారంగా, మీరు అధ్యయనం చేస్తున్న వాక్యభాగానికి ఆచరణాత్మక అన్వయాలను జాబితా చేయండి.

# పాఠం 10

# వాక్యభాగ అధ్యయనాన్ని అభ్యసించడం

## పాఠం లక్ష్యాలు

(1) లేఖనంలో ఎంచుకున్న వాక్యభాగానికి ఈ భాష్యపు దశలు అన్వయించడాన్ని అభ్యాసం చేయడం.

(2) లేఖన భాగం యొక్క వివరణాత్మక అధ్యయనాన్ని పేపర్ పై లేక మౌఖికంగా ప్రదర్శించడానికి సిద్ధపడడం.


## పరిచయం

*తరగతి నాయకునికి గమనిక: ఒకటి కంటే ఎక్కువ తరగతులు అవసరమైనప్పటికీ, ఈ పాఠంలో ఆచరణాత్మక కార్యకలాపాలు కొరకు తరగతిలో తగిన సమయం కేటాయించండి.*

ఈ కోర్సులో, మనం బైబిల్ భాష్యానికి దశలను చూశాం: పరిశీలన, భాష్యం, అన్వయం. బైబిల్ భాష్యంలో చేసే సాధారణం తప్పులు నివారించాలని మనం నేర్చుకున్నాం. లేఖన అధ్యయనానికి అవసరమైన ముఖ్య సూత్రాలు చర్చించుకున్నాం. ప్రతి దశను అభ్యాసం చేశాం. ఈ పాఠంలో, ప్రక్రియ అంతటిని సమీక్షిద్దాం. అప్పుడు ఈ ప్రక్రియ ప్రకారంగా తరగతి అంతా పాత మరియు క్రొత్త నిబంధన వాక్యభాగాలు రెండిటిని అధ్యయనం చేస్తారు. మీరు మీ సొంత నైపుణ్యాలు కూడా అభ్యసించండి. అప్పుడు మీరు 1వ పాఠంలో మొదలుపెట్టిన కోర్సు ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తారు.

మొదలుపెట్టడానికి, క్రింది చిత్రాన్ని సమీక్షించండి:

**బైబిల్ ను బాష్యం చేయుట**[39]




| | | |
|---|---|---|
| 1 | వారి పట్టణం | లేఖన అసలు సందేశం |
| 2 | నది | ప్రాచీన ప్రపంచం నుండి మన ప్రపంచాన్ని వేరు చేసే చారిత్రిక-సాంస్కృతిక వ్యత్యాసాలు |
| 3 | వంతెన | వాక్యభాగంలో బోధించిన సూత్రం |
| 4 | పటం | క్రొత్త నిబంధనకు సంబంధం (పాత నిబంధన వాక్యభాగాలతో) |
| 5 | మన పట్టణం | మన లోకంలో ఆ సూత్రం యొక్క అన్వయింపు |

ఈ పాఠంలోని తదుపరి భాగాలు బైబిల్ భాష్య ప్రక్రియ అంతటిని సమీక్షిస్తాయి. భాష్య ప్రక్రియలోని ప్రతి దశలో, భాష్యకర్తలు తమను సరైన ముగింపుకు నడిపించే ప్రశ్నలు అడగాలి. ఈ ప్రశ్నలు భాష్య సూత్రాలపై ఆధారపడతాయి.

---

[39] చిత్రం: “Interpreting the Bible” ను Anna Boggs గీశారు, https://www.flickr.com/photos/sgc-library/52377290578, licensed under CC BY 2.0. Concept from J. Scott Duvall and J. Daniel Hays, *Grasping God’s Word* (Grand Rapids: Zondervan, 2012) లో లభిస్తుంది.

ప్రక్రియలోని ప్రతి దశలో అడగవలసిన ప్రశ్నలు జాబితా చేయబడ్డాయి. ప్రశ్నలు ఎలా ఉపయోగించాలి మరియు సరైన భాష్యానికి అవి ఎందుకు ఉపయోగకరమో ఉదాహరణను చూపిస్తాయి.

ప్రశ్నల సేకరణ భాష్యానికి ఒక సాధన పెట్టెలా పరిగణించాలి. ఒక భవన నిర్మాణ ప్రాజెక్ట్ లో నిర్మాణకుడు ప్రతి పరికరాన్ని ఉపయోగించవలసిన అవసరం లేనట్లుగా, ఇక్కడ ప్రతి ప్రశ్న ప్రతి వాక్యభాగానికి వర్తించదు. ఒక ప్రశ్న యొక్క సమాధానం స్పష్టంగా లేనప్పుడు లేక ఎటువంటి సహకారాన్ని ఇవ్వనప్పుడు అది వాక్యభాగానికి సంబంధించినది కాదని భావించవచ్చు.

## పరిశీలన: చారిత్రక-సాంస్కృతిక సందర్భ అవగాహన

**రచయిత**

- రచయిత ఎవరు?
- అతని పాత్ర ఏంటి?
- అతనికి శ్రోతలతో ఉన్న సంబంధం ఏంటి?

1 తిమోతికి 5:20: "ఇతరులు భయపడునిమిత్తము పాపము చేయువారిని అందరియెదుట గద్దింపుము."

1 తిమోతికి పత్రిక రచయితయైన అపొస్తలుడైన పౌలు, తిమోతికి గురువు. ఇది, యువ సేవకుడైన తిమోతికి పౌలు ఇచ్చిన ఉపదేశం.

వీటిని అర్థం చేసుకోవడం, పౌలు ఉపదేశం సూటిగా ప్రతి క్రైస్తవునికి వర్తించదని గ్రహించడంలో మనకు సహాయపడుతుంది.

**అసలు శ్రోతలు**

- వారు ఎవరు?
- వారి లక్షణాలు ఏంటి?

ఫిలేమోను పత్రికను వ్యక్తిగతంగా విశ్వాసికి రాశాడు.

హెబ్రీ పత్రికను హింసించబడిన యూదా విశ్వాసులకు రాశాడు.

**పరిస్థితులు**

- రక్షణ చరిత్రలోని ఏ కాలంలో ఈ లేఖనం రాయబడింది?

  2 దినవృత్తాంతములు 7:14: "నా పేరు పెట్టబడిన నా జనులు తమ్ముతాము తగ్గించుకొని ప్రార్థనచేసి నన్ను వెదకి తమ చెడుమార్గములను విడిచినయెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును."

  "నా జనులు" అను మాట దేవుని ప్రజలైన ఒక నిర్దిష్ట రాజ్యాన్ని సూచిస్తుంది. "దేశమును స్వస్థపరచుదును" అను వాగ్దానం సూటిగా సంఘానికి వర్తించవలసిన అవసరత లేదు.

- సాంస్కృతిక నేపథ్యం ఏంటి? సాధ్యమైతే, అసలు సంస్కృతి గురించి అధ్యాయం చేయడానికి బైబిల్ నిఘంటువు ఉపయోగించండి. దీని వలన మీరు వారి సంస్కృతికి మన సంస్కృతికి మధ్య సారుప్యతలు, వ్యత్యాసాలు కనుగొనగలం.

  2 కొరింథీయులకు 13:12: "పవిత్రమైన ముద్దుపెట్టుకొని యొకరికి ఒకరు వందనములు చేసికొనుడి."

  పవిత్రమైన ముద్దుతో వందనాలు చెప్పడం ఆ కాలంలోని క్రైస్తవుల సాంస్కృతిక పద్ధతి.

- ప్రస్తుత సంఘటనలు ఏంటి?
- సంఘంలో పరిస్థితి ఏంటి? (క్రొత్త నిబంధన వాక్యభాగాలు మాత్రమే)

**పరిశీలన: సాహిత్య సందర్భ అవగాహన**

పుస్తకం మరియు వాక్యభాగం యొక్క సాహిత్య రూప లక్షణాలు పరిగణించండి.

- ఈ పుస్తకం/వాక్యభాగం యొక్క సాహిత్య రూపం ఏంటి?
- ఈ సాహిత్య రూపం యొక్క లక్షణాలు ఏంటి?

  కీర్తన 124:4-5:

  - సాహిత్య రూపం: కావ్యం
  - లక్షణాలు: సమాంతరత

  ప్రకటన 12:3:

- సాహిత్య రూపం: అంత్యకాల విషయాల్ని గురించిన సాహిత్యం
- లక్షణాలు: జంతువులు సాదృశ్యమైనవి

**పరిశీలన: పుస్తకం యొక్క విషయ అవగాహన**

- రచన ఉద్దేశ్యం ఏంటి? రచయిత ఏమి ఉద్ఘాటించాడో లేక రచయిత శ్రద్ధ చూపిన, వివరణ ఇచ్చిన లేక శ్రోతలను సవాలు చేసిన విషయాలు కోసం చూడండి.

  1 కొరింథీయులకు 7:1: "మీరు వ్రాసినవాటివిషయము:"

  కొరింథీ సంఘం ప్రశ్నలడుగుతూ తనకు రాసిన పత్రికకు సమాధానంగా పౌలు 1 కొరింథీయులకు పత్రికను రాశాడు.

- గ్రహీతల సమస్య/అవసరత యేమని అర్థమౌతుంది?

  1 కొరింథీయులకు 1:10: "సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, యేక మనస్సుతోను ఏకతాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండ వలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను."

  *విభజనల* గురించి పత్రిక అంతటా చర్చించబడింది.

- రచయిత శ్రోతలకు ఏమి చెప్తున్నాడు? రచయిత పరిశీలనల తరువాత ఇవ్వబడిన ఆజ్ఞలు ఏవైనా, అవి రచయిత యొక్క స్పష్టమైన సూచనలుగా ఉన్నాయి. ఇవి, వాక్యభాగాన్ని ఎలా అన్వయించాలో సూచిస్తాయి.

**పరిశీలన: వాక్యభాగం ఆరంభం మరియు ముగింపు నిర్ణయించాలి**

చాలాసార్లు, ఎల్లప్పుడు కాదు, అధ్యాయ విభజన ఒక వాక్యభాగానికి ముగింపు లేక ఆరంభాన్ని సూచిస్తుంది. అప్పుడప్పుడు, ఒక అధ్యాయమంతా ఒక వాక్యభాగంగా ఉంటుంది. మరికొన్నిసార్లు, అధ్యాయ విభజనలు సరిగా ఉండవు, వాటిని వాక్యభాగ విభజనలుగా ఉపయోగించకూడదు. విషయంలో మార్పులు గ్రహించండి, ఇవి మార్పు ప్రకటనలతో గుర్తించబడతాయి. వాక్యభాగంలో మీరు అధికంగా చేర్చితే, ఒక ముఖ్య విషయం ఉండదు. వాక్యభాగంలో చాలినంత సమాచారం చేర్చకపోతే, పూర్తి అర్థాన్ని ఇవ్వలేదు.

- ఈ వాక్యభాగంలో ఏ వచనాలు చేర్చబడ్డాయి?

  2 కొరింథీయులకు 7:1: "ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి గనుక ..."

ఇది చివరి అధ్యాయం ముగింపులో కనుగొన్న వాక్యభాగంలో భాగం, 2 కొరింథీయులకు 6:14-18.

యెషయా 52:13-15, యెషయా 53 వ వాక్యభాగంలోనే ఉంది.

**పరిశీలన: వాక్యభాగం పుస్తకంతో ఎలా సంబంధం కలిగియుందో గ్రహించండి**

- ఇది విస్తృత విషయానికి సంబంధించిన కథనమేనా?

న్యాయాధిపతులు 17:5: "మీకా అను ఆ మనుష్యునికి దేవమందిర మొకటి యుండెను. మరియు అతడు ఏఫోదును గృహదేవతలను చేయించి తన కుమారులలో ఒకని ప్రతిష్ఠింపగా ఇతడు అతనికి యాజకుడాయెను."

ఒక మనుష్యునికి గృహదేవతలు మరియు ఏఫోదు ఉన్నాయి. ఈ వచనం మరియు న్యాయాధిపతులు 17-18 చుట్టూ ఉన్న కథనం న్యాయాధిపతులు గ్రంథమంతటి విషయాన్ని ఉదహరిస్తుంది, "ప్రతివాడును తన తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచు వచ్చెను" (న్యాయాధిపతులు 17:6, న్యాయాధిపతులు 21:25).

- ఇది తదుపరి అన్వయానికి వేదాంతాన్ని ఇస్తుందా?
- ఇది పుస్తకంలోని మునుపటి భాగాలకు అన్వయమా?

ఎఫెసీయులకు 4-6, ప్రాథమికంగా ఎఫెసీయులకు 1-3లో బోధించబడిన వేదాంతం యొక్క ఆచరణాత్మక అన్వయం. "కాబట్టి" అనే పదం వేదాంత బోధన మరియు ఆచరణాత్మక అన్వయానికి మధ్య సంధిని సూచిస్తుంది.

ఎఫెసీయులకు 4:1-4: "కాబట్టి...మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతోకూడిన సంపూర్ణవినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెనని, ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను."

**పరిశీలన: వాక్యభాగం యొక్క నిర్మాణాన్ని గమనించండి**

- కొంత మెటీరియల్ కేవలం ప్రధాన సందేశానికి సన్నాహంగా ఉపయోగపడుతుందా?

మార్కు 2:2: "ఆయన యింట ఉన్నాడని వినవచ్చినప్పుడు అనేకులు కూడివచ్చిరి గనుక వాకిటనైనను వారికి స్థలము లేకపోయెను."

ఈ వివరాలు, పైకప్పు నుండి క్రిందికి దింపబడిన వ్యక్తి గురించి వినడానికి శ్రోతలకు వేదికను ఏర్పాటు చేస్తాయి.

- ఆలోచనలను క్రమంగా ఏర్పాటు చేయడానికి ఏ పదాలు ఉపయోగించారు?

  మత్తయి 24 లో "*అందుకు*" అనే పదాన్ని పదే పదే ఉపయోగించారు.

- ప్రశ్నను లేక సమస్యను వెల్లడి చేశారా?

  రోమా 6:1: "ఆలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందుమా?"

- ఆలోచనలను తార్కికంగా సంధి చేయడానికి ఏ పదాలు ఉపయోగించారు?

  తార్కిక క్రమాన్ని చూపించడానికి రోమా 6 లో "*కాబట్టి*" అనే పదాన్ని పదే పదే ఉపయోగించారు.

- సారుప్యత లేక వైరుధ్యం ఉపయోగించారా?

  రోమా 6:19-20: "ఏమనగా అక్రమము చేయుటకై, అపవిత్రతకును అక్రమమునకును మీ అవయవములను దాసులుగా ఏలాగు అప్పగించితిరో, ఆలాగే పరిశుద్ధత కలుగుటకై యిప్పుడు మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి. మీరు పాపమునకు దాసులై యున్నప్పుడు నీతివిషయమై నిర్బంధము లేనివారై యుంటిరి."

  గత బానిసత్వానికి (అపవిత్రత మరియు అక్రమం) మరియు ప్రస్తుత బానిసత్వానికి (నీతి) మధ్య వ్యత్యాసం.

- పునరావృతం లేక సారూప్య పదాలు ఉపయోగించారా?

  రోమా 6 పునరావృత/సారూప్య పాదాలు: చావు, మృతులు, చనిపోవుట, మరణం, సిలువవేయబడుట, పాతిపెట్టబడుట, నిరర్థకము.

  ఇవన్ని ముగింపును గురించిన వ్యక్తీకరణలు.

- జాబితాలు ఏవైనా ఉన్నాయా?

  1 తిమోతికి 4:12: "మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము."

- ఎలాంటి దృష్టాంతాలు లేక అలంకారరూపక వ్యక్తీకరణలు ఉపయోగించారు?

  రోమా 6 సిలువను అలంకారరూపకంగా ఉపయోగిస్తుంది.

- వివరించిన లక్ష్యాన్ని సాధించడానికి మాధ్యమంగా వాడారా?

రోమా 8:13: "గాని ఆత్మ చేత శారీర క్రియలను చంపినయెడల జీవించెదరు."

"ఆత్మ చేత" – మాధ్యమం
"శరీరక్రియలను చంపినయెడల" – లక్ష్యం
"జీవించెదరు" – తుది లక్ష్యం

- కారణాలు ప్రకటనగా ఇవ్వబడ్డాయా లేక వాదన కోసం ఇవ్వబడ్డాయా?

"కాబట్టి" అను పదాన్ని పదే పదే ఉపయోగించడం, రోమా 6లోని ఉద్ఘాటనల వివరణకు నడిపిస్తుంది.

- ముగింపు లేక కీలక విషయం ఉందా? ఇది మరిముఖ్యంగా కథనాలకు ప్రశ్న.

మత్తయి 21:33-41 లో చెప్పబడిన ఉపమానంలో, 38-39 వచనాలు ముగింపుగా ఉన్నాయి.

- కారణం మరియు ప్రభావం గురించి వివరిస్తుందా?

గలతీయులకు 5:16: "నేను చెప్పునదేమనగా ఆత్మా నుసారముగా నడుచు కొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు."

కారణం: "ఆత్మానుసారముగా నడుచు"
ప్రభావం: "అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు."

- వాక్యభాగం, ముందు లేక వెనుక భాగానికి సారాంశంగా ఉందా?

న్యాయాధిపతులు 2:11-23, న్యాయాధిపతులు గ్రంథాన్ని సంగ్రహిస్తుంది.
ఎఫెసీ 5:1, ఎఫెసీ 4:25-32 ని సంగ్రహిస్తుంది.

- వాక్యభాగం మరొక లేఖనాన్ని ఉటంకిస్తుందా లేక సూచిస్తుందా? క్రొత్త నిబంధన రచయితలు, పాత నిబంధన నుండి ఉల్లేఖనాలు లేక దృష్టాంతాలు ఉపయోగించారు.

రోమా 12:1: "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది."

ఈ వచనంలో, *యాగము* అను పదం పాత నిబంధనలో విషయాన్ని సూచించే మాట.

## పరిశీలన: ముఖ్య పదాలను గమనించి, అధ్యయనం చేయడం

- వాక్యభాగంలో ముఖ్య పదాలు ఏంటి?

  1 కొరింథీ 2:14-15లో ముఖ్య పదాలు:

  - *ప్రకృతి సంబంధియైనవాడు*
  - *ఆత్మ సంబంధియైనవాడు*

  రోమా 8లో ముఖ్య పదాలు:

  - *శరీరం*
  - *ఆత్మ*

- ఈ సందర్భంలో వాటి అర్థం ఏంటి? ప్రతి పదం అధ్యయనం చేయండి.

## పరిశీలన: ప్రతి మాట/ప్రకటనను పరీక్షించండి

- దాని అర్థం ఏంటి? నిజానికి ప్రకటన ఏం సెలవిస్తుందో వివరించండి.
- అది ఎందుకు చేర్చబడింది, ఇక్కడ ఎందుకు ఉంది? ఆ ప్రకటక ఇక్కడ చేర్చబడకపోతే ఏమౌతుందో ఎటువంటి వ్యత్యాసం కలుగుతుందో చూడండి.

## భాష్యం: సందేశాన్ని సంగ్రహించండి

ఇప్పటివరకు మీరు వచనం లేక వాక్యభాగంలోని వివరాలను జాగ్రత్తగా పరిశీలించారు, వాస్తవిక శ్రోతలకు రచయిత ఇచ్చిన సందేశాన్ని ఇప్పుడు సంగ్రహించండి. వచనం యొక్క సారాంశం బహుశా ఒకే వాక్యంలో ఉండాలి. వాక్యభాగం యొక్క సారాంశం అనేక వాక్యాల్లో లేక పేరాల్లో ఉంటుంది.

ఈ దశ లక్ష్యం ఏంటంటే, రచయిత మొదటి శ్రోతలకు ఏం చెప్తున్నాడో గమనించడం. ఈ సమయం, ఊహించడానికి లేక సృజనాత్మకంగా ఉండడానికి కాదు. ప్రసంగం లేక బోధన చేసే సమయంలో మీరు సృజనాత్మకంగా ఉండొచ్చు, కాని ఇప్పుడు మీరు లేఖన అర్థాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు. అర్థం లేఖనంలో నుండి రావాలి గాని మీ ఊహల్లో నుండి కాదు.

- రచయిత మొదటి శ్రోతలకు ఏం చెప్తున్నాడు?

  1 కొరింథీయులకు 1:10-13 ఈ విధంగా సంగ్రహించవచ్చు: "సిద్ధాంతం, సహవాసం విషయంలో ఏకీభవించండి, వేర్వేరు గుంపులుగా విభజించబడవద్దు. మీరు వాదించుకొంటున్నారని క్లోయె ఇంటివారివలన నాకు తెలిసింది. మీరు వేర్వేరు నాయకులను అనుసరిస్తున్నారు, కాని మీ కోసం చనిపోయింది కేవలం క్రీస్తు మాత్రమే."

మీ సారాంశం పరీక్షించుకొండి. మీరు చేసిన పరిశీలనల నుండి వచ్చిన ఈ క్రింది ప్రశ్నలను పరిగణించండి:

- రచయిత యొక్క వాస్తవిక పరిస్థితిని తగినంతగా పరిగణించానా?
- ఈ వాక్యభాగం రాయడంలో రచయిత ఉద్దేశ్యం ఏంటి?
- వాక్యభాగానికి నేను ఇచ్చిన భాష్యం పుస్తకమంతటి విషయానికి అనుగుణంగా ఉందా?
- నా భాష్యం ఈ వాక్యభాగానికి పుస్తకంలో సరైన పాత్రను ఇస్తుందా?
- వాక్యభాగ నిర్మాణం నా సారాంశానికి అనుగుణంగా ఉందా?
- వాక్యభాగంలో ప్రతి అర్థం నా సారాంశానికి మద్దతు ఇస్తుందా?
- రచయిత ముఖ్య పదాలు ఉపయోగించిన విధానాన్ని నేను సరిగా అర్థం చేసుకున్నానా?

**భాష్యం: సూత్రం పేర్కొనండి**

వాక్యభాగంలో, అన్ని కాలాలకు మరియు ప్రజలందరికీ వర్తించు ఒక సూత్రం కనుగొనండి. (వాక్యభాగం అనేక సూత్రాలు బోధించవచ్చు, కాని ఆచరించడానికి ఒకదానిని ఎన్నుకోండి.) ఒక్క వాక్యంలో పేర్కొనండి.

> ఎఫెసీయులకు 4:25:లో కనిపించే ఒక సూత్రం: "ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను."

మీ సూత్రం అసలు వాక్యభాగ సందేశానికి సరిగా సరిపోతుందో లేదో పరిశీలించండి:

- ఈ సూత్రం వాక్యభాగంలో స్పష్టంగా బోధించబడిందా?
- ఈ సూత్రం మిగిలిన లేఖనానికి అనుగుణంగా ఉందా?
- ఈ సూత్రం అన్ని కాలాలకు, ప్రజలందరికీ వాస్తవమేనా?

ఈ సూత్రాన్ని ఇతర సత్యానికి అనుసంధానించండి:

- లేఖనంలోని ఇతర చోట్ల ఏ సంబంధిత సత్యం వెల్లడిపరచబడింది?
- ఈ సత్యం మన జ్ఞానాన్ని ఎలా పెంచుతుంది?
- లేఖనమంతటిని మొత్తంగా పరిశీలిస్తే, నా భాష్యం సరిదిద్దవచ్చా?
- ఈ సత్యం మరొక వాక్యభాగంతో విభేదిస్తుందా? అలాగైతే, అవి సమాధానపరచవచ్చా?

### అన్వయం: ఆధునిక సందర్భానికి అన్వయించండి

మీరు కనుగొనిన సత్యం, అనేక మార్గాల్లో అన్వయించవచ్చు. ఒక నిర్దిష్టమైన ఆధునిక అన్వయాన్ని అందించండి.

- ఈ సత్యాన్ని ఏ నిర్దిష్టమైన ఆధునిక పరిస్థితికి అన్వయించవచ్చు?
- ఎప్పుడు, ఎక్కడ మరియు ఎవరికి ఈ ప్రకటనలు వర్తిస్తాయి?
- సత్యం చర్యలో మరియు భావనలో ఎలా అన్వయించబడుతుంది?
- నేను వాక్యభాగాన్ని తీవ్రంగా పరిగణిస్తే, నా జీవితంలో ఎటువంటి మార్పు కలుగుతుంది?

అనుదిన జీవితంలో దేవుని వాక్య ప్రకారంగా జీవించడంలో సహాయం చేయమని పరిశుద్ధాత్ముని అడగండి.

### పత్రికల భాష్యం అభ్యసించండి

క్రొత్త నిబంధన పత్రికలను భాష్యం చెప్పేటప్పుడు, పత్రికను సాధ్యమైనంత పరిశీలించడం ద్వారా ఆరంభిస్తాం, పత్రికలోని సందేశాన్ని నిర్ణయించడానికి దానిని అధ్యయనం చేస్తాం మరియు సూత్రాలను లోకానికి అన్వయిస్తూ ముగిస్తాం. ఈ భాష్య ప్రక్రియ, మొదటి శ్రోతల ప్రపంచం నుండి ఆధునిక పాఠకుల ప్రపంచానికి మనల్ని నడిపిస్తుంది.

**కలిసి అభ్యాసం చేయండి**

► తరగతి అంతా కలిసి, 1 యోహాను 2:15-17 పై భాష్య ప్రక్రియను అభ్యసించండి. పైన వివరించిన ప్రశ్నలు, భాష్య ప్రక్రియతో పాటుగా, క్రొత్త నిబంధన పత్రికల లక్షణాలను సాహిత్య రూపాలుగా పరిగణించాలని గుర్తుంచుకోండి (6వ పాఠం చూడండి).

**మీ సొంతంగా అభ్యాసం చేయండి**

► ప్రతి విద్యార్థి వీటిలో ఒక వాక్యభాగం తీసుకొని, భాష్య ప్రకియ చేయాలి. ఆ తరువాత విద్యార్థులు ఇతర సభ్యులతో తమ తీర్మానాలు పంచుకోవాలి.

- రోమా 13:8-10
- ఎఫెసీ 6:18-20
- 2 తిమోతికి 4:6-8
- యాకోబు 3:13-18
- 1 పేతురు 2:9-10

### పాత నిబంధన ధర్మశాస్త్రం యొక్క భాష్యం అభ్యసించండి

మనం పాత నిబంధన ధర్మశాస్త్రాన్ని భాష్యం చేసేటప్పుడు, మొదటి శ్రోతలకు దాని అర్థం ఏంటో మొదటిగా గ్రహించాలి. వాళ్ల పరిస్థితికి, మన పరిస్థితికి మధ్య వ్యత్యాసం చూడాలి, మరి ముఖ్యంగా మనం క్రొత్త నిబంధనలో జీవిస్తున్నామనే సత్యానికి సంబంధించిన వ్యత్యాసాలను చూడాలి. పాత నిబంధన ధర్మశాస్త్రంలో, అన్ని కాలాల్లో ప్రజలందరికీ వర్తించే సూత్రాన్ని గ్రహించాలి. ఆ తర్వాత ఆ సూత్రాన్ని మన జీవితాలకు అన్వయించుకోవచ్చు.

**కలిసి అభ్యాసం చేయండి**

► తరగతి అంతా కలిసి, సంఖ్యాకాండము 15:37-41పై భాష్య ప్రక్రియను అభ్యసించాలి. పైన వివరించిన ప్రశ్నలు, భాష్య ప్రక్రియతో పాటుగా, 6వ పాఠంలో ఇవ్వబడిన పాత నిబంధన ధర్మశాస్త్ర లక్షణాలను సాహిత్య రూపాలుగా పరిగణించాలని గుర్తుంచుకోండి.

**మీ సొంతంగా అభ్యాసం చేయండి**

► ప్రతి విద్యార్థి వీటిలో ఒక వాక్యభాగం తీసుకొని, భాష్య ప్రకియ చేయాలి. ఆ తరువాత విద్యార్థులు ఇతర సభ్యులతో తమ తీర్మానాలు పంచుకోవాలి.

- లేవీయకాండము 19:9-10
- నిర్గమకాండము 20:4-6
- నిర్గమకాండము 22:10-13
- ద్వితీయోపదేశకాండము 14:1-2

## పాఠం10 అభ్యాసం

1వ పాఠంలో, క్రింది ఇవ్వబడిన వాక్యభాగాలలో ఒకదానిని మీరు ఎన్నుకున్నారు.

- ద్వితీయోపదేశకాండము 6:1-9
- యెహోషువ 1:1-9
- మత్తయి 6:25-34
- ఎఫెసీయులకు 3:14-21
- కొలొస్సయులకు 3:1-16

భాష్యం ప్రయాణంలోని ప్రతి దశను మీరు ఆచరించారు, మీరు ఎన్నుకున్న వాక్యభాగాన్ని లోతుగా అధ్యయనం చేయండి. అలా చేసిన పిమ్మట, మీ అధ్యయనాన్ని వీటిలో ఒక విధంగా సిద్ధపరచండి:

1. మీరు ఈ కోర్సును సమూహంతో కలిసి తీసుకుంటే, మీ అధ్యయనాన్ని పంచుకునే ప్రదర్శనను సిద్ధం చేయండి. (1) మీ పరిశీలనలు చూపించండి, (2) వాక్యభాగంలో నుండి సూత్రాలు బోధించండి, మరియు (3) నేటి విశ్వాసులకు వాక్య భాగం ఎలా వర్తిస్తుందో చూపించండి.
2. మీరు ఒంటరిగా అధ్యయనం చేస్తే, 5-6 పేజీల్లో (1) మీ పరిశీలనలు, (2) వాక్యభాగంలో బోధించబడిన సూత్రాలు, (3) నేటి విశ్వాసులకు అన్వయం రాయండి.

# అనుబంధం (Appendix)

# బైబిల్ అధ్యయన పరికరాలు (Bible Study Tools)

## పరిచయం

బైబిల్ భాష్యకర్తలకు వివిధ రకాల వనరులు సహాయపడతాయి. దురదృష్టవశాత్తూ, ఈ అధ్యయన వనరుల లభ్యత భాషను బట్టి మారుతుంది. ఇక్కడ మేము వివిధ రకాల వనరులు గురించి వివరిస్తాం, బహుశా ఇవి మీ భాషలో అందుబాటులో ఉండొచ్చు లేక ఉండకపోవచ్చు. కొన్ని వనరులేవనగా ముద్రించబడిన పుస్తకాలు, మరికొన్ని డిజిటల్ లేక ముద్రణ రూపంలో అందుబాటులో ఉంటాయి.

## బైబిల్ అధ్యయన వనరుల రకాలు

### ఒక నిర్దిష్ట పదాన్ని కలిగి ఉన్న వచనాలను కనుగొనడానికి పరికరాలు

ఒక వాక్యభాగాన్ని భాష్యం చేసె ప్రక్రియలో, మీరు ముఖ్య పదాలు గుర్తిస్తారు. ఈ పదాలను అధ్యయనం చేసే ఒక విధానం ఏంటంటే, మీ వాక్యభాగ అధ్యయనంలో వాటి ఉపయోగం ఏవిధంగా ఉందో మరియు ఇతర వాక్యభాగంలో వాటి ఉపయోగం ఏవిధంగా ఉందో పోల్చి చూడడం. ఇలా చేయాలంటే, అదే పదాన్ని ఉపయోగించే ఇతర వాక్యభాగాలు మీకు తెలిసి ఉండాలి.

మీ భాషలోని బైబిల్లో ఒక నిర్దిష్ట పదాన్ని ఉపయోగించిన ఇతర వాక్యభాగాలు కనుగొనడంలో ఈ క్రింది రెండు పరికరాలు మీకు సహాయపడతాయి.

#### *పదపట్టిక (Concordance)*

పదపట్టిక బైబిల్లో కనిపించే పదాలను జాబితా చేస్తుంది. ప్రతి పదం క్రింద, ఆ పదం కనిపించే వచనాలను జాబితా చేస్తుంది.

పెద్ద పదపట్టిక పుస్తకాల్లో, బైబిల్లో కనిపించే ప్రతి ముఖ్య పదం యొక్క సంఘటన ఉంటుంది. చిన్న పదపట్టికలు కొన్ని బైబిళ్ళలో వెనకాల ఉంటాయి. అందులో తక్కువ పదాలే ఉంటాయి కాని ఆ పదాలు ఉన్నటువంటి ప్రతి వచనం ఉండదు.

మీరు పదపట్టిక యొక్క బలాలు, పరిమితులు అర్థం చేసుకోగలిగితే అవి మీ అధ్యయనంలో తోడ్పడతాయి. పదపట్టిక ఉపయోగించేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు:

1. బైబిల్ ను హెబ్రీ మరియు గ్రీకు భాషల్లో నుండి మీ భాషలోకి అన్వయించారు. కొన్ని సందర్భాల్లో, అనేక హెబ్రీ, గ్రీకు పదాలను, ఒకే పదంగా అనువదించారు. మీ భాష బైబిల్లో రెండు విభిన్న వచనాలలో ఒకే పదం ఉపయోగించబడినప్పుడు, రెండు సందర్భాల్లోనూ ఒకే వాస్తవిక పదం నుండి అనువదించారని మీరు భావించకూడదు.
2. మీ బైబిల్లో వివిధ చోట్ల ఉపయోగించిన పదం హెబ్రీ, గ్రీకులో ఒకే మూల పదానికి చెందకపోయినప్పటికీ, ప్రతి ఉపయోగం, మీ బైబిల్ అనువదించబడిన సందర్భంలో సాధారణ అర్థాన్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టి, ఈ పదం యొక్క వివిధ ఉపయోగ ఉదాహరణలు మనకు ఉన్నాయి. ఒక పదానికి సాధ్యమయ్యే అర్థాలు జాబితా చేస్తున్నపుడు ఇది సహాయపడుతుంది.
3. కొన్ని పదపట్టికలు, ప్రతి పదం క్రింద హెబ్రీ లేక గ్రీకు పదాలను చూపిస్తాయి. మీ భాషలో ఆ పదం అదే హెబ్రీ లేక గ్రీకు పదం నుండి అనువదించబడుందో లేదో తెలుసుకోవడానికి ఇది మీకు సహాయపడుతుంది.
4. మూల పదాలు చూపించే పదపట్టిక, నిఘంటువు వలే నిర్వచనాలు కూడా ఇస్తుంది. అయితే, పదపట్టిక లేక నిఘంటువు సహజంగా పదానికి సాధ్యమయ్యే అర్థాలను ఇచ్చినప్పటికీ, రచయిత ఉద్దేశించిన అర్థాన్ని నిర్ణయించడానికి మీరు సందర్భాన్ని చూడాలి.

***బైబిల్ సాఫ్ట్ వేర్/వెబ్ సైట్***

మీ భాషలో బైబిల్ ఇంటర్నెట్‌లో లేదా సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లో అందుబాటులో ఉంటే, మీరు ఒక పదాన్ని వెతకవచ్చు, మరియు ఆ వెబ్‌సైట్ లేదా ప్రోగ్రామ్ ఆ పదం ఉపయోగించిన ప్రతి వచనాన్ని మీకు చూపిస్తుంది.

**బైబిల్ నిఘంటువులు**

బైబిల్ నిఘంటువులు:

1. పదాలు, ప్రదేశాలు, మరియు ప్రజలపై నేపథ్య సమాచారం అందిస్తాయి.
2. ఆ పదాలు ఎక్కడెక్కడ ఉపయోగించబడ్డాయో ఉదాహరణలు ఇస్తాయి.
3. వేర్వేరు చోట్ల ఆ పదానికి ఉన్నటువంటి వివిధ అర్థాలను వివరించవచ్చు.

బైబిల్ నిఘంటువులు కొన్నిసార్లు పుస్తకాలుగా ముద్రించబడతాయి. అన్వేషించగల బైబిల్ నిఘంటువులు కొన్నిసార్లు బైబిల్ అధ్యయనం కోసం వెబ్‌సైట్‌లలో లేదా బైబిల్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లో కూడా చేరుస్తారు.

**బైబిల్ హ్యాండ్ బుక్స్**

బైబిల్ చేపుస్తకం, బైబిల్లోని ప్రతి పుస్తకాన్ని పరిచయం ఇస్తుంది, రచయిత మరియు చరిత్ర గురించి ప్రాథమిక సమాచారం ఇస్తుంది.

మీ భాషలో హ్యాండ్ బుక్స్ అందుబాటులో లేనట్లయితే, Shepherds Global Classroom అందించు ఉచిత పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన కోర్సులు (సబ్జెక్టులు) ఉపయోగించండి. ఈ కోర్సులు బైబిల్లోని ప్రతి పుస్తకానికి నేపథ్యాన్ని అందిస్తాయి.

**బైబిల్ అట్లాస్**

బైబిల్ అట్లాస్ లో, బైబిల్లో నమోదు చేసిన ప్రదేశాల పటాలు, త్రవ్వకాలలో బయటపడ్డ పట్టణ చిత్రాలు, ప్రాచీన లోకం గురించిన వ్యాసాలు ఉంటాయి.

పటాలు, మరియు ఇలాంటి సమాచారం కొన్ని వెబ్ సైట్ లో కూడా ఉంటుంది.

**బైబిల్ అనువాదాలు**

మీ భాషలో ఒకటికంటే ఎక్కువ అనువాదాలు ఉన్నట్లయితే, అనేక అనువాదాలలో వాక్యభాగాన్ని అధ్యయనం చేయడం ప్రయోజనకరం. బైబిల్ వెబ్ సైట్ లేక సాఫ్ట్ వేర్ ప్రోగ్రాం ఉపయోగించి, బహుళ అనువాదాలు ప్రక్కప్రక్కనే చూపిస్తూ, పోల్చు కోవచ్చు.

వివిధ బైబిల్ అనువాదాలు వేర్వేరు అనువాద సిద్ధాంతాలతో చేయబడ్డాయి. కొన్ని అనువాద బృందాలు, అసలైన హెబ్రీ, గ్రీకు వాక్యభాగం యొక్క వ్యాకరణం, వాక్య నిర్మాణాన్ని సంరక్షించడానికి ప్రయత్నిస్తాయి. సాధ్యమైనంతమట్టుకు, అసలైన పద క్రమాన్ని అలాగే ఉంచుతారు, దాని ప్రకారంగానే వాక్య విభజన కూడా చేస్తారు.

ఇతర అనువాద బృందాలు, సందేశాన్ని ఆధునిక భాషలో సంభాషించడానికి ప్రయత్నిస్తూ, విషయాల్ని తేటగా వ్యక్తపరచడానికి నిర్మాణాన్ని మారుస్తాయి.

అసలైన భాషలోని నిర్మాణానికి దగ్గరగా ఉన్నటువంటి అనువాదంతో మీ అధ్యయనాన్ని మొదలుపెట్టడం ఉత్తమం. అప్పుడు మీరు పోలికలు చేయడానికి మరింత అనుకూలమైన అనువాదాలు చూడవచ్చు.

అనేక భాషల్లో బహుళ అనువాదాలు కలిగిన బైబిళ్ళను కలిగియున్న మూడు ఉచిత వెబ్సైట్లు:

- http://www.biblegateway.com

- https://www.faithcomesbyhearing.com/audio-bible-resources/bible-is
- https://www.bible.com/

**బైబిల్ వ్యాఖ్యానాలు**

బైబిల్ వ్యాఖ్యానాలు బైబిల్ లోని ప్రతి వచనం లేక వాక్యభాగానికి గమనికలు ఇస్తాయి. వ్యాఖ్యానాలు ముద్రించిన పుస్తకాలు రూపంలో ఉండొచ్చు లేక బైబిల్ అధ్యయన సాఫ్ట్ వేర్లో లేక బైబిల్ అధ్యయన వెబ్ సైట్ లో ఉండొచ్చు. ముద్రించబడిన కొన్ని వ్యాఖ్యానాలు ఒక్క పుస్తకంపైనే దృష్టిపెడతాయి, మరికొన్ని బహుళ పుస్తకాలు లేక బైబిల్ అంతటిపై దృష్టిపెడతాయి. వ్యాఖ్యానాలు రచయితల యొక్క వేదాంత దృక్కోణాలను ప్రతిబింబిస్తాయి గనుక వాటిని వివేచనతో చదవడం చాలా ముఖ్యం.

**బైబిల్ నేపథ్యం**

బైబిల్ నేపథ్యం గురించి తెలియజేసే వ్యాఖ్యానాలు మరియు పుస్తకాలు బైబిల్ యొక్క సాంస్కృతిక, చారిత్రక సందర్భాన్ని అందిస్తాయి. బైబిల్ ప్రపంచపు ఆచారాలు గురించిన అవగాహన లేఖన అర్థాన్ని ఉత్తమంగా తెలుసుకోవడానికి సహాయపడతాయి.

ఉదాహరణకు, యేసు ఉపమానాలన్ని ఆనాటి సాంస్కృతిక ఆచారాలపైనే ఆధారపడ్డాయి; మోషే పుస్తకాలు ఇశ్రాయేలీయుల పొరుగువారు చేసే విగ్రహారాధనకు ప్రతిస్పందిస్తాయి. బహుదేవతారాధన ప్రపంచంలో నివాసం చేసే క్రైస్తవుల గురించి పౌలు పత్రికలు మాట్లాడతాయి. ఈ నేపథ్యాన్ని మనం అర్థం చేసుకున్నప్పుడు, లేఖన బోధనను భాష్యంచడానికి ఎక్కువగా సిద్ధంగా ఉంటాం.

**అధ్యయన బైబిల్**

ఒక మంచి అధ్యయన బైబిల్ అంటే, బైబిల్, వ్యాఖ్యానం, బైబిల్ హ్యాండ్ బుక్, పదపట్టిక, మరియు అట్లాస్ అన్ని ఒకే పుస్తకంలో ఉండడం. మీ అధ్యయనానికి, అధ్యయన బైబిల్ ఒక మంచి ఆరంభం. ఇది ఒక చక్కని వనరు, కాని మునుపు చెప్పినట్లుగా, కొన్ని బైబిల్ అధ్యయనవెబ్ సైట్లు, సాఫ్ట్ వేర్ ప్రోగ్రామ్ లు అనేక విధాలుగా ఉపయోగపడతాయి.

# సిఫార్సు చేసిన వనరులు

**పాఠం 1**

ఈ కోర్సు అంతటిలో ఉపయోగించిన వనరులు/మూలాలు ఇక్కడ జాబితా చేయబడినవి.


Carson, D.A. *Exegetical Fallacies* (2nd edition). Ada: Baker Books, 1996.

Duvall, J. Scott and J. Daniel Hays. *Grasping God's Word: A Hands-On Approach to Reading, Interpreting, and Applying the Bible.* Grand Rapids: Zondervan, 2012.

Fee, Gordon D. and Douglas Stuart. *How to Read the Bible for All Its Worth*. Grand Rapids: Zondervan, 2003.

Hendricks, Howard G. and William D. Hendricks. *Living by the Book.* Chicago: Moody Press, 2007.

Klein, William W., Craig L. Blomberg, and Robert L. Hubbard, Jr. *Introduction to Biblical Interpretation.* Nashville: Thomas Nelson, 1993.

Virkler, Henry A. and Karelynne Ayayo. *Hermeneutics: Principles and Processes of Biblical Interpretation*. Ada: Baker Books, 2007.

Zuck, Roy B. *Basic Bible Interpretation*. Colorado Springs: David C. Cook, 1991.


**పాఠం 2**

ఈ వనరులు ఆన్లైన్లో ఉచితంగా లభిస్తాయి.

ఆడియో బైబిళ్ళు. www.faithcomesbyhearing.com

బైబిల్ నిఘంటువులు. www.biblestudytools.com/dictionaries/

బైబిల్ పఠన క్యాలెండర్లు. www.bible.com

బైబిల్ అనువాదాలు. www.biblegateway.com

ఆన్లైన్ బైబిల్ అట్లాస్. www.bibleatlas.org

**పాఠం 4**

బైబిల్ భాష్యంపై ఈ ఆన్లైన్ ఉపన్యాసాలు బైబిల్ భాష్యంపై మీకు లోతైన అవగాహన కలిగిస్తాయి.

Dr. Walter Martin. "Biblical Hermeneutics One by Dr. Walter Martin."
www.youtube.com/watch?v=mJQGVzlLN-Y లో అందుబాటులో ఉంది.

Seven Minute Seminary. "Why Bible Background Matters." www.youtube.com/watch?v=-wiIK8A2EFk లో అందుబాటులో ఉంది.

Seven Minute Seminary. "The Role of Archaeology in Biblical Studies."
www.youtube.com/watch?v=Dm3HILoNOak లో అందుబాటులో ఉంది.

# అభ్యాసాల రికార్డు

విద్యార్థి పేరు ________________________________________

ప్రతి అభ్యాసం పూర్తయిన తర్వాత సంతకం చేయండి. Shepherds Global Classroom నుండి సర్టిఫికెట్ పొందాలంటే అన్ని అభ్యాసాలు విజయవంతంగా పూర్తి చేయాలి.

| పాఠం | అభ్యాసాలు | |
|---|---|---|
| 1 | | |
| 2 | | |
| 3 | | |
| 5 | | |
| 6 | | |
| 7 | | |
| 9 | | |
| 10 | | |

Shepherds Global Classroom నుండి సర్టిఫికెట్ ఆఫ్ కంప్లీషన్ కోసం దరఖాస్తును మా www.shepherdsglobal.org వెబ్ పేజిలో పూర్తి చేయవచ్చును. తమ విద్యార్థి (ల) తరపున దరఖాస్తును పూర్తి చేసే బోధకులు మరియు సహకారులు SGC ప్రెసిడెంట్ నుండి సర్టిఫికెట్లు డిజిటల్ గా పంపడం జరుతుంది.